

బృందాలవారిగా కథనం చేస్తున్న ఛాత్రోపాధ్యాయులు



సందేశాత్మక ముగ్గుల పోటీలలో ఛాత్రోపాధ్యాయులు



ఎన్.ఎస్.ఎస్. శిబిరాలలో ఆయా గ్రామ విద్యార్థులకు చేతిరాత నేర్పిస్తున్న వాలంటీర్లు

సింధూరం

• సాహిత్య ప్రక్రియల పరిచయం

# సింధూరం

• సాహిత్య ప్రక్రియల పరిచయం



ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ, కరీంనగర్
తెలంగాణ రాష్ట్రం



సంస్థ ముఖ ద్వారం



సంస్థలోని లిల్లీ తోటలో కలుపు తీస్తున్న ఛాత్రోపాధ్యాయులు



సంస్థ కిచెన్‌గార్డెన్‌లో అతిథులతో ఛాత్రోపాధ్యాయులు

# సింధూరం

• సాహిత్య ప్రక్రియల పరిచయం

Dist. Institute of Education
LIBRARY
429
362
Colony 505527 Karimnagar



ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ, కరీంనగర్
తెలంగాణ రాష్ట్రం

సింధూరం
సాహితీ ప్రక్రియల పరిచయం

మొదటి ముద్రణ : జనవరి 2019

ప్రతులు : 500

పుస్తకములు లభించు చిరునామా :
**ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ (DIET)**
ఎల్.ఎం.డి. కాలని, కరీంనగర్.
సెల్ : 99499 93720, 94905 80840.

డిజైన్ & అక్షరాలంకరణ :
**చిప్ప ప్రసాద్, వద్లకొండ శ్రావణ్ కుమార్**

ముద్రణ :
**సత్యనారాయణ ప్రింటర్స్**
తిలక్ రోడ్, కరీంనగర్. తెలంగాణ రాష్ట్రం.
సెల్ : 98663 95537.

ప్రకాశకులు :
**ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ (DIET)**
ఎల్.ఎం.డి. కాలని, కరీంనగర్.
సెల్ : 99499 93720, 94905 80840.



# సింధూరం

## సాహితీ ప్రక్రియల పరిచయం

ఈ పుస్తక రూపకల్పనలో పాల్గొన్న రచయితలు

1. డా॥ గంద్ర లక్ష్మణ్ రావు
2. డా॥ నలిమెల భాస్కర్
3. డా॥ బి.వి.ఎన్. స్వామి
4. శ్రీ గాజోజు నాగభూషణం
5. శ్రీ అన్నవరం దేవేందర్
6. శ్రీ బూర్ల వెంకటేశ్వర్లు
7. శ్రీ కూకట్ల తిరుపతి
8. శ్రీ రామక విఠల్ శర్మ
9. శ్రీ పెద్దింటి అశోక్ కుమార్
10. శ్రీ రావుల పుల్లాచారి
11. శ్రీ సంకేపల్లి నాగేంద్రశర్మ
12. శ్రీ సబ్బని లక్ష్మినారాయణ
13. శ్రీ డి. రాజారాం మోహన్
14. శ్రీ గాజుల రవీందర్
15. శ్రీ ఎజాజ్ అహ్మద్
16. శ్రీ శ్రీరాం మొండయ్య

సమన్వయం : శ్రీరాం మొండయ్య
అధ్యాపకులు

సలహాదారులు
**శ్రీ కట్ల ఆనందం**
ప్రధానాచార్యులు (అ.బా)
**ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ (DIET)**
ఎల్.ఎం.డి. కాలని, కరీంనగర్.



Scanned with OKEN Scanner

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | పద్య నిర్మాణము | 1 |
| 2. | వ్యాసము | 10 |
| 3. | వచన కవిత్వం | 15 |
| 4. | కథా సాహిత్యం | 31 |
| 5. | గేయం (పాట) | 48 |
| 6. | నవల | 54 |
| 7. | తెలుగు నాటక రంగం | 66 |
| 8. | ధ్వని విజ్ఞానం | 76 |
| 9. | చేతిరాతే-విద్యార్థి భవితకు చేయూత | 84 |
| 10. | అనుబంధము | 91 |






# ప్రవేశిక

విద్యార్థి మంచి మార్కులు సాధించుటకు, తన కాళ్ళపై తాను నిలబడుటకు ఉన్నత ఉద్యోగ సాధనకు, సంస్కృతిని కాపాడుకొనుటకు, సమాజం మంచి చెడులను ఎత్తిచూపుటకు ఒక్కమాటలో చెప్పాలంటే జీవితాన్ని పరిపూర్ణం చేసుకొనుటకు వినియోగపడేది సృజనాత్మక రచన.

అంటుకు ప్రాథమిక స్థాయినుంచే విద్యార్థిని సమాయత్తం చేయదలచిన ప్రభుత్వం వివిధ సాహిత్య ప్రక్రియలను తెలుగు వాచకాల్లో పరిచయం చేసింది. గేయం, కథ, వ్యాసం, చిత్రకథ, గేయకథ, సంభాషణ, ఆత్మకథ, పద్యం, సంఘటన, లేఖ, ఆధునిక పద్యం, ద్విపద, స్వగతం, వచన కవిత, పాట, జాపనద కథ, కథానిక, బుర్రకథ, దేశభక్తిగేయం, ఖండకావ్యం, కథా కావ్యం, ప్రాచీన పద్యం, ఇంటర్వ్యూ, కరపత్రం, అభినందన వ్యాసం మొదలగు భాషాప్రక్రియలను మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు తెలుగు వాచకాల్లో ప్రవేశపెట్టినారు. పాఠశాల విద్య పూర్తయ్యే నాటికి విద్యార్థి ఈ భాషా ప్రక్రియల పట్ల అభిరుచి పెంచుకోవడం, అధ్యయనం చేయడం, అభివ్యక్తీకరించడం జరగాలని, తద్వార విద్యార్థి భావి జీవితానికి పూలబాట వేయాలని ప్రభుత్వ ధ్యేయం. అందుకే ఆయా పాఠ్యపుస్తకాల ద్వార సాధించాల్సిన సామర్థ్యాలను (వ్యక్తీకరణ - సృజనాత్మకత) వాటిలోనే స్పష్టం చేశారు.

ఈ ప్రయత్నం దశాబ్దాల తరబడి ప్రభుత్వం పాఠ్యపుస్తకాల ద్వారా చేస్తున్నది. కాని ఆశించినమేర ఫలితాలు పొందలేకపోతున్నాము. అంటే విద్యార్థులందరిని భాషా ప్రక్రియల సృజనులుగా, వ్యక్తీకరించే వారిగా తయారు చేయలేక పోతున్నాం. అందుకు ఎన్నో కారణాలున్నాయి. ఉపాధ్యాయులను సృజనాత్మక రచనపై మక్కువ పెంచి, కొన్ని మెలకువలు నేర్పి, భాషాప్రక్రియల పట్ల అవగాహన పరచి "వ్యక్తీకరణ - సృజనాత్మకత" విద్యా ప్రమాణాన్ని సాధించవచ్చుననేది ఒక అభిప్రాయం. అందుకు ఉపయోగపడే విధంగా ఈ "సాహిత్య ప్రక్రియల పరిచయం" పుస్తకమును రూపొందించాం. అనుబంధంలో కొన్ని సాహితీ ప్రక్రియలకు ఉదాహరణలు ఇవ్వబడినవి.



Scanned with OKEN Scanner

ఈ కరదీపిక ఉపాధ్యాయులకు లక్ష్యసాధనలో ఊతంలా ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాం.

ఈ ప్రయత్నానికి ప్రోత్సహించిన రాష్ట్ర విద్య, పరిశోధన శిక్షణా సంస్థ (SCERT) తెలంగాణ, హైద్రాబాద్ సంచాలకులు శ్రీమతి బి. శేషుకుమారి గారికి, సహకరించిన సిబ్బందికి, ఈ పుస్తక రూపకల్పనలో పాల్గొన్న రచయితలకు, తోడ్పడిన ఆయా సంస్థల ప్రధానాచార్యులకు, మండల విద్యాధికారులకు, కరీంనగర్, రాజన్నసిరిసిల్ల జిల్లాల విద్యాధికారుల శ్రీ వెంకటేశ్వర్లు, డా॥ డి. రాధాకిషన్ గార్లకు, ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ (DIET) ఎల్.ఎం.డి. కాలనీ, కరీంనగర్ సిబ్బందికి హృదయపూర్వక ధన్యవాదములు. ఈ పుస్తకము ప్రత్యక్షంగా ఉపాధ్యాయుల, పరోక్షంగా విద్యార్థుల భాషాభిరుచి, సాహిత్యాభిలాష, భాషా ప్రక్రియల సాధనకు దోహదపడి బాధ్యతాయుత పౌరులుగా ఎదగడానికి, అందమైన భవిష్యత్‌ను నిర్మించుకోవడానికి తోడ్పడాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్న....

తేది : 15-12-2018
స్థలం : కరీంనగర్.

ప్రధానాచార్యులు
**ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ**
ఎల్.ఎం.డి. కాలనీ, కరీంనగర్.



# పద్య నిర్మాణము

తెలుగులో పద్యం అతి ప్రాచీనకాలం నుండి ఉంది. పద్యం అనేది భావప్రకటనకు ఒక రూపం. పద్యరూపం లయాత్మకమయింది. నాదాత్మకమయింది. ఈ లయాత్మకత, నాదాత్మకత అనేవి అక్షరాల పొసగింపు వల్ల ఏర్పడుతుంది. అక్షరాలు చిన్నవి, పెద్దవి, రెండుగా కలిసినవి (ద్విత్వ, సంయుక్తాలు), సున్నాతో కూడినవి ఉన్నాయి. ఆయా అక్షరాలు సమూహంగా ఏర్పడినవి 'గణాలు' అని పిలువబడినాయి. ఏయే అక్షరాలు కలిస్తే ఏయే గణాలు ఏర్పడతాయి అనేది ఒక శాస్త్రంగా ఎదిగింది. దాన్నే ఛందశ్శాస్త్రము అన్నారు. "ఛందయతి ఆహ్లాదయతీతి ఛందం" అని అమరము. ఏది భావప్రకటనకు ఒక తొడుగుగా ఉండి, అందాన్ని, ఆహ్లాదాన్ని కలిగిస్తుందో అది ఛందము. ఈ ఛందస్సు సంస్కృతం వంటి దేశీయ భాషలలో, ల్యాటిన్ వంటి పాశ్చాత్య భాషలలో కూడా ఉంది.

తెలుగులో పద్యరచన ఛందస్సులోనే ఆరంభమయింది. క్రమంగా వికసించింది. విస్తరించింది. తెలుగులో భారత, రామాయణ, భాగవతాదులు, మహాకావ్యాలు, కావ్యాలు, ప్రబంధాలు, శతకాలు మొ॥నవి ఛందస్సులోనే వెలువడినాయి. వాటికి సంస్కృత ఛందస్సు మూలాలుగా ఏర్పడినవి కొన్ని కాగా, దేశీయంగా సహజంగా ఏర్పడినవి కొన్ని ఉన్నాయి. మార్గ ఛందస్సు, దేశీయ ఛందస్సు అని రెండు విధాలు.

మార్గ ఛందస్సులో సంస్కృతం నుండి కొన్ని మనవైన మార్పులతో రూపొందించుకున్నవి. ఉత్పలమాల, చంపకమాల, శార్దూలం, మత్తేభం మొదలగునవి రూపాలు.

దేశీయ ఛందస్సులో కందము, తేటగీతి, ఆటవెలది, సీసము, ద్విపద, తరువోజ మొదలగునవి ఉన్నాయి.

ఈ అన్ని పద్యాలలో ఏయే గణాలు ఏయే వరుసలో ఉండాలి అనే నియమాలు ఏర్పడ్డాయి. అంతేకాదు ఏ పద్యం ఎన్ని చరణాలు ఉండాలి. ఏ



Scanned with OKEN Scanner

చరణంలో ఎక్కడ ఒక విరుపు ఉండాలి ? అనే నియమాలు కూడా ఏర్పడినాయి.

ఒక చరణంలో ఏర్పడే 'విరుపు' నే విరామం, లేదా 'యతి' అని అంటారు. సంస్కృతంలో దీర్ఘ సమాసాలుంటాయి. ఒక పదం మరొక పదంతో ముడిపడుతూ సాగిపోవడం వల్ల ఎక్కడా ఆగకుండా సాగుతుంది. అందువల్ల పాఠకుడికి, శ్రోతకు సంక్లిష్టత ఏర్పడుతుంది. అది తొలగించడానికి విరామం అవసరం. అక్కడ సమాసం ఆపి మరో పదంతో మొదలుపెడతారు. తెలుగులో కూడా ఈ ఏర్పాటు ఉంది. అయితే తెలుగులో 'యతి' స్థానం అంటే విరామం దగ్గర తరువాత మొదలయ్యే అక్షరం తప్పనిసరిగా పాదం మొదటి అక్షరం కాని, దాని మైత్రి అక్షరం కాని ఉండాలి. అందువల్ల పాదం నడకలో మరొక అందం ఏర్పడుతుంది. తెలుగులో సామెతలు కూడా ఇట్లే ఎక్కువగా ఉంటాయి. ఉదా॥ "ఎంత చెట్టుకు అంత గాలి" – ఇక్కడ 'ఎంత', 'అంత' అనేవి ఒకే విధంగా ఉన్నాయి. అయితే 'ఏ' అక్షరానికి 'అ' అక్షరానికి మైత్రి లేదు. కాని ఎంత, అంత, అని ఒకే లయ, తూగుతో ఉన్న రూపాలు ఉన్నాయి. రెండవ అక్షరం వల్ల ఇది ఏర్పడింది. దీన్ని ప్రాస యతి అంటారు. తెలుగులో మాత్రమే ఈ ప్రాసయతి ఉంది.

'ప్రాస' అంటే రెండవ అక్షరం. రెండవ అక్షరం ఒకే అక్షరాన్ని అన్ని పాదాలలో పాటించడం ప్రాస నియమం.

స్థూలంగా పద్యానికి గణ, యతి, ప్రాస నియమాలుంటాయి. వీటి వల్లనే పద్యానికి ఒక అందమైన నడక, లయ, నాదం ఏర్పడి చదివే వారికి, వినే వారికి ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. వీటి కారణంగానే అవి మననం చేయడానికి, జ్ఞాపకం పెట్టుకోవడానికి వీలవుతుంది.

ఈ గణయతి ప్రాసలు ఏయే పద్యాలలో ఎట్లా ఉన్నాయో కొన్నింటిని తెలుసుకుందాం. ముందుగా 'గణాలు' ఏవి ? ఎన్ని ? రెండు లేదా మూడు అక్షరాలు కలిస్తే 'గణం'. వీటిని సంక్షిప్తం చేసి గురులఘువుల క్రమాలను ఏర్పరిచారు. చిన్న అక్షరాలు లఘువులు క,గ,చ,అ,ఇ,కి,కు... అన్ని చిన్నవి...





పెద్ద అక్షరాలు (దీర్ఘాలు), ఆ,ఈ,ఊ,కా,గా,చా, గురువు ద్విత్వాలకు ముందున్నవి అన్న, చిన్న, నిన్న, అక్క మొ॥నవి వాటిలో ద్విత్వాలున్న క్క.. వీటికి ముందున్న 'అ' గురవు. సున్నతో, పొల్లుతో కూడినవి సంయుక్తాలు కూడా గురువులు. అందము, హంస, గంప..... నిన్, లన్, కన్, మర్... గురువులు. చక్ర, శుక్ల, అట్ల, వస్త్ర సంయుక్తాలకు ముందున్నవి గురువులు. లఘువులు – 'I' గురువును 'U' అనే గుర్తులతో సూచించవచ్చు.

యమాతారాజభానసలగం – అని గణాల మొదటి అక్షరాలతో ఏర్పడిన ఒక చిన్న సూత్రం వంటిది.

I U U U I U I I I U
య మా తా రా జ భా న స ల గం –

'య' గణం అంటే 'య' నుండి మూడక్షరాలు – యమాతా – IUU
'మ' గణం అంటే 'మా' నుండి మూడక్షరాలు – మాతారా – UUU
'త' గణం అంటే 'తా' నుండి మూడక్షరాలు – తారాజ – UUI
'ర' గణం అంటే 'రా' నుండి మూడక్షరాలు – రాజభా – UIU
'జ' గణం అంటే 'జ' నుండి మూడక్షరాలు – జభాన – IUI
'భ' గణం అంటే 'భా' నుండి మూడక్షరాలు – భానస – UII
'న' గణం అంటే 'న' నుండి మూడక్షరాలు – నసల – III
'స' గణం అంటే 'స' నుండి మూడక్షరాలు – సలగం – UIU

'లగము' – రెండక్షరాలు (అవగణం అనే పేరు కూడా ఉంది.) లగం – IU

'గలం' – రెండక్షరాలు అవగణం అనే పేరు కూడా ఉంది. (గ – గురువు, ల లఘువు) – UI

ఇవి కాక నాలుగక్షరాల గణాలు కొన్ని 'ఇంద్ర గణాలు'గా పిలుస్తారు.

నలము – నగణము + లఘువు – III + I = IIII
నగము – నగణము + గురువు – III + U = IIIU



Scanned with OKEN Scanner

సలము – సగణము + లఘువు – IIU + I = IIUI

'భ'గణము-రగణము,తగణము-ఈ మూడు మొత్తం ఆరు ఇంద్ర గణములు.

సూర్యగణములు – రెండు 1. గలం – UI

2. నగణము – III

స్థూలంగా ఈ గణాలు, యతి, ప్రాసలతో ఉండే కొన్ని పద్యాలు. మార్గ ఛందస్సు -

**ఉత్పలమాల :** ప్రతిపాదంలో **భ ర న భ భ ర వ** – అనే గణాలు వరుసగా ఉంటాయి. పదవ అక్షరం యతి స్థానం – ప్రాస నియమ ముంటుంది.

| ఉదా : | | | | | | |
|---|---|---|---|---|---|---|
| UII | UIU | III | UII | UII | UIU | IU |
| నల్లని | వాడు ప | ద్మనయ | నంబుల | వాడు కృ | పారసం | బు పై జల్లెడు |
| భ | ర | న | భ | భ | ర | వ |

ప్రాస – 'ల'కారం    యతిస్థానం (న, న)    ప్రాస – 'ల'కారం

చంపకమాల : ప్రతిపాదంలో న జ భ జ జ జ ర – 11వ అక్షరము యతి ప్రాస ఉంటుంది.

| ఉదా : | | | | | | |
|---|---|---|---|---|---|---|
| III | IUI | UII | IUI | IUI | IUI | UIU |
| అది ర | మణీయ | పుష్పవ | నమావ | నమందొ | క మేద | మీద పై నది యొక |
| న | జ | భ | జ | జ | జ | ర |

'ద'కారం ప్రాస    యతిస్థానం    'ద'కారం ప్రాస

వనము అ – 'మా' – 'అ'-కు 'ఆ'కు యతి

శార్దూలం : మ స జ స త త గ – 13 యతి ప్రాస ఉంటుంది.

| ఉదా : | | | | | | |
|---|---|---|---|---|---|---|
| UUU | IIU | IUI | IIU | UUI | UUI | U |
| శ్రీ కైవ | ల్య పదం | బు జేరు | టకునై | చింతించె | దన్, లోక | ర క్షై కారంభకు |
| మ | స | జ | స | త | త | గ |

'క'కారం ప్రాస    13వ అక్షరం యతిస్థానం    'క'కారం ప్రాస

స,శ,ష,చ,ఛ,జ,ఝ-లు మైత్రి అక్షరాలు



**మత్తేభం :** స భ ర న మ య వ – 13వ యతి ప్రాస ఉంటుంది.

| ఉదా : | | | | | | |
|---|---|---|---|---|---|---|
| IIU | UII | UIU | III | UUU | IUU | IU |
| లలిత | స్కంధము | కృష్ణ మూ | లము శు | కాలాపా | భిరామం | బు మం జులతా |
| స | భ | ర | న | మ | య | వ |

'ల'కారం ప్రాస    14వ యతిస్థానం ల-లా    'ల'కారం ప్రాస

**దేశీయములు :**

కందము, ద్విపద, సీసము, ఆటవెలది, తేటగీతి, మధ్యాక్కర వంటి కొన్ని పద్యములు దేశీయంగా రూపొందినవే. దేశీయంగా ప్రజలు పాడుకునే పాటలకు, వాడుకునే సామెతలకు, మాటలకు దగ్గరగా ఏర్పడిన చందో రూపాలు దేశీయములు.

మార్గ చంధస్సులో వలె కొన్ని నాలుగు పాదములు కలవికాగా కొన్ని రెండు పాదములు కలవిగా తరువాత త్రిపద, చతుష్పద, షట్పదములుగా ఏర్పడినవి కూడా ఉన్నాయి.

ప్రాస నియమము పాటింపబడినవి జాతులు, పాటింపబడనివి ఉపజాతులుగా విభజించారు.

జాతులు – 1. కందము

తెలుగులో అత్యంత ప్రాచీనమైన దేశీయ పద్యరూపము కందము. క్రీ.శ. 940లలో కరీంనగర్ జిల్లా బొమ్మలమ్మ గుట్టపై కనిపించిందీ కంద పద్యం.

గగ, భ,జ,నల, స – అనే గణాలు కందంలో ఉంటాయి. వీటిలో ఏవయినా మూడు గణాలు మొదటిపాదంగా ఏదు గణాలు రెండవ పాదంగా ఉంటాయి. ఈ రెండు పాదాలు పద్యంలో సగభాగం మిగతా రెండు పాదాలు ఇట్లే ఉంటాయి.



Scanned with OKEN Scanner

బేసి స్థానంలో 'జ' గణం వాడకూడదు. రెండవ, నాలుగవ పాదాలలో 3వ గణం తప్పనిసరిగా 'జ'గణం గాని 'నలము' గాని ఉండాలి.

రెండవ, నాలుగవ పాదాలలో 4వ గణం మొదటి అక్షరం యతిస్థానం. రెండవ, నాలుగవ పాదాలలో చివరి గణం 'గగ' లేదా సగణము ఉండాలి. ప్రాస నియమము 4 పాదాలలో పాటింపబడాలి.

ఇన్ని నియమాలున్నప్పటికీ కందం రాయడం, చదవడం మనవారెంతో విరివిగా చేశారు. ఆ పద్యంలో ఉన్న నడక, లయ విశిష్టమైన 'కందము' రాసినవాడే కవి అనే నానుడి ఏర్పడింది. కందము అనేక అందాలను చిందించింది.

గణాల క్రమం లేకపోవడం వలన రెండక్షరాలు, మూడక్షరాలు, నాలుగక్షరాలు గణాలు వాడుకునే స్వేచ్ఛ వలన అనేక గతులలో కందాలు వెలువడ్డాయి. పై నియమాలను పాటిస్తూ ఒకే గణాన్ని ఎక్కువగా వాడుకున్న సందర్భాలున్నాయి.

**కందము : గగ, భ, జ, నల, స ......**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| ఉదా : | I I I I | U I I | U I I | I I U | I I U | I I I I | I I U | I I U |
| | వినదృగు | నెవ్వరు | చెప్పిన | వినినం | తనె వే | గపడక | వివరిం | ప దగున్ |
| | నల | భ | భ | స | స | నల | స | స |

ప్రాస యతిస్థానం (అ–ఔ) –

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| U U | I I I I | U I I U U | I I I I | I I I I | U U | I I U |
| శ్రీరా | ముని దయ | చేతను నా రూ | ఢిగ సక | ల జనులు | నౌరా | యనగా |
| గ గ | నల | గగ | నల | నల | గగ | స |

ప్రాస యతిస్థానం (అ–ఔ) –





**ద్విపద :** కందం తరువాత దేశీయంగా ప్రసిద్ధి పొందింది. ఎక్కువ వాడుకలోకి వచ్చి కావ్యాలు వెలువడింది ద్విపదలోనే

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| ఉదా : | I I I I | U I I U | I I I U | I I U I I I I | | I I U | I U | |
| | ఇంద్రగ | ణములుమూ | డినగణం | బొకటి | చాంద్రాస్య | ద్విపదకు | చనుదెప్ప | రేచ |
| | భ | సగ | సగ | నగణం | త | నల | సల | గల |

ప్రాస యతిస్థానం (ఆ–ఔ) –

రెండు పాదాలు మాత్రమే ఉండడం వలన 'ద్విపద' అనే పేరు వచ్చింది. రెండు కన్నా ఎక్కువ పదాలు ప్రాస నియమం లేకుండా వాడితే మంజరీ ద్విపద అంటారు. 'ఉత్సాహం', మధ్యాక్కర పద్యాలు కూడా జాతుల విభాగంలో ఉన్నాయి.

**ఉపజాతులు :**

ప్రాస నియమము లేని పద్యాలు ఉపజాతులు సీసము, తేటగీతి, ఆటవెలది....

1. సీసము – ఇది చాలా పెద్ద పద్యం. నాలుగు దీర్ఘపాదాలుంటాయి. ఒక్కొక్క పాదం రెండుగా విభజింపబడి ఎనిమిది పాదాలుగా ఏర్పడతాయి. వీటి తరువాత తేటగీతి లేదా ఆటవెలది – ఎత్తుగీతిగా ఉంటాయి.

సీస పద్యం ప్రతిపాదంలో మొదటి సగంలో నాలుగు (4) ఇంద్ర గణాలు, తరువాతి సగంలో 2 ఇంద్ర గణాలు + 2. సూర్య గణాలు ఉంటాయి. ప్రతి భాగంలో 3వ గణం మొదటి అక్షరం యతి స్థానం. ప్రాసనియమం ఉండదు. యతికి బదులు 'ప్రాసయతి' పాటించవచ్చును. యతిస్థానంలో రావలసిన అక్షరం రాక రెండవ అక్షరంతో కలిసినపుడు ప్రాసయతి – ఉదా – యతి – మతి 'య'-కు, 'మ'కు – యతి కుదరదు. 'తి' కలుపుకొని రెండు చోట్ల రెండవ అక్షరం ఒకటే ఉండటం ప్రాసయతి.

ఉపజాతి పద్యాలన్నింటికీ ఈ 'ప్రాసయతి' సౌకర్యం ఉంది.



Scanned with OKEN Scanner

సీ॥

| IIUI | UUI | UI U | II U | III U | IIU I | U I | U I |
|---|---|---|---|---|---|---|---|
| నరసింహ | నీదివ్య | నామమం | త్రము చేత | దురితజా | లములెల్ల | ద్రోల | వచ్చు |
| నల | తగ | ర | సల | నగ | సల | గల | గల |

↓ యతిస్థానం

ఇంద్ర గణాలేవయినా వాడుకునే స్వేచ్ఛ ఉండడం వల సీస పద్యం అనేక విధాలుగా వ్రాయడానికి వీలవుతుంది. సీసపద్యం యొక్క నడక గేయ పద్ధతికి దగ్గరగా ఉండడం వల్ల పెద్దగా ఉన్నా చదవడమే కాదు జ్ఞాపకముంచుకొనడం కూడా తేలిక. నరసింహ శతకం సీసపద్యాల్లో ఉంది. చదువురానివారు కూడా ఈ పద్యాలు విని నేర్చుకొని పాడిన వారెందరో ఉన్నారు. పద్యంలోని లయ వల్ల ఇది సాధ్యమయింది.

**తేటగీతి :** 4 పాదాలుంటాయి. ప్రతిపాదంలో 1 సూర్యగణం+2 ఇంద్ర గణాలు+సూ.గ. ప్రతిపాదంలో '4'వ గణం మొదటి అక్షరం యతిస్థానం. ప్రాసయతి ఉపయోగించవచ్చును.

| III | UUI | UII | UI | UI |
|---|---|---|---|---|
| భరత | ఖండంబు | చక్కని | పాడి | యావు |
| న | త | భ | గల | |

↓ యతిస్థానం పఫ బభ లు మైత్రి అక్షరాలు

| | | | | |
|---|---|---|---|---|
| తెల్ల | వారను | గడుసరి | గొల్ల | వారు |

↓ యతిస్థానం తె-గొ-యతి లేదు

తెల్ల-గొల్ల ప్రాసయతి

**ఆటవెలది :** 4 పాదాలుంటాయి. 1,3 పాదాలలో 3సూ+2 ఇం.గ. ఉంటాయి. ప్రతిపాదంలో '4'వ గణం మొదటి అక్షరం యతిస్థానం.

| UI | UI | UI | UIU | IIUI |
|---|---|---|---|---|
| ఉప్పు | కప్పు | రంబు | నొక్కపో | లికనుండు |

↓

ఒక్క - లో ఒ-ఉప్పుతో 'ఉ' లో యతి





| | | | | |
|---|---|---|---|---|
| చూడ | చూడ | రుచుల | జాడ | వేరు |

↓

చూడ-జాడ-ప్రాస యతి

ఇంద్రసూర్య గణాలలో భేదాల వల్ల ఈ పద్యం కూడా అనేక గతులలో కన్పడి ఆకర్షణీయంగా ఉంటుంది. చిన్న పద్యమైనా పెద్ద భావం లయబద్ధంగా చెప్పడానికి వీలవుతుంది. శతకాలలో ఎక్కువగా ఈ ఉపజాతి పద్యాలను వాడుకున్నారు. తెలుగు పద్య నిర్మాణంలోని ఛందస్సు అనేక శిల్పవిన్యాసాలకు కారణమయింది.



Scanned with OKEN Scanner

# వ్యాసం

తెలుగు సాహిత్యం అనాది నుండి వివిధ ప్రక్రియలకు ఒక ప్రయోగ కేంద్రంగా విరాజిల్లుతూ నూతన ఒరవడిని పెంపొందించుకొంటూ విస్తృత రూపం దాల్చినది. సాహిత్యానికి వ్యాసప్రక్రియ ఒక ఆభరణం.

పాశ్చాత్య ప్రభావంతో తెలుగు సాహిత్యంలోకి వచ్చిన ప్రక్రియ వ్యాసం. ఇంగ్లీష్‌లో Essay అనే మాటకు సమానార్థకంగా వ్యాసం వాడబడుతుంది. Essay అంటే ప్రయత్నం, కృషి.

వ్యాస శబ్దానికి అర్థం 'విస్తరించు' అని, వ్యాకృతి కల్గినది వ్యాసం అని అంటాం. అంటే విపులంగా వివరించి రాసేది వ్యాసమని చెప్పవచ్చు.

వ్యాసానికి మొదట్లో ప్రమేయం, సంగ్రహం, ఉపన్యాసం అనే పేర్లుండేవి. తెలుగు వ్యాసానికి, ఆద్యుడిగా పేర్కొనదగిన సామినేని ముద్దు నరసింహం గారు వ్యాసాన్ని 'ప్రమేయం' అని పేర్కొన్నాడు.

మొట్టమొదటిసారిగా ఈ ప్రక్రియ ఫ్రెంచ్ భాషలో రూపొందింది. 16వ శతాబ్దానికి చెందిన రచయిత మాంటేనే (Montaugne) తన రచనకు Essay అని పేరు పెట్టాడు. 1561-1626లో ఆంగ్ల రచయిత ఫ్రాన్సిస్ బేకన్ ఆంగ్లసాహిత్యంలో ఈ ప్రక్రియను ప్రవేశపెట్టాడు.

ఫ్రాన్స్‌లో మొదలై ఇంగ్లాండ్‌లో అడుగుపెట్టి భారతదేశంలో అందునా తెలుగు సాహిత్యంలో 18వ శతాబ్దం ఉత్తరార్థంలో ప్రవేశించి మిగతా అన్ని సాహిత్య ప్రక్రియలకంటే వేగంగా, విస్తృతంగా విస్తరించింది. వ్యాసం తెలుగు సాహిత్యంలో సామినేని ముద్దు నరసింహం 'హితసూచిని' మహామహోపాధ్యాయ పరవస్తు వేంకట రంగాచార్యులు (1822-1900) తన వ్యాసాలను 'సంగ్రహములు'గా ప్రచురించారు. అలాగే కందుకూరి వీరేశలింగం, జియ్యర్ సూరి, కిళాంబి రామానుజాచార్యులు, కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రి, అచంట వేంకటరాయ సాంఖ్యాయన శర్మ, చిలుకూరి వీరభద్రరావు, కొమర్రాజు





లక్ష్మణరావు, గొబ్బూరి వేంకటనాగ రాఘవరావు తొలితరం వ్యాసకర్తల్లో ముఖ్యులు. అలాగే మానవల్లి రామకృష్ణ కవి, నడుకుదుటి వీరరాజు, వేటూరి శివరామశాస్త్రి, రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ, బండారు తమ్మయ్య, గిడుగు, జయంతి రామయ్య పంతులు, మల్లంపల్లి సోమశేఖర శర్మ, కందుకూరి ఈశ్వరదత్తు, నేలటూరి వేంకట రమణయ్య, మారేమండ రామారావు మొదలైనవారు సాహిత్యంలో వ్యాస ప్రక్రియను సుసంపన్నం చేసినవారే. తెలుగు సాహిత్యంలో వ్యాసాలు అనగానే మనకు గుర్తుకు వచ్చేపేరు సాక్షి వ్యాసాలు పానుగంటి లక్ష్మీనరసింహారావు గారి రచనావైచిత్రి తెలుగు వ్యాస ప్రక్రియను సుసంపన్నం చేయడమేకాక సాక్షివ్యాసాలకు కావ్య గౌరవాన్ని కల్గించింది.

నిజానికి వ్యాసం పుట్టుక యజుర్వేదంలోని తొలిమంత్రం అని చెప్పవచ్చు. వేదాలకు వ్యాఖ్యాన రూపాలైన బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు సంపుటాలు సంపుటాలుగా ఒక వ్యాస పరంపరనే తైత్తరీయం వివిధ విషయాలతో కూడిన వ్యాస సంకలనమనే చెప్పవచ్చు. ప్రధానంగా వ్యాసాలు సాహిత్య వ్యాసాలు, సాంఘిక వ్యాసాలు, రాజకీయ వ్యాసాలు, ఆధ్యాత్మిక, మత సంబంధిత వ్యాసాలు, సంపాదకీయ వ్యాసాలు, విజ్ఞానశాస్త్ర వ్యాసాలు, ఆర్థిక వాణిజ్య క్రీడాది రంగాలకు సంబంధించిన వ్యాసాలు, సమీక్ష వ్యాసాలు ఇలా నానారకాల వ్యాసాలు ఉన్నాయి.

**వ్యాసాన్ని ఎలా రాయాలి ?**

ఈ రోజుల్లో ఎటుచూసినా పోటీ ప్రపంచమే. ఏ ఉద్యోగానికైనా, పోటీపరీక్షలకైనా వ్యాసం రాయడం ఒక అంశంగా పరీక్షిస్తున్నారు. వ్యాసం రాయడాన్ని పరీక్షించడమంటే ఆ విద్యార్థి యొక్క భావవ్యక్తీకరణ శక్తిని, తాను చెప్పదల్చుకున్న అంశాన్ని వ్యక్తీకరించే విధానాన్ని పరిశీలించడమే. వ్యాసరచన ద్వారా విద్యార్థి యొక్క జ్ఞానాన్ని, విషయాన్ని గ్రహించే శక్తిని, తాను నేర్చుకున్న విషయాన్ని వ్యక్తపరిచే సామర్థ్యాన్ని పరీక్షిస్తారు. అలాగే వ్యాసం రాసేవారి యొక్క వ్యక్తిత్వాన్ని, మానసిక స్థితిగతులను కూడా వ్యాసరచన ద్వారా అంచనా వేస్తారు. అందువల్ల వ్యాసం ఎలా రాయాలో తెలుసుకుంటే వ్యాసప్రక్రియతో



Scanned with OKEN Scanner

ముడిపడిన అన్ని పోటీ పరీక్షలను ఎదుర్కొని విజేతగా నిలబడవచ్చు.

నిజానికి వ్యాసరచన ఒక నైపుణ్యం. వ్యాసం రాయడానికి విషయావగాహన ఎంత ముఖ్యమో దానిని వ్యక్తీకరించే విధానం అంతకంటే ముఖ్యం. వ్యాసమంటేనే ఒక విశ్లేషణాత్మక, వివరణాత్మక విశేషాలతో కూడిన సాహితీ కూర్పు కాబట్టి చెప్పదల్చుకున్న భావాన్ని ఆకర్షణీయంగా, అర్థవంతంగా, సూటిగా, స్పష్టంగా వ్యక్తపర్చాలి. అంతేకాకుండా అతిదీర్ఘంగా ఉండకూడదు. సంగ్రహంగా క్లుప్తంగా ఉండాలి. చెప్పదల్చుకున్న విషయాన్ని సోదాహరణంగా వ్యక్తపర్చాలి. ప్రత్యేక శీర్షికలు సందర్భానుసారంగా, విషయానుసారంగా ఉండాలి. చెప్పే విషయం నిర్దిష్టంగా, విషయోద్దేశంగా ఉండాలి. నియమిత పేజీలు నిర్దేశించుకోవాలి. భాష సూటిగా, సులభగ్రాహ్యంగా ఉండాలి. ఉపక్రమ (ప్రారంభం, ఎత్తుగడ), ఉపపాదన (ప్రతిపాదించే విషయం/అంశం), ఉపసంహారాలు (ముగింపు) క్రమంగా పాటిస్తూ రాయాలి.

## వ్యాసంలో ప్రధానంగా ఉండాల్సిన లక్షణాలు :

వ్యాసం ప్రధానంగా మూడు భాగాలుగా ఉంటుంది.

1. ఉపోద్ఘాతం లేదా ప్రారంభం లేదా ఎత్తుగడ
2. విషయస్థాపన లేదా ఉపపాదన లేదా మధ్యభాగం లేదా విషయ వివరణ.
3. ముగింపు లేదా ఉపసంహారం.

ఉపోద్ఘాతం ముఖ్యంగా ఎన్నుకున్న అంశానికి పరిచయవాక్యాలుగా (ఇంట్రో) ఉండాలి. మనం చెప్పాలనుకున్న విషయాన్ని పరిచయం చేయడం, చదువరులలో ఆసక్తిని రేకెత్తించడం ఉపోద్ఘాతం యొక్క లక్షణాలుగా చెప్పవచ్చు. మంచి భాష, మంచి పదప్రయోగం అర్థవంతంగా ప్రయోగించి ఉపోద్ఘాతాన్ని శక్తివంతంగా మలుచుకోవడం అలవర్చుకోవాలి.

ఉపపాదన లేదా మధ్యభాగంలో ఎంచుకున్న అంశాన్ని ప్రభావశీలంగా, ప్రతిభావంతంగా వ్యక్తీకరించాలి. ఎంచుకున్న విషయానికి సంబంధించిన పూర్తి





జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి. పూర్తి సమాచారంతో చెప్పదల్చుకున్న అంశాన్ని సాధికారికంగా వివరించి రాయాలి. వ్యాసం యొక్క పూర్తి స్వభావం తెలిసేది ఈ మధ్యభాగమే కావున దీనికి తగిన విషయ పరిజ్ఞానాన్ని కల్గి ఉండాలి. ఒక క్రమపద్ధతిలో, ఎలాంటి సందేహాలకు తావులేకుండా స్పష్టంగా, సూటిగా విషయ వివరణ చేయాలి. రాసే అంశంలో స్పష్టత తప్పనిసరిగా ఉండాలి. విషయ వివరణలో విషయాన్ని వివరించేటప్పుడు, అసందిగ్ధమైన, అశాస్త్రీయమైన, అసంగతమైన అనవసర చర్చలకు దారితీసే అంశాలను పరిహరించాలి. చాలా సహేతుకంగా, సోదాహరణంగా, రాగద్వేషాలకు అతీతంగా విషయాన్ని ప్రతిస్థాపన చేయాలి. మొత్తం వ్యాసంలో ఇదే ప్రధానభాగం కనుక దీనిని చాలా జాగ్రత్తగా క్రమపద్ధతిని పాటిస్తూ తనకున్న అవగాహన మేరకు స్పష్టంగా, సమగ్రంగా రాయాలి. అంతేకాకుండా అనుకూల, ప్రతికూల అంశాలను రాసేటప్పుడు సంయమనం పాటిస్తూ సమంగా ఎటువైపు మొగ్గకుండా రాసే నైపుణ్యాన్ని అలవర్చుకోవాలి.

చెప్పదల్చుకున్న విషయ విస్తృతిని బట్టి, పరిమితిని బట్టి ఉపశీర్షికలు ఉపయోగిస్తూ పేరాలుగా విభజిస్తూ రాయాలి. ముఖ్యంగా ఒక అంశం నుండి ఇంకొక అంశానికి విషయాన్ని మార్చుటకు పేరాలుగా విభజించడం తప్పనిసరిగా చేయాలి. ఒకవేళ చెప్పదల్చుకున్న విషయం ఒకవైపే మొగ్గుచూసేదిగా ఉండే సందర్భంలో దానిని సమర్థించుటకు గతంలో జరిగిన సంఘటనలను, ప్రముఖుల అభిప్రాయాలను ఉటంకిస్తూ తన అభిప్రాయాన్ని జోడించి రాయాల్సి ఉంటుంది.

## ముగింపు లేదా ఉపసంహారం :

వ్యాసానికి ప్రాణం ఒక చక్కటి ముగింపు మాత్రమే. ముగింపు అర్థవంతంగా, చదువరులలో ఆలోచనను, క్రియాశీలతను కల్గించేదిగా ఉండాలి. అంతేకాకుండా సమస్యకు ఒక చక్కటి పరిష్కారాన్ని సూచించేదిగా, ఒక పరిష్కారం దిశగా ఆలోచించేదిగా, పఠితల మనోవైఖరుల్లో మార్పును తెచ్చేదిగా



Scanned with OKEN Scanner

ఉండాలి. అవసరమైతే ప్రముఖుల అభిప్రాయాలను తన వాదనకు జోడిస్తూ తాను చెప్పదల్చుకున్న అంశాన్ని సమర్ధవంతంగా, సందిగ్ధత లేకుండా, పైన పేర్కొన్న విషయాలతో విభేదించకుండా, చక్కటి భాషను ప్రయోగిస్తూ ముగింపు పలకాలి. ఇలా పైన పేర్కొన్న విధంగా మనం రాసే వ్యాసం అది సాహిత్య సంబంధమైనదా, సాంఘిక, రాజకీయ, ఆధ్యాత్మిక, మత సంబంధిత వ్యాసాలా? లేక సంపాదకీయ వ్యాసాలా ? అనేవి కాకుండా విజ్ఞానశాస్త్ర సంబంధిత, ఆర్థిక, వాణిజ్య, క్రీడా, హాస్య, వ్యంగ్య, సమీక్ష, పరిశోధనాత్మక వ్యాసాలా అని నిర్ధారించుకొని వాటికనుగుణంగా భూమికనుసిద్ధం చేసుకొని చక్కని భాష ప్రయోగాన్ని చేస్తూ, పదబంధాలను ఉపయోగిస్తూ, క్రమపద్ధతిలో పేరాలుగా విభజించుకుంటూ రాసినట్లైతే చక్కని వ్యాసకర్తలుగా పేరు ప్రఖ్యాతులు సంపాదించవచ్చు.





# వచన కవిత్వ ప్రక్రియ

**పరిచయం :**

సాహిత్యం వ్యక్తి శ్రేయస్సును సమాజ శ్రేయస్సును కోరుకుంటుంది. కొత్త ఆలోచనల ద్వారా భావోద్వేగాల ప్రకటన ద్వారా బుద్ధినీ, మనస్సునూ చైతన్య పరుస్తుంది. మానవ సమాజం మరింత ఆనందంగా, సుఖంగా జీవించడానికి దారులు వేస్తుంది. "ఒకే ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్ళకు కదలిక" అనే వాక్యం కవిత్వానికి చక్కగా సరిపోతుంది. తెలుగు సాహిత్యంలో మౌఖిక, లిఖిత సాహిత్యాల్లో పాట, పద్యం, వచనంతో రూపొందిన అనేక ప్రక్రియలు ఉన్నాయి. దేని విలువా, అవసరం దానిదే ఒక దానికి మరొకటి పూరకం కాదు, పోటీ కూడా కాదు. కవి, రచయిత తాను ప్రకటించదలచుకున్న భావాలకు వాహిక ప్రక్రియ. భావం ప్రాణంలాంటిదైతే రూపం శరీరంలాంటిది. ఒకే ప్రాణం అనేక రూపాలలో ఉన్నట్టుగా ఒకే భావం అనేక ప్రక్రియా రూపాలలో వెల్లడిచేయవచ్చు. అట్లాంటి అనేక రూపాలలో వచన కవిత కూడా ఒకటి. వచన కవిత్వం ఒక ఆధునిక ప్రక్రియ. 1930-40ల మధ్య తెలుగు సాహిత్యంలో మొదలైన అభ్యుదయ కవిత్వ ఉద్యమం వచన కవిత్వ ప్రక్రియకు దోహదం చేసింది. ఈ వచన కవిత్వ ప్రక్రియకు "వచన పద్యం, వచన గేయం, వచన గంధి, వృత్త గంధి, ముక్తచ్ఛందం, స్వచ్ఛందం కవిత్వం, స్వేచ్ఛాఛందం, అనిబద్ధ కవిత్వం, స్వేచ్ఛా గీతి అనే పేర్లు వ్యవహరింపబడుతూ వచ్చాయి. కానీ, ఇప్పుడు వచన కవిత్వం అనే పేరు స్థిరపడి పోయింది. ఆంగ్లంలో దీనికి free verse libre అనే పేర్లున్నాయి.

**నిర్వచనం :**

వచన కవితకు ప్రామాణికమైన ఒకే నిర్వచనం ఏదీ లేదు. విస్తృతమైన దాని పరిధిని కొంత మంది నిర్వచించడానికి ప్రయత్నించారు.

1. "వచనం లాగా భాసించే మాటల్లో కవితా స్వభావమైన భావానుభూతిని కలిగించే ప్రయత్నం" అని
2. "ఛందో రహితమైన కేవల వచనంలో భావ లయ ప్రధానంగా పలికే కవిత్వం" అని అరిపిరాల విశ్వం.



Scanned with OKEN Scanner

3. "వచనం **కవితామయంగా** ఉంటే ఆ రచన వచన కవిత్వం" అని సర్దేశాయి తిరుమల రావు

4. "వచన గీతానికి ప్రాణప్రదమైన లక్షణం **గమన వైవిధ్యం**. ఇది సంభాషణలోని యాసతో, కాకువుతో, ఉచ్చారణ విశేషాల మీద ఆధారపడి ఉంటుంది." అని శ్రీశ్రీ

5. "కళాభంజకం కానంతవరకే అలంకారాల, వర్ణనల స్వీకరణ, కవితలో **సారళ్యం** సూటిగా హృదయానికి తాకే విధంగా **శబ్దాల కూర్పు**, తెలుగు **నుడికారపు సొంపులను, రసపోషణ** తగినంతగా వినియోగించుకోవడం, అన్నిటికంటే కవిత తెలుగు ప్రజల **సంభాషణా స్థాయికి** దగ్గరగా రావటం అని కుందుర్తి ఆంజనేయులు.

6. "ఏ నియమము లేకుండా శుద్ధ వచనమును లయాత్మకంగా మార్చిన వచన గేయమగును. వచనములో విషయ ప్రకటనయే ముఖ్య లక్ష్యము. వచన గేయములో వైశద్యము ప్రధాన గుణము కాదు. పాఠకులలో భావోద్వేగము కలిగించు **అంతర్లయ** దీని ప్రధాన లక్షణము" అని సి. నారాయణరెడ్డి.

7. "వచన పద్యం దాని స్వరూపం" అనే వ్యాసంలో ఆచార్య కోవెల సంపత్కుమార వచన కవితకు ఈక్రింది లక్షణాలు సూచించారు.

* భావాన్ని, భావాంశాన్ని బట్టి పాదాలను విభజించటం.
* క్రియా పదాలతో ప్రారంభించటం, పూర్తి చేయటం.
* క్రియా రహితంగా భావాన్ని వాక్యంలో నిరూపించటం.
* అనియతంగా యతి ప్రాసల్ని, అంత్యప్రాసల్ని ఉపయోగించటం.
* ఒక్కొక్క పాదాన్ని, తత్పూర్వ పాదం కన్నా పొడిగిస్తూ భావోద్దీప్తిని కలిగించటం.
* భావాన్ని లయబద్ధంగా స్ఫురించేటట్టు పదాలను కూర్చటం.

పై అనేక నిర్వచనాలను, సూచనలను ఇతర కవుల అభిప్రాయాలను





క్రోడీకరించి వచన కవితకు నిర్వచనం చెబితే "వచన శైలి, ఛందో రాహిత్యం, గమన వైవిధ్యం, నిరాడంబరత, పాద విభజన, అర్థపుష్టి, శబ్ద వైచిత్రి, భావ లయ, అంతర్లయ, ఊపు, విసురు, నియమ రాహిత్యం, అంత్యప్రాస, వ్యవహారిక శైలి మొదలైన అనేక లక్షణాల సమాహారం వచన కవిత" అనవచ్చు.

**పుట్టుక - వికాసం :**

సాహిత్యం ప్రకృతినీ, సమాజాన్నీ ప్రతిబింబిస్తుంది. ఇవి రెండూ నిత్యం మారుతూ ఉంటాయి. కనుక, సమాజ అవసరాలకు అనుగుణంగా ఉద్యమాలు ఆవిర్భవించినప్పుడు, ఆలోచనల్లో మార్పు చోటుచేసుకున్నప్పుడు సాహిత్యంలో కూడా ఒక ఉద్యమ స్ఫూర్తి ప్రవేశిస్తుంది. వస్తువులోనూ రూపంలోనూ కొత్త పోకడ తలెత్తుతుంది. కవిత్వంలో వస్తువు, రూపం ఒక దాని మీద ఒకటి ఆధారపడి ఉంటాయి. వచన కవితా పితామహునిగా పేరుపొందిన కుందుర్తి ఆంజనేయులు నూతన ప్రక్రియల ఆవిర్భావం గురించి చెబుతూ "వస్తు గతమైన కొత్త భావం పాత రూపం మీద తిరుగుబాటు చేస్తుందని, దానికి అనువైన కొత్త రూపాన్ని అది సృష్టించుకొంటుంది" అని అన్నారు.

వచన కవిత్వావిర్భావానికి ముందు జాతీయోద్యమ కాలంలో తేటగీతులు, ఆటవెలదులు, గేయ కవిత్వం, ముత్యాల సరాలులాంటి రూపాలు సామాన్య ప్రజలను చైతన్యవంతులను చేయడానికి ముందుకు వచ్చినాయి. ఇవే రూపాలను వాడుకొని భావ కవిత్వం లలిత, మనోహర, సుందర, సుకుమార, విరహ, విషాద కావ్యాలను ముందుకు తెచ్చింది. కవిత్వం సామాజిక స్పృహను కోల్పోయి ఆత్మాశ్రయంగా మారింది. ఈ భావ కవిత్వపు వ్యక్తిగత ధోరణికి భిన్నంగా ప్రపంచాన్ని, ప్రపంచ సమస్యలను ప్రతిబింబించే విధంగా కొన్ని పాశ్చాత్య ధోరణులు 1930ల నుండి తెలుగు సాహిత్యం మీద ప్రభావం చూపాయి. వాటిలో డాడాయిజం (విధ్వంసవాదం), సర్రియలిజం (అధి వాస్తవికత), ఇమేజిజం (భావ చిత్రవాదం), సింబాలిజం (ప్రతీకవాదం) ముఖ్యమైనవి. వీటిని మొదటగా అందుకొని శిష్లా, ఉమా మహేశ్వర రావు, పట్టాభిరామిరెడ్డి, శ్రీరంగం శ్రీనివాసరావు, శ్రీరంగం నారాయణ బాబు మొదలైనవారు భావ కవిత్వం మీద ఒక తిరుగుబాటులాగా కవిత్వాన్ని సృష్టించారు.



Scanned with OKEN Scanner

ఆనాటి పాశ్చాత్య వాదాల ప్రభావం, 1930లలోని ఆర్థిక సంక్షోభం, అప్పుడే వేళ్ళూనుకుంటున్న నగర జీవిత ప్రభావం, మారుతున్న జీవన విధానం, విలువలు మొదలైన సామాజిక అంశాలు, పాత నిఘంటువులు, వ్యాకరణాలు, ఛందస్సులను వదులుకోవాలనే స్వేచ్ఛాప్రియత్వం కలిసి వచన కవిత్వానికి పురుడు పోసినాయి. వృత్త పద్య స్థితి నుండి ఆటవెలది, తేటగీతులకు, ఆ తర్వాత త్రిస్ర, చతురస్ర, ఖండ, మిశ్ర గతుల గేయాలతో అలరారిన తెలుగు కవిత్వం క్రమంగా వాటిని వదులుకొంటూ వచన కవిత్వంలోకి అడుగుపెట్టింది. "పాతకాలం పద్యమైతే/వర్తమానం వచన గేయం" అని ఎలుగెత్తి చాటి వచన కవిత్వాన్ని వ్యాప్తిలోకి తేవడానికి విశేష కృషి చేసినవాడు కుందుర్తి ఆంజనేయులు.

కుందుర్తి తన వ్యాసాలు పీఠికల ద్వారా వచన కవిత్వోద్యమానికి కొన్ని ముఖ్యమైన ప్రతిపాదనలు చేశాడు.

1. కవితా శైలి సామాన్య ప్రజల సంభాషణ స్థాయికి రావాలి.
2. బృహత్ కావ్యాలూ, కథా కావ్యాలూ, కవితా నాటకాలూ, నాటికలూ రావాలి.
3. ఆత్మాశ్రయ తత్త్వం వదులుకొని, మార్క్సిజం చదవాలి.
4. వచన కవిత్వానికి వ్యాకరణం ప్రజలు, నిఘంటువులు ప్రజలు, అలంకారాలు ప్రజలు.
5. సంస్కృత పద బాహుళ్యాన్ని, ఆంగ్ల పదాడంబరాన్ని వదులుకోవాలి.
6. కవిత్వాన్ని జాతీయం చేశాం - ఇక ఇది అందరి సొత్తు.
7. అధివాస్తవికత, అయోమయం, అస్పష్టత పనికి రాదు.
8. నిజాయితీ, చిత్తశుద్ధి అనేవి ప్రజాదృష్టితో రాసే కవికి చాలా ముఖ్యం.
9. పీడిత వర్గాలను గురించి రాసే కవి ఆ వర్గానికి చెందినవాడే కానక్కరలేదు. సానుభూతి ముఖ్యం. ఆ వర్గ సమస్యల పట్ల సమగ్రమైన అవగాహన ఉండాలి. అందుకు తగ్గ బలమైన అభివ్యక్తి అవసరం.
10. ఆధునిక కవిత్వం రాయడం అంటే కవి తాను సమాజంలో ఒకడుగా కవితలు రాయడం, తాను ఇతరులకంటే అధికుడననే అహంకారం ఆధునిక



కవికి పనికిరాదు. కావ్య వస్తువునూ, దానికి సంబంధించిన ఎక్స్‌ప్రెషన్స్‌ను కూడా ప్రజల నుండి గ్రహించడానికి ఏది సిద్ధంగా వుందో అది ఆధునిక కవిత్వం.

ముప్పయ్యవ దశకంలో అభ్యుదయ కవిత్వంతో కలిసి అడుగేసి, జాతీయోద్యమాన్ని, తెలంగాణా సాయుధ రైతాంగ పోరాట ఉద్యమాన్ని, దిగంబర కవిత్వోద్యమాన్ని, చేతనావర్త కవిత్వాన్ని, తెలంగాణ ఉద్యమాన్ని, విప్లవోద్యమాన్ని అందుకొని వచన కవిత్వం ఆధునిక కవితా రూపంగా విస్తరించింది. ఈ ఉద్యమాల ప్రభావంతో ఎంతో మంది కవులు వచన కవిత్వాన్ని సుసంపన్నం చేశారు. వారిలో దాశరథి కృష్ణమాచార్య, కాళోజీ నారాయణ రావు, పొట్లపల్లి రామారావు, డా. సి. నారాయణరెడ్డి, అజంతా, ఆవంత్స సోమసుందర్, గుంటూరు శేషేంద్ర శర్మ, బోయి భీమన్న, కోవెల సంపత్కుమారాచార్యులతో పాటు నయాగరా కవులు, దిగంబర కవులు, పైగంబర కవులు, విప్లవ కవులు, తిరగబడు కవులు అనేకులు వచన కవితా రచనతో విస్తృత వ్యాప్తికి దోహదం చేశారు.

వచన కవిత్వంలో తొలికావ్యంగా కుందుర్తి రాసిన "తెలంగాణ" కావ్యం ప్రసిద్ధి చెందింది. ఇది 1955లో వెలువడింది. కానీ, తెలంగాణకు చెందిన కవిరాజమూర్తి రాసిన "మహైక" కావ్యం 1953 లోనే వెలువడినట్లు తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్ర పేర్కొంటున్నది. శ్రీశ్రీ "మహా ప్రస్థానం" 1950లో వెలువడినప్పటికి దానిలో వచన కవితలు గేయకవితలు కలిసి ఉన్నాయి. ఇక అభ్యుదయ కవిత్వం తర్వాత 1965 నుండి దిగంబర కవులలో తెలంగాణకు చెందిన నిఖిలేశ్వర్, చెరబండరాజు, జ్వాలాముఖి, చేతనావర్త కవులలో కోవెల సంపత్కుమారాచార్య, సుప్రసన్నాచార్య, పేర్వారం జగన్నాథం, వే. నరసింహారెడ్డి, తిరుగబడు కవులలో వరవరరావు, అశోక్, లోచన్, ఐ, ఎక్స్‌రే, కిషన్, సుధాకర్, సుదర్శన్, యాదగిరి రావు ఉద్యమ కవిత్వంలో విశేషంగా వచన కవిత్వ రచనలు చేసి సంపుటాలు ప్రకటించారు. 1969 తెలంగాణ ఉద్యమ కాలంలో రుక్నుద్దీన్,



Scanned with OKEN Scanner

జి. యాదగిరి, సలంద్ర, అనుముల శ్రీహరి, ఎస్వీ సత్యనారాయణ, జగదీశ్వర స్వామి ఉద్యమ కవిత్వం రాశారు. కాళోజీ అన్ని ఉద్యమాలలో దారి పొడుగునా కవిత్వాన్ని ఉరకలెత్తించారు. నిత్య సాహిత్య కృషీవలునిగా డా. సి. నారాయణరెడ్డి వచన కవిత్వాన్ని పరిపుష్టం చేశారు. అలిశెట్టి ప్రభాకర్ తన కవిత్వమంతా వచన కవిత్వంగానే రాసి, దాని శక్తిని నిరూపించారు. తెలంగాణ ఉద్యమం ఇచ్చిన స్ఫూర్తితో అయిలయ్య, దేవరాజు మహారాజు, పంచరెడ్డి లక్ష్మణ, తెలిదేవర భానుమూర్తి, డా. ఎన్. గోపి, కృష్ణమూర్తి యాదవ్ తెలంగాణ భాషలో వచన కవిత్వానికి ప్రారంభకులైనారు. తెలంగాణ ప్రజల భాషలో తొలి వచన కవితా సంపుటి "గుడిసె గుండె" (1974) లో డా. దేవరాజు మహారాజు ప్రకటించారు.

తర్వాతి కాలంలో వచ్చిన మినీ కవిత్వంతో పాటు అనేక అస్తిత్వ ఉద్యమాలు వచన కవిత్వాన్ని జన సామాన్య ప్రక్రియగా మలిచాయి. అనుభూతి కవిత్వం, నవ్య సంప్రదాయ కవిత్వం, స్త్రీవాద కవిత్వం, దళిత బహుజన కవిత్వం, మైనార్టీ వాద కవిత్వం, తెలంగాణ ప్రాంతీయ వాద కవిత్వం, బీసీవాద కవిత్వం వచన కవిత్వంలోనే అనేక రచనలు వెలువరించాయి. ఇట్లా వచన కవిత్వం అన్ని రకాల దృక్పథాలకు ఆశ్రయమిచ్చింది. వాహికగా మారింది. ఇట్లా, 1930లలో శ్రీశ్రీ వంటి వారితో మొదలై తిలక్ వంటి కవుల చేతులలో పరిపక్వతను పొంది కుందుర్తి వంటి వారి ప్రచారంతో తెలుగు సాహిత్యమంతటా విస్తరించి వచన కవిత ఆధునిక కాలపు ప్రజాస్వామిక ప్రక్రియగా నిలదొక్కుకున్నది.

**నిర్మాణ పద్ధతులు :**

ఒక భావం కవిత్వంగా రూపుదాల్చే క్రమాన్ని పరిశీలించినప్పుడు దానిలో ఏదో ఒక ప్రత్యేక లక్షణం ఉంటుంది. అట్లాంటి ప్రత్యేకత ఒక నిర్మాణ పద్ధతి అనవచ్చు. సాధారణంగా మాట్లాడే మాటలకు, రాసే వాక్యాలకు కవితా రూపంలో ఉన్న మాటలకు, వాక్యాలకు అర్థాలు, శైలి వేరువేరుగా ఉంటాయి. ఉదాహరణకు "ఈ చల్ల గాలి భరించడం కష్టంగా ఉంది" అన్నదానికి "ఈ





చల్ల గాలి గుండెల్ని కోస్తుంది" అన్న దానికి వ్యక్తీకరణలో తేడా ఉన్నదని గమనించవచ్చు. ఈ వ్యక్తీకరణల్లో ఉండే ప్రత్యేకతల వలన అనేక నిర్మాణ పద్ధతులు ఏర్పడతాయి.

భావాలు కవిత్వమయ్యేటప్పుడు కవిలో ఉండే ఉద్వేగం, ధోరణి, స్థాయి, భాషల వలన ఆ కవిత్వం ఒక రూపాన్ని పొందుతుంది. ప్రతీ కవికీ శబ్ద జాలం, భావనా బలం, మనో వైఖరులు వేర్వేరుగా ఉంటాయి. అందువలన, ఒకే అంశాన్ని వివిధ కవులు వివిధ పద్ధతుల్లో కవిత్వీకరిస్తారు. కవి యొక్క ఆలోచనా అనుభవమూ కవిత్వానికి ముడిసరుకులు అయితే, అవి కవిత్వం కావడానికి, కళగా మారడానికి గల కారణాలని నిర్మాణ పద్ధతులు అని చెప్పుకోవచ్చు.

ఆధునిక వచన కవిత్వ నిర్మాణ పద్ధతుల మీద విస్తృత రచనలు చేసినవారు ఆచార్య చేకూరి రామారావు, జి. లక్ష్మి నర్సయ్య, యం. నారాయణ శర్మ, బిక్కి కృష్ణలాంటి వారు అనేక రూపాలు గుర్తించారు. ప్రధానంగా జి. లక్ష్మీనర్సయ్య గారు భావం కవిత్వంగా మారే అనేక పద్ధతులను గుర్తించి విశ్లేషించారు. జి. లక్ష్మీనర్సయ్య గారు చెప్పినట్టు "కవిత్వం ప్రకంపన రూపంలో బయటపడే భావోద్వేగాల మిశ్రమం అనుకుంటే ఆ ప్రకంపన తాలూకు భౌతిక రూపాన్ని అందించేదే నిర్మాణ పద్ధతి."

ఈనాడు వస్తున్న తెలుగు కవిత్వాన్ని ఆధారం చేసుకొని వివిధ కవితా నిర్మాణ పద్ధతులను తెలుగు కవులు ఎట్లా ఉపయోగిస్తున్నారో పరిశీలించి జి. లక్ష్మీనర్సయ్య గారు "కవిత్వ నిర్మాణ పద్ధతులు" అనే పుస్తకంలో క్రింది పద్ధతులను గుర్తించారు.

1. **వస్తు సత్సంబంధి (Objective Correlative) :** కవి తన ఆలోచననీ, భావాన్నీ నేరుగా కాక ఒక ఉద్రేక పూరిత వాతావరణం ద్వారా, అనుభూతి ద్వారా, ఒక మూడ్ ద్వారా వ్యక్తం చేస్తాడు. తన భావంతో సంబంధమున్న వస్తు సముదాయాన్నీ, మానసిక స్థితినీ, ప్రకంపననీ సృష్టించగల



Scanned with OKEN Scanner

సన్నివేశాల్నీ, ఘటనల గొలుసునీ వాక్యంలో ఏర్పరచడం ద్వారా భావాన్ని కవిత్వంగా మలచవచ్చని ఈ పద్ధతి చెబుతుంది.

"ఒంటరితనం" గురించి చెప్పడానికి 'జనచరం' అనే కవితలో కె. శివారెడ్డి ఈ పద్ధతిని వాడుకున్న తీరు చూడవచ్చు.

బహుశా/ఈరోజు ఎవరూ రాకపోవచ్చు/పిట్టలు తోడు లేకుండా ఈ చెట్టు పడుకుంటుంది కాబోలు/ముఖ పత్రాలన్నీ అక్షర రహితాలుగా తెల్లబోతాయి కాబోలు" అనే కవితా వాక్యాల్లో ఒంటరితనం గురించి పిట్టలు తోడులేని చెట్టునీ, అక్షరాలూ లేని ముఖ పత్రాలనీ వాడుకుని వాటిద్వారా ఒంటరితనానికి సంబంధించిన ఒక అనుభూతిని కవి అందించాడు.

2. <u>భావ భంగిమల భాష</u> <u>***(Language of Gesture)***</u> : కవి తనకు ఉన్న ఆలోచనను సైగ రూపంలోనో, ముఖానికి, చేతులకీ సంబంధించిన భంగిమ రూపంలోనో ఒక నాటకీయ వాతావరణం ద్వారానో ప్రవేశపెట్టినప్పుడు దానికి తగిన భాషను ఎన్నుకొని చేసే కవితా నిర్మాణం దీనిలో కనిపిస్తుంది. దీనికి ఉదాహరణగా కొండేపూడి నిర్మల 'హృదయానికి బహువచనం' అనే కవితలో వాడిన ప్రయోగాలను గమనించవచ్చు.

"నీకేం తెలీదు నువ్వూరుకో/అంటున్న స్వజనం మాటకి గతుక్కుమని/గతుక్కుమన్నట్టు కనిపించకుండా ఉండేందుకు/ఏదో అంటూ వాదన పెంచుకుంటూ/కొంగుతో కళ్ళద్దాలు తుడిచినంత చప్పున"

పై కవితలో "గతుక్కుమనడం, వాదన పెంచుకోవడం, కొంగుతో కళ్ళద్దాలు తుడుచుకోవడం" అనే ప్రయోగాలు అంతరంగ ఆవేదన తాలూకు భౌతిక సూచనల్ని, ముఖ భంగిమల్ని పట్టివ్వడం ద్వారా మనల్ని కవితా వాతావరణంలో వదులుతాయి.

3. <u>**శబ్ద కంపన పద్ధతి**</u> <u>**(Auditory Imagination)**</u>: కవి తాను చెప్పదలచుకున్న భావాన్ని ఒక శబ్ద వాతావరణం ద్వారా అందించడానికి కావాల్సిన



సింధూరం (సాహితీ ప్రక్రియల పరిచయం)

ఇమేజెస్‌ని, మాటల్ని పోగుచేసుకొని వాక్య నిర్మాణం చేసే పద్ధతిని శబ్ద కంపన పద్ధతి అంటారు.

వేగుంట మోహన్ ప్రసాద్ కవిత్వంలో ఆడిటరీ ఇమాజినేషన్ టెక్నిక్‌ని గొప్ప నేర్పుతో వాడిన ఈ కవితలో చూడవచ్చు. "కీచురాళ్ళలా నరాల సూదుల వాన/రాత్రంతా అలా నరాలు కురుస్తోన్నప్పుడు/ నా శిరస్సులోకి నారాజేసుకున్న/నిప్పు కణికెల మీద మొక్కజొన్న కండెలా/హృదయాన్ని తిప్పుకుంటూ వేపుకుంటున్నాను."

తనలో ఒత్తిడి మొదలై తీవ్రమైన ఆత్మ విమర్శకు తన్ను తాను గురిచేసుకుంటున్న వైనాన్ని కీచురాళ్ళ ప్రస్తావనా, నరాల సూదుల వాన ప్రస్తావనా పాఠకుడిలోని శ్రవ్య తంత్రుల్ని తట్టిలేపుతాయి. హృదయాన్ని వేపుకోవడం ఆత్మ విమర్శకు చిహ్నమయినా, నిప్పు కణికెల మీద మొక్కజొన్న కండెలా అన్న వాక్యాన్ని చదివినపుడు పాఠకుడిలో ప్రవేశించే శబ్ద స్పృహ ఆత్మ విమర్శకు సంబంధించిన తీవ్రతను పట్టి ఇస్తుంది. కండె నిప్పుల మీద కాలుతున్నప్పుడు (ఫట్ టప్ టప్ ఫట్ అని) చేసే ప్రత్యేక శబ్దం ఇక్కడ పాఠకుడి మీద పనిచేస్తుంది. మొక్కజొన్న కండె పేలుడు హృదయాన్ని తూట్లు పోడుచుకుంటున్న వైనాన్ని కవిత్వంగా మార్చింది.

4. <u>***స్థాన భ్రంశ పద్ధతి***</u> <u>***(Misplacement)***</u> : కవి తాను ఆశించిన భావానికి సంబంధించిన మూడ్‌నీ, కంపన వాతావరణాన్ని సృష్టించడానికి అందుకు సరిపడే వస్తువుల్ని ఎన్నుకొని వాటిని భిన్న ప్రదేశాల్లో భిన్న వస్తువులతో కలపడంలో స్థానభ్రంశ పద్ధతి కవిత్వంగా మారుతుంది. గాలి నాసరరెడ్డి కవిత్వంలో ఈ పద్ధతి రచనా లక్షణాల్ని గమనించవచ్చు.

ఎడారి వీధుల్లో/రెండు పచ్చని చెట్లు మొలవడం నాకిష్టం/వేదాంతి నేత్రాల్లో/రెండు కన్నీటి బొట్లు తొణకడం నాకిష్టం/అప్పుడు నిజంగా/నేను మనిషిలా గాలి పీలుస్తుంటాను" అన్న వాక్యాల్లో హింసతో, అమానవత్వంతో, అలక్ష్యంతో, స్నేహ రాహిత్యంతో కరడుగట్టిన

నాగరికతలో మనిషి మనిషిగా ఒక ఫీలింగ్‌తో బతకాలనే ఆకాంక్షతో రాసిన కవిత ఇది. ఈ భావాన్ని వ్యక్తం చేయడానికి వస్తు స్థానభ్రంశ పద్ధతిని ఉపయోగించాడు కవి. పచ్చని చెట్లు ప్రేమకూ, స్నేహానికి, అందానికీ చిహ్నం. ఎడారులు కష్టాలకూ, అమానవత్వానికీ, వికారత్వానికీ చిహ్నాలు. పరస్పర భిన్నమయిన చెట్లనీ, ఎడారుల్నీ కలపడం, ఎడారుల్లో చెట్లు మొలవాలని కోరుకోవడం మానవ ప్రేమకు సంబంధించిన ఆకాంక్షను తెలుపుతుంది.

5. **అపరిచయిత్వీకరణ (De familiarization) :** పరిచయమున్న వాటిని పరిచయం లేని వాటిగా ప్రవేశపెట్టడం, అంతకుముందు చూసిన వాటిని గురించి ఎన్నడూ చూడని స్పృహతో మాట్లాడటం, అనుభవంలోకి ఎప్పుడో వచ్చిన ఘటనని తొలిసారిగా కనుగొన్న భ్రమను కలిగించే వాతావరణాన్ని ఏర్పరచడం, ప్రాణంలేని వస్తువులకు మానవ లక్షణాల్ని ఆపాదించడం కూడా ఈ పద్ధతి కవిత్వంలో కనిపిస్తుంది. దీనికి ఉదాహరణగా ఎండ్లూరి సుధాకర్ కవితను గమనించవచ్చు. ఒక పాట విని కదిలిపోయిన వైనాన్ని తన సొంత పద్ధతిలో ఈ టెక్నిక్‌ను ఉపయోగించి ఇలా చెబుతాడు.

"పాట వెలుతురై నన్ను గంధం చెక్కలా కరగదీస్తూ వుంటే/నేను కన్నీటి కొండనై పెరుగుతూ వుంటాను. ఏదో వేదన ఎలుకలా నన్ను తొలుస్తూ వుంటుంది." అన్న వాక్యాలలో పాట తన అంతరంగాన్ని కదిలిస్తున్న వాస్తవాన్ని "నన్ను గంధం చెక్కలా కరగదీస్తూ" ఉందనటం ద్వారా అవాస్తవీకరించటం జరిగింది. తనలో దుఃఖం కట్టలు తెంచుకుంటుందనే పరిచయ వ్యక్తీకరణని "కన్నీటి కొండనై పెరుగుతూ వుంటాను" అంటూ అపరిచయిత్వీకరించడం జరిగింది. ఈ అపరిచయిత్వీకరణ వల్ల మనకు వ్యక్తీకరణ చాలా బాగుందనిపిస్తుంది.

6. **ప్రతిమా పద్ధతి లేదా భావ చిత్ర పద్ధతి (Imagism) :** మాటల ద్వారా, పదాల ద్వారా వాక్యాల ద్వారా ఒక విషయాన్ని గానీ, వస్తువును గానీ వాటికి





సంబంధించిన భౌతిక ప్రతిమ ద్వారా ప్రవేశ పెట్టె పద్ధతిని ప్రతిమావాదం అంటారు. దీనికే భావచిత్రం అనే పేరు కూడా వ్యాప్తిలో ఉంది. ఇస్మాయిల్ అనే కవి కవిత్వంలో భావ చిత్రాలు అధికంగా కనిపిస్తాయి. చిలుకలు వాలిన చెట్టును గురించి చెబుతూ "పచ్చని చీకట్లో మంటేదో ఎర్రగ కదిలింది" అంటాడు. అట్లాగే బావిని గురించి చెప్పడానికి "భూమి బుగ్గపై చల్లని నవ్వు సొట్ట"లా ఉంది అంటాడు.

చెట్టు నా ఆదర్శం అనే కవితలో "తరు చాపము వీడిపోయి/గురి మరచిన బాణంలా తిరుగాడును పిట్ట/ధరణి గుట్టు తెరవబోయి / బిరదాలో ఇస్రూలా ఇరుక్కున్న పురుగు/పురుగు సగం, సగం పిట్ట/ధరను చొచ్చి, దివిని విచ్చి/ విరులు తాల్చు తరువు" అంటాడు. ఇక్కడ పిట్టా పురుగూ భూమీ ఆకాశం ఈ నాలుగింటి ద్వారా చెట్టు యొక్క ప్రతిమను చూపిస్తాడు కవి.

7. **నాటకీయ స్వగతం (Dramatic Monologue) :** కవి చెప్పదలచుకున్న భావాన్ని ఒక నాటకీయ స్వగతంగా ప్రవేశపెట్టడం దీని లక్షణం. నాటకీయంగా మాట్లాడటం, ముహ భంగిమల ద్వారా, భౌతిక చేష్టల ద్వారా భావాన్ని వ్యాఖ్యానించడం ఈ పద్ధతిలో కనిపిస్తుంది. నందిని సిద్ధారెడ్డి "బాలుని ఆత్మగీతం" అనే కవితలో బాల శ్రామికుల దుస్థితిని మనసును కదిలించే స్థాయిలో చిత్రించాడు. కవిత్వంగా ఒక శ్రామిక బాలుడు తన చేత కష్టం చేయించుకొని తనని గుర్తించని పెద్ద మనిషితో చేసే నాటకీయ ప్రసంగంలా ఉంటుంది.

"సార్ ! మీరైనా నన్నానవాలు పట్టలేదా సార్ ! నిజమే సార్ ! / జీవితం శపించి ఉండకపోతే / మీ సన్నీతో క్రికెట్టాడుకోవాల్సిన వాణ్ణి/ మీ సుజ్జీతో కాన్వెంటుకెల్లాల్సిన వాణ్ణి" అని బాలుడు మాట్లాడినట్టుగా రాయడం ఈ పద్ధతికి ఉదాహరణ. జూకంటి జగన్నాథం గారు కూడా ఇదే శైలిలో కేవలం యాంత్రికంగా జరిగే ప్రజాస్వామిక ఎన్నికల ప్రక్రియను ఓటరు ద్వారా ఇలా చెప్పిస్తాడు. "ఓట్లకు నోట్లంటరు / నోట్లకు సీట్లంటరు?



Scanned with OKEN Scanner

ముంచెటోడు ప్రజల సేవ అంటడు / నిండా మునిగి పాణం పోంగ సూసేటోడు గాదె సేవసేత్తున్న మంటడు / గదేందో గని అడిగేటోడు కడుపు నింపుకునుడే / ఏలెటోడు కమాయిత్తనే ఉంటడు."

8. **మానవ గుణారోపణ పద్ధతి (Personification) :** వస్తువులకీ, అమూర్త భావాలకీ, జంతువులకీ, ప్రకృతి విషయాలకీ, మానవ స్వభావాన్నీ రూపాన్నీ, లక్షణాలనీ ఆపాదించడం ద్వారా కవిత్వం చెప్పే టెక్నిక్ మానవీకరణ పద్ధతి. జయప్రభ రాసిన "పైటని తగలెయ్యాలి" అనే కవిత ఇందుకు మంచి ఉదాహరణ. "నన్ను / నిటారుగా నిలబడనివ్వక / పైట నా గుండెలపై తన అంచుల చేతులాన్చి / నన్ను వంగదీయాలని చూస్తుంది / నా చేతులతో / రెండు భుజాలనీ చుట్టి / ఈవిడ మహా పతీవ్రత సుమా / అంటు రెపరెపలాడుతుంది. అనే కవితా వాక్యాల్లో పైటకు మానవ లక్షణాలు ఆపాదించి అది తనను వంగదీయాలని చూస్తుందని, మహా పతీవ్రత సుమా అంటూ రెపరెపలాడుతుందని మానవ గుణాన్ని ఆరోపించడం ద్వారా మానవీకరణ చెందాయి.

అట్లాగే, అన్నవరం దేవేందర్ పల్లె దుఃఖాన్ని చెప్పే సందర్భంలో "ఇదిగో / సన్నని మూలుగు విన్పిస్తుంది / ఇది కూశి కూశి అయిన నాగలి ఏడుపు / పులుకు పులుకున సూసుకుంట / బక్కెద్దు కబేలాకు ఎల్లిపోతుంది / అయ్యో ! పాలిపోయిన మా పల్లె నుంచి / వలపోసుకుంటూ తలపోసుకుంటూ వచ్చాను / అయ్యో ! పల్లె గిలగిలలాడుతుంది." అన్నప్పుడు పల్లెలో నాగలి ఏడుస్తున్నదని, బక్కెద్దు పులుకు పులుకున చూస్తున్నదని, పల్లె ముఖం పాలిపోయి గిలగిలలాడుతుందని మానవీకరించడం ఈ పద్ధతిలో భాగమే.

9. **విరోధాభాస పద్ధతి (Paradox) :** పైకి అసంబద్ధంగా కనబడుతూ లోపల ఒక అనుగుణ్యతనీ, సత్యాన్నీ కలిగి ఉండే వాక్యాల్ని తయారు చేయడం విరోధాభాస పద్ధతి. దీనిని ఆంగ్లంలో (Paradox) అంటారు తెలుగులో ఈ తరహా కవిత్వం తక్కువ.





**ఒక ఉదాహరణ చూద్దాం :** "చనిపోయిందల్లా / హటాత్తుగా ఏదో జ్ఞాపకమొచ్చి / శవం లేచి కూచుంటుంది / మన మరణమే / మనమిక్కడ జీవించామనడానికి గొప్ప గుర్తు"

పై వాక్యాలలో చనిపోయిన శవం అనడం పెద్ద షాక్. ఇక చనిపోయిన శవానికి హటాత్తుగా ఏదో జ్ఞాపకం వచ్చి లేచి కూర్చోవడం ఇంకా అసంబద్ధంగా కనబడుతుంది. జీవితంలో సజీవత్వం లేనప్పుడు, స్పృహ లేకుండా కొనసాగుతున్నప్పుడు, మరణంతో సమానమైన జీవితాన్ని గడుపుతున్నప్పుడు ఇట్లాంటి వాక్యాలు దాన్ని షాకింగ్‌గా చెబుతాయి.

"మనిషిలా / బతకటం తెలుసుకున్న క్షణం నుంచి చావటం మొదలైంది / నదిలా / జీవించడం ప్రారంభించిన మరు నిమిషం నుండి బేషరతుగా ఓడటం ఆరంభమైంది" అన్న జూకంటి జగన్నాథం కవితా వాక్యాలలో కూడా విరోధాభాస ఉన్నది.

ఇట్లాంటి విరోధాభాస కలిగిన కొన్ని పదబంధాలలో కూడా గమనించవచ్చు. ఉదా : రాత్రి సూర్యుడు, నిశ్శబ్ద సంగీతం, తీయని బాధ, నల్లని చంద్రుడు.

10. **సంభాషణా పద్ధతి (Conversation Method) :** రోజువారీ మాట తీరు, నుడికారాలు, ప్రాంతీయ యాస మొదలైన వాటిని వాడుకొని తనలో నలుగుతున్న భావాన్ని ఒక సంభాషణగా కవిత్వాన్ని నిర్మిస్తే అది సంభాషణా పద్ధతి అనవచ్చు. డా. ఎన్. గోపిగారి ఈ కవిత దీనికి ఉదాహరణ గ్రహించవచ్చు.

"వద్దంటే దినేటోడు / బుక్కెదన్న దింటలేదు / జర కడుపు జూడుండ్రి దొరా / మీ పేరు జెప్పుకుంట / మిమ్ముల మతికి పెట్టుకుంట / పేదరాలి రొదవిని / తల పైకెత్తాడు డాక్టరు / మీవోనికి రోగమేం లేదు / Malnutrition / అంటే తిండి గావాలె / మంచి తిండి"

ఈ కవితలో అనారోగ్యానికి అతి ముఖ్యకారణం పేదరికమనే భావాన్ని



Scanned with OKEN Scanner

పేద తల్లికీ, డాక్టరుకీ మధ్య జరిగే చిన్న సంభాషణగా మలిచాడు కవి. ఇక్కడ ప్రాంతీయ యాస కాదు ప్రధానం, సంభాషణా రూపం ప్రధానం. ఒక భావాన్ని సంభాషణగా మలచడంలో మాట్లాడే అలవాట్ల మీద కవికి ఎక్కువ పట్టు ఉండాల్సి వుంటుంది.

**11. *వర్ణనాత్మక పద్ధతి (Descriptive Method)*:** వాస్తవ జీవితం నుంచి తాను పొందిన ఒక భావాన్ని, ఒక ఘటనగానో, దృశ్యంగానో వర్ణించడం ద్వారా కవిత్వం రాయడం ఈ పద్ధతిలో కనిపిస్తుంది. తన భావానికి సంబంధించిన వివరాలని ఇస్తూ ఎక్కడో ఒక భావ గర్భిత వాక్యాన్ని జమ చేయడం కూడా ఇందులో భాగమే.

కవి "శిఖామణి" ఈ విధమైన కవితలు రాశారు. "మానకూడని గాయం" అనే కవితలో ఉత్తరాన్ని గురించి చెబుతూ "చాన్నాళ్ళకు నీ నుండో ఉత్తరం / మే మాసపు ఎండల్లో / తిరిగి తిరిగి గదికొద్దును కదా ! / తలుపులు తీయగానే - చల్లటి సముద్రపు గాలిలా / కళ్ళకు చుట్టేకుసుంది నీ ఉత్తరం."

ఇట్లా, చెప్పదలచుకున్న విషయాన్ని వర్ణనాత్మకం చేయడం ఈ రకపు కవిత్వంలో భాగం. ఒక నర్సును గురించి రాసిన కవితలో ఆమె దినచర్యనంతా వర్ణిస్తాడు. ఆసుపత్రిలో రోజంతా రోగుల సేవలో గడిపే నర్సు రాత్రి డ్యూటీ దిగగానే ఎదుర్కొనే వాస్తవాన్ని చివర్లో Suggestiveగా చెబుతాడు.

"డ్యూటీ దిగిపోగానే / యూనీఫాంతో పాటు / పెదవుల మీద నవ్వును కూడా తీసి హేంగర్‌కు తగిలిస్తుంది.

**12. *ప్రతీకాత్మక పద్ధతి (Symbolic Method)*:** నిత్య జీవితంలో మనకు తెలియకుండానే కొన్ని కొన్ని విషయాల్ని కొన్ని ప్రతీకల ద్వారా అర్థం చేసుకుంటాం. ఒక దేశం సార్వభౌమాధికారానికి ప్రతీక ఆ దేశపు జెండా. అట్లాగే సుత్తీ కొడవలి కమ్యూనిజానికి ప్రతీక. శిలువ క్రిస్టియానిటీకీ, త్యాగానికీ ప్రతీక. పూలు అందానికి ప్రతీక, వివిధ రంగులు వివిధ



భావాలకు ప్రతీకలు. పురాణ పాత్రలు కూడా వివిధ గుణాలకు ప్రతీకలు. చెప్పదలచుకున్న విషయాన్ని సరిగా సంకేతించగల ప్రతీకల ద్వారా వ్యక్తీకరించే పద్ధతే ప్రతీకాత్మక పద్ధతి.

నగ్నముని రాసిన కొయ్యగుర్రం, వరవర రావు రాసిన సముద్రం దీర్ఘ కావ్యాలు ఇందుకు గొప్ప ఉదాహరణలు.

"కొయ్యగుర్రం భూమ్మీద నడవదు / ఇనుప నాడాల్తో చెక్క హృదయంతో ధన మదంతో / అలగాజనం భుజాల మీద స్వారీ చేస్తుంది / బరువుకి కుంగిపోతూ తలలెత్తితే / భీషణంగా సకిలించి అణగదొక్కుతుంది.

హృదయం లేని ఈ వ్యవస్థ కష్టజీవుల్ని దోచుకుంటుందనీ ఎదురు తిరిగిన వాళ్ళను అణచి వేస్తుందనీ చెప్పటానికి కవి కొయ్యగుర్రం ప్రతీకను వాడినట్లు పై వ్యక్తీకరణలో అర్థమవుతుంది. కొయ్యగుర్రం దోపిడీ వ్యవస్థకు, ఇనుప నాడాలూ, చెక్క హృదయం క్రూరత్వానికీ, నిరంకుశత్వానికీ ప్రతీకలు. కవితనంతా ఒక ప్రతీకగా మార్చడం ఒక పద్ధతయితే అవసరమయిన చోటల్లా ప్రతీకల్ని మార్చుకుంటూ పోవడం మరొక పద్ధతి. ఇది శివసాగర్ కవిత్వంలో కనబడుతుంది.

"ఓల్గా ఘనీభవించెను / యాంగ్సీ నది పొంగెను / ఋతుగీతికి పులకరించి / గంగ కూడా పొంగెను." దీనిలో ఓల్గా రష్యాకు ప్రతీక, యాంగ్సీ చైనాకు ప్రతీక, గంగ భారతదేశానికి ప్రతీక.

**13. *వ్యంగ్య పద్ధతి (Irony Method)*:** కవి తాను చెప్పదలచుకున్న విషయానికీ, చెబుతున్నట్టుగా కనిపించే విషయానికీ మధ్య వైరుధ్యాన్ని, వ్యత్యాసానికి చూపించడానికి అవసరమయిన మాటల్నీ పదాల్నీ ఎన్నుకొని వాటిని సరిగా కలపటం ద్వారా తన భావాన్ని ఈ పద్ధతిలో కవిత్వం చేస్తాడు. శ్రీశ్రీ రాసిన ఈ కవితలో దీన్ని గమనించవచ్చు.

"అదృష్టవంతులు మీరు / వెలుగును ప్రేమిస్తారు / ఇరులను ద్వేషిస్తారు /



Scanned with OKEN Scanner

మంచికీ చెడ్డకీ నడుమ / కంచుగోడలున్నాయి మీకు / మంచి గదిలోనే / సంచరిస్తాయి మీ ఊహలు / ఇదివరకే ఏర్పడిందా గది / అందుకే వడ్డించిన విస్తరి మీ జీవితం / నిశ్చల నిశ్చితాలు మీవి"

పై వాక్యాలలో అన్ని సౌకర్యాలూ వుండి శాంతంగా, చిరునవ్వుతో జీవితాన్ని గడిపే వాళ్ళని పైకి అభినందిస్తున్నట్లు కనబడ్డా, అట్లాంటి జీవితాన్ని ఎద్దేవా చెయ్యడం కవి ఉద్దేశ్యం. మార్పులేని నిశ్చల నిశ్చితాలు కోరదగినవి కావని, అవి మానసిక సోమరితనానికి నిదర్శనమని కవి చెప్పదలచుకున్నాడు. ఇట్లాంటివే త్రిపురనేని శ్రీనివాస్ రాసిన ఈ కవితా వాక్యాలు.

"ఆల్లనీ యీళ్ళనీ / పడగొట్టేసి / మనం కూడా పడిపోదాం / వూరికే సరదాగా / సిద్ధాంతం మీద / దాడి చేద్దాం / అయినా మనకు / పనిలేక కాదు కదా"

ఊరికే ఇతరుల మీద బురద జల్లుతూ కాలక్షేపం చెయ్యడం, ఊసుపోక సిద్ధాంత చర్చని మొదలుపెట్టడం పతనానికి గుర్తనీ ఏమీ చెయ్యలేని తనానికి నిదర్శనమనే తన ఉద్దేశాన్ని మళ్ళీ ఆకృతికీ, సారాంశానికీ మధ్య వైరుధ్యాన్ని కల్పించడం ద్వారా కవిత్వం చేశాడు. అయినా మనకు పనిలేక కాదు కదా అన్నప్పుడు ఇలాంటి పనులన్నీ పనిలేక చేసేవే అని కవి ఉద్దేశ్యం.

వచన కవిత్వంలో నిర్మాణ పద్ధతి ప్రత్యేకంగా నిర్దేశించబడనందు వల్ల, రచనా పద్ధతులు కూడా అనంతంగా ఉంటాయి. స్థూలమైన అవగాహన కోసం జి. లక్ష్మీనర్సయ్య గారు గుర్తించిన కొన్ని పద్ధతులను, సంక్షిప్త పరిచయంగా పైన ఇవ్వడం జరిగింది.





# కథా సాహిత్యం

***కథ పుట్టుక :*** పారిశ్రామిక విప్లవ ప్రభావం వల్ల పత్రికల నిర్వహణ, ముద్రణా సంస్థల నిర్వహణ సులువయింది. కింది వర్గాలకు ఉపాధి అవకాశాలు, ఆదాయాలు పెరిగాయి. సమాజంలో చాలా మందికి కొంత విశ్రాంతి దొరికింది. ఎవరికి వారు తమ సాహిత్య ఆసక్తులను పరిపూర్తి చేసుకునే వీలు కలిగింది. నవల, కథ వంటి సాహిత్య రచనల ప్రచురణకు అచ్చుయంత్రం ఉపయోగపడింది. దాని వల్ల కథాపఠనం, కథా రచన పెరిగింది", కథ చెప్పటం, వినటం అనేది సాంప్రదాయ మౌఖిక పద్ధతికి చెందినది. బృహత్కథ వంటి రచనలు అత్యంత ప్రాచీనమే అయినా, అగ్ని పురాణం కథను ఒక సాహిత్య ప్రక్రియగా పేర్కొన్నా, ఆధునిక కథకు వీటితో సంబంధం తక్కువే. ఇంగ్లీష్‌లోని కథానికా ప్రక్రియ పరిచయం, పత్రికా వ్యాప్తి, సంస్కరణ ఉద్యమ అవసరాలు, మధ్యతరగతి పరిశీలనాశక్తి ఆధునిక కథకు మూల కారణాలు. 1870ల తరువాత తెలుగులో కథా ప్రారంభం జరిగింది. భండారు అచ్చమాంబ నుండి తర్వాతి అనేకుల వరకు కథలు రాశారు. అచ్చమాంబతో సహా అనేకులు స్త్రీ విద్యకు సమాజంలో ఆమోదం తేవడానికి రకరకాలుగా కథలు రాయడాన్ని చూస్తే, కథ సంస్కరణోద్యమంతో పెనవేసుకొని పుట్టిందని అర్థమవుతుంది.

***కథ అంటే :*** "కదిలేది కదిలించేదీ, మారేది మార్పించేదీ, పాడేది పాడించేదీ, మునుముందుకు సాగించేది పెనునిద్దుర వదిలించేది, పరిపూర్ణపు బతుకిచ్చేది. నవ కవిత్వమన్నాడు శ్రీశ్రీ. ఈ లక్షణాలన్ని ఉన్నదే ఆధునికథ. మనిషి నాగరికుడయ్యాడనడానికి కొలమానం ఆధునికథ. మనిషిని ఆధునికం చేసి, వర్తమానంలోను, వాస్తవికతలోను ఉంచడానికి కొన్ని సాహిత్య ప్రక్రియలు నడుంబిగించాయి. అలాంటి వాటిలో ముందు వరుసలో ఉన్నది కథ.

"కథా రచన అనేది అగ్గిపుల్లలతో మేడకట్టడంలాంటిది. ఒక దశ వచ్చేసరికి ఒక్క పుల్ల ఎక్కువ అయినా మొత్తం కూలిపోతుంది. యింత శ్రద్ధగా "బేలన్స్" గమనించాల్సిన ఆవశ్యకత ఒక కథా రచనలో తప్పించి మరెక్కడా కనపడదు. అందుచేతనే సృజనాత్మక వచన సాహిత్య ప్రక్రియలన్నింటిలోకి



Scanned with OKEN Scanner

కథా రచన క్లిష్టమైనదిగా నేను భావిస్తాను" అన్నాడు ప్రఖ్యాత కథా రచయిత హెచ్.యి. బేట్స్.

కథ అంటే మన, ఇతరుల అనుభవాల సమాహారం. మన బాధలు, సంతోషాలు, ప్రయత్నాలు, పోరాటాలు, రాజీపడడాలు, ఆచరించే నీతులు, అనుభూతులు, సమస్తం కూడా వచన రచనగా, కొన్ని నియమాల పరిధిలో పరిణమించడం మొత్తంగా చూస్తే పిన్నల నుండి పెద్దల వరకు కథ చెబితే "ఊఁ" కొట్టేవారే. చెబుతూ చెబుతూ "జో" కొడితే పిల్లలు పడుకోవడం, పెద్దలు సంబరపడడం చూస్తున్నదే. కనుకనే కథ మానవ జీవనంలో పెనవేసుకున్నది. సారాంశంలో మానవజీవితాన్ని ప్రతిబింబించేదే కథ.

**తెలంగాణ కథా వికాసం :**

ఒక వైపు మహరాష్ట్ర, మరోవైపు బ్రిటిషాంధ్ర రెండూ కూడా భాషా సాహిత్యాల్లో ముందంజవేసాయి. నిజాం రాష్ట్రంలో మాత్రం తెలుగు వెనకబడి ఉర్దూ రాజ్యమేలింది. ఈ స్థితి ఇక్కడి విద్యావంతులకు రుచించలేదు. మాతృ భాషాభిమానంతో స్థానిక సాంస్కృతిక వికాసానికి గ్రంథాలయాలు స్థాపించుకున్నారు. 1901లో సుల్తానుబజారులో శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం. 1904లో వరంగల్లులో రాజరాజనరేంద్ర భాషానిలయం, 1905లో సికింద్రాబాద్‌లో ఆంధ్ర సంవర్ధినీ గ్రంథాలయం, 1906లో విజ్ఞాన చరిత్ర గ్రంథమాల స్థాపించబడ్డాయి. ఈ గ్రంథాలయాలు తెలంగాణలో స్వాభిమాన బీజాల్ని నాటి సాహిత్య వికాసానికి పాదులు వేసాయి. ఈ పునాదులు నుంచే తెలంగాణ కథ ఎదిగింది.

తెలుగు కథా సాహిత్యంలో బండారు అచ్చమాంబ 1892లో "గుణవతి యగు స్త్రీ" కథ మొదటిదని తెలుస్తుంది. 1910లో రామానుజరావు "ఏబదివేల బేరము" కథ రాసారు. 1911లో మాడపాటి హనుమంతరావు "నవ నాగరికత" రాసారు. 1913-15 వరకు బంజెరు శ్రీనివాసశర్మ ఏడెనిమిది కథలు రాసారు. దాదాపు ఇవన్ని సంస్కరణవాద ధోరణిలో సాగాయి. 1921లో రామనరసింహా రావు "బాలికా వివాహం" అని బాల్యవివాహాల్ని నిరసిస్తూ కథ రాసారు.





1927-30 మధ్య రాసిన కథకులలో ఒద్దిరాజు సోదరులు ముఖ్యులు. 1931లో భాగ్యరెడ్డి వర్మ "వెట్టిమాదిగ" కథ రాసారు. ఇది తొలిదళిత కథ. వట్టికోట ఆళ్వారుస్వామి తెలంగాణ వైతాళికుడు. ఆయన "జైలు లోపల" అనే కథా సంపుటి వెలువరించారు. సురవరం ప్రతాపరెడ్డి "మొగలాయి కథలు" ఆనాటి నిజాం కాలపు పరిస్థితులకు అద్దం పడతాయి. 1940 నాటికి తెలంగాణ కథా ప్రస్థానంలో గణనీయమైన మార్పు కనిపిస్తుంది. 1945 మొదలు 1956 వరకు తెలంగాణ చరిత్ర పెనుమార్పులకు లోనైంది. ఈ కాలంలో వెల్దుర్తి మాణిక్యరావు, కాళోజీ, బూర్గుల రంగనాథరావు, పొట్లపల్లి రామారావు, జి. రాములు, ఆవుల పిచ్చయ్య, గూడూరి సీతారాం, పి.వి. నరసింహారావు, అయోధ్యరామకవి, ఇల్లందలి సరస్వతీ దేవి మొదలగువారు అనేక కథలు రాసారు. ఈ కథలు ఆనాటి చరిత్రకు అద్దం పట్టాయి. 1950 నుండి 1970 వరకు తెలంగాణ కథా సాహిత్యం కాస్త స్థబ్దతకు గురైంది.

1970 తరువాత తెలంగాణ కథ, తెలుగు సాహిత్యానికి దిక్సూచిగా మారింది. అందుకు విరసం లాంటి సాహితీ సంస్థలు దోహదపడ్డాయి. పాకాల యశోదారెడ్డి మొదలుకొని నేటి కథకుల వరకు అందుకు దోహదపడ్డారు. కథ ఒక చారిత్రక వనరు. గుణాడ్యుని బృహత్కథ నుండి నేటి వరకు ప్రతి పరిణామాన్ని తనలో ఇమిడ్చుకొంది. అలా కథ విస్తృతి చెందింది. భాగ్యరెడ్డి వర్మ లాంటి వారి చేతిలో సంస్కరణ బాటలో నడిచింది. సురవరం ప్రతాపరెడ్డి లాంటి వారి కలం నుండి నిజాం వ్యతిరేకోద్యమ కథగా మారింది. అనేక మంది కథకులు సాయుధరైతాంగ పోరాట కథను తీర్చిదిద్దారు. స్వయంగా పోరాటంలో పాల్గొన్నవారు, నాయకత్వం వహించినవారు, దూరం నుండి పోరాటాన్ని చూసినవారు ఈ పోరాట కథకు ప్రాణం పోశారు. పి.వి. నరసింహారావు లాంటి వాళ్ళు జాతీయోద్యమ ఛాయల్లో కథను పండించారు. తెలంగాణ పీఠభూమిలో నేలను చీల్చుకొని వచ్చిన కథా మొక్క వటవృక్షంగా ఎదిగింది. అల్లం రాజయ్య, తుమ్మేటి రఘోత్తమ రెడ్డి, సాహు, పి.చంద్ మొదలగువారు విప్లవకథను పండించారు. స్త్రీవాద మరియు దళిత స్త్రీవాద కథలను తమ జీవితాల నేపథ్యంగా తీసుకొని జాజులగౌరి, జూపాక సుభద్ర,



Scanned with OKEN Scanner

గోగు శ్యామల మొదలైన కథకులు చర్చించారు. తెలంగాణలో ఆకలిపోరాటాలు, ఆత్మగౌరవ పోరాటాలు చాలానే జరిగాయి. వాటికి వెన్నుదన్నుగా దళిత కథ నిలబడింది. పసునూరి రవిందర్, భూతం ముత్యాలు మరికొందరు దళిత కథను ముందుకు తీసుకెళ్ళారు. ఓటు బ్యాంకు రాజకీయాలు కొందరిని మైనారిటీలుగా స్థిరపరచాయి. వారి సాంస్కృతిక నేపథ్యం, పేదరికం, భాషాభిమానం మొదలైన అంశాల్ని వేదికగా చేసుకొని స్కైబాబా, షాజహానా, తదితరులు మైనారిటీ కథను తలకెత్తుకున్నారు. సంఖ్యకు ఎక్కువగా ఉన్న బహుజనులు, అధికారానికి మరియు అన్నింటికి వెనుకబడే ఉన్నారు. ఈ భావనను విస్తృతపరచి కాలువ మల్లయ్య, బి.ఎస్. రాములు మున్నగువారు బహుజన కథను సృష్టించారు. నేటి మానవ జీవితంలో ప్రపంచీకరణ చొరబడని ప్రదేశం లేదు. దాని ప్రభావం జీవితాలపై పడ్డ వైనాన్ని పూసగుచ్చినట్లు చెప్పిన వారిలో పెద్దింటి అశోక్ కుమార్, జాతశ్రీ, కె.వి. నరేందర్, ఉదయమిత్ర, మొదలగువారు గ్లోబలైజేషన్ కథను తీర్చిదిద్దారు. అన్ని అస్తిత్వాలతో పాటు ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమాలు కూడా తలెత్తాయి. వీటిలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం గొప్పది. ఉద్యమ వెలుగులో బి.వి.ఎన్. స్వామి, బెజ్జారపు రవీందర్, బోధనం నర్సిరెడ్డి మొదలగువారు ప్రాంతీయ కథకు ఊపిరులూదారు. భగవంతం లాంటి వారు ఆధునికానంతర కథను మోసుకు తిరుగుతున్నారు. ప్రజల నుండి గ్రహించిన వస్తువును కథగా తీర్చిదిద్ది తిరిగి వారికే వినిపించిన విధం కథా చక్రాన్ని గమనిస్తే తెలుస్తుంది. తెలంగాణలో సామాజికాభివృద్ధి జాడల్ని కథ పట్టిస్తుంది. నేటికీ ఇక్కడ కథ దిక్సూచిగానే పనిచేస్తుంది. అది ఇక్కడి రచయితల మరియు మట్టి గొప్పతనం.

**కథా వివరం - నిర్మాణ పద్ధతులు :**

పిల్లా - పాప నుండి ముసలి-ముతక వరకు కథను ఇష్టపడని వారు లేరు. మానవ జీవిత ప్రతిబింబంగా కథ నిలుస్తుంది. మనిషి తనను తాను కథలో చూసుకోవచ్చు. అందుకే కథ అంటే అందరికి ఇష్టం. పూర్వం నానమ్మ, అమ్మమ్మ, తాతయ్యలు కథలు చెప్పేవారు. పశుపక్ష్యాదుల కథలు, జానపద కథలు, నీతికథలు, పురాణ కథలు, కాశీమజిలీ కథలు ఇలా అనేకం ఆ కాలాల్లో పెద్దవారు చిన్నవాళ్ళకు చెప్పేవారు. అంటే కథ మొదట్లో చెప్పబడింది. లిఖిత రూపం





రాకముందు అంతా మౌఖిక సాహిత్యం ఉండేది. రాను, రాను ప్రతి విషయం రాయబడడం వల్ల, కథ కూడా లిఖిత రూపాన్ని సంతరించుకొంది. కొందరు కథను వినసొంపుగా చెబుతరు. వారు చెబితే విసుగు అనిపించదు. అదొక కళ. అలాగే రాయడం కూడా ఒక కళ. అభ్యాసం ద్వారా దాన్ని సాధించవచ్చు. ఎప్పుడైతే కథ రాయబడేదిగా మారిందో అప్పుడే కొన్ని లక్షణాలు కథకు వచ్చిచేరినవి.

**"ఏకాంశవ్యగ్రమై స్వయం సమగ్రమైన**
**కథాత్మకవచన ప్రక్రియ" "కథానిక"**

కథ, కథానిక రెండింటిని సమానార్థంలో వాడటం గమనార్హం. పై నిర్వచనంలో "ఏకాంశవ్యగ్రము", "స్వయం సమగ్రము" అనే రెండు లక్షణాలు ఉన్నవి. అవి ఉంటేనే కథ అనబడుతుంది.

రచయిత తాను రాయదలచుకున్న "విషయం" నుండి దృష్టిమరల్చక అదే విషయాన్ని సూటిగా, అర్థమయ్యే విధంగా చెప్పాలి. ఈ లక్షణాన్నే ఏకాంశవ్యగ్రత అంటారు.

విషయాన్ని అర్థం చేయించే క్రమంలో దానికి సంబంధించిన ఇతరేతర అంశాలు చెప్పక తప్పదు. అయితే అవన్ని కూడా విషయపరిధిని దాటి పోకూడదు. అప్పుడు చెప్పిన ప్రతి అంశము "అసలు విషయాన్ని" బలపరచేదిగా మారుతుంది. ఇట్లా మారి ఆసక్తికరంగా కథ తయారైనట్లయితే అది స్వయం సమగ్రత కలిగి ఉన్నట్లు. ఈ రెండు లక్షణాలు లేని కథా రచన, పాఠకులకు విసుగును పుట్టిస్తుంది. పాఠకుణ్ణి ఆకర్షించని రచన పదికాలాలు నిలబడదు. అందుకని కథా రచన చేసేటప్పుడు, ప్రధానంగా "పాఠకుణ్ణి" దృష్టిలో పెట్టుకొని రాయాలి.

ఏది రాయాలి ? ఎలా రాయలి ? అనే ప్రశ్నలు పునాది రాళ్ళవంటివి. "కాదేదీ కవిత కనర్హమ్" అన్నట్లు దేని గురించైనా కథ రాయవచ్చు. దేని గురించి రాస్తున్నామో, ఆ రాయబడే విషయాన్ని, సాహిత్య పరిభాషలో "వస్తువు" అంటారు. చూడటమో, వినడమో, అనుభవించడమో, తటస్థపడటమో,



Scanned with OKEN Scanner

అనుభూతి చెందడమో ఇలా ఏదో ఒక విధంగా రచయిత మనసులో స్పందన కలుగుతుంది. స్పందనకు కారణభూతమైన విషయం అతనిలో నిక్షిప్తమవుతుంది. ఆలోచనను కలిగిస్తుంది. దాన్నే మనం కథా బీజము అంటాము. బీజమే విషయము. ఇది శక్తివంతంగా ఉన్నచో మొలకెత్తి, వృక్షంగా వృద్ధి నొందును. కథా వస్తువు సామాజిక ప్రయోజనం కలిగించేదిగా ఉంటే, అది విస్తృత పాఠకాదరణ పొందుతుంది.

విషయం ఎంత బలీయమైన శక్తి కలిగి ఉన్న, చెప్పే తీరు బాగాలేకుంటే అది పాఠకుణ్ణి ఆకర్షించలేదు. "తుఫాను వల్ల జరిగిన నష్టం" అనేది విషయం అనుకొందాం. దాని గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలనే కుతూహలం కలిగి ఉంటారు. విషయపరంగా ఆ అంశం ఎన్నదగిందే. కాని జరిగిన నష్టాన్ని, ఆ క్రమాన్ని వివరించడం సరియైన రీతిలో చేయకపోతే శ్రోత లేక పాఠకుడు వినడానికి కాని చదవడానికి కాని సుముఖత చూపడు. కనుక చెప్పే రీతి కూడా ప్రధానం. దీన్నే "కథనం" అని అంటారు. కథనం రెండు రకాలు.

1. ఉత్తమ పురుష కథనం 2. ప్రథమ పురుష కథనం.

1. **ఉత్తమ పురుష కథనం :** తెలుగులో "ఉత్తమ పురుష" ఇంగ్లీషులో "ఫస్ట్ పర్సన్" అంటారు. చూసింది చూసినట్లుగా, విన్నది విన్నట్లుగా, తెలిసింది తెలిసినట్లుగా, అనుభూతి చెందినది, చెందినట్లుగా మొత్తానికి ఉన్నది ఉన్నట్లుగా చెప్పడం, రాయడం ఈ కథన ప్రత్యేకత. అంతకంటే ఎక్కువ చెప్పలేము. "నేను ఇవ్వాళ ఏం చూశానంటే", "నేను ఏం విన్నానంటే", "నాకు తెలిసినదేంటంటే", "ఏం జరిగిందంటే", ఈ ధోరణిల చెబితే ఉత్తమ పురుష కథనం అనబడుతుంది. ఈ కథనంలో "నేను" అని మొదలుపెట్టాలి. అలా చెబితే పాఠకులు నమ్మే అవకాశం ఉంది. ఇలాంటి కథలు సులువుగా చెప్పవచ్చు. కాని ఈ విధానంలో తనకు తెలియని విషయాన్ని కథకుడు చెప్పలేడు. అది దీని పరిమితి. ఉదాహరణకు ఒక కథా భాగాన్ని చూద్దాం.

"మా అత్తకండ్లల్ల నేను వో ఈగెను, దోమనుగాను, కాకుంటే వోతి, అప్పుడే





తాళపు సెవుల గుత్తి దీస్కోని నడ్ముల జెక్కుకుంట నంటిగిటన ? యాది లేదు. ఉత్త పుణ్యానికే నన్ను పాలల్ల వడ్డ ఈగను దీసేసినట్లు తీసేస్తది. ఏస్తైవాయె. నా తాపున నేను వుంటున్నా నన్ను వుండనిస్తద ? అంటే అదీ లేదు.

గండకత్తెర్ల సొప్పదంటోలె నలిగి నజ్జిగిజ్జి అయితుండనంటె నమ్ముండి. కూసుంటె తప్పు, లేస్తె తప్పు, అయ్యో దేవుడా ! కూసున్నం, లేస్కం, అట్టవెట్టి, నా నెత్తినేను దువ్వుకున్నా తప్పే ! దువ్వుకోకుంటే అంత కన్న తప్పు ! తుమ్మిన తప్పే, దగ్గినా తప్పే !

తుమ్ములు, దగ్గులు నన్నడిగి వొస్తయి గన్కనా ? ఆగవట్టుకునేటందుకు ? పొద్దున్నే సుక్కవొడువంగలేసి సద్దకంకి గొట్టుంగ ఆ బూజులకు ముక్కు గులగుల వెట్టంగ ఒక్కటి రొండు మాట్లు తుమ్మిన. అది జూసి మా అత్త దొర్సాని అయ్యో పాపం, ఆనక – "మా కోడలమ్మ యా శుభకార్యం దలపెట్టినగని కచ్చు, కచ్చున తుమ్ముడె లెక్క", "సుభం గోరుర పెండ్లికొడ్క అంటే ఐరేని కుండ పల్గ" అన్నాడంట", అంట పురాణం జదివె.

(కోడలమ్మ ఎతలు – పాకాల యశోదారెడ్డి)

పై కథా భాగము యశోదారెడ్డి రాసిన కథ లోనిది. ఇందులో కోడలు తన అనుభవాన్ని తాను తెలిపింది. తన అత్త తనను అన్న మాటలను కూడా తెలిపింది. ఈ రీతి కథనంలో ఇంత కంటే ఎక్కువ చెప్పలేము. ఎక్కువ విషయం చెప్పాలంటే "ప్రథమ పురుష" కథనాన్ని ఆశ్రయించాల్సిందే.

2. **ప్రథమ పురుష కథనం :** తెలుగులో "ప్రథమ పురుష" ఇంగ్లీషులో "థర్డ్‌పర్సన్" అంటారు. ఈ తీరు కథనంలో తెలిసిందే కాదు, తెలిసిన దానిపై ఆధారపడి ఊహించి కూడా చెప్పవచ్చు. ఇందులోని కథకునికి గతం-వర్తమానం-భవిష్యత్తు అంతా తెలిసి ఉంటుంది. జరగబోయే రామాయణాన్ని, వాల్మీకి ముందే ఊహించి చెప్పినట్లు, రచయిత అంతా



Scanned with OKEN Scanner

చెప్పేవీలు ఉంటుంది. పాఠకునికి ఎక్కువ విషయాలు చెప్పవచ్చు. "అతడు", "ఆమె", "వారు", "వీరు" అని ఆయా వివరాలు చెప్పడమే ఈ కథన ప్రత్యేకత. ఉత్తమ పురుష కథనం "ఇండోర్ గేమ్" అనుకుంటే ప్రథమ పురుష కథనం "అవుట్ డోర్ గేమ్" అనుకోవచ్చు. దీనికి విస్తృతి ఎక్కువ. గొప్ప రచయితలందరు ఈ ధోరణిలోనే కథలు రాసారు. అయితే ఇలాగ చెప్పినప్పుడు రచయిత ఎక్కువ బాధ్యత నెత్తికెత్తుకోవాల్సి ఉంటుంది. చెప్పిన విషయాలకు పూచీపడాల్సి ఉంటుంది. ఈ ధోరణి కథనంలో రచయిత అంతా తానే అయి సర్వసాక్షిగా ఉంటడు. కనుక దీనిని సర్వసాక్షి కథనం అని కూడా అనవచ్చు. ఒక విషయాన్ని గురించి రచయిత సర్వం తెలిసినట్లు రాస్తే "సంపూర్ణ సర్వసాక్షి కథనం" అంటరు. పూర్తి అవగాహన లేక ఏదో కొంత తెలిసినట్లు రాస్తే "పరిమిత సర్వసాక్షి కథనం" అంటరు. ఏదైన రచయిత శక్తి సామర్థ్యాలపై ఉంటది. ఎలా చెబితే కథ శక్తివంతంగా ఉంటదో గ్రహించి కథను రాయాలి.

"మాల మాదుగులందరికి గుండ్లు గీయించి, కొత్త పైజామా, కమీజులు తొడిగిచ్చి మామిడితోట్ల వరుసగ కూసోబెట్టిండు కరీంసాబ్.

మాలమాదుగులు ఒకల మొఖం ఒకరు జూసుకుంటుండు. (ఒక్కనికి ఒక్కడు ఏర్పడుతలేదు. గడ్డం, మీసాలు వొయ్యి అందరు పేడి మోకాలేసుకొని కనవడుతుండు). ఒక్కనాటి బాగోతానికి మూతిమీసాలు గొరుక్కున్నట్టుంది - పాతగూడెం మాలమాదిగల బతుకులు. సుంకరి సాయిలు పుంజులు కూసేటి రాత్రి నుంచి కరీంసాబు ఎటు తరుముతె అటు ఉరుకుతుండు" (ఇనాం శెలుక - గూడ అంజయ్య)

పై కథనంలో మాలమాదుగులు, మామిడితోట, పాతగూడెం, సుంకరి సాయిలు, కరీంసాబు - ఇన్ని విషయాలు వచ్చినయి. ఇవన్ని రచయితకు తెలిసినవిగా ఉన్నవి. లేకుంటే రాయలేదు. కనుక రచయిత ఇక్కడ సర్వసాక్షిగా ఉన్నట్లులెక్క అన్నిటికి మించి అక్కడ జరుగుతున్న విషయాన్ని కూడా చెప్పిండు. అందుకే ఇది సర్వసాక్షి కథనం. ఈ ధోరణిలో ప్రతి





ఒక్కటి రాయవచ్చు. చీకటి-వెలుతురు, లోపల-బయట, జీవం-నిర్జీవం, గతం-భవిష్యత్తు, నింగి-నేలా ఇలా సమస్త ప్రదేశాల్లో ప్రవేశించి రచన చేయవచ్చు. ఎంత సౌలభ్యం ఉందో, అంత కట్టడి కూడా ఉంటది. అందుకే కొందరు "పరిమిత సర్వసాక్షి కథనం"ను ఎన్నుకుంటరు. ఇందులో పరిది-బాధ్యత రెండు తక్కువే.

కథ చెప్పాల్సిన విషయం తెలిసాక, ఎలా చెప్పాలో నిర్ధారించుకుని రాయడం, అలారాస్తే పాఠకుడు చదవడం జరుగుతుంది. కథ వెనుక జరిగే కృషి ఇది. ఈ మొత్తం తతంగంలో రచయితకు ఉపయోగపడే సాధనాలు మరికొన్ని ఉన్నవి. ప్రతీ ప్రక్రియకు లేదా రచనకు ప్రారంభం, కొనసాగింపు, ముగింపు అనేవి ఉంటవి. ఆ చట్రంలో రాయాల్సిన వస్తువును అమరిస్తే కథ పూర్తవుతుంది.

వంటకు కావాల్సిన పదార్థాలుంటే సరిపోదు. అవి సమపాళ్ళలో కలవాలి. అవసరమయ్యే పరికరాలుంటే సరిపోదు. అవి వాడటం తెలియాలి. అప్పుడే వంట కుదురుతది. కథా వస్తువు, కథన రీతి తెలియగానే సరిపోదు. పథక రచన చేసి కథా నిర్వహణ జరపాలి. అప్పుడే కథ పండుతది. ప్రారంభం, కొనసాగింపు, ముగింపు ఇవన్నీ పథక రచనలో భాగాలు. వీటిని సమర్ధవంతంగా నడపాలి. అందుకు తగిన సాధనాలను, సామాగ్రిని కూర్చుకోవాలి. పఠితల ఓపికకకు పరీక్ష పెట్టకుండా కథారంభం నుండి శిఖరాగ్రం వరకు నడపాలి.

**ప్రారంభం :** చెప్పదలచుకున్న విషయాన్ని ఎక్కడ నుండి మొదలుపెడతమో అదే ప్రారంభం. ఫలానా చోటు నుండి మొదలుపెట్టాలనే నియమం లేదు. ఆసక్తి కొల్పే విధంగా ఆరంభం ఉండాలి. దాన్నే ఎత్తుగడ అంటారు. సంభాషణ - సన్నివేశం - సంఘర్షణ - వర్ణన - పాత్ర పరిచయం ఇలా, ఇంకా దేంతోనైనా ప్రారంభించవచ్చు. మొత్తానికది చదవరిని ఆకర్షించాలి. ప్రారంభం ఎలా ఉంటుందో కింది ఉదాహరణ తెలుపుతుంది.



Scanned with OKEN Scanner

"కోడి కూసింది... మామూలుగా అయితే ఆ సమయానికి ఊరుమేలుకొనేది, కళ్ళాపి చల్లుతూ, ముగ్గులు వేస్తూ, నీళ్ళు తెస్తూ - ఉరుకులు, పరుగులతో ఆడవాళ్ళు సందడి సందడిగా కనిపించేవాళ్ళు. ముగ్గాల మోత లయబద్ధంగా - జోరుగా వినిపించేది. ఇప్పుడు మాత్రం వూరువూరంతా నిశ్శబ్దంగా ఉంది. స్తబ్దంగా ఉంది. కళ్ళు తెరచుకునే ఉన్నా చూపు కన్నీటితో మసకబారిన దుఃఖార్తునిలా ఉంది" - (ఉరితాళ్ళు - దిలావర్)

పై వర్ణన ద్వారా పాఠకునిలో రచయిత ఉత్కంఠను కలిగించాడు. దాంతో పఠిత కథలోకి వెళతాడు. అలా వెళ్ళాక అతడిని వేలుపట్టుకొని కథ వెంట నడిపించగల సాధనం కొనసాగింపు.

**కొనసాగింపు :** ఆరంభానికి, అంత్యానికీ మధ్య ఉండేది కొనసాగింపు. దీన్నే నడక అని కూడా అనవచ్చు. నడక సూటిగా సాగవచ్చు. మలుపులు తీసుకోవచ్చు. ముందు వెనకకు నడవవచ్చు. ఆరోహణ, అవరోహణ జరపవచ్చు. మొత్తానికి కదలడం దీని లక్షణం. పరుగులు తీయడం, నెమ్మదించడం అవసరాలను బట్టి కథా గమనం ఆద్యంతం కుంటుపడకుండా సాగాలి. కథలో ఈ భాగం ముఖ్యమైనది. గుండెలాంటిది. ఈ ప్రదేశంలోనే సంఘర్షణలు, సన్నివేశాలు, సంభాషణలు, వికసనాలు, దుఃఖాలు, సంతోషాలు సమస్త మార్పులు విషయగతంగా చోటు చేసుకుంటాయి. ఇదొక కదన రంగం. రచనాశక్తి నిరూపణకు వేదిక ఇది. చదవరి శ్రద్ధ పెట్టి నిలిచేది ఇక్కడే. చాలా వరకు కథ కేంద్రీకృతం అయ్యే స్థలం ఇది. మచ్చుకు ఒక ఉదాహరణ చూద్దాం.

"ఊర్లోకి పోయి తన కులపోల్లందరికి మన కులం పేరు పెట్టి అడ్డగోలు తిట్టిండని ఎక్కించి చెప్పిండు హన్మంతు. దీనితో కాపోల్లంతా ఒక్కటైంద్రు. ఆ రాత్రి సాలోల్ల ఇండ్లమీద పడి చితకబాదింద్రు. ఎర్రసత్యాన్ని సొక్క గొట్టింద్రు. తాగి ఉన్న మైకంలో సాలోల్లు ఎదురుమల్లి కొట్టలేకపోయింద్రు. ఆ ఊరిలో కాపోల్లే మోతుబరులు. వాల్లమాటే చెల్లుబాటవుతుంది. ఎవరితో చెప్పుకున్నా లాభం లేకపోయింది. పోలీస్ స్టేషన్ అంటేనే భయం. లక్ష్మితో ఎర్ర సత్యానికి స్నేహం ఉన్న మాట నిజం. ఇది ముందలపడదన్నది కూడా తెల్సు. అయినా వదిలేటట్లు లేదు. లేచిపోదామంటది లక్ష్మి. ఎక్కడికిపోవాలి. ఏం చేసి





బతకాలన్నది ఒక సమస్య. ఈ లోగా ఈ గోల" (మొదటి కథ - దేవులపల్లి కృష్ణమూర్తి).

పై పేరా కథలోని సంఘర్షణకు అద్దం పడుతుంది. ఈ సంఘర్షణ మలుపుగా మారి కథను ముందుకు నడుపుతుంది. కథ జీవిత శకలాన్ని చిత్రిస్తది. జీవితంలో జరిగిన ఆటుపోట్లను అందిస్తది. పోరాటాన్ని, రాజీపడడాన్ని తెలుపుతది. జీవితంలో జరిగే ప్రతి పరిణామాన్ని చెప్పడం దాని పని. అలా చెప్పడం వల్లనే కథ సాగుతుంది. ముంగిపు వైపుకు వెళ్ళుతుంది. జీవితగమనంలో ఒడిదొడుకులుంటాయి. అవే కథలో పఠనీయతకు కారకాలవుతాయి. ఒక విషమస్థితి ఉత్కంఠను రేపుతుంది. మరొక ఉత్సవం ఆసక్తిని గొల్పుతుంది. ఒక భయానకం ఆలోచింపజేస్తుంది. సంఘర్షణ చదివిస్తుంది. ఏ జీవిత శకలాన్నయితే విషయంగా గ్రహించామో, దాని తాలూకు సంఘటలన్ని కథలో కొలువుదీరతాయి. అవి మధ్యలో మలుపులుగా, చివరలో కొసమలుపులుగా, మరికొన్ని కొసమెరుపులుగా మారి పఠితకు ఒక ఎరుకను కలిగిస్తాయి. ఇదంతా కథ "కొనసాగింపు"లో భాగంగా జరుగుతుంది.

**ముగింపు :** ముగింపు ముఖ్యమైనది. ముగింపు కథలో నుండి పుట్టుకొచ్చినట్టుగా ఉండాలి. అదొక విశ్రాంత స్థితిగా అనిపించాలి. ఎత్తేసినట్టు కాకుండా దించినట్టుండాలి. మంచి ముగింపులు ఒక కొత్త కథకు ప్రారంభాన్ని అందిస్తాయి. రామరావణ యుద్ధం ముగింపు అనుకుంటే, అది పట్టాభిషేకానికి తెరలేపింది. కథకు ముగింపు నివ్వడంలో రచయిత నైపుణ్యం ద్యోతకమవుతుంది. ముగింపులో రచయిత జోక్యం చేసుకొని పరిష్కారాలు చూపెట్టకూడదు. ఘటన, సంభాషణ, వ్యాఖ్య, చమత్కారం, వర్ణన, అనుభూతి, మెరుపు ఇలా దేని ఆసరాతోనైనా ముగింపు పలకవచ్చు.

"దోడ్త్ ! కొంటెపోరడా ! నాకే పేర్లు బెడుతున్నావు ! నాపేరు గొల్లరామి ! గంతే.... ఇగనువ్వెల్లు.... మల్లిని అత్తోరింటికి తోలుకపోత పొద్దెక్కుతాంది.... ఊ యెల్లు...." ముసలవ్వ ఆజ్ఞ అనుల్లంఘనీయమైందని యువకుడిదివరకే తెలుసుకున్నాడు. (గొల్లరామవ్వ - పి.వి. నరసింహారావు)



Scanned with OKEN Scanner

పైన గల సంభాషణ, చివరి రచయిత వ్యాఖ్య రెండూ కూడా పరస్పరాధారితాలు. అవి కథ నుండి జాలువారి ముగింపు పలికినవి.

**కొన్ని కథా ముట్లు :** పనికి ఉపయోగపడేవి పనిముట్లు. కథ రాయడానికి ఉపయోగపడేవి కథాముట్లు. అవి 1) కథకు పేరు 2) పాత్రలు 3) సంభాషణలు 4) స్థలకాలాలు 5) సంఘటనలు 6) సన్నివేశాలు 7) సంఘర్షణలు 8) భాష 9) వర్ణన 10) శైలి.

కథ రాయడానికి పై అంశాలే కాకుండా ఇంకా ఏవైనా సమయానుసారంగా తోడ్పడవచ్చు. ప్రస్తుతానికి పై అంశాలు ఎలా పనికి వస్తాయో సూక్ష్మంలో మోక్షంలా గమనిద్దాం.

1. **కథకు పేరు :** కథకు పేరు ఎలా పెట్టినా అది పాఠకుణ్ణి ఆకర్షించాలి. పేరు పెట్టడమనేది రచయిత అభిరుచి పై ఆధారపడి ఉంటది. "సార్థక నామధేయం" అని ఒకటుంది. దాన్ని పాటిస్తే బాగుంటది. కథకు పేరు గడపలాంటిది. **ఉదాహరణకు కొన్ని పేర్లు :** ఆహారయాత్ర, మాయిముంత, చావుప్యాకేజి, ఒంటికాలి శివుడు.

2. **పాత్రలు :** పాత్రలు లేని కథ ఊహాతీతం. పాత్రలు మనిషి ప్రవర్తనకు, మనస్తత్వానికి ప్రతీకలు. తన లక్షణాన్ని మాటల్లోగాని, చేతల్లోగాని వ్యక్తీకరిస్తుంది పాత్ర. ఇలాంటి పాత్రలు స్థూలంగా రెండు రకాలు :

   *1) వికాసం చెందే పాత్రలు :* ఇవి కథ మొదలైనప్పటి నుండి ముగింపు వరకు తన ప్రవర్తనలో, మానసిక వికాసంలో మార్పుకు గురైతవి. **ఉదా:** భక్త కన్నప్ప.

   *2) మార్పులేని పాత్రలు :* కథ ప్రారంభంలో ఎలా ఉంటదో చివరి వరకు అలాగే ఉండటం. ఎలాంటి మానసిక మార్పు పాత్రలో కనపడదు. **ఉదా:** దుర్యోధనుడు.

   పాత్ర జీవితపు లోతు పాతులతో రచయితకు ఎంతగా ఎక్కువ



పరిచయముంటే అంత బాగా కథలో ఆవిష్కరించవచ్చు. పాత్ర చిత్రణలో సహనము, కుతూహలము కలిగి ఉండాలి. అప్పుడవి రాణిస్తుంది.

3. **సంభాషణలు :** మాట్లాడని మనిషి ఉండనట్టే, కథ కూడా మాట్లాడకుండా ఉండలేదు. కథనం కూడా ఒక సంభాషణే. మూగపాత్ర కూడా స్వగతంగా మాట్లాడుతుంది కదా ! మాట ఒక వాహిక "మాట ఇవ్వడం" గొప్ప విలువ – "మాట పడడం" నీచ విలువ.

   కనుక మానవ జీవితంలో సంభాషణలకు అత్యంత ప్రాధాన్యత కలిగింది. కథలో ఎక్కువ పాత్రలుంటే, సంభాషణల్లోకి సంఘర్షణ వచ్చి చేరితే నాటకీయత పండుతుంది. పాత్రలు తమ స్వభావానికి అనుగుణంగా మాట్లాడాలి. పాత్ర తన స్థాయిని మరచి మాట్లాడితే అభాసుపాలౌతుంది. ఒక పాత్ర స్వభావాన్ని మాటలే పట్టిస్తాయి. **ఉదా:** 1) మంథర మాటలు, 2) విదురుని మాటలు

4. **స్థల కాలాలు :** స్థలకాలాతీత కథలు ఉండవు. కథ జరిగే ప్రదేశము స్థలాన్ని సూచిస్తుంది. కథలో జరిగే ఆహారవిహారాదులు, వాతావరణ చిత్రణలు కాలాన్ని పట్టిస్తాయి. బాల్య చిత్రణ అంతా కాలానికి చెందినదే. మంచి కథలు స్థలాకాలాదులకు లోబడి ఉంటూనే, వాటికి అతీతంగా మిగులుతవి. **ఉదా:** ప్రపంచంలోని క్లాసిక్స్ ప్రపంచం అంతా వాటిని చదువుకుంటది. ఈ కోవలోనికి వస్తయి.

5. **సంఘటన :** "జరిగిన ఒక విషయం" సంఘటనగా నమోదవుతుంది. ప్రయత్న పూర్వకంగా సంఘటన జరగవచ్చు, యాదృచ్ఛికంగా కూడా జరగవచ్చు. ఇవి కథపై ప్రత్యక్ష పరోక్ష ప్రభావాల్ని వేస్తాయి. సంఘటనా నిర్వహణ రచయిత ప్రతిభకు గీటురాయిగా ఉంటుంది.

   "మరుక్షణంలో ఇద్దరు బెడ్‌మీద. ఆమె అతనికి అడ్డు చెప్పలేదు. చల్లగా, మెత్తగా, మత్తుగా ఆమె శరీరం. ఆమె శరీరంతో పెనవేసుకుపోతున్న తన శరీరం... ఆనంద జలధిలో ఓలలాడుతున్న తాను. ఆనందపు శిఖరాలను అధిరోహిస్తున్న తాను... హేమ కూడా ఇవ్వనంత సుఖాన్ని



Scanned with OKEN Scanner

ఆ క్షణంలో ఆమె తనకందించింది. ఆ మర్నాడు కూడా సరిగ్గా అలాగే గడిచింది. (ఊబి - అంపశయ్య నవీన్)

కథలో జరిగిన పై ఘటన కథను మలుపు తిప్పేదిగా ఉంది. రచయిత రచనాశక్తికి గీటురాయిగా ఈ సంఘటన నిలుస్తుంది. ఈ సంఘటన కథలో ఇద్దరి జీవితాలను మృత్యుముఖానికి చేరుస్తుంది. ఒక చిన్న సంఘటన మహా సంరంభాన్ని సృష్టించవచ్చు. అలాంటి దాన్ని అర్థంచేసుకోవచ్చు. కథలో సంఘటన సృష్టికి ప్రాధాన్యత విశేషంగా ఉంది.

6. **సన్నివేశం:** సన్నివేశ శబ్దానికి "సమ్మేళనం, అమరిక, ఏర్పాటు, ప్రదేశం పరిస్థితి" మొదలైన అర్థాలున్నాయి. స్థలము, కాలము, కదలిక అన్ని కలగలసి సన్నివేశంలో ఉంటాయి. సహజంగా, సరళంగా సంక్షిప్తంగా సన్నివేశాన్ని చిత్రించడంలో రచయిత ప్రతిభ కనపడుతుంది. సన్నివేశం వల్ల జరుగుతున్న దాన్ని అర్థం చేసుకోవచ్చు. సన్నివేశం, పరిసరాల్ని, వాతావరణాన్ని ప్రభావితం చేస్తుంది.

"పురుగు ముట్టిందిరో" మల్లుబాయి కేకేసి దబ్బున కిందపడిపోయింది. "చంపుండ్రి" అరుపులు.

మల్లుబాయి నోట్లో నుంచి నురుగులు - శరీరం రంగుమారిపోయింది. పిల్ల మిడిగుడ్లేసుకుని పిచ్చిదానిలా తల్లిని చూస్తుంది. అందరిలో భయం అందరు మల్లుబాయిని చెట్లకింద నుండి మోసుకొని గూడానికి తీసుకొచ్చారు. పాము కరిచిన చోట వాళ్ళకు తెలిసిన పసర్లు పోశారు. పరధాన్ల మంత్రాలు పిటపిట చదువుతున్నాడు. నాగురావ్ ఎటో ఉరికి పాములవాడిచ్చిన తేజాబు (అమ్లము) తీసుకొచ్చాడు. అప్పటికే సంగతి తెలిసి శర్మ మంది దగ్గర కొచ్చాడు" (రక్తపింజెర- సాహు)

పై సన్నివేశం, అక్కడి వాతావరణాన్ని, పరిస్థితిని చిత్రించింది. వారి జీవితాన్ని పట్టి చూపింది. కథ నడకకు బాసటగా నిలిచింది.

7. **సంఘర్షణ:** పరస్పర విరుద్ధ శక్తుల మధ్య జరిగే రాపిడే సంఘర్షణ. ఇది





ఆంతరికము కావచ్చు. బాహ్యం కావచ్చు. అంతస్సంఘర్షణ, బాహ్య సంఘర్షణ అని రెండు రకాలు. కథలో జరిగే సంఘర్షణ, పాఠకుడి మీద కూడా ప్రభావం చూపుతుంది. అలా చదువరి పై ప్రభావం చూపడంలోనే రచయిత నైపుణ్యం దాగి ఉంది. ఈ ఘర్షణ కథలో పాత్రలపై, ముగింపుపై కూడా ప్రభావితం చూపుతుంది. కథను అర్థవంతం చేయడానికి ఉపకరిస్తుంది.

"అపురూపంగా కట్టుకున్న పిట్టగూళ్ళవంటి గుడిశెల్ని వాచ్‌మెన్స్ పీక్కొని లారీల్లో వేసుకుంటుంటే వాళ్ళ గుండెల్ని ఎవరో చేతుల్తో పెకిలించినట్టు అయింది. వాళ్ళకు నెత్తురు పొంగింది. పిడికిల్లు బిగుసుకపోయాయి. అటు నుంచి తుపాకులు పేలినయి. ఇటు నుంచి రాళ్ళు పడినయి. వురుకులు పరుగులు పెడబొబ్బలు మొదలైనయి. నిమిషాలమీద కార్మిక జనం పుట్ట బెదిరినట్టు ఉరికింద్రు" (ఇల్లు-తుమ్మేటి రఘోత్తమరెడ్డి)

కార్మికులకు, యాజమాన్యానికి మధ్య జరిగిన ఘర్షణను రచయిత చిత్రించారు. ఈ ఘర్షణ తరువాత కొనసాగి యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చేవిధంగా కథలో సాగుతుంది. ఈ ఘర్షణ వల్లే కథకు విశ్వసనీయత అబ్బింది. విషయం వెలుగులోకి వచ్చింది. కనుక సంఘర్షణ కథకు ప్రాణప్రదంలాంటిది అని చెప్పవచ్చు.

8. **భాష:** భాష కథకు శరీరం లాంటిది. కథలోని పాత్రల స్థాయిని బట్టి అవి పలికే భాష ఉంటుంది. కథనం రచయిత దృష్టిని పట్టి ఉంటుంది. గ్రాంధికం, ప్రామాణికం, వ్యవహారికం, మాండలికం ఇలా రకరకాల రీతుల్లో కథలు వచ్చాయి. పాత్ర పరిత ఇద్దర్నీ దృష్టిలో పెట్టుకొని భాషను ప్రయోగించాలి. పాత్రోచిత భాషలో కథను నడపడం ఒక విధం. పూర్తి మాండలికంగాని ప్రామాణికంలో గాని కథ చెప్పడం మరోరకం.

ఉదా : "రెక్కల పెళ్ళాం" కథ మొత్తం ప్రామాణిక భాషలో ఉంది. (1)

"మన్నుబువ్వ" కథ మొత్తం మాండలిక భాషలో ఉంది. (2)



Scanned with OKEN Scanner

"సండాస్" కథ పాత్రోచిత భాషలో ఉంది. (3)

9. **వర్ణన :** ఒక విషయాన్ని, స్థితిని, సంఘటనను, సన్నివేశాన్ని, దృశ్యాన్ని, వ్యక్తిని, ఇంద్రియగోచరమయ్యే విధంగా చిత్రించడం వర్ణన. దీనికి తోడ్పడేవి ఉపమాది అలంకారాలు. అయితే ఇవి సంక్షిప్తంగా, ప్రతీకాత్మకంగా ఉండాలి. కథనానికి ఎంత ప్రాముఖ్యత ఉందో, వర్ణనకు అంత ప్రాముఖ్యత ఉంది. వర్ణించబడే వస్తువు అత్యంత రమణీయంగా భాసిస్తుంది. పాఠకుడిని ఆకట్టుకుంటుంది.

"ఆనాడు సాయంత్రాన బండి దిగిన" "బేగం" తన బంగళాలో చేరింది. తలమీద ముసుగు వెనిక్కి తోసేసి చూసింది బేగం. పడమర వైపు విచ్చుకున్న బంగళా కిటికీలలో నుంచి ఎర్రటి సాయంత్రం కనపడుతున్నది. పడమర ఆకాశానికి అవతలగా ఎర్రగా పూచిన మోదుగుల గుంపు. తన యింటి ముందరి పైడి తంగేడుల కంటే యెన్నో రెట్లు ఎరుపు ! హైదరాబాదులో మహళ్ళ ముందు లేత భానుని యెరుపు. మరి పల్లెటూళ్ళో సూర్యోదయం యెంత అందం ! ఆ బారులుగా పూచిన మోదుగుల్లో యెంత రంగు. మోదుగు మొగ్గల్లో చల్లారని నిప్పు. ముట్టుకున్నా కాలని ఆ చల్లని నిప్పుతో అరణ్యం యెంత అందంగా వుంది !! యెన్నడూ, పూచిన మోదుగులు చూడని బేగం ఆశ్చర్యపడింది." (నిప్పు పూలు - దాశరథి కృష్ణమాచార్య)

మోదుగు పూలను నిప్పుపూలుగా వర్ణించడం, ఆ చల్లని నిప్పుతో అరణ్యం అందంగా ఉందని రచయిత చెప్పడం వల్ల కథకు పఠనీయత చేకూరింది.

10. **శైలి :** మాట, చూపు, నడక, ఆలోచన, ఆసక్తి, రాత, వ్యవహార పద్ధతులు మనిషి శైలిని పట్టిస్తాయి. వ్యవహార దక్షత కూడా శైలిని పట్టిస్తుంది. రచనలో ఇది భాషను, అభివ్యక్తిని ఆసరా చేసుకొని నడుస్తుంది. మనిషి శైలిని ఇతరులు మార్చడం సాధ్యం కాదు. ఒక్కోసారి అతనికే అసాధ్యమవుతుంది. అది పుట్టుకతో వస్తుంది. పెరుగుతున్న క్రమంలో వృద్ధి చెందుతుంది. అది జీవలక్షణం. శబ్దాంబికం, అక్షర విన్యాసం,





వాక్య నిర్మాణం, పదగుంఫనం, పేరాప్రదర్శనం, వర్ణనా లౌల్యం లాంటి వాటిలో రచయితకు కొన్నింటిపై మక్కువ ఎక్కువ ఉంటుంది. ఇష్టమైన వాటిని ఎక్కువగా వాడతాడు. అది ఆయన ముద్రగా పేరుగాంచుతుంది. ముద్రనే ఆయన శైలి అనుకోవచ్చు.

**ఉదా :** 1) రావిశాస్త్రిది వర్ణనాశైలి 2) పతంజలిది వ్యంగ్య శైలి 3) అల్లం రాజయ్యది మాండలిక భాషా శైలి. ఇదంతా కథన పద్ధతి. కథన రీతులు కూడా అనేకం ఉన్నవి. అంతరార్థ కథనం, ఇంద్ర జాలకథనం, చైతన్య స్రవంతి కథనం, వాస్తవిక కథనం అందులో కొన్ని మాత్రమే.



Scanned with OKEN Scanner

# గేయం - పాట
# గేయ ప్రక్రియ నిర్వచనం

గాన యోగ్యమైనది గేయం. ఇందులో మాత్రా ఛందస్సుకు ప్రాధాన్యం ఉండటం వలన లయబద్ధంగా, రాగయుక్తంగా పాడుకోవడానికి వీలుగా ఉంటుంది. యతి ప్రాసలకు ఇందులో ప్రాముఖ్యం లేదు. జానపదుల మౌఖిక సంప్రదాయంగా ఉన్న గేయం, ఆధునిక కవిత్వంలో శిష్ట కవిత్వమై ప్రసిద్ధికెక్కింది.

పాద సంఖ్యా నియమం, గతి నియమం, మాత్రల నియమం, గాన యోగ్యత అనేవి గేయ కవిత్వ ముఖ్య లక్షణాలు. అంత్యప్రాసల ఆడంబరం, శబ్ద సంబంధ లయలోని అనుప్రాసల ఆడంబరం గేయంలో కనిపించే మరో లక్షణం.

"గాయతి ఇతి గీతం" పాడేది గీతం లేదా గేయం. "గాతుమర్హంతు గేయం" గాన యోగ్యమైన రచన గేయం. పాటలోని లయను సంస్కరింపబడిన రూపమే గేయం. ఇది మాత్రా ఛందస్సు వలన సిద్ధించినదని ఛందో వేత్తల అభిప్రాయం. చక్కటి ఉనికతో, సముచిత స్వర భేదంతో ఆలపించిన గేయం రసానుభూతిని, ఆనందానుభూతిని కలిగిస్తుంది. పశుపక్ష్యాదులు కూడా గానామృతంలో ఓలలాడిన సందర్భాలున్నాయి.

**గేయం పుట్టుక - వికాసం :**

జనపదం అంటే పల్లె. జనపదంలో ఉండేవారు జానపదులు. జానపదులకు సంబంధించింది జానపదం. ఇది జానపదుల శ్రమైక జీవన సౌందర్యం లోంచి పుట్టింది. దీనినే గీతం, గేయం, పాట అని కూడా పేర్కొంటాం. అందుకే పల్లీయుల పనీ పాటా ఒకదానితో ఒకటి పెనవేసుకొని సాగుతాయి. జానపద సాహిత్యంలో గేయాలు కథా విరహితాలుగా, కథా సహితాలుగా కనిపిస్తాయి. కథా విరహితాల్లో కార్మిక, పారమార్థిక, కౌటుంబిక గేయాలు వస్తాయి. కథా సహితాల్లో ఐతిహాసిక, పౌరాణిక, చారిత్రక, అద్భుత, వీర, వృత్తి సంబంధి గేయాలు ఉంటాయి.





లిఖిత సాహిత్యానికంటే ముందు ఎంతగానో జానపద సాహిత్యం పరిఢవిల్లిందనడానికి పాల్కురికి సోమనాథుడు పేర్కొన్న తుమ్మెద పదాలు, వెన్నెల పదాలు, ప్రభాత పదాలు మొదలైనవి సాక్ష్యంగా నిలుస్తున్నాయి. జంగమ కథలు, యక్ష గానాలు లేదా ఒగ్గు కథలు, శారద కాండ్ర కథలు, బుర్ర కథలు, హరి కథలు మొదలైన సాహిత్యమంతా జానపద గేయ వాఙ్మయాత్మకమే. జానపద గేయ సాహిత్యం లోంచే అనేక దేశీ పద్ధతులు పుట్టినాయి.

"నాదం వల్ల అక్షరం, అక్షరం వల్ల పదం, పదం వల్ల వాక్యం, వాక్యం వల్ల సమస్త లోక వ్యవహారమూ జరగడం వల్ల వీటితో కూడిన యావజ్జగత్తూ నాదాధీనం" అని సంగీత రత్నాకర కర్త సారంగదేవుడు పేర్కొన్నారు.

ఆచార్య సి. నారాయణ రెడ్డి తన "తెలుగు కవిత - లయాత్మకత" అనే గ్రంథంలో ఏ మంత్రమైనా సరే, ఏ శ్లోకమైనా సరే, ఏ పద్యమైనా సరే, ఏ గేయమైనా అది ఒకనాడు తాళబద్ధంగానే ఉద్భవించి ఉండాలి. గానం చేయబడి ఉండాలి" అని వక్కాణించారు.

జానపదుల మౌఖిక సంప్రదాయంగా ఉన్న గేయం ఆధునిక కవిత్వంలో ఒక ప్రత్యేక శాఖగా రూపుదిద్దుకోవడానికి ఆద్యులు, ఆరాధ్యులు గురజాడ అప్పారావు. ఆయన ప్రత్యేకంగా "ముత్యాల సరాలు" అనే మాత్రా ఛందస్సును సృష్టించుకొని, దేశభక్తి, కన్యక, పూర్ణమ్మ లాంటి గేయ కవితలల్లారు. గేయ కవితకు ప్రాణం పోసిన వారిలో "కృష్ణ పక్షం" రాసిన దేవులపల్లి కృష్ణ శాస్త్రి అగ్రగణ్యులు. శ్రీశ్రీ కవితా ! ఓ కవితా !, బాటసారి, భిక్షువర్షీయసి లాంటివి ప్రాచుర్యం పొందిన గేయ ఖండికలు. విద్వాన్ విశ్వం - పెన్నేటి పాట, విశ్వనాథ సత్యనారాయణ - కిన్నెరసాని, పుట్టపర్తి నారాయణాచార్యులు - శివతాండవం, సినారె - నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు ఈ కోవకు చెందిన గొప్ప కావ్యాలు.

**గేయం - నిర్మాణ పద్ధతులు**

మాత్రా గణాలతో గేయం నిర్మితమవుతుంది. కాల ఖండాలలోని కనిష్ఠ ఉచ్చారణను "మాత్ర" అంటారు. కనురెప్పపాటు లేదా చిటికె వేసే కాలంలో



Scanned with OKEN Scanner

ఉచ్చరించే ధ్వని లేదా అక్షరం ఒక మాత్ర. లఘువు ఒక మాత్ర. గురువు రెండు మాత్రలు. మూడు మాత్రల కాలాన్ని ప్లుతం అంటాము. కాల పరిమాణం మీద ఆధారపడింది మాత్రా ఛందస్సు. మాత్రా ఛందస్సులో మాత్రా సంఖ్య నియతంగా ఉంటుంది కాని, గురు లఘువుల క్రమం నియతంగా ఉండనవసరం లేదు. ఒక గురువుకు మారుగా రెండు లఘువులను, అట్లాగే రెండు లఘువులకు మారుగా ఒక గురువును వేసుకోవచ్చు. ఈ సౌలభ్యం మాత్రా ఛందస్సులలో మాత్రమే ఉంటుంది. గేయమంటే మాత్రా సమత్వమున్న, లయ ప్రధానమైన రచన. మాత్రా ఛందస్సులోని మాత్రలను అక్షరాలతో సూచిస్తారు. 'తి' ఏకమాత్ర 'తిరు' రెండు మాత్రలు, తిరుపతి నాలుగు మాత్రలు.

గేయం మూడు మాత్రల కాల ప్రమాణంలో నడిస్తే త్రిశ్రగతి అని, నాలుగు మాత్రల కాల ప్రమాణంలో నడిస్తే చతురస్ర గతి అని, ఐదు మాత్రల కాల ప్రమాణంలో నడిస్తే ఖండగతి అని, ఏడు మాత్రల కాల ప్రమాణంలో నడిస్తే, మిశ్రగతి అని అంటారు. సాధారణంగా మిశ్రగతి 3+4 మాత్రల క్రమంలో ఉంటుంది. కాని, 4+3 మాత్రల క్రమంలో ఉండదు. త్రిశ్ర గతిలో ఎక్కడైనా షణ్మాత్రా పద బంధాల కూర్పు ఉన్నా, దానిని త్రిశ్రగతిగానే పరిగణిస్తారు. తొమ్మిది మాత్రల కాల ప్రమాణం గలది సంకీర్ణ గతి. ఇది 5+4 లేదా 4+5 మాత్రల క్రమంలో నడవవచ్చు. గేయంలో పాదాలు చిన్నవిగా ఉంటాయి. సాధారణంగా నాలుగు కాల ఖండాలు ఉంటాయి. గణాలైనా, పాదాలైనా సరిసంఖ్యలో ఉండటం, అట్లాగే పాద మధ్య విరామం, పాదాంత విరామం ఉండటం సహజ లక్షణం. అలాగే యతి, ప్రాస, అంత్యప్రాసలను నియతంగా కాక ఐచ్ఛికంగా పాటించారు. గతికొక ఉదాహరణ చూద్దాం.

**త్రిశ్రగతి :**

పగటి పూట నేమో రోళ్లు పగులగొట్టు బీరెండలు నడిరాతిరి నింగి మెడకు నల్ల గల్ప పూదండలు (ఋతు చక్రం - సి. నారాయణరెడ్డి).

ప్రతి పాదంలో 3X8=24 మాత్రల ప్రమాణం. సరిగ్గా పాద మధ్యంలో యతిని ప-ప; న-న; ఎండలు-దండలు; అంత్యప్రాసను పాటించడం జరిగింది.





బీరెండలు, నడిరాతిరి, పూదండలు ఈ పదాలు షణ్మాత్రా పదాలు. మూడు మాత్రలకు పదం తెగకపోయినా ఇది త్రిశ్రగతే. ఇందులో ప్రాసను పాటించలేదు.

**చతురశ్ర గతి :**

కార్మిక లోకపు కళ్యాణానికి 4+4+4+4
శ్రామిక లోకపు సౌభాగ్యానికి 4+4+4+4
(శ్రీశ్రీ-మహా ప్రస్థానం)

ఈ పాదాలలో పదహారు మాత్రల ప్రమాణం కలదు. అంత్యప్రాస ఉన్నది. పాద మధ్య, పాదాంతర విరామం కూడా ఉన్నది.

**ఖండ గతి :**

గలగలని వీచు చిరుగాలలో కెరటమై 5+5+5+5
జలజలని పారు నెల పాటలో తేటనై 5+5+5+5
(కృష్ణశాస్త్రి - కృష్ణ పక్షం)

ఇందులో ద్వితీయాక్షర ప్రాస ఉన్నది. అంత్యప్రాస పాటించబడింది. పాద మధ్య, పాదాంత విరామం కూడా ఉన్నది.

**మిశ్ర గతి :**

దేశమును ప్రేమించుమన్న 3+4+3+4
మంచి యన్నది పెంచుమన్నా 3+4+3+4
వొట్టి మాటలు కట్టి పెట్టోయ్ 3+4+3+4
గట్టి మేల్ తలపెట్టవోయ్ 3+4+3+2
(గురజాడ - దేశభక్తి గీతం)

మొదటి రెండు పాదాలకూ, తర్వాతి రెండు పాదాలకు అంత్యప్రాస కుదిరింది. చివరి రెండు పాదాలలో ద్వితీయాక్షర ప్రాస కలదు.

**సంకీర్ణ గతి :**

చెమ్మచెక్క చేరడేసి మొగ్గ
అట్లు వోయంగ ఆరగించంగా



Scanned with OKEN Scanner

ముత్యాల చెమచెక ముగ్గు వేయంగా 5+4+5+4
రత్నాల చెమచెక రంగు వేయంగా 5+4+5+4
పాటగా పై రెండు పాదాలను పాడుతారు.

గేయం, గీతి, గీతిక, గీతం, లలిత గీతం, పాట, కీర్తన, సంకీర్తన, పదం, కృతులు మొదలైనవి ఒక కోవకు చెందినవే. ఇవి మాత్రా ఛందస్సుతోనే రూపుదిద్దుకుంటాయి. సమాన మాత్రలతో ఏర్పడినవే. గేయ పాదంలో మాత్రలు నిండుగా ఉంటాయి. కవితాత్మకతతో ఆలంకారికతను సంతరించుకున్న గేయాలు ఆకర్షణీయంగా, ఆలోచనాత్మకంగా ఉంటాయి. గురజాడ అప్పారావు, రాయప్రోలు సుబ్బారావు, బసవరాజు అప్పారావు, నండూరి సుబ్బారావు, విశ్వనాథ సత్యనారాయణ, దేవులపల్లి వేంకటకృష్ణ శాస్త్రి, తల్లావఝ్జల వంటి భావ కవులు గేయ రచనలు విరివిగా చేశారు. అభ్యుదయ కవులలో శ్రీరంగం నారాయణబాబు, ఆరుద్ర, అనిశెట్టి, దాశరథి కృష్ణమాచార్యులు, గజ్జెల మల్లారెడ్డి, డా॥ సింగిరెడ్డి నారాయణరెడ్డి మున్నగు వారిని ఎందరినో ఎన్నవచ్చును.

**పాట:** గేయ కవితలో పల్లవి చరణాలు అనే విభజన చేస్తే పాట అవుతుంది. మాటలను అందంగా, రాగ తాళ బద్ధంగా వినిపించడాన్ని పాట అంటారు. సంగీత సాహిత్యాల సమ్మేళనమైన పాట ఆపాత మధురమే కాదు ఆలోచనామృతం కూడా. పాటకు ఆపాత మాధుర్యం గానం వల్ల సిద్ధిస్తుంది. పాటకు ఆవేశానుభూతుల సమాహారాన్ని వ్యక్తీకరించగల సామర్థ్యం ఉంటుంది.

శ్రావ్యత, లయాత్మకత, పాడే గుణం, కంఠస్థం చేయడానికి అనువైన లక్షణాలు పాటలో ఉంటాయి. పాటలో పల్లవి, అనుపల్లవి, చరణాలు అనే విభాగాలు ఉంటాయి. కొన్నింటిలో సాకి కూడా ఉంటుంది. పల్లవి తర్వాత పాడే మొదటి చరణాన్ని అనుపల్లవి అని, పల్లవి తర్వాత పాడే భాగాన్ని చరణం అని అంటారు.

పనిలో నుంచి పుట్టిందే పాట. అందుకే పనీపాటా అనే పదబంధం ఏర్పడింది. మానవ మనుగణకు జీవనాడి పాట. ప్రభావవంతం, ప్రతిభావంతమైన కళా రూపం పాట. తెలుగు సాహిత్యంలోని ప్రక్రియల్లో





మొదటపుట్టింది పాటే. అనేక జానపద కళారూపాలు పాటను ప్రధానంగా కలిగి ఉంటాయి.

**పాట పుట్టుక - వికాసం :** ఏ భాషలోనైనా ముందు పుట్టింది పాటే. జనం మాటే పాటయింది. మానవ ఉద్వేగాల రూపం పాట. జన జీవితాలతో పెనవేసుకుపోయింది. పాటపాడుకోవడానికి అనువుగా, మాత్రలు సాగదీసుకోవడానికి, కుదించుకోవడానికి అనుకూలంగా ఉంటాయి. పాటలో పల్లవి, పల్లవి తర్వాత మూడు నాలుగు చరణాలు ఉంటాయి. పాదాలతో చరణం ఏర్పడుతుంది. చరణం పాడిన తర్వాత మళ్లీ పల్లవిని అందుకొంటారు. ఇట్లా ప్రతి చరణం తర్వాత పల్లవిని మాటిమాటికి ఎత్తుకుంటారు. కాబట్టి పాటకు పల్లవి ప్రాణం అంటారు.

"సుందరమైన తెలుగు పాటను పాడుకుంటూ సింధునదిలో పడవ నడుపుదాం" అని తమిళ కవి సుబ్రహ్మణ్య భారతి ప్రశంసించారు. తెలుగు సాహిత్యంలో పాటకు ఒక విశిష్టమైన స్థానముంది. పాట సంగీతానికి ఒదిగే పాల కడలి. పరిణామ క్రమంలో పాట అన్ని అనుభూతులకూ, అన్ని ఉద్యమాలకు ప్రసార సాధనంగా నిలిచింది. స్వాతంత్ర్యోద్యమం, విప్లవోద్యమం, తెలంగాణోద్యమం, దళిత, సామాజికోద్యమాలలో పాటకే ప్రథమ స్థానమున్నది.

సమాజ సంస్కృతిని, మానవీయ స్పందనలను అందించే పాట పలు పాయలుగా ప్రవహించింది. స్త్రీల పాటలు, పిల్లల పాటలు, భక్తి పాటలు, సినిమా పాటలు, సరదా పాటలు, దంపుడు పాటలు, పడవ పాటలు ఇలా మానవ జీవితంతో మమేకమై నడిచాయి. పాటల సృష్టికర్తలు పల్లీయులు. అందుకే అజ్ఞాన కర్తృత్వం గల పాటలు ఇప్పటికీ ఎన్నో చలామణిలో ఉన్నాయి. తాళ్ళపాక అన్నమయ్య, భక్త రామదాసు, త్యాగయ్య, క్షేత్రయ్య మొదలగువారు ముందు తరం కాగా, నేటి తరంలో మంగళంపల్లి బాలమురళీకృష్ణ, పి.బి. శ్రీనివాస్, సినారె, గద్దర్, సుద్దాల హన్మంతు, బండి యాదగిరి, మాస్టార్జీ, వంగపండు ప్రసాదరావు, సుబ్బారావు పాణిగ్రహి, శివసాగర్, సాహు, గూడ అంజయ్య, గోరటి వెంకన్న, అందెశ్రీ, సదాశివుడు, జయరాజ్, విమల వంటి వారిని పేర్కొనవచ్చు.



Scanned with OKEN Scanner

# నవల

**నిర్వచనం :**

నవల అంటే కొత్తది అని అర్థం. లాలిత్యమైనది, సున్నితమైనది, స్త్రీ అని మరికొన్ని అర్థాలు కూడా ఉన్నాయి. ఇంగ్లీష్‌లోని "నావెల్" అన్న పదానికి సమానార్థం ఇది. వాస్తవ జీవితాన్ని చిత్రించే ఒక కాల్పానిక కథనే నవల అని నిర్వచించవచ్చు. నవల జీవితమంత విస్తృతమైనది. సాహిత్య ప్రక్రియల్లో జీవితాన్ని సమగ్రంగా చిత్రించడంలో అగ్రస్థానం నవలదే. అందుకే నవల అంటే జీవితం. నవల అంటే సమకాలీన సమాజపు ప్రతిబింబం.

**నవల పుట్టుక :**

తెలుగులోనే కాదు. ప్రపంచ సాహిత్యంలో కూడా నవల ఎప్పుడు పుట్టిందో ఖచ్చితంగా చెప్పలేము. అది మొదటిసారి ఏ భాషలో, ఏ దేశంలో పుట్టిందో కూడా ఖచ్చితంగా చెప్పలేము. ఇప్పుడు అందిన వివరాల ప్రకారం నవలా ప్రక్రియ మొదటిసారిగా జపాను సాహిత్యంలో పుట్టిందంటారు. క్రీ.శ. 1000 సంవత్సరంలో మురసాకి రాసిన "బెంజిగాథ" విశ్వసాహిత్యంలో మొదటి నవల అని విమర్శకుల అభిప్రాయం బెంజిగాధ తర్వాత ఆరున్నర దశాబ్దాల వరకు మళ్లీ నవల ఏ భాషలో వచ్చినట్లు పరిశోధనలో తేలలేదు. మళ్ళీ 1606లో స్పానిష్ భాషలో సెర్వాంటెజ్ రాసిన 'డాన్‌క్విక్జాట్' అనే నవల వచ్చింది. సాహిత్యకారుల్లో ఈ నవలనే ఆధునిక నవలగా గుర్తించారు. ఆధునిక నవల అప్పుడు మొదలైనాఅది మళ్లీ 19వ శతాబ్దం వరకు ప్రసిద్ధిలోకి రాలేదు. 19వ శతాబ్దంలోనే విశ్వనవల విస్తృతంగా ప్రచారంలోకి వచ్చింది. తర్వాత ఆంగ్లం, రష్యన్, స్పానిష్ నవలలు ప్రజా జీవితాన్ని ఎంతో ప్రభావితం చేసాయి. వాటి ప్రభావంతోనే అటు హిందీలో, ఇటు తెలుగులో నవలా సాహిత్యానికి పునాది పడింది.

**వికాసం :**

నవల తెలుగులో అది తెలంగాణలో ఎలా వికాసం చెందింది. ఏయే





మార్పులకులోనయింది. ఏయే అంశాలను ప్రతిబింబించింది తెలుసుకునే ముందు అటు ప్రపంచంలో కాని ఇటు తెలుగులో కాని నవల పుట్టడానికి కారణాలను అన్వేశిద్దాం.

నవల సాహిత్య ప్రక్రియల్లో ముఖ్యమైనది, కీలకమైనది ఇది పుట్టడానికి బలమైన కారణాలున్నాయి. సాహిత్య ప్రక్రియల్లో ఎక్కువ విశ్లేషణ, ఎక్కువ జీవితం, ఎక్కువ అంశాలను ప్రతిబింబించేది నవల కాబట్టి రచయితకు ఎక్కువ పరిశీలన అవగాహన కావాలి. అంతకంటే ఎక్కువగా ప్రభావితం చేసే అంశాలు, చిత్రించే సమయము కావాలి.

**పుట్టుకకు కారణాలు :**

సాంస్కృతిక పునర్జీవనం, వివిధ పరిశోధనలు ఆధునిక వస్తువుల ఆవిష్కరణ, పారిశ్రామికీకరణ, ద్రవ్యవినిమయం తర్వాత జన జీవితంలో ఎంతో మార్పు వచ్చింది. ప్రజలకు అవసరాలు పెరిగాయి. భావ ప్రకటన, వ్యక్తి స్వేచ్ఛ, సామాజిక అవగాహన పెరిగింది. వ్యక్తిలో సామాజిక స్పృహ, పరిసరాల పరిశీలన పెరిగింది. సమాజంలో వచ్చిన ఆర్థిక, సామాజిక మార్పుల వల్ల విద్య యొక్క ప్రాముఖ్యత పెరిగింది. సుఖవంతమైన విలాసవంతమైన జీవితానికి ప్రాముఖ్యత ఏర్పడింది. విద్యావంతులైన ఎందరో యువతీయువకులకు ఉద్యోగ ఉపాది అవకాశాలు ఏర్పడ్డాయి. తద్వారా ఎందరో యువతీ యువకులు ఒక ప్రత్యేక ప్రపంచాన్ని సృష్టించారు. ఆ ప్రపంచమే మధ్యతరగతి వర్గం. మిగులు సమయమును గడపడానికి వారు వివిధ మార్గాలను అన్వేషించారు. ఈ వర్గం సమాజంలో బలమైన వర్గంగా ఎదిగాక జన జీవితంలో అనేక మార్పులు వచ్చాయి. ఈ వర్గం తమ అవసరాలు, ఆనందం కోసం సమయానుకూలంగా కొత్త సౌకర్యాలను సృష్టించుకుంది. కొత్త సృజనతో కొత్తకొత్త కళలకు ప్రాణం పోసింది. అదిగో అప్పుడే పుట్టింది ఈ నవలా ప్రక్రియ పారిశ్రామిక విప్లవ ప్రభావిత ప్రాంతాలైన యూరోపియన్ దేశాల్లో మొదటగా పుట్టి వేగవంతంగా ప్రపంచమంతా వ్యాపించింది.

నవలకు ముందు మధ్యయుగాల మౌఖిక సాహిత్యం ప్రచారంలో

ఉండేది పౌరాణికాలు, దయ్యాలు, భూతాలు, అవాస్తవిక కథలు ఉండేవి. అవి ఒకరి నుంచి ఒకరికి చిలువలు పలువలుగా ప్రచారంలోకి వచ్చేవి. దానిని తరిమికొట్టి వాస్తవిక జీవితానికి పట్టం కట్టి మనిషి ఆలోచనలను ఆచరణను ప్రభావితం చేసింది. ఈ నవలా ప్రక్రియనే ముఖ్యంగా మనిషిని సంస్కరణవైపు అడుగులు వేయించి హేతువాద ఆలోచనలకు భీజం వేసింది ఈ నవలనే. మధ్యతరగతి జీవితం ముందుగా ఈ నవలకు ముడిసరకు అయినా తర్వాత తర్వాత విద్య, వైజ్ఞానిక, శాస్త్రీయ, సాంకేతిక వస్తువులను కూడా ముడిసరుకుగా ఉపయోగించుకునే ప్రపంచాన్నే అత్యంత ప్రభావితం చేసిన ఘనత నవలది.

**తెలుగులో నవల:** ధవళేశ్వరం వద్ద గోదావరి మీద 1852లో కృష్ణానది మీద 1855లో ఆనకట్టలు నిర్మించాక తెలుగు సమాజంలో పెద్దమార్పు వచ్చింది. వ్యవసాయం లాభసాటిగా మారింది. పంటలు బాగా పండాయి. రవాణా, విద్య, ఆధునికత పెరిగింది. ఈ మార్పులతో ఆంధ్ర ప్రాంతంలో మధ్యతరగతి వర్గం ఏర్పడింది. తద్వారా నవలా వికాసం జరిగింది. అంతకుముందు తెలుగునాట ప్రబంధ సాహిత్యం ఫరిడవిల్లింది. చాలా రోజుల వరకు తెలుగులో నవలను వచన ప్రబంధమనే అన్నారు. తెలుగులో 1872లో నరహరి గోపాల కృష్ణమశెట్టి రాసిన రంగరాజ చరిత్ర మొదటి నవలగా భావించినప్పటికి కందుకూరి వీరేశలింగం 1878లో రాసిన రాజశేఖర చరిత్రనే మొదటి నవలగా బహుళ ప్రచారాన్ని పొందింది. 1872కు పూర్వం కూడా ఎన్నో నవలలున్నాయని అవి తెలంగాణలోనే పుట్టాయని పరిశోధకులు పరిశోధిస్తున్నారు. 1900 సంవత్సరంలో రాజశేఖర చరిత్రను విశ్లేషిస్తూ కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి గారు ఇలాంటి రచనలను వచన ప్రబంధములని కాకుండా నవల అనాలని సూచించారు. అప్పటి నుండి అదే పేరు స్థిరపడిపోయింది.

**తెలంగాణలో నవల:** తెలుగులో మొదటి నవల తెలంగాణలోనే పుట్టిందని విమర్శకులు అంటారు. 1918లోనే ఒద్దిరాజు సీతారామ చంద్రరావు "రుద్రమదేవి" అనే చారిత్రక నవల రాసాడు. తర్వాత 1860లో తడకమళ్ల క్రిష్ణారావు "కంబుకందర చరిత్ర" అనే నవల రాసారు. తర్వాతనే గోపాలక్రిష్ణమ





శెట్టి, కందుకూరి వీరేశలింగం నవలలు వచ్చాయి. వీటన్నింటిని శోధించి చూస్తే నవలా లక్షణాలు పరిపూర్ణంగా కనిపించే తెలంగాణ నవల ప్రజల మనిషి. దీనిని వట్టికోట ఆళ్వారుస్వామి 1930-40 మధ్య ఉన్న తెలంగాణ పరిస్థితులు ఆధారంగా రాసాడు. ఇది అణా గ్రంథమాల సంస్థ ద్వారా 1955లో ప్రచురితమైంది.

భారతదేశ నవలా సాహిత్యం ఆంగ్ల నవలతో ప్రభావితమైతే తెలుగు నవల హిందీ, ఉర్దూ, బెంగాలీ నవలతో ప్రభావితమయింది. తెలుగులో ప్రసిద్ధ నవలాకారులని చెప్పుకున్న కందుకూరి వీరేశలింగం, చిలకమర్తి లక్ష్మీనరసింహ లాంటి వారి మీద కూడా ఇంగ్లీష్ ప్రభావముంది. 1830-1890 మధ్యన జీవించిన తడుకమళ్ల వెంకటకృష్ణారావు, కామందకము, లీలావతి గణితము, కంబుకందర చరిత్ర, కామరూప కథ, చిత్రకథా వివరణ అనే రచనలు వెలువరించాడు. అందుబాటులో ఉన్న ఆధారాలను పరిశీలిస్తే కొన్ని పద్యాలతో కూడిన కంబుకందర చరిత్రకంటే కామరూప కథనే ఆధునిక నవలగా భావించాలన్న ఒక వాదన కూడా ఉంది. కథ, కథనం అన్ని ఆధునిక నవలకు సరిపోనుగా ఉన్నాయి. కావున ఇదే తొలి తెలుగు నవల అని కొందరు విమర్శకుల అభిప్రాయం. మద్రాసు లైబ్రరీలో ఉన్న ఈ నవలను పునర్ముద్రిస్తే తప్ప వాస్తవం అందరికి తెలియదు.

**నవలా వికాసం:** 1906లో హైదరాబాద్‌లో స్థాపించబడి 1910 నాటికి మద్రాసుకు తరలించబడ్డ 'విజ్ఞానచంద్రికా గ్రంథ మండలి' తరపున తొలి దశలో అనేక నవలలు వెలువడ్డాయి. ఈ మండలి నుంచి విమలాదేవి, రాణిసంయుక్త, రాయచూరు యుద్ధము తదితర రచనలు వచ్చాయి. మెడోస్ టేలర్ రాసిన 'చాంద్ బీబీ' నవలను చిలకమర్తి వారు 'హేమలత' పేరిట అనువాదం చేసారు. బండారు శ్రీనివాసరావు 1910లో 'ఆశాదోషం' నవల రాసారు. మొత్తం మీద తెలంగాణ నవల 1910 వరకు గ్రాంథిక భాషలో చరిత్ర, రాజుల రాజ్య విస్తరణ వస్తువుగా కొనసాగింది. తర్వాత కాలంలో



Scanned with OKEN Scanner

తెలంగాణ నవలను అనేక అంశాలు ప్రభావితం చేసాయి. అప్పుడప్పుడే తెలంగాణ సమాజం ఆధునికీకరణ వైపు అడుగులేస్తుంది. సంఘ సంస్కర్తలు తమ తమ బోధనలు, రచనలతో సమాజం మీద ప్రభావాన్ని చూపిస్తున్నారు. సురవరం ప్రతాపరెడ్డి, బూర్గుల రామకృష్ణారావు, షబ్నవీసు, మందుముల సోదరులు, ఒద్దిరాజు సోదరులు ఈ కాలంలోనే రంగం మీదికి వచ్చారు. వీరంతా రాజకీయ చైతన్యంతో రచనలు చేసారు. అవి ప్రజా జీవితాన్ని ఎంతో ప్రభావితం చేసాయి. సంస్కరణకు తెరలు తీసాయి. టేకుమళ్ళ నరసింహం గారు రాసిన 'రాధమ్మ' నవలలో వేశ్యల జీవితాల చీకటి కోణాలను స్పృశించారు. మెడోస్ టేలర్ రాసిన 'టిప్పుసుల్తాన్' నవలను అదే పేరుతో 1913లో అక్కిరాజు ఉమాకాంత్ గారు అనువాదం చేసారు. కేతవరపు వెంకటశాస్త్రి 'రాయచూరు' అను నవలను రాసారు. బోగరాజు నారాయణమూర్తి 'అల్లా హూ అక్బర్' నవలను రాసారు. ఈ రెండు నవలలు విజ్ఞాన చంద్రిక గ్రంథమాల వారు వెలువరించారు. 1914లోనే సోమరాజు రామానుజరావు 'మంజుమతి' అను నవల రాసాడు. వరంగల్ జిల్లా ఇనుగుర్తికి చెందిన ఒద్దిరాజు సీతారామచంద్రరావు 1918లోనే రుద్రమదేవి నవలను రాసాడు. అది 1922లో పునర్ముద్రణ పొందింది. ఇంకా వీరు శౌర్యశక్తి, భ్రమర అనే నవలలు రాసారు. నిజాం పాలన మీద 'రక్తాంజలి' నవల రాసారు. వీరి సోదరుడు రాఘవ రంగారావు 'వీరావేశం', 'వరాహముద్ర' అనే నవలలు రాసారు. ఇవి కూడా చరిత్రను ఆధారంగా చేసుకుని రాసిన నవలలే. ఒద్దిరాజు సోదరులకు కొనసాగింపుగా నోరి నరసింహశాస్త్రి రుద్రమాదేవి, తిక్కన సోమయాజి నవలలను అడవి బాపిరాజు, గోనగన్నారెడ్డి హిమబిందు నవలలను వెలువరించాడు. సురవరం ప్రతాపరెడ్డి 1917లోనే తన ఇరవైయవ ఏటనే నిజాం నవాబుల అంతఃపుర వాస జీవితాల మీద 'శుద్ధాంతకాంత' నవలను రాసాడు. దీనికి 'మిస్టరీ ఆఫ్ హైదరాబాద్' అని మరో పేరు కూడా ఉంది. ఈయనే 1932లో రాసిన మరో నవల 'ఆరె వీరులు' సంస్థానాదీశుల రాజ్య కాంక్షను తెలియజేస్తుంది. తెలంగాణకు చెందిన భాగ్యరెడ్డి వర్మ దళితుల ఆర్థిక, సాంఘిక, రాజకీయ హక్కులకోసం పోరాటం చేసాడు. ఆయన హీరోగా





1921లో ఉన్నవ లక్ష్మినారాయణ గారు మాలపల్లి అనే నవలను రాసాడు. దాదాపుగా 1930కి ముందు తెలంగాణలో వచ్చిన నవలలు చాలా వరకు అముద్రితంగానే ఉన్నాయి. అందుకని వాటికి సంబంధించిన పూర్తి వివరాలు అందుబాటులో లేవు.

ఆంధ్ర మహాసభలు అందించిన చైతన్యంతో 1930 తర్వాత తెలంగాణ నవలా చరిత్రలో చాలా మార్పులు వచ్చాయి. 1931లో వచ్చిన 'రెబల్ ఇండియా' ఆంగ్ల పుస్తకాన్ని కాళోజి 'నా భారతదేశ యాత్ర' పేరుతో అనువాదం చేసాడు. కమ్యూనిస్టు యోధుడుతాచార్య బెంగాలి నవలను 'ఆకలి' పేరుతో అనువదించాడు. తెలంగాణలో విముక్తి కోసం పోరాడుతున్న దశలో ఇక్కడి ఉద్యమాన్ని చిత్రిస్తూ కొన్ని నవలలు వచ్చాయి. అందులో ఉద్యమంలో పాల్గొన్నవారు రాసిన నవలలు కొన్నయితే ఉద్యమాన్ని చూసి రాసిన నవలలు మరికొన్ని. అందులో బొల్లిముంత శివరామకృష్ణ, మృత్యుంజయులు నవల రాయగా లక్ష్మికాంత మోహన్ 'సింహగర్జన' నవలను రాసాడు. ఈ కాలం నాటికి నవలల్లో క్లిష్టత తగ్గింది. సరళ భాషలో నవల సూటిగా సాగడం మొదలెట్టింది. సామాజిక సమస్యలు వాటికి పరిష్కారం చూపే దిశగా నవల సాగింది. నిజామాబాద్‌కు చెందిన లోకమలహరి 1947-55 మధ్యకాలంలోనే 'జగ్గని యిద్దె' సంగం అనే నవలలు రాసిండు. ఈ కాలం నాటికి భాషలో కూడా పూర్తి మార్పు వచ్చింది వాడుక భాషకే పెద్దపీట వేస్తూ నవలా రచన సాగింది. తర్వాత కవిరాజమూర్తి కూడా నవలలు రాసాడు. ఖమ్మంకు చెందిన హీరాలాల్ మోరియా పుల్లాబొట్ల వెంకటేశ్వర్లు నవలలు రాసారు. తెలంగాణ నవలా సృజనను పరిపుష్టం చేసిన రచయితల్లో భాస్కరభట్ల కృష్ణారావు అగ్రగామిగా నిలుస్తారు. ఈయన రాసిన 'యుగసంధి' గొప్ప నవల. ఇది 1957లో వెలువడినా 1922 నుండి 1948 వరకు జరిగిన పరిణామాలు మార్పులను సూచించిన నవల. 1960లో అస్తిత్వవాదం ప్రభావంతో రాసిన వెల్లువలో పూచికపుల్ల నవల కూడా మంచి నవల. తెలుగులో మొదట అస్తిత్వవాద నవల కూడా ఇదేనని విమర్శకుల అభిప్రాయం.



Scanned with OKEN Scanner

తెలంగాణ నవలను అత్యంత ఆధునికంగా తీర్చిదిద్ది కొత్త ఒరవడిని సృష్టించిన నవలాకారుడు వట్టికోట ఆళ్వారుస్వామి ఈయన రాసిన మొదటి నవల 1955లో ప్రజల మనిషి పేరున దేశోద్ధారక గ్రంథమాల వారు ప్రచురించారు. ప్రజల భాషలో ప్రజా జీవితాన్ని ప్రతిబింబిస్తూ చైతన్య స్ఫూర్తిని రగిలిస్తూ రాసిన నవల ఇది. 1938 నుండి 1940 వరకు జరిగిన పరిణామాలను ఈ నవల చిత్రించగా తర్వాత కాలంలో మార్పులను 'గంగు' నవల ద్వారా చిత్రించారు. ఇది ఒక అసంపూర్ణ నవల 1954లో తెలంగాణ రచయితల సంఘం తరపున జి. రాములు 'పెరటిచెట్టు' నవలను రాసారు. అంతకుముందే అంటే 1952లోనే దొరల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా నిలిచిన వ్యక్తి నాయకుడిగా 'పిచ్చి సాయన్న' నవలను రాసాడు.

ఆనాటి గ్రామాలు, జనం, పోరాటాలు, దోపిడి నేపథ్యంగా దాశరథి రంగాచార్య జనపదం నవలను రాసారు. అంతకుముందే ఆయన రాసిన 'మోదుగుపూలు' 'చిల్లర దేవుళ్లు' నవలలు తెలంగాణలోని సామాజిక మార్పులను చిత్రించాయి.

హైదరాబాద్ యూనియన్ ఆంధ్రరాష్ట్రంలో కలిసి ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక తెలంగాణ నవలాశకం ముగిసిందనే చెప్పాలి. ఈ మధ్యకాలంలో కొన్ని నవలలు వచ్చినా అవి అంతగా ప్రాచుర్యంలోకి రాలేదు. ఈ కాలంలో వచ్చిన విభిన్నమైన నవల అంపశయ్య.

1970 తర్వాత విప్లవోద్యమ ప్రభావంతో తెలంగాణలో నవలా యుగం మళ్లీ ఊపందుకుంది. సమకాలీన సమస్యలను ప్రతిబింబిస్తూ అల్లం రాజయ్య రచించిన 'కొలిమంటుకున్నది' 'ఊరు' 'అగ్ని కణం' 'వసంత గీతం' 'సరిహద్దు' నవలలు ముఖ్యమైనవి. విప్లవోద్యమ క్రమంలో జరిగిన పరిణామాలను పులుగు శ్రీనివాస్ 'అన్నలు' నవల రాయగా ఇంద్ర వెల్లి సంఘటనకు ముందుగా జరిగిన పరిణామాలను చిత్రిస్తూ వసంతరావు దేశ్‌పాండే 'అడవి' నవలను రాసాడు.

1980 దశకం తర్వాత నవలల్లో నాటి చరిత్రను చెప్పే పనికి





రచయితలు శ్రీకారం చుట్టారు. ఆ నేపథ్యంలో 1946-51 మధ్య జరిగిన సాయుధ పోరాటం ఇతివృత్తంగా ముదిగంటి సుజాత రెడ్డి మలుపు తిరిగిన రథ చక్రాలు, బి.ఎస్. శాస్త్రి 'విప్లవ జ్వాల' కందిమల్ల ప్రతాప్‌రెడ్డి 'బందూక్' సరిపల్లి కృష్ణారెడ్డి ఉప్పెన నవీన్ రాసిన మూడు నవలలు జన జీవితాన్ని చిత్రించాయి.

విప్లవోద్యమం ఇచ్చిన స్ఫూర్తితో రచయితలు వివిధ అంశాల మీద, దోపిడి మీద నవలలు రాసారు. బీడీ కార్మికుల మీద బి.ఎస్. రాములు రాసిన 'బతుకు పోరు' సింగరేణి బతుకుల్లోని కష్టాలను చిత్రిస్తూ తుమ్మేటి రఘోత్తమరెడ్డి రాసిన నల్ల వజ్రం కె.వి. నరేందర్ రాసిన 'నల్ల సముద్రం' పి. చంద్ రాసిన 'శేషగిరి' నవలలు ఉన్నాయి.

తెలంగాణలో స్త్రీవాదం, దళితవాదం రాకముందే ఆయా వర్గాల వారి జీవితం వెతలను చిత్రిస్తూ నవలలు వచ్చాయి. బోయ జంగయ్య 'జాతర' వేముల ఎల్లయ్య కక్క నవలలు ముఖ్యమైనవి. ప్రపంచీకరణ, నూతన ఆర్థిక విధానాలు, సరళీకృత విధానాలు తెలంగాణ సమాజాన్ని ఎంతో ప్రభావితం చేసాయి. తత్పరిణామంగా తెలంగాణ నుంచి గల్ఫ్ దేశాలకు వలసలు మొదలయ్యాయి. ఈ వలసలు నేపథ్యంగా పెద్దింటి అశోక్ కుమార్ 'ఎడారి మంటలు' నవలను రాసాడు. వలస సాహిత్యంలో వచ్చిన మొదటి ఎడారి వలస నవల ఇది. గ్రామీణ పర్యావరణం గురించి 'దాడి' అనే నవల రాయగా ఎలుగుబంటి జీవితం ఇతి వృత్తంగా భిన్నమైన కథనంతో పెద్దింటి అశోక్ కుమార్ 'జిగిరి' అనే నవలను రాసాడు. ఇది 9 భాషల్లోకి అనువాదమయింది.

తర్వాత ప్రాంతీయ అస్థిత్వ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటం జరిగింది. దీనిని చిత్రిస్తూ ఎక్కువగా నవలలు రాలేదు. వచ్చిన రెండు మూడు నవలల్లో పెద్దింటి అశోక్ కుమార్ రాసిన 'లాంగ్ మార్చ్' నవల ఒకటి.

ఇలా విభిన్న పార్శ్వాలతో తెలంగాణ నవల విస్తృత రూపం దాల్చింది.



Scanned with OKEN Scanner

**వస్తువులను ఎన్నుకోవడం :** ఏదైనా ఒక వస్తువు తయారు చేస్తున్నప్పుడు దానికి ముడిసరుకు కావాలి. కుమ్మరి కుండను తయారు చేయలన్నా మట్టి కావాలి. కమ్మరి కత్రను తయారుచేయాలంటే ఇనుము కావాలి. వడ్రంగి నాగలి తయారుచేయాలంటే కర్ర కావాలి. ఇవి వారికి ముడిసరుకు. అలాగే ఓ రచయిత నవల రాయాలంటే తప్పకుండా ముడిసరుకు కావాలి. దానినే వస్తువు లేదా ప్లాట్ అని అంటారు.

రచయిత నవల రాయాలంటే ముందుగా ఒక ప్లాట్‌ను ఎన్ను కోవాలి. ముఖ్యంగా రచయితలు నవలలు రాసేప్పుడు తాను చూసిన జీవితంలోంచి కాని తన బాల్యంలోంచి గాని తను విన్న చరిత్రలోంచి కాని తన చుట్టు జరుగుతున్న సంఘటనల్లోంచి కాని పరిసరాల్లోంచి కాని తీసుకుంటాడు. నవల అంటే ఒక జీవితం కాబట్టి దీనికి కాన్వాస్ ఎక్కువగా ఉంటుంది. కాబట్టి వస్తువును విస్తృతమైనదిగా, వాస్తవానికి దగ్గరగా ఉండేదిగా తీసుకోవాలి. వస్తువు తీసుకునేప్పుడు ఈక్రింది జాగ్రత్తలు తీసుకోవాలి.

1. వాస్తవానికి దగ్గరంగా ఉండాలి.
2. మార్పును కోరేదిగా ఉండాలి.
3. గతంలోకి ఒకసారి తొంగిచూసి వర్తమానంలోని మార్పులను గమనించి భవిష్యత్‌ను ఊహించి మార్పును సాధించేదిగా ఉండాలి.
4. ఎక్కువ జీవితాన్ని ప్రతిబింబించేదిగా ఉండాలి.

వస్తువును తీసుకున్న తర్వాత కొంత పరిశోధన మొదలుపెట్టాలి. పరిశోధనకు సంబంధించిన అంశాలను రఫ్ నోట్‌గా రాసుకోవాలి. పరిశోధననే నవలకు ముడిసరకు కాబట్టి అంశాలను నిజాయితీగా లోతుగా పరిశోధించాలి. ఎవరో చెప్పినవి ఎక్కడో చదివినవి ఏవో గుర్తున్నవి కాకుండా వాస్తవమే అని మనం రూఢి చేసుకున్నప్పుడు మాత్రమే నిజమని నమ్మాలి.

**కథను అల్లుకోవాలి :**

మనం ఎన్నో సంఘటనలను చూస్తాం. వింటాం. ఇది ఇలా జరిగితే బాగుండు అంటాం. ఇలా జరగకపోతే బాగుండు అనుకుంటాం. దానిని కాగితం





మీద పెడితేనే కథ, నవల అవుతుంది. నవల రాయాలనుకున్నప్పుడు కొన్ని సంఘటనలతో కొంత కథ ముందుగా అల్లుకోవాలి. అందులో మలుపులు, చెప్పాలనుకున్న అంశాన్ని ముందుగానే కొంతవరకు పాయింట్స్ రాసుకోవాలి.

**పాత్రల ఎంపిక :**

అది కథయినా, నవలైనా నాటకమైనా రకరకాల పాత్రలుంటాయి. అందులో కొన్ని మంచి పాత్రలుంటాయి. కొన్ని చెడ్డ పాత్రలుంటాయి. అలాగే రకరకాల స్వభావాలతో పాత్రలుంటాయి. ఒక సమాజాన్ని ప్రతిబింబించేది నవల కాబట్టి నవలలో సమాజంలో ఉన్నన్ని పాత్రలుంటాయి. ఎక్కువ పాత్రలు తీసుకోకుండా కొంత జీవితానికి మాత్రమే పరిమితమై కొన్ని పాత్రలు మాత్రమే తీసుకోవాలి. పేర్లు కూడా పాత్ర మనస్తత్వానికి దగ్గరగా ఉన్న పేర్లే పెట్టాలి. నవలకు కథలోలా కాకుండా విస్తృతి ఎక్కువ కాబట్టి పాత్ర చిత్రణ కొంత వివరంగా రాయాలి. మానసిక విశ్లేషణ చేయాలి. సంఘటనల ఆధారంగా పాత్రల సంఖ్యను ఎంచుకోవాలి. కొన్ని పక్కపాత్రలు తప్ప ప్రధాన పాత్రలు రెండు మూడు కంటే ఎక్కువగా ఉండకుంటే కొత్తగా రాసేవారికి కొంత సౌలభ్యం ఉంటుంది.

**పాత్ర చిత్రణ :**

ఇది అత్యంత సున్నితమైనది. ప్రధానమైనది. ముఖ్యమైనది కూడా. పాత్ర చిత్రణ ద్వారానే ఆ పాత్ర మన మనసులో ముద్రించుకుపోతుంది. చిత్రణ వాస్తవానికి ఎంత దగ్గరగా ఉంటే అంతగా ఆ పాత్రలో పాఠకులు మమేకమవుతారు. పాత్ర చిత్రణ అంటే పాత్ర యొక్క గుణగణాలు, ఆదర్శాలు, వ్యక్తిత్వము, ఇలాంటివి. అవి చదువుతుంటే మనకు సమాజంలో ఎక్కడో ఆ వ్యక్తిని చూసినట్టో, విన్నట్టో, చదివినట్టో అనిపించాలి. వాస్తవానికి దగ్గరగా ఉన్న చిత్రణతోనే ఇది సాధ్యం. పాత్ర చిత్రణలో ఆదర్శవంతమైన పాత్ర గాని, హాస్య పాత్ర గాని, విలన్‌పాత్ర గాని ఇలా ఏవైనా సరే ! రచయిత వాటి వాటి గుణగణాలను డైరెక్ట్‌గా చెప్పకుండా కొన్ని సంఘటనల ద్వారా చెబితే మనసుకు హత్తుకుపోయి ఆ పాత్ర ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఇక్కడే రచయిత యొక్క నైపుణ్యం మనకు కనిపిస్తుంది. పాత్రల మనో విశ్లేషణల ద్వారా కూడా పాత్ర



Scanned with OKEN Scanner

చిత్రన చెయ్యవచ్చు. ఈ మనో విశ్లేషణ ఇంట్రావర్ట్‌గా చేయవచ్చు లేదా ఎక్స్‌ట్రావర్ట్‌గా కూడా చెయ్యవచ్చు. దీని ద్వారా పాత్ర యొక్క మనోస్వభావం కూడా అర్థమైపోతుంది. ఒక పాత్ర యొక్క మనోవిశ్లేషణ, గుణగణాలు, పాత్ర స్వభావం చెప్పాక ఆ పాత్ర పాఠకుల మనసులో ముద్రించుకుపోతుంది. కాబట్టి ఆ పాత్ర స్వభావానికి విరుద్ధంగా ఎప్పుడూ ప్రవర్తించకుండా చూసుకోవాలి. ఒకవేళ అలా ప్రవర్తించి ఉంటే అందుకు బలమైన కారణాన్ని చూపించగలగాలి. రామాయణం విషయం తీసుకుంటే రామునికి సీత అంటే చాలా ప్రేమ. కాని ఆమెను అడవిలో వదిలి రమ్మంటాడు. ఇక్కడ రాముని పాత్ర స్వభావానికి విరుద్ధంగా ప్రవర్తిస్తుంది. కాబట్టి పాఠకులను ఒప్పించే బలమైన కారణం చెబుతాడు రచయిత. కొత్తగా నవలలు రాసేవారు ఇది బాగా గుర్తుంచుకోవాలి. సిద్ధాంత చర్చలు జరిగినప్పుడు లేదా వాదోపవాదాలు జరిగినపుడు రచయిత ఎవరివైపున ఉండకుండా నిష్పాక్షికపాతంగా చర్చించాలి. అందుకు తగిన విషయాన్ని రచయిత సేకరించుకోవాలి.

**నాటకీయత :**

దీనినే డ్రామా అంటాము. డ్రామాలో మరో డ్రామా కూడా ఉంటుంది. అదే మెలోడ్రామా. పాఠకున్ని కట్టిపడేసి చదివించేది డ్రామానే. ఇంతకు ముందు చెప్పినట్లు పాత్ర స్వభావాన్ని రచయిత తన మాటల్లో కాకుండా ఒక సంఘటన ద్వారా చెప్పడం మంచిది. ఆ సంఘటన ఎంత నాటకీయంగా చెప్పితే అంతగా నవల ఆకట్టుకుంటుంది.

డ్రామా అనేది సందర్భానుసారంగా పాత్రల మనస్తత్వం నుంచి వస్తుంది. మెలోడ్రామా అంటే రచయిత ఒక సంఘటనను తన చేతుల్లోకి తీసుకుని నడిపించుకునే తీరు. డ్రామాకు తుది అంకమే మెలోడ్రామా. ఈ మెలోడ్రామాల సమ్మేళనంతోనే డ్రామా రక్తికడుతుంది. ఒక పాత్ర పట్ల ద్వేషం పెంచుకోవాలన్నా ఒక పాత్ర పట్ల ప్రేమ పెంచుకోవాలన్నా అది మెలోడ్రామాతోనే సాధ్యం. ఇటు నాటకీయత అయినా అటు మెలోడ్రామా అయినా వీలయినంత క్లుప్తంగా ఉంటేనే మంచిది.





**శైలి :** చెరుకు రసంలో తీపి, కాకరరసంలో చేదు, నిమ్మరసంలో పులుపు ఇలా ఒక్కొక్క పదార్థంలో ఒక్కొక్క రుచి కనిపించకుండా అంతర్లీనంగా ఎలా ఉంటుందో ప్రతీ రచనలో శైలి అంతర్లీనంగా అలా ఉంటుంది. శైలికి సరియైన నిర్వచనం మనం ఇవ్వకపోయినా కథను ముందుకు నడిపే తీరును శైలి అంటాం. ఇందులో భాష, వాక్య నిర్మాణం, క్లుప్తత, సామెతలు, నానుడులు, పదప్రయోగం, ప్రాస, పులిస్టాపులు, కామాలు, మూడ్, వర్ణన, భావోద్వేగాలు ఇవన్నీ సరియైన సమయంలో సరియైన పాళ్లలో అందించడమే శైలి.

ముఖ్యంగా పాత్ర స్వభావానికి తగిన భాషను వాడాలి. పాత్ర పరిధితి ఎలాంటిది, ఏం చదువుతుంది, సమాజం పట్ల ఎంత అవగాహన ఉంది, ఏ వర్గం నుంచి వచ్చింది, ఇలాంటి వాటిని దృష్టిలో ఉంచుకుని సంభాషణను తగిన భాషలో వ్రాయాలి. భాషలో సరళత స్పష్టత ఉండాలి. సామెతలు నానుడులు, ప్రాసపదాలు పాత్రయొక్క పరిణతిని తెలియజేస్తాయి. కాబట్టి తగిన మోతాదులో ప్రజలు వాడే, వాడుకలో ఉన్న, జీవిత సత్యాలను చెప్పే, ముఖ్యంగా కథకు సంబంధం కలిగి చెప్పవలసిన అవసరం ఏర్పడినపుడు మాత్రమే చెప్పాలి. కొత్త రచయితలు శైలి గురించి జాగ్రత్త తీసుకోకుంటే నవల బాగా డ్రైగా, చదవడానికి వీలు లేకుండా తయారవుతుంది.

**శిల్పం :** శిల్పాన్ని నిర్వచించడం కష్టం. ప్రతీ రచనలోకి శిల్పం అంతర్లీనంగా తనంత తానుగా కొబ్బరికాయలోకి నీళ్లలాగా వచ్చేస్తుంది. కొత్త రచయితలు దీని గురించి ఆలోచించకుండా రచనలు చేయడం ఉత్తమం. పాత్ర పోషణ, నాటకీయత, సంభాషణ, మెలోడ్రామా, భావోద్వేగాలు, రసానుభూతి ఇలా నవలకు సంబంధించిన ఏయే అంశాలుంటాయో అవన్నీ సమపాళ్లలో ఉండడమే శిల్పం. ఒక్కమాటలో చెప్పాలంటే ఒకరాయిని అందమైన విగ్రహంగా మార్చడంలో ఏయే అవయవాలు ఎంతెంత ఉండాలో అవి అంతంత ఉండడమే శిల్పం. అలాగే నవలలో కూడా.



Scanned with OKEN Scanner

# "తెలుగు నాటక రంగం"

"కావ్యేషు నాటకంరమ్యం - నాటకాంతం హి: సాహిత్యం" అన్నారు కాళిదాసు. నాటకం సంస్కృతి సంప్రదాయాలకు నిలయం, నాటకం సమాజాభివృద్ధికి ఆయుధం నాటకం సర్వకాల సర్వావస్థల యందు సమాజ పరిమాణాన్ని ప్రజల జీవన విధానాలను, స్వభావాలను, సంఘటనలను చూపిస్తూ ఉంటుంది నాటకం.

"జీవితాన్ని ప్రతిబింబించేది నాటకం. నాటకానికి ప్రతిస్పందించేదే జీవితం" ఈ నిర్వచనానికి నిలువెత్తు నిదర్శనం నాటకం, నాటకం ఒక ప్రక్రియ, పరిణామం, ప్రగతి శీలం, సృజనశీలం, నాటకం యొక్క ప్రదర్శన ప్రయోగం, విస్తృతంగా జరిగినపుడు, అందులో సమాజం, సంప్రదాయం, ప్రజలు వారి సుఖదుఃఖాలు, యువత ఆరాట పోరాటాలను ఎన్నింటినో బలంగా చూపించగల శక్తివంతమైన కళ ఒక్క నాటకమేనని నిర్వచించవచ్చు.

"అంత కడివెడుపాలపై
ఒక్కింత మీగడ పేరినట్లుగా
ఎంతయో గతము లోపలి మంచి
అదియె సంప్రదాయము" -అని సి.నా.రె. గారు అన్నట్లు కాలం రోజులుగా, నెలలుగా, సంవత్సరాలుగా మారుతున్న పరిణామ క్రమంలో పుట్టిన సంప్రదాయాలను అందంగా తీర్చిదిద్దుకొని చూసుకొనె ప్రక్రియ నాటకం/నాటిక, ఇది ప్రధానంగా మూడు లక్ష్యాలు కలిగి ఉంటుంది. 1) సృజన, 2) ప్రదర్శన, 3) ప్రయోగం.

నాటక, నాటికలను ఎవరు ఏ విధంగా నిర్వచించినా, ముఖ్యంగా రచయిత చెప్పేది సగటు ప్రేక్షకుని వరకు చేరాలి, పామర ప్రేక్షకుండు అందులోని రసాన్ని పూర్తిగా ఆస్వాదించాలి. నాటక విజయానికి రచయిత, దర్శకుడు, నటులు, సాంకేతిక నిపుణులు ఎంత అవసరమో నాటకాన్ని ఆదరించే ప్రేక్షకుడు కూడా అంతే ముఖ్యం.





**నాటకం - పుట్టుక:** "నాటకాంతం హి: సాహిత్యం" నుడివిన కాళిదాసు మాటకు, నాటకానికి సాహిత్య వాఙ్మయములు, పూవుల దండలో, దారంలా ఉండవలసిందే.

హాల శాతవాహన మహారాజు సంపాదించిన గాథా సప్తశతిని బట్టి క్రీస్తు శకారంభమునకు పూర్వమే ఆంధ్రదేశములో నృత్యసంగీత నాటకములు ప్రచారమందు ఉన్నవని తెలియుచున్నది. పాల్కురికి సోమనాథుని (క్రీ.శ. 12వ శతాబ్ది) బసవ పురాణం, పండితారాధ్య చరిత్రములలో నృత్య-సంగీత-నాటకాదుల గురించి వక్కాణించారు.

క్రీ.శ. 11వ శతాబ్ది నుండియు తెలుగు భాషలోనికి సంస్కృతము నుండి, పురాణేతిహాస కావ్యాదులనువాదములగుచున్నను, రూపకములు మాత్రము యథాతథముగా అనూదితములు కాలేదు, క్రీ.శ. 15వ శతాబ్దిలో వల్లభరాయుడు "ప్రేమాభిరామ"మనేడి సంస్కృత రూపకమును "క్రీడాభిరామ"మను పేర అనువదించెను, కాని, ఇందు దృశ్య కావ్య లక్షణముల కంటె, శ్రవ్య, కావ్య లక్షణములే అధికంగా కనబడుచున్నవి, ఇట్టి ప్రయత్నములు మరికొన్ని కూడా జరిగినవి. కాని అటుపిమ్మట సంస్కృత రూపకములను యథాతథంగా ఆంధ్రీకరించుటకు ఎవ్వరూ ప్రయత్నించలేదు. మొత్తము మీద కారణము ఏవి అయినను కీ॥శ॥ 19వ శతాబ్ది తృతీయపాదము వరకును, అనగా ఆంగ్లసాహిత్య ప్రభావము ప్రసరించు వరకు, సంస్కృత రూపకములు అనువాదములు గానీ, ఆ లక్షణాలలో స్వతంత్ర రూపకములు కాని తెలుగులో వెలయలేదు, ఇది ఒక్క తెలుగు భాషకే గాక తక్కిన దేశభాషలన్నిటికీ సమాన లక్షణమే, అనగా ఎవోకొన్ని అపవాదములు తప్పించినచో భారతీయ భాషలలో ఆధునిక నాటక రంగస్థల నాటక రచనా-ప్రదర్శనములు కీ॥శ॥ 1850 తర్వాతనే ఆరంభమైనవని చెప్పవచ్చు, కీ॥శ॥ 1857లో బొంబాయి, కలకత్తా, మద్రాసు నగరములలో భారతదేశములోని మూడు ప్రధాన విశ్వవిద్యాలయములకు అంకురార్పణ జరుగుటతో దేశమున ఆంగ్ల విద్యావ్యాప్తి శీఘ్రగతిని పురోగమించెను.



Scanned with OKEN Scanner

ఆధునిక నాటక రచనా ప్రదర్శనముల విషయమున పాశ్చాత్య ప్రభావమునకు లోనైన ప్రథమ రాష్ట్రము వంగ దేశము, పిమ్మట బొంబాయి, పూనా నగరములను, కన్నడ దేశమూను, ప్రభావితములైనవి, అటు పిమ్మట ప్రభావితమైనది, తెలుగుదేశము, ఈ ఆంగ్ల సాహిత్య ప్రభావము కేవలము ఆంధ్ర-సంస్కృత భాషలలో పండితులైన వారి మీద కూడా కనబడదు. ఒక్కప్రక్క తమలో జీర్ణించుకుపోయిన సంస్కృత విద్యా సంస్కారము, మరోప్రక్క దేశము అంతటినీ, స్వీయ ప్రభావము చేత ముంచివేయుచున్న ఆంగ్ల విద్యా ప్రభావము ఈ రెండింటి సంఘర్షణము లేదా సమ్మేళనముతో వారిలో కొత్తవూహలు బయలుదేరెను. ఇంతకు పూర్వము లేని సాహిత్య శాఖలను దేశభాషలలో అవతరించుటకు పూనుకొనినారు.

ఈ విధముగా తెలుగులో ఆధునిక నాటక సాహిత్యమునకు నాందీ పలికినవారు సంస్కృత పండితులేయగుట గమనింపవచ్చును.

ఇచ్చట ఒక విషయమును గుర్తించవలసియున్నది, తెలుగులో నాటక రచన రెండు కాలములలో రెండు శాఖలుగా సాగినది, తెలుగు సాహిత్యము అరంభమైన కాలము నుండి ఇంచుమించుగా కీ॥శ॥ 1860 వరకు మొదటికాలము, ఇది వీధినాటకం, యక్షగానముల కాలం ఇక రెండవ కాలం క్రీ.శ. 1860 నుండి 1960 వరకు గల కాలం ఇది ఆధునిక నాటక రచనా కాలము, న్యాయముగా, ఈ కాలపు రచనలకు ఇంతకుముందరి కాలపు రచనలు, పునాది కావలసియున్నది, అట్లు జరగలేదు, ఈ రెండు కాలములకును మధ్య ఎట్టి సమన్వయము లేదు, ఇది ఒక విచిత్ర విషయము.

**తెలుగు నాటకం - పరిణామ దశలు :**

తెలుగు నాటకాన్ని మూడు వర్గాలుగా విభజించుకొన్నచో – ముఖ్యంగా 1) పౌరాణిక నాటకం, 2) చారిత్రాత్మక నాటకం, 3) సాంఘిక నాటకం.

ముందుగా పౌరాణిక పద్యనాటకాల మీద కవులు వ్రాయడానికి పూనుకొంటే, నటులు ప్రదర్శించడానికి నడుంబిగించారు. ఒక దశలో ఇవి బహుళ ప్రాచుర్యం పొందాయి. రాను, రాను పద్య ప్రధాన నాటకాలలో





కొండవీటి చాంతాళ్ళ రాగాలు తీస్తు పద్యం పాడడమేననే అభిప్రాయం. కొంత మంది పెద్దలలో పాతుకుపోయి, పద్యనాటకాలంటే కొంత అయిష్టత ప్రచారంలోకి వచ్చింది, అలా సాగదీసి పాడడం సబబుకాదని ముక్తసరిగా రాగాన్ని పద్యంలో ఇమిడ్చి పద్యాన్ని పాడడం అవసరమని అభిప్రాయానికి వచ్చారు, ఈ ప్రక్రియకు దోహదమిచ్చి ప్రచారంలోకి తెచ్చిన పెద్దలు ముఖ్యంగా ముగ్గురు, స్వర్గీయులు ముంజులూరి కృష్ణారావు గారు, బళ్ళారి రాఘవాచారి గారు, మాదవపెద్ది వెంకట్రామయ్య గారు.

పద్యాన్ని భావయుక్తంగా పాడడం అనేది ఆంధ్రుల ప్రత్యేకత. మరి ఇతర భాషల్లోను, దేశాలలోను లేదు. ఈ ప్రత్యేకతను నిలబెట్టుకోవడం తెలుగువారి బాధ్యత, అందువల్లనే పద్య ప్రధాన నాటకాలు తెలుగువారి స్వంతం.

పద్య ప్రధాన నాటకాలంటే వెంటనే స్ఫురణకు వచ్చేది తిరుపతి వెంకట కవుల పాండవ నాటకాలు, చిలకమర్తివారి గయోపాఖ్యానం, పానుగంటి వారి పాధుకా, పట్టాభిషేకం ధర్మవరం వారి చిత్రనళీయం, సారంగధర, బలిజేపల్లి వారి "హరిశ్చంద్ర" మొ॥లగు పద్యయుత నాటకాలు. ఈ నాటకాలలోని పద్యాలు సాహిత్యపరంగా, ఎంతో రాగయుక్తానికి అనువుగా ఉన్నందున పురుషులలో, మహిళలలోను చాలా మందికి కంఠస్థం.... పద్యాలు పూర్తిగా రాకపోయినా, సంధర్భానుసారంగా, ఈ పద్య ప్రధాన నాటకాలలోని పద్య భాగాలను ఉదహరించటం పరిపాటి.

"బావా ! ఎప్పుడు వచ్చితీవు"... "అల్లుడా రమ్మని ఆదరంబున బిల్వ".... "అతివా దాపగనేల..." – "మాయామేయజగంచే నిత్యమని"...లనే పద్యభాగాలు అత్యంత ఆధునిక గృహాలలో తప్ప కొంచెం పాతకాలపు వ్యక్తులున్న కుటుంబాలలో తరచు వినిపిస్తుంటాయి, వినిపిస్తూనే ఉన్నాయి.

దీనికి కారణాలు రెండని చెప్పవచ్చు, అతి లలిత సుందర పదాలతో నడచిన ఆ పద్య రచన మొదటిది, తర్వాత ఆ నాటకాలు, సుశిక్షితులైన నటీనట బృందాలతో ప్రదర్శించేవారు, అందువల్ల పద్యప్రధాన నాటకాలు రసిక లోకాన్ని



Scanned with OKEN Scanner

ఆనందపరచి ప్రజలలోకి చొచ్చుకుపోయాయి, తెలుగు నాట పద్యప్రధాన నాటకాలు ప్రజలను ఆహ్లాదపరిచాయి, కాని అలాంటి నాటకాలను చూడాలనే అభిలాష గల రసిక లోకానికి ఆ నాటకాలను ప్రదర్శించే సమాజాలు తక్కువైపోతూ వచ్చాయి. అవి ఇపుడు నామమాత్రంగానే మిగిలాయి.

**చారిత్రాత్మక నాటకాలు :**

1897 లో వచ్చిన ప్రతాపరుద్రీయం మొట్టమొదటి చారిత్రాత్మక నాటకం కాగ స్వాతంత్ర్యం వచ్చే నాటికే తెలుగు నాటకాల ఇతి వృత్తాలలో ఎంతో చైతన్యవంతమైన వైవిధ్యం ప్రారంభమైంది. తెలుగులో వచ్చిన చారిత్రక నాటకాలలో చాలా వరకు స్వాతంత్రోద్యమం ముమ్మరంగా ఉన్న రోజులలో వ్రాయబడినవే ఉద్యమానికి ప్రత్యక్షంగా చూపే రాజకీయ నాటకాలపై బ్రిటీష్ ప్రభుత్వం ఆంక్షలు విధించడం వల్ల పరోక్షంగా దేశభక్తిని ప్రేరేపించే చారిత్రాత్మక నాటకాలు అవసరమయ్యాయి. మాతృదాస్య విమోచనము" వంటి పౌరాణిక నాటకాలు కూడా ఇట్టి పరోక్ష రచనలే.

స్వాతంత్ర్యం రావడంతో తెలుగు నాటక కర్తకు ఈ దేశభక్తి ఉద్భోదకాలైన ఇతి వృత్తాలన్ని అంటరానివైపోయాయి. ఈ లోపాన్ని పూరించడానికి సంఘ సమస్యల వైపుకు రచయితలు దృష్టి సారించారు, కళాకారులు దృష్టి సారించారు.

**సాంఘిక నాటకం విస్తృత పరిణామం :**

సాంఘిక నాటకం అన్నది చాలా విస్తృతమైన పదం, 1892లో "కన్యాశుల్కం" వచ్చిన నాటి నుంచి రచయితలు అసంఖ్యాలైన సాంఘిక సమస్యలను నాటకీకరిస్తూనే వచ్చారు, 1921-44 మధ్య కాలంలో వచ్చిన సాంఘిక సమస్యా, నాటకాలను స్థూలంగా రెండు రకాలుగా విభజించవచ్చు. సంఘంలో పాతుకుపోయిన దురాచారాలను కథా వస్తువుగా స్వీకరించి వాని వల్ల వ్యక్తికి కలిగే కష్టనష్టాలను వివరించే నాటకాలు కొన్ని. ఇవి సాంప్రదాయక నాటకశైలిలో పద్యాలు పాటలతో వ్రాయబడి ఆడబడిన నాటకాలు. చింతామణి,





రంగూన్ రౌడి, వరవిక్రయం వంటి నాటకాలు ఈ కోవకు చెందినవి.

ఇక రెండవ రకం నాటకాలు, సంఘంలో వ్యక్తికి లేదా వ్యక్తులకు జరుగుతున్న అన్యాయానికి సంబంధించినవి సంఘంలో కొందరు వ్యక్తులను ఎలా అనగద్రొక్కుతున్నది వివరిస్తాయి ఈ నాటకాలు. ఇబ్సన్ వల్ల ప్రభావితులైన రాజమన్నార్, రాఘవ, రంగారామ్ వంటి రచయితలు సంఘంలో స్త్రీకి జరుగుతున్న అన్యాయాలను గురించి చర్చించారు.

జమీందార్లు లేదా భూస్వాములకు, పాలేర్లకు మధ్య జరిగే సంఘర్షణను చిత్రించిన నాటకాలలో బోయి భీమన్నగారి పాలేరు (1945) సుంకర వాసిరెడ్డి గార్ల ముందడుగు (1945) ముఖ్యమైనవి, కాని 1947 తరువాత వచ్చిన నాటకాలలో వెనుకటి కంటే తీవ్రత, అసహనం హెచ్చుగా కనిపిస్తాయి.

1946లో ఆంధ్రనాటక కళాపరిషత్తు మొదటిసారిగా ప్రారంభించిన నాటకాల పోటీలలో ఆత్రేయ, కొండమీద గోపాలశర్మలాంటి ప్రముఖ రచయితల నాటకలు ఎన్.జి.ఓ, హెచ్.జీ.వో. (ఆత్రేయ), ఎదురీత (గోపాలశర్మ) - తదాది అనగా 1949 నుండి నాటకం పరిషత్తులలో వేయడం ప్రారంభించారు.

నాటకం - నాటకాలు పోటీ పరిషత్తులలో పాల్గొనడం ప్రారంభించినప్పటి నుండి, పురాణ కావ్య నాటకాల, రూపకాల లక్షణాలలో అనుహ్యమైన మార్పు చేర్పులకు తెరలేచింది.

నాటిక విషయంలో కూడా భరతుడు చెప్పిన నాటిక లక్షణాలు ఈ నాటికి నాటికలలో కనిపించవు, ఆయన నిర్దేశించిన దాని ప్రకారం, నాటికలో నాలుగు అంకాల దాక వుండవచ్చు, ఈనాటి ఏకాంకి కాలు, నాటికలు, కేవలం ఆధునిక సాహిత్య ప్రక్రియలుగానే కొనసాగుతున్నాయి.

వైశాల్యంలో చిన్నవి, ప్రదర్శన కాలంలో తక్కువ పట్టేవి. ఈనాడు నాటికలు గాను వాటినే ఒక్కోసారి ఏకాంకికలు, నాటికలుగాను పిలవడం జరుగుచున్నది, నాట్యశాస్త్రం కాలం కంటే ముందువాడుగా చెప్పబడుతున్న భాస మహాకవి ఇలాంటి రచనలు చేసినట్లు ప్రస్తుతం లభ్యమవుతున్న "దూత



Scanned with OKEN Scanner

వాక్యము" "ఊరుభంగము" లాంటి రచనలవల్ల తెలుస్తుంది.

పాశ్చాత్య దేశాలలో మధ్యయుగం నాటి "మిస్టరీ రూపకాలు" "మిరాకిల్ నాటకాల వంటి మతపరమయిన రచనలన్నీ వైశాల్యంలో చిన్నవి కావడం చేత ఆధునిక నాటిక రచనలకి ప్రాతిపదికలుగా మనం భావించవచ్చు.

ఇంగ్లీషులో నాటకాన్ని Full Play అని, చిన్న నాటికలని Short Play అని అంటారు, Short Playనే తర్వాత తర్వాత One Act Play లేక One Actor గా పిలవడం పరిపాటిగా అయిపోయింది. ఈ One Act Play రచన విదేశాల్లో విస్తృతంగా జరిగింది, W.W. Jacot రాసిన Monkey's Paw అనే నాటిక 1903లో లండన్‌లో ప్రదర్శింపబడి విశేష ప్రేక్షకాధరణ పొందింది, ఈ నాటికనే ఆచార్య ఆత్రేయ గారు 1955లో వరప్రసాదంగా తెలుగులో రచించారు.

**నాటిక - లక్షణాలు :**

ఆధునిక తెలుగు సాహిత్యంలోని నాటిక, ఏకాంకిక, ప్రహసనం ఈ మూడు కూడా పాశ్చాత్య సాహితీ సంపర్కం వల్లనో, కొత్త ప్రయోగాలు చేద్దాం అన్న తలంపుతోనో అవతరించినప్పటికి అవి, కేవలం అనుకరణల కోసం కాక తమదైన ఒక ప్రత్యేకమైన ఫక్కీలో నిలబడ్డాయని చెప్పక తప్పదు, వీటన్నింటిని మన సౌలభ్యం కోసం నాటికలుగానే పిలుచుకొంటున్నాము.

ఈనాటి మన రచయితలు నాటక రంగంలో ఈ నాటిక లక్షణాల మీద తలెత్తిన ప్రశ్నలు ప్రశ్నలుగానే మిగిలిఉండగా, అవేవి పట్టించుకోకుండానే ఎవరికి తోచిన విధంగా వారు రచనలు చేశారు, చేస్తున్నారు, దీనికి కారణం తెలుగు నాటకం ఈనాటికి కూడా పరిషత్ పోటీల మధ్య, ఔత్సాహకుల పుణ్యమా అనే బతుకుతుందనడంలో సందేహం లేదు.

గంటకు మించకపోతే నాటిక, గంటకు లేదా గంటన్నరకు మించితే నాటకం అని మన పోటీ నిర్వాహకులు పెట్టిన నిబంధనల వల్ల, నాటక రచనకి ప్రదర్శనా సమయమే ముఖ్యమయిన లక్షణంగా నిలిచిపోయింది. ఇతి





వృత్తం ఎంత వివరంగా వుండాలి ? మధ్యలో తెరవాలవచ్చా లేదా ? లైట్స్ ఆఫ్ చేసి, వెంటనే ఆన్ చేయవచ్చా ? కాల, స్థల, కార్య ఐక్యతలాంటిది, పాటించాలా వద్దా ? పాత్రల సంఖ్య ఎంత వుండాలి ? అనే ప్రశ్నలకు జవాబు దొరకక రచయితలు రచనలు చేస్తున్నారు, ప్రయోక్తలు ప్రదర్శిస్తున్నారు, పోటీలలో న్యాయనిర్ణేతలు కూడా వారికి తోచిన రీతిగా బహుమతులు ఇస్తున్నారు, కాని ఇది ప్రమాణీకం అని నాటక/నాటికల ఒక కొలమానం ఒక నిబంధనలాంటిది నిర్ణయించలేక పోతున్నారు.

నాటికలోని సన్నివేశం ఎంతకాలం జరిగిందో అంతేకాలం ప్రదర్శన జరిగితే మంచిదని కొందరి అభిప్రాయం లేదా చాకచక్యంతో ఒక రోజులో జరిగిన కథను సాధ్యమయినంత క్లుప్తంగా నాటికలో చెప్పవచ్చు అని కొందరి అభిప్రాయం పైవేవి అక్కర్లేదు, ఎన్ని సంవత్సరాలు జరిగిన కథయినా అరవై నిమిషాల్లో చెప్పోచ్చు అని మరికొందరి వాదన.

ఈ చర్చనీయాంశాలన్నీ ఇలాగే ఉంటున్నాయి. కాని, నాటికలు సమకాలీన సమస్యలపై తెలుగురంగంలో చాలా విరివిగా వస్తూనే ఉన్నాయి. నాటిక – ఏకాంకిక ఒకదానికొకటి పర్యాయపదాలుగా వాడబడ్డాయి.

యధార్థానికి నాటికకు ఏకాంకికకు మౌలికమైన భేదం వుండి, ఒకే అంకం గలది ఏకాంకిక, రెండు నుండి నాలుగంకాలు కలిగింది నాటిక అనవచ్చును. అందువల్ల నాటికను స్వతంత్రమైన రూపక ప్రక్రియగానే భావించడం సమంజసంగా ఉంటుంది. అంతేకాని నాటికలను, ఏకాంకికల్లో చేర్చడం ఉచితం కాదు, ఆధునిక కాలంలో నాటిక ప్రక్రియ, కొత్తరూపు రేఖలు దిద్దుకొని పురోగమిస్తుందనడంలో అతిశయోక్తి లేదు.

అయితే ఈ నాటకం – నాటికలు లేని తొలిదశలో, అంతకుముందున్న సంప్రదాయ నాటక రూపాల జానపద కళాబృందాలు ఊరూరాతిరుగుతు గ్రామీణులకు వినోదాన్ని కలిగిస్తుండేవి, తోలు బొమ్మలాటలు, పగటివేశాలు, వీధిభాగోతాలు గొల్లసుద్దులు మొ॥వన్ని సంచార నాటక బృందాలద్వారానే



Scanned with OKEN Scanner

ప్రదర్శింపబడుతుండేవి ఆయా కుటుంబాల పెద్దలే ఆ బృందాల నాయకులు - కాని క్రమేణ, నాటకం నాటిక ముందు ఒక రచయిత కలం నుండి పుట్టి, అందులోని వివిధ పాత్రల్ని కొందరు నటులు ధరించి ఆయా పాత్రలు అభినయిస్తున్నారు.

పరిణామక్రమంలో ఒక ప్రదర్శన బృందాల వారిగా కాకుండా, ఒక దర్శకుని చేతిల్లోకి వచ్చిచేరింది, ప్రదర్శన మంచి, చెడ్డలకు, దర్శకుడు ఒక్కడే భాద్యుడు, అందులోని పాత్రలన్నీ వ్యక్తిగత ప్రశంసలు, బహుమతులకే పరిమితమౌతుంటాయి.

ఆధునిక తెలుగు నాటక ప్రదర్శన 1930-44 సంవత్సరాలు మాత్రమే అని పెద్దలు చూపిన ఆధారాల వల్ల తెలుస్తుంది, ఇదే కాలంలో సాంఘిక నాటికలు, దృశ్య నాటికలే కాక రేడియో కోసం శ్రవ్యనాటికలు, పద్యగేయ నాటికలు పౌరాణిక చారిత్రాత్మక ఇతివృత్తాల రచనలు తెలుగు సాహిత్యంలో వెలువడ్డాయి.

నాటి నుండి నేటి వరకు వెలువడ్డ నాటక నాటికలను మనం ఈవిధంగా వర్గీకరించుకోవచ్చు.

1. కేవలం పోటీలో ప్రదర్శన కోసం, ఔత్సాహికులు ప్రదర్శించుకోవడానికి వీలుగా రచించబడ్డవి.
2. ప్రయోగాత్మక రచనలు.
3. ప్రచారం కోసం రచనలు.
4. మాండలికంలో రచనలు
5. స్త్రీ పాత్రలు లేని రచనలు, పురుష పాత్రలు లేని రచనలు
6. ఆధునిక వీధి నాటక రచనలు.

ఈ విధంగా మనం ఎంత వర్గీకరించినా, అన్ని రకాల రచనలు, పోటీలలో ప్రదర్శించబడ్డవే, ప్రదర్శించబడుతున్నవే, ఎందుకంటే తెలుగు నాటక రంగానికి వేదిక అవే గనుక. ఇవేకాక ఈ అరవై సంవత్సరాలలో బాగా అభివృద్ధి చెందినది మాత్రం బాలల కోసం నాటికా రచన. నాటకం-నాటిక ఏ మాండలీకంలో





సాగింది, ఏ జీవన సంఘర్షణలను చూపించింది, నవ రసాల్లోని ఏ రసంలో ప్రదర్శించబడ్డది, అనే అంశాన్ని పరిగణలోకి తీసుకోకుండా, ప్రేక్షకులు, ప్రదర్శనలో లీనమై నాటకం చివరంటా చూశారా లేదా ? అన్నదే ముఖ్యం.

ఈరోజుల్లో నాటకం - నాటిక సజీవంగా ఉందా ? లేక క్షీణ దశలో ఉందా ? అంటే చెప్పడం కష్టంగా తోస్తుంది. కాని, అంతరించి పోకుండా ఉంది అనడం మాత్రం నిజం.



Scanned with OKEN Scanner

## ధ్వని విజ్ఞానం

భాష నాగరికుల ఆస్తి. భాషే జీవితము. భాషే అభివృద్ధి, పురాభివృద్ధి ఇంతటి ప్రాధాన్యత గల్గిన భాషకు వెచ్చిస్తున్న సమయమెంత ! భాషను పొందుతున్న విధానం ఏమి ! భాషను అందించే వారెవరు ! తల్లిదండ్రులా! ఇరుగుపొరుగా ! ఉపాధ్యాయులా ! ఎందరు అందించే వారున్నా ప్రమాణాత్మకంగా అందించే అర్హత, ఓపిక, బాధ్యత ఉన్నది మాత్రము ఉపాధ్యాయులకే. ఉపాధ్యాయులుగా నియామకం కావాడానికి గాని, ఉపాధ్యాయ శిక్షణ సమయంలో గాని భాషతో సంబంధం లేకుండానే వృత్తిలో ప్రవేశించే వారెందరో.

భాషా నైపుణ్యాల్లో మొట్టమొదటిది శ్రవణము. శిశువు/విద్యార్థి ఎలా వింటారో అలా మాట్లాడుతారు.

ప్రతి భాషకు ఉచ్చారణ ప్రాణం. సరియైన ఉచ్చారణ లేని భాష నిస్సారంగా ఉంటుంది. చక్కటి ఉచ్చారణకు సరియైన సమయం పాఠశాల విద్యార్థి దశ. ఈ దశలో బోధించే ఉపాధ్యాయులు ముఖ్యంగా భాషోపాధ్యాయుల పాత్ర వర్ణనాతీతం. అంత గొప్ప పాత్ర పోషించాల్సిన ఉపాధ్యాయునికి కనీస ఉచ్చారణ పరిజ్ఞానం ఉన్నప్పుడే సారవంతమైన నేలలో పడిన విత్తనంలా విద్యార్థి భాషలో వికసిస్తాడు. గ్లోబల్ ప్లేయర్‌గా అవతరిస్తాడు. తెలుగు భాషోచ్చారణకు ఉపాధ్యాయుని కనీస పరిజ్ఞానం అందించే ప్రయత్నమే "ధ్వని" పాఠం మీ ముందుకు.

భాషాధ్వనులు పుడుతున్న తీరును, వాటిని పలకడంలో ఉపయోగ పడుతున్న ముఖయంత్ర అవయవాలను, ఊపిరితిత్తుల నుంచి వచ్చే గాలిని అడ్డగించడం వల్ల ఏర్పడే ధ్వని తరంగాల లక్షణాలను తెలియజేసే భాషా శాస్త్రంలోని ఒక భాగాన్ని "ధ్వని విజ్ఞానం" అంటాం.

**1.ధ్వని** : మానవుని వాగవయవాల నుంచి ఉత్పన్నమై భాషా విజ్ఞానానికి ఉపయోగపడే ప్రతి శబ్దాన్ని "ధ్వని" అంటాం. ఉదా: చ, చ





**2.వర్ణం** : అర్థభేదక శక్తి కల్గిన ధ్వనిని మాత్రమే వర్ణంగా గుర్తిస్తారు. ఉదా : చందమామ, చందమామ, చ, చ లలో అర్థబేధ శక్తి లేదు. కాబట్టి ఈ రెండింటిలో ఒకటి మాత్రమే వర్ణం (చ) పాట, బాట – ప, బ లు అర్థభేదక శక్తి కల్గినని కాబట్టి ఇవి రెండూ వర్ణాలే.

**3.అక్షరం** : ఒక అచ్చు ఖచ్చితంగా కలిగి ఉండేది అక్షరం. పదంలో ఎన్ని అచ్చులుంటే అన్ని అక్షరాలున్నట్లు. ఒక్కొక్క ధ్వని కాకుండా, ఒక అక్షరానికి సరిపడే అంత చిన్న పరిమాణంలో గాలి వెలుపలకు వస్తుంది. బల్ల అనే మాటలో ధ్వనులు ఐదు, అక్షరాలు రెండు. భాషా ధ్వనుల్లో హల్లులు, అచ్చులు అని ప్రధానంగా రెండు రకాలు. ధ్వన్యుత్పత్తి మూడింటిపై ఆధారపడి ఉంటుంది.

1. స్థానం 2. కరణం. 3. ప్రయత్నం.

**1.స్థానం** : ముఖ కుహరంలో కరణంతాకే ప్రదేశాన్ని/గరిష్ట సంకుచిత అవకాశాన్ని ఏర్పాటుచేసే ప్రదేశాన్ని "స్థానం" అంటారు. కదలిక లేని అవయవాలు స్థానాలు. పైపెదవి, పై దంతాలు, దంతమూలం, కఠినతాలువు, మృదుతాలువు స్థానాలుగా వ్యవహరిస్తాయి.

**2.కరణం** : స్థానం వైపు పయనించి, వాయు ప్రవాహాన్ని ఆపి వదలడం గాని లేదా స్థానం దగ్గర సంకుచిత అవకాశాన్ని ఏర్పాటు చేయడం గాని చేసేదాన్ని "కరణం" అంటాం. కదలిక ఉన్న అవయవాలు కరణాలు. క్రింది పెదవి, నాలుక, లంబిక కరణాలుగా వ్యవహరిస్తాయి.

**3.ప్రయత్నం** : ఊపిరితిత్తుల నుంచి వచ్చే వాయుప్రవాహం కంఠబిలం నుంచి పెదవుల వరకు ఉన్న ప్రాంతంలో పొందే మార్పును "ప్రయత్నం" అంటాం. వాయు ప్రవాహాన్ని అడ్డగించి వదలడం, సంకుచిత



Scanned with OKEN Scanner

అవకాశం ద్వారా పంపించడం లేదా కరణాన్ని కంపింప చేయడం మొదలైనవి ప్రయత్న భేదాలు. ప,బ – ఈ రెండు ధ్వనులు ఉచ్చరించడానికి పై పెదవి స్థానం, క్రింది పెదవి కరణం, కానీ ప్రయత్నభేదం వల్ల ప,బ లుగా భిన్న ధ్వనులవుతున్నాయి. స్వరపేటికలోని నాదతంత్రులు కంపించకుండా ఉన్నప్పుడు 'ప' అనే శ్వాస ధ్వనిగా, అవి కంపించినప్పుడు 'బ' అనే నాదధ్వనిగా ఉచ్చారణ జరుగుతుంది. ఇలా ప్రయత్నం వల్ల ధ్వని భేదం వస్తుంది.



1. నాసికారంధ్రం
2. నాసికా కుహరం
3. ఓష్ఠం
4. వర్త్స్యం
5. బర్త్స్యం (అంగిలి)
6. మూర్ధం
7. తాలువు
8. కాకలం
9. ఓష్ఠం
10. దంతం
11. జిహ్వాగ్రం
12. జిహ్వామధ్యం
13. జిహ్వాపృష్ఠం
14. గళగర్తం
15. జిహ్వామూలం
16. గో జిహ్వాక
17. స్వరపేటిక
18. నాదతంత్రికలు
19. శ్వాసనాళిక
20. ఆహారనాళిక





స్థానకరణాలను బట్టి క్రింది ధ్వనులు పుడతాయి.

| స్థానం | కరణం | ధ్వని | ఉదాహరణ |
|---|---|---|---|
| పై పెదవి | కింది పెదవి | ఉభయోష్ఠ్యాలు | ప, బ |
| పై దంతాలు | కింది పెదవి | దంతోష్ఠ్యాలు | వ |
| పై దంతాలు | జిహ్వాగ్రం | దంత్యాలు | త, ద |
| దంత మూలం | జిహ్వాగ్రం | దంత మూలీయాలు | న |
| మూర్ధం | పూర్వ జిహ్వవెనుక భాగం | మూర్ధన్యాలు | ట, డ |
| కఠిన తాలువు | మధ్య జిహ్వ | తాలవ్యాలు | చ, జ |
| మృదు తాలువు | పశ్చిమ జిహ్వ | కంఠ్యాలు | క, గ |
| కంఠమూలం | జిహ్వ మూలం | కంఠ మూలీయం | హ |

**హల్లుల్లో రకాలు :** వీటిని స్పర్శాలు, ఊష్మాలు, స్పర్శోష్మాలు, అనునాసికాలు, కంపితాలు, తాడితాలు, పార్శ్వికాలు, అంతస్థాలు" గా వర్గీకరించవచ్చు.

**1. స్పర్శాలు:** కంఠబిలం నుంచి పెదవుల వరకు ఉండే భాగంలోని ఏదో ఒక స్థానంలో వాయు ప్రవాహాన్ని క్షణకాలం పూర్తిగా నిరోధించి వెలువరించడం వల్ల ఏర్పడే ధ్వనులు స్పర్శాలు. వీటిల్లో శ్వాసనాద భేదంతో పాటు అల్పప్రాణ, మహాప్రాణ భేదం కూడా ఉంది.

**అల్పప్రాణం :** నిర్దిష్ట కాలంలో స్వాభావికోచ్చారణతో ఉచ్చరించే హల్లు అల్పప్రాణం (క).

**మహా ప్రాణం :** నిర్దిష్ట కాలంలో స్వాభావికోచ్చారణకు మించిన గాలిని వెలువరిస్తూ ఉచ్చరించే హల్లు మహాప్రాణం (ఖ)

ప – శ్వాసం అల్పప్రాణం ఉభయోష్ఠ్య స్పర్శం
ఫ – శ్వాసం మహాప్రాణం ఉభయోష్ఠ్య స్పర్శం
బ – నాదం అల్పప్రాణం ఉభయోష్ఠ్య స్పర్శం



Scanned with OKEN Scanner

| | | | |
|---|---|---|---|
| భ - | నాదం | మహాప్రాణం | ఉభయోష్ఠ్య స్పర్శం |
| త - | శ్వాసం | అల్పప్రాణం | దంత స్పర్శం |
| థ - | శ్వాసం | మహాప్రాణం | దంత స్పర్శం |
| ద - | నాదం | అల్పప్రాణం | దంత స్పర్శం |
| ధ - | నాదం | మహాప్రాణం | దంత స్పర్శం |
| ట - | శ్వాసం | అల్పప్రాణం | మూర్ధన్య స్పర్శం |
| ఠ - | శ్వాసం | మహాప్రాణం | మూర్ధన్య స్పర్శం |
| డ - | నాదం | అల్పప్రాణం | మూర్ధన్య స్పర్శం |
| ఢ - | నాదం | మహాప్రాణం | మూర్ధన్య స్పర్శం |
| క - | శ్వాసం | అల్పప్రాణం | కంఠ్య స్పర్శం |
| ఖ - | శ్వాసం | మహాప్రాణం | కంఠ్య స్పర్శం |
| గ - | నాదం | అల్పప్రాణం | కంఠ్య స్పర్శం |
| ఘ - | నాదం | మహాప్రాణం | కంఠ్య స్పర్శం |

('కాఫీ'లోని ఫ దంత్యోష్ఠ్యం)

**2. ఊష్మాలు** : ఊపిరితిత్తుల నుంచి వచ్చే వాయు ప్రవాహం స్థానిక నిరోధం లేకుండా స్థానకరణాల సంకుచిత అవకాశం ద్వారా ఒరుసుకొని రావటం వల్ల ఏర్పడే ధ్వనులు ఊష్మాలు. ఈ అవకాశం ఎంత చిన్నదైతే ఊష్మధ్వని తీవ్రత అంత ఎక్కువగా ఉంటుంది.

| | | |
|---|---|---|
| శ - | శ్వాసం | తాలవ్య ఊష్మం |
| ష - | శ్వాసం | మూర్ధన్య ఊష్మం |
| స - | శ్వాసం | దంతమూలీయ ఊష్మం |
| హ - | శ్వాసం | కంఠ్య ఊష్మం |

**3. స్పర్శోష్మాలు** : స్పర్శ ప్రయత్నం, ఊష్మ ప్రయత్నం రెండూ కలిసి ఉచ్చరించే ధ్వనులు. స్పర్శ ప్రయత్నంలో గాలిని వెలువరిస్తే ఏర్పడేవి "స్పర్శోష్మ ధ్వనులు".

| | | | | |
|---|---|---|---|---|
| చ - | శ్వాసం | అల్పప్రాణం | దంత్యం | స్పర్శోష్మం |
| జ - | నాదం | అల్పప్రాణం | దంత్యం | స్పర్శోష్మం |





| | | | | |
|---|---|---|---|---|
| చ - | శ్వాసం | అల్పప్రాణం | తాలవ్య | స్పర్శోష్మం |
| ఛ - | శ్వాసం | మహాప్రాణం | తాలవ్య | స్పర్శోష్మం |
| జ - | నాదం | అల్పప్రాణం | తాలవ్య | స్పర్శోష్మం |
| ఝ - | నాదం | మహాప్రాణం | తాలవ్య | స్పర్శోష్మం |

**4. అనునాసికాలు** : స్పర్శ ప్రయత్నంలో లంబిక ముఖకుహరాన్ని మూసివేస్తే వాయు ప్రవాహం ముఖకుహరం ద్వారా కాకుండా నాసికాకుహరం ద్వారా వెళ్ళటం వల్ల ఉత్పత్తి అయ్యే ధ్వనులు అనునాసికాలు. అనునాసికాలకు బదులుగా లిపిలో ఆయా వర్గాక్షరాల ముందు 'ం' వాడతారు.

| | | | |
|---|---|---|---|
| ఙ - | నాదం | కంఠ్యం | అనునాసికం |
| ఞ - | నాదం | తాలవ్యం | అనునాసికం |
| ణ - | నాదం | మూర్ధన్యం | అనునాసికం |
| న - | నాదం | దంత్యం | అనునాసికం |
| మ - | నాదం | ఉభయోష్ఠ్యం | అనునాసికం |

**5. కంపితాలు** : కరణం (జిహ్వాగ్రం) అనేక సార్లు కంపించడం వల్ల ఏర్పడే ధ్వనులు కంపితాలు. ఱ-దంతమూలీయం, కంపితం.

**6. తాడితం** : కరణం (జిహ్వాగ్రం) ఒక్కసారిగా వెనక్కు వచ్చి పైనున్న స్థానాన్ని ఒక్కసారిగా తాకి కిందికి కొట్టినట్లు పడిపోవడం వల్ల ఏర్పడే ధ్వనులు తాడితాలు. ర-దంతమూలీయం, తాడితం.

**7. పార్శ్వికాలు** : కరణమైన నాలుకను పై స్థానానికి స్పర్శింపచేసి రెండువైపులా లేదా ఒకే వైపు ద్వారా గాలి వెలువరించటం వల్ల ఏర్పడే ధ్వనులు పార్శ్వికాలు.

| | | | |
|---|---|---|---|
| ల - | నాదం | దంతమూలీయం | పార్శ్వికం |
| ళ - | నాదం | మూర్ధన్యం | పార్శ్వికం |

**8. అంతస్థాలు** : ఊష్మధ్వనుల కంటె ఒరిపిడి లేకుండా స్థానానికి సంబంధించిన కండరాలకు బిగువు కలిగిస్తూ ఉచ్చరించే ధ్వనులు అంతస్థాలు.



Scanned with OKEN Scanner

వ - దంతోష్ఠ్యం అంతస్థం.
య - తాలవ్యం అంతస్థం.

1. హల్లుల వైవిధ్యం స్థాన 'కరణ' ప్రయత్న భేదాలను బట్టి ఏర్పడుతుంది.
2. స్పర్శాలతోను, ఊష్మాలతోను, స్పర్శోష్మాలతోనూ సామాన్యంగా శ్వాసనాద భేదం కనిపిస్తుంది.
3. స్పర్శ హల్లుల్లో మాత్రమే అల్పప్రాణ, మహాప్రాణ భేదం ఉంది.
4. కంపితాలు, తాడితాలు, పార్శ్వికాలకు మహాప్రాణం ఉండదు.
5. అనునాసికాలు, అంతస్థాలు సామాన్యంగా నాదధ్వనులై ఉంటాయి.

**అచ్చులు :** ఊపిరితిత్తుల నుంచి వచ్చే వాయు ప్రవాహానికి ముఖ కుహరంలో ఎలాంటి నిరోధాన్ని గాని, ఒరిపిడిగాని కలిగించకుండా ఉచ్చరించే ధ్వనులు అచ్చులు. నోటి ఆకారాన్ని మార్చడం వల్ల, పెదవుల స్థితిని మార్చడం వల్ల, నాలుకను పైకి కిందికి నిలపడం వల్ల వివిధ రకాల అచ్చులు పుడుతాయి. అచ్చుల వర్గీకరణలో కింది అంశాలు ముఖ్యమైనవి :

**1. పూర్వాచ్చు, మధ్యాచ్చు, పశ్చిమాచ్చు :**

జిహ్వాగ్రం కఠిన తాలువు వైపు లేస్తే పుట్టె అచ్చులు పూర్వాచ్చులు (తాలవ్యాచ్చులు) జిహ్వామధ్యం మూర్ధం వైపు లేస్తే పుట్టే అచ్చులు మధ్యాచ్చులు (మూర్ధన్యాచ్చులు) జిహ్వామూలం మృదుతాలువు వైపు లేస్తే పుట్టే అచ్చులు పశ్చిమాచ్చులు (కంఠ్యాచ్చులు).

**2. వివృతం - అర్ధవివృతం - సంవృతం - అర్ధసంవృతం :**

ఉచ్చరించేటప్పుడు పెదవులు పరస్పరం చాలా దూరంగా ఉన్నప్పుడు పుట్టే అచ్చులు వివృతాచ్చులు. పెదవులు కొంచెం సన్నిహితంగా ఉన్నప్పుడు పుట్టే అచ్చులు అర్ధ వివృతాచ్చులు. పెదవులు అర్ధవివృత స్థితికంటే మరింత దగ్గరగా ఉంటే పుట్టే అచ్చులు అర్ధసంవృతాచ్చులు. పెదవులు దాదాపు పూర్తిగా మూసుకొని ఉన్నప్పుడు పుట్టే అచ్చులు సంవృతాచ్చులు.





**3. వర్తులితం - అవర్తులితం :**

పెదవులు గుండ్రంగా ఉన్నప్పుడు పుట్టే అచ్చులు వర్తులితాలు. వీటిని ఓష్ఠ్యాచ్చులని కూడా అంటారు. పెదవులు విడివిడిగా ఉన్నప్పుడు పుట్టేవి అవర్తులితాలు. వీటిని నిరోష్ఠ్యాచ్చులని కూడా అంటారు.

అ, ఆ - పశ్చిమాచ్చు, వివృతం, అవర్తులితం (కంఠ్యం)
ఇ, ఈ - పూర్వాచ్చు, సంవృతం, అవర్తులితం (తాలవ్యం)
ఉ, ఊ - పశ్చిమాచ్చు, సంవృతం, వర్తులితం (ఓష్ఠ్యం)
ఎ, ఏ - పూర్వాచ్చు, అర్ధ సంవృతం, అవర్తులితం (కంఠ తాలవ్యం)
ఒ, ఓ - పశ్చిమాచ్చు, అర్ధ సంవృతం, వర్తులితం (కంఠోష్ఠ్యం)
ఐ, ఔ - (ఐ=అయ్, ఔ=అవ్) సంయుక్త ధ్వనులు.
ఋ,ౠ - (ఋ=రు) (ౠ=రూ) హల్లులతో సమానం.

అచ్చులన్నీ సామాన్యంగా నాదాలై ఉంటాయి. మామూలుగా ఉచ్చరించే కాలం కంటే ఎక్కువ కాలం ఒక అచ్చును ఉచ్చరిస్తే అది దీర్ఘాచ్చు అవుతుంది.



Scanned with OKEN Scanner

# చేతిరాత - విద్యార్థి ప్రగతికి చేయూత

పాఠశాల విద్యార్థి దశలో అందంగా రాయడం నేర్పడం ఎంతో అవసరం. అందమైన చేతిరాత మనిషి మనసును అద్దంలో ఉంచుతుంది, నిర్మాణాత్మకంగా ఆలోచింపచేస్తుంది. స్థిరమైన క్రమశిక్షణను పెంపొందింప చేస్తుంది. మనిషి అంతస్సౌందర్యానికి ఉన్నతమైన భాష్యం రాస్తుంది. ఆ పాఠకుల హృదయాలు రంజింపచేసే, గుండ్రటి రాతను అది ఒక కళ. అట్టి ఉపాధ్యాయులు అక్షర రమ్యతను చేజిక్కించుకొని విద్యార్థుల గుండె గదుల్లో అనుభవాల సంపదను నింపి నిత్యనిర్మాణ కృషీవలురు కావాలని నా కోరిక. శ్రద్ధ, ఆసక్తి, పట్టుదల ఉండే ఆచార్యులు దేన్నైనా సాధించగలరు. తెలుగు, హిందీ, ఆంగ్లం మూడు భాషల అక్షరాల వక్రతాపరమ్యాల అందాలను ప్రతి పదాన్ని ప్రతి హృదయాకాశంలో ఎగురవేయాలని ఉపాధ్యాయ మిత్రులను కోరుతున్నాను. చేతిరాత అందంగా ఉండాలంటే, నేర్పించాలంటే ఏ పద్ధతిలో సాధన చేయాలి, ఎటువంటి అభ్యాసాలు చేయాలి అనే అంశాలను సవివరంగా విశ్లేషించుకుందాం. విద్య అనే నాణానికి చదవటం, వ్రాయటం అనేవి బొమ్మ బొరుసులాంటివి. రెండింటిలో దేనిని అశ్రద్ధ చేయకూడదు. మనిషి మదిలో దాగివున్న మనస్తత్వాన్ని చూడకుండా మాట్లాడకుండా తెలుసుకోవడం చేతిరాతతోనే సాధ్యమవుతుంది.

మనిషి హృదయ సౌందర్యానికి దర్పణం చేతిరాత. హస్తాక్షరి మన అస్తిత్వాన్ని కనుల ముందు ఉంచుతుంది. నలుగురిలో మన ఉనికిని చాటుకోవటానికి ఇతరులకు మనం ఆదర్శం కావటానికి మనపై మనకు నమ్మకం ఏర్పడటానికి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగటానికి చేతిరాత మనకు చేయూత నిస్తుంది. నిజానికి చదవటం ఎంత ముఖ్యమో తప్పులు లేకుండా రాయటం కూడా అంత ముఖ్యం. "ఫేస్ ఆఫ్ ఇండెక్స్ దమైండ్" అంటారు. అంటే ముఖాన్ని చూసి మనిషిలో భావాల్ని చదవవచ్చు, వ్యక్తిత్వాన్ని అంచనా వేయవచ్చునేది మరో పరిశీలన. అలాగే చేతివ్రాతను బట్టి కూడా మనిషి



ప్రవర్తన ఆలోచనల్ని, అంతరంగ [illegible] కాదా ! [illegible] ఉపాధ్యాయులు [illegible] ఓ వ్యక్తిలోని ఆలోచనలు ప్రత్యక్షంగా [illegible] అద్భుతంగా [illegible] చేతిరాత ద్వారా మనలోని ప్రతిభను [illegible] గ్రాఫాలజీ [illegible] అక్షరాలు [illegible] ఎలా [illegible] ? మన భావాలను ఎలా వ్యక్తీకరించాలి అనేది [illegible] ఆ అధ్యయనం వెల్లడించింది. ఈ విషయాన్ని హ్యాండ్ రైటింగ్ ఎక్స్‌పర్ట్స్ ధ్రువీకరించింది. అందంగా వేగంగా రాసే విద్యార్థులే క్లాసులో ముందుంటారని, వారికే మంచి మార్కులు వస్తాయని సర్వే వెల్లడించింది. ఆ చేతిరాత సరిగ్గా లేని విద్యార్థులు అన్నింటా వెనుకబడే ఉంటారని నిరూపించింది. అందుకే ఉపాధ్యాయ మిత్రులారా ! నా ఆలోచనలు మీ ఆలోచనలు జోడించి విద్యార్థులకు మంచిదస్తూరి నేర్పండి.

ముందుగా తెలుగు అందంగా ఎలా రాయాలో నేర్చుకుందాం. భావ ప్రకటనకు భాష మూలాధారమైతే అటువంటి భాషకు అక్షరాలు ప్రాణాధారం ! యాభైయారక్షరాలున్న సుసంపన్నమైన భాష - తెలుగు భాష.

తెలుగు భాష ఎంత మాధుర్యమైనదో, స్వభావంలోనే కాదు స్వరూపంలో కూడా అంతే మధురమైనది. అక్షరం అనగా క్షరము కానిది అంటే నశించనిది. దేశభాషల్లో ఏ భాషకూ లేనన్ని అక్షరాలు (56) మన తెలుగు భాషకున్నవి. కాలానుగుణంగా కొన్ని అక్షరాలు కనుమరుగయినప్పటికి తెలుగు భాషకున్న మౌలికమైన పరిమళాలు చెక్కుచెదరలేదు. సాకారమైన భాషకు ఆకారాన్నిచ్చే

అక్షరాలు తమకంటూ ఒక నిర్దిష్టమైన రూపాన్ని సంతరించుకున్నాయి. అందుకే ఏ ధ్వనికైనా ఉచ్చరించే వీలు వ్రాసే అవకాశం ఉంది. సున్నాను కనిపెట్టిన ఘనత మన భారతీయులదే. ఆ ఒక్క సున్నాయే ఎన్నెన్నో అక్షరాల రూపకల్పనకు ఆధారం, కొమ్ముల గర్వం తలకట్టు సౌందర్యం ఏత్వాల, ఓత్వాల, ఐత్వాల సాంగత్యం ఒత్తుల మెత్తదనం దీర్ఘసరళత్వం గుడులతో కలిపి పలుకుబడులు నిలిపి విద్యార్థి మనసులో చెరగని ముద్రవేసుకోవాలి.

అనుసరించుమెపుడు అభ్యాసయోగమున్
అభ్యాసమున విద్యలమరునెపుడు
నిద్ర ఆకలెపుడు నినువంచనెంచును
అన్నీమరచి విద్యలందుకొనుము.

అన్నట్టు విద్యార్థులకు అభ్యాసం ఎక్కువ చేయించాలి. తెలుగు డబల్ రూల్ కాపీలలో రాయించాలి. టీచర్లు కాపీలలో పెట్టించేటప్పుడు రోజుకో రంగు పెన్నులు వాడటం వల్ల విద్యార్థికి ఆసక్తి పెరుగుతుంది. పెట్టించిన అక్షరాలను, పదాలను, వాక్యాలను క్రింది నుండే వ్రాయమనాలి. ఎందుకంటే పై నుండి రాస్తే ఉపాధ్యాయులు పెట్టించింది విద్యార్థి ఒకేసారి రాస్తాడు. ప్రతి లైను రాస్తున్నప్పుడు తాను రాసిందే చూస్తుంటారు. అందంగా రాదు. క్రింది నుండి రాస్తే ప్రతి లైను రాసేటప్పుడు టీచర్లు పెట్టించిందే చూస్తాడు కాబట్టి రాత అందంగా ఉంటుంది. తెలుగు అక్షరాలు గుండ్రంగా, సమానంగా ఉండాలి.

## అచ్చ తెనుగు అక్షరాలు అందంగా రాయాలంటే

విద్య అనే నాణానికి చదవటం, రాయటం అనేది బొమ్మ, బొరుసు లాంటివి. రెండింటిలో దేన్నీ అశ్రద్ధ చేయకూడదు. మనిషి మదిలో దాగి ఉన్న మనస్తత్వాన్ని చూడకుండా, మాట్లాడకుండా తెలుసుకోవడం చేతిరాతతోనే సాధ్యమవుతుంది. మనిషి హృదయ సౌందర్యానికి దర్పణం అతని చేతిరాత, నలుగురిలో మన ఉనికిని చాటుకోవడానికి, ఇతరులకు మనం ఆదర్శం





కావడానికి మనపై మనకు నమ్మకం ఏర్పడటానికి, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగడానికి చేతిరాత. మనకు చేయూత నిస్తుంది. ముఖ్యంగా మన మాతృభాష తెలుగు అందంగా రాయడం ఎలాగో తెలుసుకుందాం.

తెలుగు అక్షరాలు ఒకే సైజులో గుండ్రంగా ఉండాలి. వినాయకుని చేతిలోని లడ్డులాగా, అనిల్‌కుంబ్లే చేతిలోని బంతిలాగా, ఉడిపి హోటల్‌లోని పూరి, ఇడ్లీ, వడలాగా, హెడ్మాస్టర్ టేబుల్ పైన గ్లోబులాగా ఉండాలి.

ముందుగా డబుల్ రూల్ కాపీలో గుండ్రటి సున్నాలు, అరసున్నాలు దిశలు మార్చి గీయాలి.

○ ○ ○ ⊂⊂⊂ ∩∩∩ ∪∪∪ ⊃⊃⊃

పావలా, అర్ధరూపాయి బిళ్ళలతో గాని, సిరప్ మూతలతోగాని గుండాలు గీసుకొని అందులో అక్షరాలు రాయడం ప్రాక్టీసు చేయాలి. ఇలా చేస్తే ప్రతి అక్షరం సమానంగా, గుండ్రంగా ఉండి రాత అందాన్ని పెంచుతుంది. అచ్చులు, హల్లులు నుంచి ఒకే రకం గల అక్షరాలను విడిగా నేర్చుకోవాలి. ఈ ఝ ఠ ర థ ద ధ '0' సున్నాకు తలకట్టు ఇచ్చి మధ్య గీత గీస్తే ఈ. '0' సున్నాకు తలకట్టు ఇచ్చి రెండు కొమ్ములిచ్చి కింద గీత ఇస్తే ఝ '0' సున్నాకు తలకట్టు ఇచ్చి మధ్యలో చుక్కపెడితే – ఠ '0' సున్నాకు తలకట్టు ఇస్తే – ర, అన్ని సున్నాలు సమానంగా ఉండాలి. అలాగే కొద్ది మార్పులతో థ ద ధ అరసున్నతో ఒకే మాదిరిగా ఉండే అక్షరాలు ఉ ఊ ద ధ

⊂⊂⊂ ∪∪∪ అ ఆ అం అః ట ల

ఇ జ ఐ ⊃⊃⊃

అక్షరాలు ఒకే మాదిరిగా ఉన్నా మార్పును గమనించాలి. ఒ ఓ ఔ బ భ జ ఋ.

చిన్న సున్న గల అక్షరాలు రాసేటప్పుడు చాలా మంది కొన్ని అక్షరాలకు



Scanned with OKEN Scanner

పెద్ద సున్నాలు పెట్టి రాతను చెడగొడుతుంటారు. వది చిన్న సున్నాలు గల అక్షరాలు విడిగా ప్రాక్టీసు చేయాలి.

ఎ ఏ ఐ ష ప ఫ మ వ ష హ

**తలకట్టు :** అక్షరాలకు తలకట్టు ఎంతో అందాన్ని పెంచుతుంది. అందుకే వ్యక్తులకున్న తలకట్టును ఇష్టానుసారం ఎంపిక చేసుకొని సమాన సైజులో ఇవ్వాలి. ఉదాహరణకు : **కనకమహాలక్ష్మి.**

ఈ పేరులోనే ఐదు తలకట్టు ఉంటే అవి చివర్య రాస్తే ఒక పేజీలో వందల తలకట్టు వస్తాయి. అవి ఒకే సైజులో ఒకే విధంగా ఉంటే రాత అందంగా కనిపిస్తుంది. తలకట్టు సైజు అక్షరానికి పెద్దదిగా గాని, చిన్నదిగా గాని ఉండకూడదు. మనిషి తలకాయ పెద్దగా ఉన్నా బాగోదు, చిన్నగా ఉన్నా బాగుండదు. శరీరానికి తగ్గట్టుగా ఉంటే బాగుంటుంది. అలాగే అక్షరాలకు తలకట్టు కూడా.

**తలకట్టు గల అక్షరాలు :**

ఈ క గ ఘ చ ఛ ఝ ఠ డ ఢ త థ ద ధ న ప ఫ భ మ య ర వ శ ష స హ ళ క్ష

వ ఛ ఠ ళ శ అక్షరాలను డబుల్ రూల్ గీతలో మధ్య నుండి మొదలు పెట్టి రాస్తే సరిగ్గా వస్తాయి.

**గుడి :** ఈ పదం వినగానే మనకు దేవుళ్ళ గుళ్ళు గుర్తొస్తుంటాయి. కొన్ని అక్షరాలకు 'గుడి' పైన, కొన్ని అక్షరాలకు 'గుడి' డబుల్ రూల్ గీతలో, గీతలోపల ఇస్తే అక్షరాలు అందంగా ఉంటాయి.







కి గి ఘి జి టి డి ఢి పి ఫి షి సి హి

పైన గుడి కల అక్షరాలు గుడిదీర్ఘం కూడా గుడి తలపైన మధ్యలో ఇవ్వాలి. కీ గీ ఘీ జీ టీ డీ ఢీ ఠీ పీ ఫీ షీ సీ హీ క్షీ

**కొమ్ము :** అక్షరం సైజులోనే కొమ్ము గుండ్రంగా ఇవ్వాలి. కు ఖు గు ఘు చు ఛు జు ఝు. కొమ్ము దీర్ఘం, ఋత్వంగా కూడా ఇలాగే అక్షరం సైజుకు తగ్గట్టుగా ఇవ్వాలి.

**ఎత్వం :** ఎత్వం చాలా మంది అక్షరానికి ఎడమవైపు చాలా దూరం వరకు ఇస్తుంటారు. అలా కాకుండా అక్షరానికి సరిపడే ఎత్వం ఇస్తే అక్షరాలు అందంగా కనిపిస్తాయి. కె ఖె గె ఘె చె ఛె జె ఝె ఏత్వం ఐత్వాలకు కూడా ఇదే జాగ్రత్త వహించాలి.

**ఒత్వం :** ఒత్వం వంకరటింకరగా కాకుండా టికిలి బొట్టును రెండు కళ్ళ మధ్య భాగంలో ఎలా పెడతామో అలాగే ఒత్వం, ఓత్వం దీర్ఘాల మధ్య భాగాన్ని అక్షరానికి సరిగా తలపై మధ్య భాగంగా వచ్చేటట్టు రాయాలి.

కా ఖా గా ఘా చా ఛా.....

ఒక బెత్వం సరిగ్గా అక్షరాల తలపైన ఇవ్వాలి. కా గా చా జా....

**సున్న :** కం దం నం... ఇలా అక్షరం సైజులోనే పక్కన సున్నా పెట్టాలి. సున్నాతో కూడిన పదాలు ఎక్కువగా రాయడం వలన తొందరగా అందంగా రాయడం నేర్చుకోవచ్చు. ప్రతి అక్షరానికి ఒక పదం ఉదాహరణకు తీసుకొని ఆ పదం లాంటి పదేసి పదాలు రాసి సాధన చేస్తే మీ రాత కూడా అచ్చువేసినట్లుంది.

**ఒత్తులు :** ఒత్తులు అక్షరానికి - రాసే అక్షరం కంటే చిన్న సైజులో ఉండాలి.

[illegible] మాత్రమే భిన్నంగా ఉంటాయి.

ఖ జ జ ఞ ట ణ యధావిధిగానే ఉంటాయి.

తలకట్టు తీసేసి రాసే ఒత్తులు - ్గ ్ఘ ్ఝ ్డ ్ఢ ్థ ్ద ్ధ ్ష
సాగదీసి రాసే ఒత్తులు - ్చ ్ఛ ్జ ్ఫ ్బ ్భ ్శ ్స ్ళ ్క
తేనేకన్నా తీయనిది తెలుగు భాష - దేశ భాషలందు తెలుగు లెస్స

పై విధంగా అక్షరాలను సాధన చేసి, చక్కని చేతిరాత అలవరచుకుంటే, అది చూడచక్కగా ఉండి అందరూ మెచ్చుకోవటమే కాదు, పరీక్షలలోనూ మీకు మరిన్ని ఎక్కువ మార్కులు వస్తాయి. మరి అక్షరాలను పై విధంగా సాధన చేస్తారుగా....





# అనుబంధము

ఒకనాడు పొద్దు వాలుతున్న వేళకు, తాబేలు, కాకి, ఎలుక ఒక చోటికి చేరాయి. కాని, మేతకు వెళ్లిన జింక ఇంకా రాలేదు. ఎందుకు రాలేదో తెలియక మిత్రుడికోసం కలతపడుతున్నాయి. ఏం చేయాలో తెలియలేదు. త్వరత్వరగా చీకటి ముసురుతూ ఉన్నది. తాబేలు గబగబా పాకి వెళ్ళలేదు. చిత్రాంగుణ్ణి ఎటు పోయి వెదకాలో ఎలుకకు తెలియడం లేదు. కాకి మనసులో తళుక్కున ఒక ఉపాయం మెరిసింది. అప్పుడది రెక్కలు విప్పింది. చటుక్కున లేచింది. గబుక్కున పైకి చూసింది. రివ్వున ఎగిరింది. ఎగురుతూ, కళ్ళు విప్పార్చి ఇటూ, అటూ చూస్తూనే ఉన్నది. ఒకచోట దాని చూపు నిలిచింది. హఠాత్తుగా కిందికి దిగింది. వలలో చిక్కుకున్న జింకను చూసింది. బయటకు రాలేక అల్లాడిపోతున్న నేస్తాన్ని చూసి దుఃఖించింది. చిత్రాంగుడి దగ్గరకు వెళ్ళింది.

"ఎంత ప్రమాదం జరిగింది చిత్రాంగా ! నీలాంటి మంచివాడికి రావలసిన అపాయం కాదిది. కానీ, ముందుగా నువ్వు ఈ ఆపద నుంచి బయటపడాలి" అన్నది.

వెంటనే జింక, "ఎలుక ఇక్కడికి వచ్చి ఈ వలను కొరికేస్తే నేను బయటపడతాను," అన్నది.

"ఔను ! వేటగాడు రాకముందే ఎలుకను తీసుకురావాలి. నువ్వు బయటపడాలి. నేనిప్పుడే పోయి ఎలుక నేస్తాన్ని తీసుకొస్తాను" అని వెంటనే ఎగిరిపోయింది. చిత్రాంగుడు ఎక్కువ సేపు ఎదురుచూసే అవసరం లేకుండానే లఘుపతనకం తిరిగి వచ్చి వల దగ్గర వాలింది. దాని వీపు మీది నుండి హిరణ్యకం గబుక్కున కిందికి ఉరికి వలతాళ్లు కొరికింది. ఒకవైపు తాళ్ళు కొరకగానే జింక బయటికి వచ్చింది.

సంతోషంగా స్నేహితులు ముగ్గురూ తిరుగు ప్రయాణం సాగించారు." ఇంత పెద్ద ఆపదలో నువ్వెందుకు చిక్కుకున్నావు ? కొంచెం జాగ్రత్తగా ఉండాలి కదా !" అని అన్నది ఎలుక.

ఆ మాటకు జింక, "ఎంత జాగ్రత్తగా ఉన్నా ఒక్కొక్కప్పుడు అపాయం తప్పదు మిత్రమా ! నా జీవితంలో ఇంతవరకు ఎన్నో అపాయాలు వచ్చాయి. నాకు ఆరు నెలలు వయస్సున్నప్పుడు ఒక వేటగాడి ఉచ్చులో చిక్కుకున్నాను.





వాడు నన్ను ఆ దేశపు రాజకుమారునికి కానుకగా ఇచ్చాడు. రాజుగారి కోటలో నన్నందరూ ముద్దుచేసేవారు. నాకెంతో స్వేచ్ఛనిచ్చారు. నేను నా ఇష్టం వచ్చినచోటికి తిరిగేదాన్ని. నలుగురు కూర్చొని మాట్లాడుకుంటున్నప్పుడు పక్కన కూర్చొని వినేదాన్ని. నేను కూడా వాళ్లలాగే మాట్లాడడానికి ప్రయత్నం చేసేదాన్ని.

"ఒకనాడు నేను రాజభవనంలో నుంచి బయటకు వచ్చి వీధిలో తిరుగుతూ ఉంటే, కొంతమంది పిల్లలు నా వెంటపడి నన్ను ముందుకు తరిమారు. నేనెంతో భయపడ్డాను. ఒక పూలతోట కంచె మీది నుంచి లోపలికి దూకాను. ఆ తోటలో ఆ సమయంలో అంతఃపుర స్త్రీలు విహరిస్తున్నారు. వాళ్లు నన్ను పట్టుకొని రాజకుమారుని పడకటింటికి దగ్గరగా స్తంభానికి కట్టేశారు. ఆనాటి రాత్రి కళ్ళు మిరుమిట్లు గొలిపే మెరుపులతో చెవులు బద్దలయ్యేటంత ఉరుములతో కుండపోత వాన కురిసింది. నామీద కూడా వాన చినుకులు పడ్డాయి. చల్లని గాలి వీస్తూ ఉన్నది. అప్పుడు నా చిన్నప్పుడు పరుగులు తీసిన అడవి గుర్తుకు వచ్చింది. నన్ను కన్నవాళ్ళు నా స్నేహితులు గుర్తుకు వచ్చారు. ఇలాంటప్పుడు నేను వాళ్ళతో కలిసి ఉంటే ఎంత బాగుండునో అనుకున్నాను. ఆ మాట నేను నేర్చిన మానవ భాషలో అన్నాను. నన్ను పెంచుకున్న రాజకుమారుడు నా మాటలు విన్నాడు. ఆశ్చర్యపోయాడు. ఈ వింతను కొలువు కూటంలో చెప్పాడు. పెద్దల సూచన ప్రకారంగా నన్ను అడవిలో విడిచిపెట్టమని తన సేవకులకు చెప్పాడు.

ఈ విధంగా మళ్ళీ నేను పుట్టిన అడవికి వచ్చాను. స్వేచ్ఛగా బతికాను. ఒక వేటగాడు తరుముతుండగా బెదిరి మీ దగ్గరికి వచ్చాను. తరవాతి సంగతి అంతా మీకు తెలిసిందే".

చిత్రాంగుడు, హిరణ్యకం, లఘుపతనకం మాట్లాడుకుంటూ మెల్లగా తిరిగివస్తూ ఉండగా మంథరకం ఎదురుపడింది. స్నేహితులను చూసి ఊపిరి పీల్చుకుంది. కానీ ఎలుక మాత్రం తాబేలును కోప్పడింది, "ఏం కొంప మునిగిపోయిందని వచ్చావు నువ్వు ? మేం వస్తూనే ఉన్నాం గదా ?" అన్నది.

వీళ్ళ సంభాషణ ఇట్లా సాగుతుండగానే వేటగాడు అటువైపు రావడం కాకి చూసింది. వేటగాడు వస్తున్నాడు, పదిపదిగా నడువండని స్నేహితులను



Scanned with OKEN Scanner

కాకి తొందరపెట్టింది. ఇంతలో వేటగాడు రానే వచ్చాడు. ఎలుక కలుగులోకి దూరింది. జింక దాక్కున్నది. తాబేలు మాత్రం భయంతో నిలిచిపోయింది. వేటగాడు దగ్గరకు వచ్చాడు. దాన్ని పట్టుకొని వింటికి కట్టుకున్నాడు. ఉన్నట్టుండి ఇంకో ఉపద్రవం వచ్చినందుకు స్నేహితులంతా నివ్వెరపోయారు.

మిగిలిన ముగ్గురు స్నేహితులూ వెంటనే చురుగ్గా ఆలోచించారు. ఎలుక ఒక ఉపాయం చెప్పింది. ఆ ఉపాయం ప్రకారం కొంతదూరంలో, వేటగాడు వెళ్ళే దారిలో ఒక చెరువు దగ్గర జింక చచ్చినదానిలా పడి ఉంటే కాకి జింకమీద వాలి దాని కళ్ళు పొడుచుకొని తింటున్నట్టు నటిస్తూ ఉన్నది. వేటగాడది చూసి ఎదురుగా జింక దొరికినందుకు మురిశాడు. జింకను భుజానికెత్తుకుందామని తాబేలును కింద పెట్టి జింకవైపు నడిచాడు. అది చూసి ఎలుక తాళ్ళను కొరికింది. తాబేలు మడుగులోకి జారింది. ఎలుక కలుగులో దూరింది. కాకి కావ్ మంటూ ఎగిరింది. జింక చెంగున ఉరికింది.





## పల్లెటూరి పిల్లగాడా ! (పాట)

పల్లెటూరి పిల్లగాడ
పసులగాచే మొనగాడ
పాలుమరచి ఎన్నాళ్ళయిందో ఓ పాలబుగ్గల జీతగాడ
కొలువు కుదిరి ఎన్నాళ్ళయిందో

చాలిచాలని చింపులంగి
సగము ఖాళీ చల్లగాలి
గోనెచింపు కొప్పెర పెట్టావా ఓ పాలబుగ్గల జీతగాడ
దానికి చిల్లులెన్నో లెక్కపెట్టావా

తాటిజెగ్గలా కాలిజోడు
తప్పటడుగుల నడకతీరు
బాటతో పని లేకుంటయ్యిందా ఓ పాలబుగ్గల జీతగాడ
చేతికర్రే తోడైపోయిందా

గుంపు తరలే వొంపులోకి
కూరుచున్నవు గుండు మీద
దొడ్డికీవే దొరవై పోయావా ఓ పాలబుగ్గల జీతగాడ
దొంగ గొడ్ల నడ్డగించేవా

కాలువై కన్నీరుగార
కండ్లపై రెండు చేతులాడ
వెక్కి వెక్కి ఏడ్చుచున్నావా ఓ పాలబుగ్గల జీతగాడ
ఎవ్వరేమన్నారో చెప్పేవా

పెందలాడ అమ్మనీకు
పెట్టలేదా సద్దికూడు
ఆకలిగొని అడలుచున్నావా ఓ పాలబుగ్గల జీతగాడ
అడవి తిరిగి అలిసిపోయావా



Scanned with OKEN Scanner

ఆకుతేల్లు కందిరీగలు
అడవిలో గల కీటకాదులు
నీకేమైన కాటువేశాయా ఓ పాలబుగ్గల జీతగాడ
నిజము దాచక నాతో చెప్పేవా

మాయదారి ఆవుదూడలు
మాటిమాటికి కంచె దుంకీ
పంట చేలూ పాడు చేశాయా ఓ పాలబుగ్గల జీతగాడ
పాలికాపు నిన్నే కొట్టాడా

నీకు జీతం నెలకు కుంచం
తాలు వరిపిడి కల్తిగాసం
కొలువగా సేరు తక్కువ వచ్చిందా ఓ పాలబుగ్గల జీతగాడ
తలుచుకుంటే దుఃఖ మొచ్చిందా

పాఠశాల ముందుచేరి
తోటి బాలుర తొంగి చూసి
ఏటికోయీ వెలవెలబోతావు ఓ పాలబుగ్గల జీతగాడ
వెలుగులేని జీవితమంటావా





## కాపాడుకుందాం (సంభాషణ)

పాఠంలోని పాత్రలు : అన్నమ్మ - అమ్మమ్మ
నర్సయ్య - తాత
గోపాల్ - మనుమడు
లక్ష్మి - మనుమరాలు

అన్నమ్మ : అరేయ్ గోపాల్ ఇట్రా ! కోతిలెక్క చెంగచెంగ ఎగురుతున్నవ్. నీకో కోతి పాట వినిపిస్తా.

గోపాల్ : కోతి పాటనా ? జల్ది పాడవా

అన్నమ్మ : తోకవాయె కత్తి వచ్చె ధాం ధాం ధాం
కత్తివాయె పండు వచ్చె ధాం ధాం ధాం
పండువాయె కుండ వచ్చె ధాం ధాం ధాం
కుండవాయె బొమ్మ వచ్చె ధాం ధాం ధాం
బొమ్మవాయె డప్పు వచ్చె ధాం ధాం ధాం
డప్పువాయె సల్ల వచ్చె ధాం ధాం ధాం
సల్లవాయె పిల్ల వచ్చె ధాం ధాం ధాం

గోపాల్ : అబ్బో నీ పాట జోరుగున్నది. కోతి గూడ వింటున్నది.

అన్నమ్మ : కోతా ! ఏడ ?

గోపాల్ : అగో పెరట్ల ఉన్నది - అగో అటురుకుతున్నది

లక్ష్మి : అయ్యో ! ఓ కోతి గిన్నెత్తుకపోతున్నదే. ఇంకో కోతి నువ్వులను ఎత్తుకపోయి పెరట్ల చల్లుతున్నదే.

అన్నమ్మ : అయ్యో ! రామ ! రామ ! ఈ నడుమ కోతులు, గుడ్డేలుగులు, ఇండ్లల్లకు వస్తున్నై. కొట్టు ! కొట్టూ ! మీ తాతకు జెప్పు. బంగారమసొంటి నువ్వులను పాడుజేసె. అసలే ధరలు మండిపోతున్నై.

లక్ష్మి : గిన్నెల అప్పాలన్నీ పట్టుకపోయి కోతి ఇంటి మీద కూసోని తింటున్నది.

నర్సయ్య : (కట్టె పట్టుకొని) నడుప్. లే లే నడుప్.

గోపాల్ : అమ్మమ్మ నాకొక అప్ప ఇయ్యవా.

నర్సయ్య : ఇంకా అప్పాలెక్కడున్నయి ? అప్పాల గిన్నెకుగిన్నె కోతి ఎత్తుకపోయింది.

అన్నమ్మ : ఏం కోతులయ్య, మునుపు కోతులు తోటల్లనో అడవుల్లనో ఉండేవి.

గోపాల్ : మరిప్పుడు ఇండ్లల్లకెందుకు వస్తున్నై ?

లక్ష్మి : మరి మనం అడవులను కొట్టివేస్తున్నం కదా !

అన్నమ్మ : ఔనౌను ! ఆ జంతువులు ఉండాల్సిన అన్ని జాగల్లో మనిషి ఉండేటందుకు పోతున్నడు.

గోపాల్ : అందుకేనా మొన్నొక చిరుతపులి కూడా ఊర్లోకి వచ్చినట్టు టీవీల చూసిన.

లక్ష్మి : చిరుతపులేం ఖర్మ ! నక్కలు, తోడేళ్ళు, పులులు, సింహాలు ఇట్లా అన్నీ ఊర్లల్లోకి వస్తున్నై అని పేపర్లల్ల, టీవీలల్ల వార్తలు చూస్తనే ఉన్నం గదా !

గోపాల్ : మా దోస్తు వాళ్ల నాయన సెల్‌ఫోన్‌ను కూడ కోతులు ఎత్తుకపోయి నీళ్లల్ల పారేసినయట.

లక్ష్మి : మనం అడవులను నాశనం చేసుకుంట పోతె ఇంకా భయపడే కాలం వస్తది.

గోపాల్ : ఎందుకట్లంటున్నవ్.

నర్సయ్య : అనుడేందిరా, లక్ష్మి సరిగ్గనే చెప్పింది. ఇవాలరేపట్ల మనిషికి ఆశలు ఎక్కువై ప్రకృతినంత పాడుజేస్తున్నడు. కనీసం తన ఇంట్ల కూడ చెట్లను పెంచుతలేడు.

అన్నమ్మ : అడవులు లేకుండ చేస్తున్నరు కాబట్టే వానకాలంల వానలొస్తలేవు. ఎండాకాలం ఎండలకు ఉండలేకపోతున్నం.





కాలంగాని కాలంల వానలు పడ్తున్నయ్. ఎండలు కొడ్తున్నయ్.

గోపాల్ : ఔను ! మన ఊర్లోని పెద్ద చెరువు ఎప్పుడు ఎండిపోదని నువ్వు చెప్పినవ్ కదా ! మరి ఈ సంవత్సరం ఎందుకు ఎండిపోయిందే అమ్మమ్మా ?

అన్నమ్మ : మా తాతల నాటి నుంచి అది ఎండిపోయిన దాఖలాలు లేవు. మరిప్పుడు ఎండిపోయింది. చెరువును ఎవరిష్టం వచ్చినట్టు వాళ్లు వాడుతుంటే ఏమైతది మరి ?

లక్ష్మి : మన ఊర్ల చెరువు జాగనంత కబ్జా చేసుకుంటపోయి పెద్ద చెరువును చిన్న చెరువు చేసిరి. అందుకే ఈ గతి వచ్చింది.

గోపాల్ : చెరువుల ఉండే జీవులన్ని చచ్చిపోయినట్లేనా ?

నర్సయ్య : అంతేగదమరి ! చెరువులనే కాదు మనం చేసే పనులతోటి బావులల్ల, నదులల్ల జీవులు కూడా లేకుండా పోతున్నై.

గోపాల్ : ఒక్క చేపలే కదా.

లక్ష్మి : నీ మొహం. ఒక్క చేపలే కాదురా ! కప్పలు, తాబేళ్ళు, రొయ్యలు ఇట్ల ఎన్నో జీవులకు కష్టకాలమొచ్చింది.

గోపాల్ : నదుల నీళ్లు స్వచ్ఛమైన వంటరు గదా ! మరి మల్లెందుకు శుభ్రం చేయాలని అంటున్నరు.

నర్సయ్య : నదుల నీళ్లు మంచివే గానీ, మన కర్మాగారాల్లోని పాడునీళ్లను, మన స్నానాల పేరిట సబ్బునీళ్లను, బట్టలు ఉతికిన మురికి నీళ్లను, నూనె పదార్థాలను....

గోపాల్ : ఆ... ఆ.... పశువులను కడిగిన నీళ్లను, రసాయనాలతో, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన విగ్రహాలను, ప్లాస్టిక్ పదార్థాలను వాటిలో వదిలిపెడ్తున్నం గదా !

లక్ష్మి : అందుకే నీళ్ల శుభ్రత పాయె. మనకు తీరొక్క రోగాలు రావట్టె.

అన్నమ్మ : ఏవయ్యా ! మన చెరువు కట్టమీద రకరకాల పిట్టలు కనబడేవి. ఇప్పుడు చాలా వరకు కనబడుతనే లేవు ఎందుకో ?



Scanned with OKEN Scanner

లక్ష్మి : నేను చెప్తా ఎందుకు కనబడుతలేవో.

గోపాల్ : అగో సెల్ రింగైతున్నది.

లక్ష్మి : ఇగో ఈ సెల్‌ఫోన్లే పక్షులను లేకుండా చేస్తున్నయ్

గోపాల్ : నీకేమన్న పిచ్చిపట్టిందా? సెల్‌ఫోన్లకు పక్షులకు ఏం సంబంధం?

లక్ష్మి : నాక్కాదు పిచ్చి నీకే పిచ్చి. సెల్‌ఫోన్లల్ల మాట్లాడడానికి సిగ్నల్స్ ఎక్కడి నుంచి వస్తున్నయ్?

గోపాల్ : టవర్ నుంచి

లక్ష్మి : ఎక్కడికక్కడ సెల్‌టవర్లు పెట్టడంతో వాటి నుంచి వచ్చే తరంగ శక్తిని తట్టుకోలేక అనేక పక్షులు చచ్చిపోతున్నవట !

అన్నమ్మ : ఓ పక్క అడవులు లేకపాయే ! నదులు, చెరువులు ఎండిపాయే! జనం మధ్యలో సెల్‌టవర్లాయే ! ఇగ ఎట్ల బతుకుతయ్.

గోపాల్ : తాతా ! పొగతోటి గూడా కొన్ని జీవులు చచ్చిపోతున్నవట నిజమేనా?

నర్సయ్య : అవును నిజమే. ఆ జీవుల్లో మనం కూడ ఉన్నం.

గోపాల్ : మనమెట్లుంటం ?

నర్సయ్య : ఇంట్లోంచి బయట కాలుపెడ్తే చాలు. ఏదో ఒక పొగ మన శరీరంలోకి పోతనే ఉన్నది.

లక్ష్మి : వాహనాల పొగ, ఫ్యాక్టరీల పొగ, ప్లాస్టిక్ చెత్తను కాల్చడంతో వచ్చే పొగ, సిగరెట్లు, బీడీల పొగ.. అన్ని పొగలేనాయె.

గోపాల్ : మనం బతుకుతలేం మిగతా జీవులను బతకనిస్తలేం.

అన్నమ్మ : గోపాల్ మంచిగ చెప్పిండయ్యా

గోపాల్ : మంచిగ చెప్పిన అన్నవ్ గదా ! నేను టీవీల పాటలు పెట్టుకుంటా

అన్నమ్మ : అబ్బా నీ దయరా ! అది మాత్రం వద్దు

లక్ష్మి : ఎందుకు వద్దంటున్నవ్ అమ్మమ్మా ?

అన్నమ్మ : మీరు చెవులు చిల్లులుపడేటట్టు, ఇంటి పెంకులు ఎగిరి పోయేటట్టు సౌండు పెట్టుకుంటరు.





నర్సయ్య : చెవులు గిల్లుమనేటట్టు, ఇంటి పెంకులు ఎగిరిపోయేటట్టు సౌండు పెట్టుకుంటరు.

అన్నమ్మ : ఏం మజా? ఏం సంబురం? మొన్న మనకాడ డాక్టరు చెప్పంగ విన్న

నర్సయ్య : ఏం విన్నవు ?

అన్నమ్మ : పెద్ద పెద్ద చప్పుళ్ళ తోటి చెవులకు వినే శక్తి తగ్గుతదట !

లక్ష్మి : నిజమే, రోడ్డు మీద వాహనాల చప్పుళ్ళు పెద్ద పెద్ద కార్ఖానాల చప్పుళ్ళు, బోర్లు వేసేటప్పుడు వచ్చే చప్పుళ్ళు...

గోపాల్ : డి.జె. సౌండ్స్ కూడానా ?

నర్సయ్య : కూడానా ఏంది ? అదో పెద్ద దరిద్రం, నిద్రపోనియ్యవు. తిండి తిననియ్యవు. మనుషుల్ని మనుషులుగా ఉండనియ్యవు. సమయం వృథా చేస్తయి.

అన్నమ్మ : డి.జె. అంటే ఏంటిదయ్యా ?

నర్సయ్య : గదే మొన్న రంగయ్య కొడుకు లగ్గమప్పుడు పెద్ద సౌండు పెట్టుకొని ఎగురలేదా ! గదే !

అన్నమ్మ : దాంతోటే గద ! నా చెవులు పాడైనయని డాక్టరు చెప్పిండు.

నర్సయ్య : ఈ పోరగాండ్లకు తెలువదాయె. చెబితే వినరాయే. మరేం జేసుడు.

అన్నమ్మ : ఎందుకు తెల్వది ? అప్పట్నించి వీళ్లిద్దరు అన్ని ముచ్చట్లు చెబుతనే ఉన్నరు గద !

గోపాల్ : చెపితే ఇగ మేం ఎగురొద్దు, దుంకొద్దా ఏంది ?

నర్సయ్య : ఎందో సంబురానికి అట్ల చేస్తరు.

అన్నమ్మ : ఇదేం సంబురం ? ప్రాణం పొయ్యే సంబురం. మంచి నీళ్లు వాయె. మంచిగాలి వాయె, జంతువులు వాయె, పక్షులు వాయె. అఖర్న మనం గూడ సక్కగా సుఖంగా ఉండలేకపోతిమి. ఇగ ఎందుకివన్నీ.



Scanned with OKEN Scanner

నర్సయ్య : గంత కోపమెందుకే ?

లక్ష్మి : అమ్మమ్మ చెప్పింది నిజమే ! ఎక్కడ చూసిన స్వచ్ఛత లేదు. అంతా కాలుష్యమే. ఇల్లు కాలుష్యమే, బళ్ళు కాలుష్యమే. ఒళ్ళు గుళ్ళు, రోడ్లు ఊర్లకూర్లు పట్నాలకు పట్నాలు... అన్నీ అంతా కాలుష్యమే.

గోపాల్ : మన పనులతోనె అంటవా. కాని నువ్వు బోర్ల సౌండుతో కష్టమైతున్నదని అంటివి. మరి నీళ్లెట్ల రావాలె.

లక్ష్మి : ఓ పిచ్చి మొహమా ! చెఱువులు, బావులు, నదులు ఇవన్నీ నీళ్ళతోటి కలకలలాడితే నీళ్ళకేం కష్టం.

గోపాల్ : చెరువులు, నదులంటే పోనీ బావులెందుకు ఎండిపోతున్నయ్.

నర్సయ్య : మీ మోటర్లన్నీ బుర్రుబుర్రున పోవటానికి ఎత్తుకెత్తు రోడ్లన్ని ఊర్లనిండా వేయవట్టిరి. ఇసుమంత జాగ విడిచిపెట్టకుండా ఇళ్లు కట్టవట్టిరి. ఇంటి ముందు గచ్చాయె. ఇంటెనుక గచ్చాయె.

అన్నమ్మ : అందుకే నీళ్లన్నీ మోరీల్లోకి పోతున్నయ్. మోర్లు కూడా సిమెంట్‌వేనాయె. ఒక్క నీటి చుక్క కూడా భూమి లోపలికి ఇంకుతలేదాయె !

గోపాల్ : అందుకే బావులు ఎండిపోతున్నయా ?

నర్సయ్య : ఎనుకట, బావులల్ల నీళ్లు ఎప్పుడుండాలని ఊర్లల్ల, చుట్టుపక్కల, కోనేర్లు, చెరువులు, కుంటలు కట్టినరు. అవన్ని ఇప్పుడు తీసేయవట్టిరి.

అన్నమ్మ : మరి ఆ బావులల్ల నీళ్లు ఏడికెళ్లుంటయ్ ? నీళ్ల కొరకు ఫీట్లకుఫీట్లు మిషన్లకు భూమిలోకి దించవట్టిరి.

నర్సయ్య : దాంతోటి భూమి అదిలిపోతున్నది. జంతువులు, పిట్టలు, పాములు, తేళ్ళు భయంతోటి అల్లాడవట్టె.

లక్ష్మి : మనకు గూడా రాత్రి నిద్రరాదు. పగలు నడువరాదు. అంతా భయం భయమే.

గోపాల్ : మన ప్రకృతిని మనమే పాడుజేసుకుంటున్నం.





అన్నమ్మ : గోపి మంచిగనే సోయి తెచ్చుకుంటున్నడు.

నర్సయ్య : ఔను

గోపాల్ : అమ్మమ్మ నువ్వు కోతి పాట పాడినవు గదా ! నేనో పాట పాడుత విను.

పాట : అడవుల్ని పెంచాలె
జంతువులనుంచాలె దుబుదుక్కుదుండుం
నీళ్ళన్ని ఇంకాలె
బావులను పెంచాలె దుబుదుక్కుదుండుం
చెరువులను చెరపొద్దు
నదిలోకి చెడులొద్దు దుబుదుక్కుదుండుం
పిట్టలూ ఎగరాలె
చెట్లపై నుండాలె దుబుదుక్కుదుండుం
చప్పుళ్లు తగ్గాలె
శాంతింత పెరగాలె దుబుదుక్కుదుండుం
పొగలన్ని పోవాలె
సెగలన్ని తగ్గాలె దుబుదుక్కుదుండుం
మంచి గాలి రావాలె
రోగాలన్ని పోవాలె దుబుదుక్కుదుండుం
జీవులన్నుండాలె
జగమంత మెరువాలె దుబుదుక్కుదుండుం
ఆనందం పొంగాలె
సంతోషం నిండాలె దుబుదుక్కుదుండుం



Scanned with OKEN Scanner

## రాణి శంకరమ్మ (బతుకమ్మ పాట) - గేయకథ

వీర తెలంగాణా
మన శౌర్య తెలంగాణా
మన ధైర్య తెలంగాణా
మన భాష తెలంగాణా
మన వాణి తెలంగాణా
మన బాణి తెలంగాణా
మన శ్వాస తెలంగాణా
మన ధ్యాస తెలంగాణా

తెలంగాణ అంటేనే ఒక ప్రత్యేక ఉనికి. విశిష్ట సంస్కృతి. ఉద్యమాలకు పుట్టినిల్లు. తెలంగాణలోని ప్రతిగ్రామం ఒక వీరునికో, ఒక కళాకారునికో, ఒక కవికో, ఒక గాయకునికో ఏదో ఒక రంగానికి చెందిన గొప్పవారికో జన్మనిచ్చింది. ఈ విషయంలో నాటి గౌతమీ బాలాశ్రీ మొదలుకొని నేటివరకు అనేక మంది స్త్రీలకు కూడా ప్రసిద్ధస్థానముంది.

**రగిలించే పౌరుషాగ్ని తెలంగాణా**
**కదిలించే హృదయ దీప్తి తెలంగాణా**
**త్యాగాలకు మారుపేరు తెలంగాణా**
**వీరులకు పుట్టినిల్లు తెలంగాణా**

ఇంత ప్రాధాన్యాత సంతరించుకున్న తెలంగాణలో మెతుకుసీమ సిగలో విరిసిన శౌర్య పారిజాతం రాణిశంకరమ్మ. ఈమె నేటి మెదక్‌జిల్లాలోని అందోలును రాజధానిగా చేసుకొని రాజ్యం చేసింది. శత్రువులకు సింహ స్వప్నమైంది. ప్రజలకు ఆరాధ్యదేవతైంది. నేటికీ ఈమె గురించిన కథలు పాటలుగా, గాథలుగా చెప్పుకుంటారు పల్లె ప్రజలు. బతుకమ్మ పాటల్లో కూడా ఈమె చరిత్రను పాడుకుంటారు. ఆ చరిత్ర ఎట్లా ఉన్నదో చూద్దాం !

శౌర్యశంకారమ్మ ఉయ్యాలో - రాణి శంకారమ్మ ఉయ్యాలో
శూరశంకారమ్మ ఉయ్యాలో - ధైర్య శంకారమ్మ ఉయ్యాలో
రాయబాగిని గాథ ఉయ్యాలో - కొదుమ సింగపు గాథ ఉయ్యాలో





సుద్దులూ వినరండి ఉయ్యాలో - కొదువలేకా వినుడు ఉయ్యాలో
పల్లెలో పుట్టింది ఉయ్యాలో - పల్లెలో పెరిగింది ఉయ్యాలో
పల్లెటూర్లో నుండి ఉయ్యాలో - పట్నాని కెదిగింది ఉయ్యాలో
అందాలు సిల్కింది ఉయ్యాలో - అందలాలెక్కింది ఉయ్యాలో
కనగ శంకారమ్మ ఉయ్యాలో - కన్నతల్లీ మనకు ఉయ్యాలో
గౌడి చర్లాలోన ఉయ్యాలో - కాపోళ్ళ గల్లిలో ఉయ్యాలో
పాడిపంటలు గల్ల ఉయ్యాలో - రైతు సంగారెడ్డికీ ఉయ్యాలో
రాజమ్మ తల్లీ ఉయ్యాలో - అపర లచ్మీవోలె ఉయ్యాలో
అపర రుద్రమ వోలె ఉయ్యాలో - అపరంజి బొమ్మోలె ఉయ్యాలో
అవతరించీనాది ఉయ్యాలో - ఆది శంకారమ్మ ఉయ్యాలో
సుగుణాల పట్టిరా ఉయ్యాలో - గారాల పట్టిరా ఉయ్యాలో
ఆటపాటల్లోన ఉయ్యాలో - మేటిగా నిల్చెరా ఉయ్యాలో
బండరాళ్ళను గూడ ఉయ్యాలో - పిండిగా జేసెనూ ఉయ్యాలో
కండ బలమూ గల్గి ఉయ్యాలో - గుండె బలమూ కల్గి ఉయ్యాలో
సదువు సందెల్లోన ఉయ్యాలో - సక్కగా నుండెరా ఉయ్యాలో
శౌర్యశంకారమ్మ ఉయ్యాలో - రాణి శంకారమ్మ ఉయ్యాలో
రాయబాగిని కథ ఉయ్యాలో - రమ్యంగా వినరండి ఉయ్యాలో
మగరాయనివోలె ఉయ్యాలో - పంచెనూ కట్టురా ఉయ్యాలో
కర్ర తిప్పుటలోన ఉయ్యాలో - కత్తి పట్టుటలోన ఉయ్యాలో
నాగల్ని పట్టుట్ల ఉయ్యాలో - బండినీ తోలుట్ల ఉయ్యాలో
ఆరితేరినాది ఉయ్యాలో - అన్ని విద్దెల్లోన ఉయ్యాలో
మీసాలు లేకున్న ఉయ్యాలో - రోసమును సూపురా ఉయ్యాలో
పదుగురూ ఎదురైన ఉయ్యాలో - పడగొట్టి తన్నురాఉయ్యాలో
ధైర్యలచ్మీ దేవి ఉయ్యాలో - రాణి శంకారమ్మ ఉయ్యాలో

ఈ విధంగా ఎదుగుతున్న శంకరమ్మ ఒకసారి గౌడిచర్ల ప్రాంతంలో ఒక చిరుతపులితో కలెబడింది. చిరుత గాండ్రిస్తూ తన పంజా విసురుతున్నా

భయపడలేదు. కట్టెతో పులిని కొడ్తూ ధైర్యంగా ఎదుర్కొన్నది. చిరుతపులిని కాలితో తొక్కింది. దానిని చంపివేసింది. తాను చాలా అలిసిపోయింది. ఐనా అతి కష్టంతో తన తండ్రికి సద్దిగంపును తలపైనెత్తుకొని తీసుకుపోతున్నది అప్పుడు....

ఒక్క గంపాలోన ఉయ్యాలో - సద్దిమూటను వెట్టి ఉయ్యాలో
పొద్దెక్కి నాదంచు ఉయ్యాలో - చేను కాడికి పోంగ ఉయ్యాలో
పూని నడుచూచుండె ఉయ్యాలో - రాణి శంకారమ్మ ఉయ్యాలో
వేసంగి కాలాన ఉయ్యాలో - ఎండవేడిమి పెరిగె ఉయ్యాలో
అల్లంత దూరాన ఉయ్యాలో - అగుపించె నొక్కడూ ఉయ్యాలో
గుర్రాన్ని తోలుతూ ఉయ్యాలో - అటు ఇటూ తిరుగుతూ ఉయ్యాలో
ఆకలి దప్పులతో ఉయ్యాలో - అలమటించూచుండె ఉయ్యాలో
శంకారమ్మా చూసి ఉయ్యాలో - చెంతకేగీనాది ఉయ్యాలో
మంచి నీళ్లందించి ఉయ్యాలో - అంబలిని, సంకటిని ఉయ్యాలో
అతనికీ ఇచ్చిందీ ఉయ్యాలో - ఆకలినీ తీర్చింది ఉయ్యాలో
ఈ రీతి శంకారమ్మ ఉయ్యాలో - సేద తీర్చినాది ఉయ్యాలో
నారసింహారెడ్డి ఉయ్యాలో - సంతోషభరితుడై ఉయ్యాలో
అమ్మ నీ వెవ్వరవు ఉయ్యాలో - అన్నపూర్ణవు నీవు ఉయ్యాలో
అమృతాన్నము నిచ్చి ఉయ్యాలో - ఆకలిని తీర్చితివి ఉయ్యాలో
ఇదిగొ తీసుకోమంచు ఉయ్యాలో - ఉంగరము నిచ్చెను ఉయ్యాలో
అప్పుడూ శంకరమ్మ ఉయ్యాలో - ఈ రీతిగా బల్కె ఉయ్యాలో
నువ్వెవరివో గాని ఉయ్యాలో - వేయి దండాలయ్య ఉయ్యాలో
ఉంగరం గింగరం ఉయ్యాలో - నాకేమీ వద్దయ్య ఉయ్యాలో
ఈ ఉంగరం జూస్తేను ఉయ్యాలో - మా అయ్య మా అవ్వ ఉయ్యాలో
తప్పు జేసిన వంచు ఉయ్యాలో - కోదండమేతురూ ఉయ్యాలో
అమ్మలక్కలంత ఉయ్యాలో - నిందలూ వేతురూ ఉయ్యాలో
నాకొద్దు నా కొద్దు ఉయ్యాలో - ఈ ఉంగారమ్ము ఉయ్యాలో
అనుచు దిగ్గున లేచి ఉయ్యాలో - లేడోలె పరుగెత్తెఉయ్యాలో





ఇట్లా ఇతరులకు సహాయం చేయడంలో కూడా రాణి శంకరమ్మ ఎప్పుడూ ముందుండేది. ఈ పాటలో ఉన్న నారసింహారెడ్డ అందోలు రాజు. ఆయన శంకరమ్మ చేసిన సహాయాన్ని మరిచిపోకుండేవాడు. ఎప్పుడూ ఆమెను గుర్తుకు తెచ్చుకుంటుండేవాడు. చివరకు సంగారెడ్డి దంపతుల వద్దకు మంత్రులతో పెండ్లి రాయబారాన్ని పంపాడు. సంగారెడ్డి దంపతులు సంతోషంతో శంకరమ్మను నారసింహారెడ్డి కిచ్చి ఘనంగా పెండ్లిచేశారు. శంకరమ్మ నారసింహారెడ్డిని రాజ్యపాలన చక్కగా చేయమని రాజధర్మాన్ని చెప్పింది. అదెట్లా ఉందో చూద్దాం.

పెండ్లి పూర్తైనంక ఉయ్యాలో - రాచకార్యాల్విడిచి ఉయ్యాలో
రాజరికము మరిచె ఉయ్యాలో - నారసింహారెడ్డి ఉయ్యాలో
అదే అదనుగా ఉయ్యాలో - సిద్దిఖీ సోదరులు ఉయ్యాలో
కుట్రలూ పన్నిరీ ఉయ్యాలో - కుతంత్రాలు జేసిరి ఉయ్యాలో
ప్రజలనూ పీడించి ఉయ్యాలో - పన్నులూ లాగిరీ ఉయ్యాలో
ఈ సంగతిని తెల్పిరీ ఉయ్యాలో - రాజు నర్సింహారెడ్డికీ ఉయ్యాలో
ఉలుకు పలుకూ లేని ఉయ్యాలో - పెనిమిటిని చూసి ఉయ్యాలో
శంకరమ్మప్పుడూ ఉయ్యాలో - భయమింత లేకుండ ఉయ్యాలో
రాజు చెంతా జేరి ఉయ్యాలో - ఈ రీతి దెల్పెనూ ఉయ్యాలో
నా మీది ప్రేమతో ఉయ్యాలో - ప్రజలను మరిచినవు ఉయ్యాలో
రాజ్యమంతా జూడు ఉయ్యాలో - రంజిల్లు టాలేదు ఉయ్యాలో
రాజధర్మం గాదు ఉయ్యాలో - ఇది పద్ధతి గాదు ఉయ్యాలో
ప్రజల హితమును గోరి ఉయ్యాలో - కన్నబిడ్డల్లా జూడు ఉయ్యాలో
మొదట రాజ్యం పనులు ఉయ్యాలో - కుదురుగా జేయాలి ఉయ్యాలో
జగమున మెరవాలి ఉయ్యాలో - కీర్తిని పొందాలి ఉయ్యాలో

ఈ విధంగా తన పెనిమిటికి రాజధర్మం గురించి చెప్పి రాజ్యపాలన చేయించింది. చక్కగా పాలన సాగిస్తున్న నారసింహారెడ్డిని చూసి సహించలేక సిద్దిఖీ సోదరులు విషప్రయోగం చేసి చంపారు. శంకరమ్మ తన భర్త గురించి ఏడ్చి ఏడ్చి కండ్లలో సముద్రం నింపుకొన్నది. ఈమె ఇట్లా బాధలో ఉండగానే

శంకరమ్మను నైజాం రాజు మరాఠీల పైకి యుద్ధానికి పంపాడు. అదెట్లాగో వినండి ;

అంతట మరాఠీలు ఉయ్యాలో - పంతాలు గలవారు ఉయ్యాలో
నైజాము రాజుకు ఉయ్యాలో - జాబునూ రాశిరీ ఉయ్యాలో
కప్పంబు గడ్తవా ఉయ్యాలో - కయ్యానికొస్తవా ఉయ్యాలో
మాబలము గొప్పదీ ఉయ్యాలో - రాజీకి రావయ్య ఉయ్యాలో
అది జూసి నైజాము ఉయ్యాలో - చింతలో పడ్డాడు ఉయ్యాలో
పీష్వాలు వీరులూ ఉయ్యాలో - శూరులూ ధీరులూ ఉయ్యాలో
పోరు నెట్లా జేతు ఉయ్యాలో - వారినెట్లా గెలుతూ ఉయ్యాలో
అనుచు చింతించుతూ ఉయ్యాలో - శంకరమ్మను బిల్చి ఉయ్యాలో
సమరానికి బంపె ఉయ్యాలో - కయ్యానికీ బంపె ఉయ్యాలో
శంకరమ్మంతటా ఉయ్యాలో - శక్తిరూపము దాల్చె ఉయ్యాలో
జుట్టుముడి వేసింది ఉయ్యాలో - కొంగు నడుముకు గట్టి ఉయ్యాలో
ముందుకుప్పిల్లు దీసి ఉయ్యాలో - ముద్దుగా మలిచింది ఉయ్యాలో
కాళి బోసినాది ఉయ్యాలో - కత్తినే పట్టింది ఉయ్యాలో
కదనాని కెళ్ళింది ఉయ్యాలో - కాళికా రూపెత్తి ఉయ్యాలో
అశ్వకా దళములా ఉయ్యాలో - అరువేల రాగ ఉయ్యాలో
కాలిబంటూలంత ఉయ్యాలో - వేవేల వెనువెంట ఉయ్యాలో
మొండి ధైర్యంతోని ఉయ్యాలో - దండెత్తి పోయింది ఉయ్యాలో
ఎత్తుపై ఎత్తుతో ఉయ్యాలో - కుత్తకత్తిగోసె ఉయ్యాలో
రక్తమును పారించె ఉయ్యాలో - వీరనారీయయ్యె ఉయ్యాలో
పీష్వాలతోటియు ఉయ్యాలో - కత్తిరించి వేసె ఉయ్యాలో
విజయ గర్వంతోని ఉయ్యాలో - వెనుదిరిగినాది ఉయ్యాలో

విజయం తర్వాత నైజాం నవాబు శంకరమ్మకు 'రాయబాగిన్' అనే బిరుదునిచ్చాడు. అందోలు రాజ్యాన్ని శంకరమ్మకు అప్పగించారు. ఆమెను రాణిగా ప్రకటించారు. 1764 సం॥లో అందోలు రాజ్యానికి శంకరమ్మ రాణి అయ్యింది. దక్షగా రాజ్యపాలన చేసింది. రాజ్యాన్ని తన శౌర్యంతో





విస్తరించుకున్నది. అనేక విజయాలను సాధించింది. కాని ఆమె మనసు సంతోషంగా ఉండేది కాదు. ఎప్పుడు భర్త గుర్తుకు వచ్చేవాడు. ఈ బాధ నుండి ఉపశమనం పొందడానికి తీర్థయాత్రలకు పోయింది. నడితోవలో శత్రువులు ఆమెపై మత్తుమందు చల్లారు. నిజాం వద్దకు వెళ్ళి శంకరమ్మ చలిజ్వరంతో చనిపోయిందని చెప్పారు. అందోలుకు రాజులయ్యారు. అడవిలో తెలివిలోకి వచ్చిన శంకరమ్మ.....

నెమ్మదిగ లేచింది ఉయ్యాలో - కలయజూసినాది ఉయ్యాలో
తనవారలెవ్వరూ ఉయ్యాలో - కానగా రాలేదు ఉయ్యాలో
కారండ పడవిరా ఉయ్యాలో - కాటుక చీకటిరా ఉయ్యాలో
కొండాకోనలూ ఉయ్యాలో - గండూ చీమలూ ఉయ్యాలో
పులులూ సింహాలు ఉయ్యాలో - ముంగీస పాములూ ఉయ్యాలో
దట్టమైన పొదలూ ఉయ్యాలో - లోయలూ లొంకలూ ఉయ్యాలో
దారీ తెన్నూలేక ఉయ్యాలో - ఎండనక వాననక ఉయ్యాలో
రాణీ శంకారమ్మ ఉయ్యాలో - కాళ్ళరగ దిరిగెను ఉయ్యాలో
చీకట్లో చిరుదీపం ఉయ్యాలో - కోయవాడగుపించెఉయ్యాలో
మెడలోని హారాలు ఉయ్యాలో - కానుకగ నిచ్చెను ఉయ్యాలో
దగ్గర గ్రామంకు ఉయ్యాలో - దారిజూపుమనె ఉయ్యాలో
కోయరాజంతట ఉయ్యాలో - కుర్రో కుర్రోయంచు ఉయ్యాలో
హైదరాబాదుకు ఉయ్యాలో - దారిని జూపిందు ఉయ్యాలో

రాణీ శంకరమ్మ ధైర్యవంతురాలు కనుకనే అడవిని దాటగలిగింది. నైజాం రాజు దగ్గరికి వచ్చి శత్రువుల కుట్రలను ఛేదించింది. అందోలుకు రాణి అయింది. ప్రజలను కన్నబిడ్డలుగా పాలించింది. ప్రజలకు పన్నుల భారం తగ్గించింది. అందరూ ఆమె రాజ్యాన్ని రామరాజ్యం అనేవారు. ఆమె తన తండ్రి పేరిట సంగారెడ్డి, తల్లి పేరిట రాజంపేట పట్టణాల్ని నిర్మించింది. గరుడాద్రి గుట్టపై రంగనాథాలయాన్ని కట్టించింది. ఇట్లా ఉండగా శంకరమ్మకు

రాచపుండు పుట్టింది ఉయ్యాలో - రంపానపెట్టింది ఉయ్యాలో

ఎన్ని మందులు పెట్టి ఉయ్యాలో - ఇంతైన తగ్గదు ఉయ్యాలో
పెయ్యంత పాకింది ఉయ్యాలో - పానాలు దీసింది ఉయ్యాలో
రాణీ శంకారమ్మ ఉయ్యాలో - దేవున్ని చేరింది ఉయ్యాలో

1774 సంవత్సరములో శంకరమ్మ తుది శ్వాస విడిచింది. అందోలు చరిత్రలో ఆమె కీర్తి సువర్ణాక్షరాలతో లిఖించబడింది. అందుకే అందోలు ప్రజలు శంకరమ్మను ఈ విధంగా కీర్తించారు.

వీర శంకారమ్మ ఉయ్యాలో - శూరశంకారమ్మ ఉయ్యాలో
అందోలు కీర్తిని ఉయ్యాలో - అజరామరంజేసే ఉయ్యాలో
సూర్యచంద్రులవోలె ఉయ్యాలో - సుక్కై నిలిచింది ఉయ్యాలో
ఆదర్శరాణియై ఉయ్యాలో - నిలిచిపోయినాది ఉయ్యాలో
మారాణి శంకరమ్మ ఉయ్యాలో - మారాణి మా తల్లి ఉయ్యాలో
విన్నవారికి ఉయ్యాలో - విష్ణు లోకాలు ఉయ్యాలో
చెప్పినవారికి ఉయ్యాలో - కలుగు గోసంపదలు ఉయ్యాలో
మంగళం మంగళం ఉయ్యాలో - రాణి శంకరమ్మ ఉయ్యాలో





## నాయనమ్మ (కథానిక)

రవి వాళ్ళ ఇంట్లో అమ్మ, నాన్న, తమ్ముడు, చెల్లె ఇంకా ఒక ముసలి అవ్వ ఉంటారు. ముసలి అవ్వ రవికి నాయనమ్మ.

నాయనమ్మకు కండ్లు సరిగ్గా కనిపించవు. మోకాళ్ళు కూడ అరిగిపోవడంతో నడవడం కూడా కష్టమైంది. నాయనమ్మను చూడటానికి వచ్చిన వాళ్ళందరూ 'ఏం అవ్వా ! మంచిగున్నవా ?' అని అడిగితే 'ఏం మంచిగుండుడు బిడ్డా ! ఎవళ్ళకూ పనికిరాని బతుకు' అని అనేది.

"ఏం కాదులే అవ్వా ! అన్నింటికీ ఆ దేవుడున్నాడు" అని వచ్చినవాళ్ళు అంటుంటే అవ్వ ముఖం వెలిగిపోయేది. వాళ్ళంతా తలవంచి దండం పెడుతుంటే "సల్లగుండు బిడ్డా" అని దీవించేది.

అవ్వ పండుకునే మంచం మీద పరుపు, మెత్త, చెద్దరు ఇంకా కొన్ని బట్టలుంటాయి. పక్కన బల్లమీద యాదగిరి నరసింహస్వామి పటం, ముందర జపమాల ఉంటుంది. నాయనమ్మకు రోజూ మాలను చేతితో పట్టుకొని జపం చేయడం అలవాటు.

మంచానికి రెండుదిక్కులా ఏమేం వస్తువులు ఉంటాయో అవ్వకు తెలుసు. ఎంత రాత్రి నిద్రలేచినా చీకట్లోనే ఆ వస్తువులను చేత్తోటి అందుకుంటుంది.

అవ్వ మంచానికి ఒక దిక్కు నీళ్ళ బిందె, చెంబు ఉంటాయి. దూప అయితే చెంబుతో నీళ్ళు ముంచుకొని తాగుతుంది. మంచానికి ఇంకో దిక్కు చెప్పులుంటాయి. మంచం దిగితే చూడకుండనే కాళ్ళను చెప్పుల్లో పెట్టి తొడుక్కుంటుంది.

అవ్వ అంటే ఇంట్లో అందరికీ ఇష్టం. ఆమెను బంగారం లెక్క చూసుకుంటారు. రవివాళ్ళ అమ్మ, నాన్న పొద్దున్నే నాయనమ్మకు స్నానం చేయించడానికి పట్టుకొని తీసుకొనిపోతారు. స్నానం చేయించినంక మళ్లా మంచం మీద కూచుండబెట్టినపుడు నాయనమ్మ ముఖం మీద నీళ్ళ చుక్కలు మెరుస్తూ ఎంతో అందంగా కనబడుతాయి.



Scanned with OKEN Scanner

రవి వాళ్ళ అమ్మ నాయనమ్మ తలను దువ్వెనతో దూస్తూ నాయనమ్మ నొసలు మీద ముద్దుపెట్టుకుంటుంది. మంచం పక్కన బీరువాలో నాయనమ్మ మందులుంటాయి. ఏ మందు గోలీలు ఎప్పుడు వేసుకోవాల్నో నాయనమ్మకు తెలుసు. రవివాళ్ళ అమ్మగానీ, నాన్న గానీ మందులు వేయబోతే "నాకు చాతనయితది బిడ్డా... నేనేసుకుంట" అంటుంది.

రవికి నాయనమ్మ అంటే ఎంతో ఇష్టం. నాయనమ్మకు ఏదైనా పని చేసిపెట్టడమన్నా, నాయనమ్మ చెప్పే కథలు వినడమన్నా, నాయనమ్మ దగ్గర హాయిగా నిద్రించడమన్నా ఇష్టం. రవికేకాదు అతని తమ్మునికి, చెల్లెకు కూడా నాయనమ్మ అంటే ఇష్టం. నాయనమ్మ కూడా పిల్లలు బడి నుంచి ఎప్పుడు వస్తారో అని ఎదురుచూస్తుంది.

ఒకరోజు వాళ్ళింటికి కరీంనగర్ నుండి చుట్టాలు వచ్చారు. వాళ్ళు దగ్గరి చుట్టాలు. వాళ్ళ కొడుకు శేఖర్, రవి ఒకే ఈడువాళ్ళు, ఒకరితో ఒకరు కలిసి ఆడుకోవడమంటే వాళ్ళకు చాలా ఇష్టం. కలిసి ఎగురుతారు, దుంకుతారు, ఆడుతారు, ప్రపంచడం మొత్తం మర్చిపోతారు. శేఖర్ వస్తున్నాడని రవి ఎగిరి గంతులు వేశాడు. శేఖర్ అయితే ఎప్పుడు రవి దగ్గరకు పోదామా, ఎప్పుడు రవితో కలిసి ఆడుకుందామా అని ఆతృతతో ఉన్నాడు.

శేఖర్ వాళ్ళ అమ్మా నాన్న తమ్మునితో కలిసి ఇంటికి రాగానే రవికి ఎంతో సంబురమైంది. ఇద్దరూ కలిసి కొంచెం సేపు ఆడుకున్నారు. కాని కొంతసేపటికి రవి ఆటను ఆపేసి నాయనమ్మ దగ్గరకు పోయాడు. రవి తనతో ఆడుతున్న ఆటను ఆపి వాళ్ళ నాయనమ్మ కోసమని పోవడం శేఖర్‌కు నచ్చలేదు. రవి వస్తాడేమోనని శేఖర్ చూసిండు. కానీ రవి నాయనమ్మకు అవసరమైన సహాయం చేసుకుంటూ అక్కడనే ఉన్నాడు.

ప్రతిరోజూ రవి నాయనమ్మ దగ్గరనే ఎక్కువసేపు ఉండడం, తనతో ఆడుకోవడానికి రాకపోవడం శేఖర్‌కు నచ్చలేదు. చాలా కోపం వచ్చింది. "రవీ! నీతో ఎన్నో ఆటలు ఆడుకోవాలని ఎంతో ఆశతో వచ్చాను. నాతో పాటే ఎందుక ఉండవు?" అని అడిగాడు శేఖర్.





"నాయనమ్మకు పనులు చేసుకోవడం చాతనయితలేదు. అందుకని నాయనమ్మ దగ్గరనే ఉండాలి. రేపు మొత్తం నీతోటే ఉంటలే" అన్నాడు రవి.

తెల్లవారి లేవగానే తయారయి, శేఖర్‌ను తోలుకోని స్నేహితుల ఇంటికి వెళ్ళాడు రవి. అందరూ కలిసి బడిలో ఆటస్థలానికి వెళ్ళి చిర్రగోనె, దాగుడుమూతలు, కబడ్డీ ఎన్నో ఆటలు ఆడుకున్నారు. ఆ రోజు శేఖర్ ఎంతో సంతోషంగా ఉన్నాడు. కానీ మాపటికి ఇంటికి రాంగనే నాయనమ్మతోనే ఉన్నాడు రవి. శేఖర్‌కు ఇంకా బాధగా అనిపించింది.

తెల్లారేసరికి నాయనమ్మకు బాగా జ్వరం వచ్చింది. రవి బాధపడ్డాడు. జ్వరంలో నాయనమ్మ మూలుగుతుంటే రవికి ఏడుపు వచ్చింది. శేఖర్ దగ్గరకు వచ్చి ఏడ్చాడు. ఇంకో రెండురోజులూ రవి నాయనమ్మ దగ్గరే ఉండి ఆమెకు సేవ చేసాడు. రవి మాత్రమే కాదు వాళ్ళ ఇంట్లో అందరూ నాయనమ్మతోనే ఉన్నారు.

రెండు రోజుల్లో నాయనమ్మకు జ్వరం తగ్గింది. కానీ చాతగాకుండా ఉండడంతో నాయనమ్మ పనులకు సహాయం చేసుకుంటూ రవి ఆమె దగ్గరనే ఉండిపోయాడు.

ఎప్పుడు చూసినారవి నాయనమ్మ దగ్గరనేఉండడంతో శేఖర్‌కు నాయనమ్మ మీద కోపం వచ్చింది. తనతోపాటు రవిని ఆడుకోనీయకుండా చేస్తున్నది నాయనమ్మనే అని ఆమె మీద ద్వేషం పెంచుకున్నాడు.

రవి నాయనమ్మకు మందులిస్తూ సేవలుచేస్తూ ఉండేవాడు. రవి సేవలు చూస్తున్నకొద్దీ శేఖర్‌కు కోపం పెరిగిపోయింది. ఏదో ఒకటి చేయాలనుకున్నాడు. ఒకరోజు పగటిపూట నాయనమ్మ నిద్రపోయింది. చుట్టుపక్కల ఎవరూ లేకుండా చూసి నాయనమ్మ మంచానికి రెండు దిక్కులా ఉన్న వస్తువులను మార్చాడు. బిందె, చెంబు ఉన్న దిక్కు చెప్పులను, చెప్పులు ఉన్న దిక్కున బిందెను ఉంచాడు. తర్వాత ఏమి తెలియనట్లు దూరంగ కూచుని నాయనమ్మనే చూడసాగాడు.

ఈ విషయం తెలియని నాయనమ్మ నిద్రలేవంగనే చెప్పులు ఉండే దిక్కు నుంచి కిందికి దిగింది. కాని అక్కడ చెప్పులకు బదులు బిందె ఉండడంతో



Scanned with OKEN Scanner

దానిలో కాలు ఇరుక్కుని కింద పడింది. ఆమె బాధతో అరిచింది. ఆమె అరుపులు విని ఇంట్లో అందరూ ఉరుకుతూ వచ్చారు. అందరూ ఎంతో ఆందోళన పడుతూ నాయనమ్మను పైకిలేపి మంచం మీద పడుకోబెట్టారు.

డాక్టరు వచ్చి పరీక్షలు చేసి కాలు విరిగిందని చెప్పాడు. ఎక్స్‌రే తీయించాడు. నాయనమ్మ తొడ ఎముక విరిగిందని డాక్టరు చెప్పాడు. ఆపరేషన్ చెయ్యాలి, కానీ ఇంత పెద్ద వయసులో ఆపరేషన్ చేస్తే ప్రాణానికే ప్రమాదం అని డాక్టర్ చెప్పడంతో అందరూ బాధపడ్డారు.

అసలు చెప్పులు ఉండేచోట బిందె ఎవరు పెట్టారో ఎవరికీ అర్థం కాలేదు. పనిమనిషి మతిమరుపుతో అట్లా చేసిందేమోనని అనుకున్నారు.

నాయనమ్మ నెలరోజులు దవాఖానాలోనే ఉన్నది. రవితో సహా అందరూ ప్రతిరోజూ దవాఖానాకు పోతున్నారు. నాయనమ్మకు తొందరగా నయం కావాలని దేవునికి మొక్కారు.

తన అమ్మానాన్నలతో సహా ఇంట్లో అందరూ నాయనమ్మ ఆరోగ్యం గురించి బాధపడుతుంటే శేఖర్‌కు కూడా బుగులైంది.

'అయ్యో ! నాయనమ్మకు ఈ కష్టం కలగడానికి కారణం నేనే కదా ! ఏదైనా అనుకోనిది జరిగి నాయనమ్మ ప్రాణాలకు ప్రమాదం జరిగి ఉంటే' అని ఆలోచించగానే అతనికి చాలా బాధగా అనిపించింది. ఇంకోసారి 'ఇట్లాగే మా అమ్మకు కూడా జరిగి మా అమ్మ కాలు విరిగి ఉంటే' అనుకోంగనే అతనికి చాలా ఏడుపు వచ్చింది. ఎవరూ ఓదార్చలేనంత ఏడుపు వచ్చింది. అందరితో కలిసి మునుపటి తీరుగ మాట్లాడలేకపోయాడు.

ముభావంగా ఉండిపోయాడు. శేఖర్ ఇట్లా ఎందుకు ఉంటున్నాడో ఎవరికీ అర్థం కాలేదు. శేఖర్‌ను మామూలు మనిషిని చేయడానికి రవి ఎంతగానో ప్రయత్నించాడు. రవి ఎంత పిలిచినా అతనితో ఆడుకోవడానికి పోలేదు.

కొద్ది రోజులకు నాయనమ్మను ఇంటికి తీసుకువచ్చారు. నాయనమ్మ కాలుకు కట్టుతో మంచం మీదనే ఉండిపోయింది. శేఖర్‌కు నాయనమ్మను





చూస్తే దుఃఖం వచ్చేది. ఆమె దగ్గరకు పోయి ఆమెనే చూసుకుంటూ కూచునేవాడు.

అట్లా విచారంగా కూర్చున్న శేఖర్‌ను నాయనమ్మ పిలిచేది. తన దగ్గరున్న పళ్ళు తినమని ఇచ్చేది. దానిమ్మ గింజలను ఒలిచి శేఖర్ నోట్లో పోసేది.

అట్లా చేస్తున్న ప్రతిసారీ శేఖర్‌కు ఏడుపు వచ్చేది. ఆరోజు నుండి అతడూ రవివలె నాయనమ్మకు ప్రతి పనిలో సహాయం చేయసాగాడు. నాయనమ్మ అతడిని రవిని చూసినట్టుగానే ప్రేమగా చూడసాగింది. నాయనమ్మ తనను ప్రేమగా చూస్తున్నకొద్దీ శేఖర్‌కు తాను చేసిన తప్పు గుర్తుకొచ్చి ఏడుపు వచ్చేది. ఆ ఏడుపు నుండి ఎట్లా తప్పించుకోవాలో అతనికి తెలువలేదు.

ఒకరోజు ఇంట్లో ఎవరూ లేనప్పుడు నాయనమ్మ ఒడిలో తలవాల్చి ఏడ్చాడు శేఖర్.

"ఏమయింది?" అడిగింది నాయనమ్మ. "నాయనమ్మా ! నీ మీద కోపంతోని చెప్పుల స్థానంలో బిందెను పెట్టింది నేనే" అని భోరున ఏడ్చాడు.

నాయనమ్మ ఏమనలేదు. "నాయనమ్మా ! నాకు రవితోని ఆడుకోవడమంటే బాగా ఇష్టం. కాని రవి ఎప్పుడూనన్ను విడిచిపెట్టి నీతోనే ఉంటే నాకు కోపం వచ్చింది. అందుకే అట్లా చేసిన. ఇంక నువ్వు కొట్టినా నాకేం బాధలేదు" అన్నాడు ఏడ్చుకుంట. నాయనమ్మ శేఖర్‌ను దగ్గరకు తీసుకున్నది. అతని కన్నీళ్ళు తుడిచి నవ్వింది. నాయనమ్మ నవ్వంగనే శేఖర్ ఏడువడం ఆపాడు.

"అంతా మంచే జరిగిందిరా.... నేను కష్ట పడడం చూసి నీలో మార్పు వచ్చింది. రవి నాతోనే ఉండడంతో నీకు నామీద ఈర్ష్య కలిగింది. ఇప్పుడా ఈర్ష్య పోయింది. ఈర్ష్య అనేది మనిషి మనసుకు విషం వంటిది. నువ్వింక అందరితో కలిసి ఆడుకో... సంతోషంగ ఉండు" అంటూ శేఖర్ వీపు మీద తన అరచేత్తో రాస్తూ ఓదార్చింది.



Scanned with OKEN Scanner

## ప్రేరణ (ఆత్మకథ)

నేను రామనాథపురంలో హైస్కూల్లో స్థిరపడగానే నాలోని పదిహేనేళ్ళ పిల్లాడి మేల్కొన్నాడు. తన ముందు పరచుకొని ఉన్న జీవితావకాశాల గురించి ప్రత్యామ్నాయాల గురించీ ఇదమిత్థంగా ఏమీ తెలుసుకోలేని ఒక నవ ఔత్సాహికుడికి నా ఉపాధ్యాయుడు ఇయదురై సోలోమోన్ ఆదర్శపథ నిర్దేశకుడయ్యాడు. తన ఉదార విశాల దృక్పథంతో ఆయన తన తరగతి గదిలోని విద్యార్థుల్ని ఉత్సాహపరిచేవాడు. 'మందబుద్ధి శిష్యుడు ఉత్తమగురువు నుంచి నేర్చుకోగలిగిన దానికన్నా ఉత్తమ విద్యార్థి చెడ్డ ఉపాధ్యాయుడి నుంచి కూడా ఎక్కువ నేర్చుకోగలడనే వాడాయన. నేను రామనాథపురంలో ఉన్న కాలంలో మా అనుబంధం గురుశిష్యబంధాన్ని దాటి వికసించింది. ఆయన సాహచర్యంలో ఒకరి జీవితగమనాన్ని ఎవరైనా ఏ మేరకు ప్రభావితం చేయగలరో తెలుసుకున్నాను. ఇయదురై సోలోమోన్ అంటూండేవారు, జీవితంలో విజయం పొందడానికీ ఫలితాలు సాధించడానికీ నువ్వు మూడు అంశాల మీద పట్టు సాధించాల్సి ఉంటుంది – అవి "కోరిక", "నమ్మకం", "ఆశ పెట్టుకోవడమూ"ను.

తరువాతి రోజుల్లో రివరెండ్‌గా మారిన సోలోమోన్ నాకు నేర్పిందిదే. నాకేదన్నా సంభవించాలని నేననుకునే ముందు నేను దాన్ని గట్టిగా ఆకాంక్షించాలనీ, అది తప్పక జరిగి తీరుతుందనీ ప్రగాఢంగా విశ్వసించాను. నా జీవితం ఉంచి ఒక ఉదాహరణ ఇస్తాను. నాకు చిన్నప్పటి నుంచీ ఆకాశపు రహస్యాలన్నా, పక్షుల ప్రయాణమన్నా అమితాసక్తి. కొంగలూ, సముద్రపు గువ్వలు ఎగురుతుండటం చూస్తూ నేను కూడా ఎగరాలని కోరుకునేవాణ్ణి. సాధారణ గ్రామీణ బాలుడినయినప్పటికీ, నేను కూడా ఏదో ఒకరోజు ఆకాశంలో విహరించగలననీ ఎంతగా నమ్మానంటే మా రామేశ్వరం నుంచి ఆకాశయానం చేసిన మొదటి బాలుణ్ణి నేనే కావటం విశేషం.

ఇయదురై సోలోమోన్ ఎందుకు గొప్ప ఉపాధ్యాయుడంటే ఆయన విద్యార్థులందరిలో ఏదో ఒక విలువ గురించి స్పృహని మేల్కొల్పేవాడు. ఆయన నా ఆత్మగౌరవాన్ని ఏ మేరకు మేల్కొల్పాడంటే ఏ మాత్రం చదువుకోని తల్లిదండ్రుల బిడ్డనైన నేను కూడా ఏది కావాలనుకుంటే అది కాగలనని





నమ్మాను. "విశ్వాసంతో నువ్వు నీ విధిని కూడా తిరిగి రాయుగలవు" అనే వారాయన. 1950లో ఇంటర్మీడియట్ పరీక్షకు చదవడానికి తిరుచినాపల్లిలోని సెయింట్ జోసఫ్ కాలేజీలో చేరాను. పరీక్షల గ్రేడుల లెక్కన చూస్తే నేనేమంత చురుకైన విద్యార్థిని కాను.

మా అన్నయ్య ముస్తఫా కమల్‌కి స్టేషన్‌రోడ్‌లో ఒక కిరాణా దుకాణముండేది. హైస్కూల్లో చదువుకునేటప్పుడు నేను రామేశ్వరం వెళ్ళినప్పుడల్లా నన్ను సాయం చెయ్యమంటూ పిలిచి, షాపులో కూచోపెట్టి ఇంక గంటల తరబడి అతను అదృశ్యమైపోయేవాడు. నేను అక్కడ ఆ షాపుని కనిపెట్టుకు కూచొని బియ్యం, నూనె, ఉల్లిపాయలు ఒకటేమిటి అన్నీ అమ్ముతుండే వాణ్ణి. వాటిలో తొందరగా చెల్లిపోయేవి సిగరెట్లూ, బీడీలూను, బీదవాళ్ళు తమ కష్టార్జితాన్ని ఎందుకట్లా పొగపీల్చేస్తుంటారని ఆశ్చర్యం కలిగేది నాకు. మా అన్నయ్య ముస్తఫా నన్ను వదిలి పెట్టగానే మా తమ్ముడు కాశిం మహమ్మద్ నన్ను తన ఫ్యాన్సీషాపులో కూర్చోబెట్టడానికి సిద్ధంగా ఉండేవాడు. అక్కడ నత్తగుల్లలతోను, శంఖాలతోను చేసిన రకరకాల అలంకార సామాగ్రి అమ్మేవారు.

సెంట్ జోసెఫ్‌లోని మా ఉపాధ్యాయులంతా కంచి పరమాచార్యకు అనుచరులు. త్యాగనిరతి ద్వారా ఆనందించే గుణాన్ని ఆయన వాళ్ళల్లో మేల్కొల్పాడు. కళాశాల క్యాంపస్‌లో మా గణితశాస్త్ర ఉపాధ్యాయులు ప్రొఫెసర్ తోతత్రి అయ్యంగార్, ప్రొఫెసర్ సూర్యనారాయణ శాస్త్రి గార్లతో కలిసి నడుస్తున్న ఆ దృశ్యం నాకిప్పటికీ గుర్తొచ్చి ఉద్వేగభరితుణ్ణి చేస్తుంది.

నేను సెంట్ జోసెఫ్‌లో నా చివరి సంవత్సరంలో ఉన్నప్పుడు ఇంగ్లీషు సాహిత్యం పట్ల మక్కువ పెంచుకున్నాను. ఇంగ్లీషులోని సర్వశ్రేష్ఠ కృతుల్ని చదువుతుండేవాణ్ణి. టాల్‌స్టాయ్, స్కాట్, హార్డీల పట్ల ప్రత్యేక ఆసక్తి ఉండేది. అప్పుడప్పుడు తత్వశాస్త్ర గ్రంథాలు చదువుతుండేవాణ్ణి. దాదాపుగా ఆ సమయంలోనే భౌతికశాస్త్రం పట్ల నాకు అమితమైన ఆసక్తి ఏర్పడింది.

కొంతమంది మనుషులు సైన్సు అనేది వేరే ఒక అంశమన్నట్టుగా అది మనిషిని భగవంతుడి నుంచి దూరం చేస్తుందన్నట్టుగా ఎందుకు



Scanned with OKEN Scanner

మాట్లాడుతారో నాకర్థం కాదు. విజ్ఞానశాస్త్ర పథం మానవహృదయ వీధుల్లోంచి సాగిపోయేదే. నాకయితే సైన్స్ ఎప్పుడూ ఆధ్యాత్మిక ఉన్నతికీ, ఆత్మ సాక్షాత్కారానికి మార్గంగానే ఉంటూ వచ్చింది.

సెంట్ జోసెఫ్‌లో బి.ఎస్.సి. డిగ్రీ కోర్సులో చేరినప్పుడు అంతకుమించిన ఉన్నత చదువేమీ నాకు తెలియదు. ఒక సైన్స్ విద్యార్థికి ఉన్న భవిష్య అవకాశాల గురించిన సమాచారం కూడా నాకేమి తెలియదు. బి.ఎస్.సి. డిగ్రీ పూర్తి చేసాకే భౌతికశాస్త్రం (ఫిజిక్స్) నా సబ్జెక్ట్ కాదని గ్రహించాను. నా కలలు నిజం కావాలంటే నేను ఇంజనీరింగ్ చదవవలసి ఉంటుందని తెలుసుకున్నాను. ఇంటర్మీడియట్ అయిన తరువాతనే నేను నేరుగా ఇంజనీరింగ్‌లో చేరి ఉండవచ్చు. దక్షిణ భారతదేశమంతటిలోనూ సాంకేతిక విద్యకు తలమానికం లాంటి మద్రాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ప్రవేశానికి దరఖాస్తు చేసాను.

ప్రవేశానికి ఎంపికైతే అయ్యాను గానీ అటువంటి ప్రతిష్ఠాత్మక సంస్థలో చదవడమంటే చాలా ఖర్చుతో కూడుకున్న పని. దాదాపు వెయ్యిరూపాలయన్నా అవసరమవుతాయి. కానీ అది నా తండ్రికి తలకు మించిన విషయం. అప్పుడు నా సోదరి జోహారా నాకు తోడు నిలబడింది. తన బంగారు గాజులు, గొలుసు కుదవబెట్టి ఆమె నాకు సహాయం చేసింది. నేను చదువుకోవాలన్న ఆమె ఆకాంక్ష నా సామర్థ్యం పై ఆమె నమ్మకం నన్ను గాఢంగా చలింపచేసాయి. నేను నా సొంత సంపాదన మీదనే ఆమె గాజుల్ని విడిపిస్తానని ఒట్టుపెట్టుకున్నాను. అప్పుడు నాకు డబ్బు సంపాదించడానికున్న ఏకైక మార్గం కష్టపడి చదువుకుని స్కాలర్షిప్ సంపాదించుకోవడమే.

నన్ను ఎమ్.ఐ.టి. లో అన్నిటికన్నా మిన్నగా ఆకర్షించింది. అక్కడ ప్రదర్శన కోసం పెట్టిన రెండు పాత విమాన యంత్రాలు. విమానయంత్రాల ప్రదర్శన కోసం అవక్కడుంచబడ్డాయి. వాటి పట్ల ప్రత్యేక ఆకర్షణకు లోనయ్యాను. విద్యార్థులంతా హాస్టలుకు వెళ్ళిపోయాక కూడా చాలా సేపు వాటి దగ్గరే కూర్చుండేవాణ్ణి. పక్షిలాగా ఆకాశంలో విహరించాలన్న మనిషి ఆకాంక్షని ఆరాధిస్తూ అక్కడే గడపేవాణ్ణి.





నా మొదటి సంవత్సరం పూర్తయ్యాక ఒక ప్రత్యేక విషయాన్ని ఎంపిక చేసుకోవాల్సి వచ్చినప్పుడు మరేమీ ఆలోచించకుండా ఏరోనాటికల్ ఇంజనీరింగ్‌ని ఎంచుకున్నాను. లక్ష్యం నా మనసులో స్పష్టంగానే ఉండింది. నేను ఎలాగైనా విమానాల్ని నడపాలి. నిలదొక్కుకునే శక్తిలేదని తెలిసి కూడా నాకా లక్ష్యం సాధ్యమనే నేను నమ్మాను. నా సాధారణ కుటుంబ నేపథ్యం అందుకు అడ్డురాలేదు.

ఆ సమయంలోనే నేను వివిధ రకాల వ్యక్తులతో పరచయాలు పెంచుకోవడానికి ప్రయత్నించాను. ఆ దారిలో వైఫల్యాలున్నాయి. ఆశాభంగాలున్నాయి. తోవ తప్పడాలున్నాయి. కానీ దారితప్పిన ప్రతివేళా నా తండ్రి మాటలు నన్ను మళ్ళా సరిగా నిలబెట్టేవి. ఆ ఉత్తేజకరమైన మాటలు 'ఇతరుల్ని అర్థం చేసుకున్నవాడు విజ్ఞాని. కానీ తనని తాను తెలుసుకున్నవాడే వివేకి. వివేకం లేని విజ్ఞానం ప్రయోజన శూన్యం'.

ఎమ్.ఐ.టిలో నా విద్యాభ్యాసంలో నా ఆలోచనని ముగ్గురు ఉపాధ్యాయులు తీర్చిదిద్దారు. వారి సంయుక్త ప్రోత్సాహం ఏర్పరచిన పునాది పైనే నా సాంకేతిక ప్రతిభ అంతా ఆధారపడి ఉంది. వారు ప్రొఫెసర్ స్పాండర్, ప్రొఫెసర్ కె.ఏ.వి. పండలై, ప్రొఫెసర్ నరసింగరావు గార్లు. వారిలో ప్రతి ఒక్కరిదీ ఒక ప్రత్యేక వ్యక్తిత్వం కానీ అందరి ఆశయమూ ఒకటే. తమ విద్యార్థుల జ్ఞాన తృష్ణని తమ చైతన్యంతోనూ అకుంఠిత సంకల్పంతోనూ సంతృప్తిపరచడమే.

విస్తృత పరిజ్ఞానం నా మనసులో నెమ్మదిగా సమీకరింపబడటం మొదలయ్యింది. వివిధ రకాల ఏరోప్లేన్‌ల నిర్మాణాంశాల ప్రాముఖ్యత తెలియడం మొదలైంది. నా జ్ఞానం సమగ్రవంతం కావడానికి ఆ ముగ్గురు ప్రొఫెసర్లు వారి వారి శ్రేష్ఠ వ్యక్తిత్వాలతో నాకెంతో సహకరించారు.

ఈ లోగా నా కోర్సు పూర్తిచెయ్యగానే నలుగురు సహచరులతో కలిసి ఒక చిన్న తరహా యుద్ధ విమానం డిజైన్ చేసే బాధ్యత చేపట్టాను. అందులో ఏరోడైనమిక్ డిజైన్ రూపకల్పన బాధ్యతనాది. చోదనం, నిర్మాణం, అదుపు, ఉపకరణ సామగ్రికి సంబంధించిన రూపకల్పన నా మిత్రులు తమ వంతుగా తీసుకున్నారు.



Scanned with OKEN Scanner

ఒకరోజు మా డైరెక్టర్, మాకు డిజైనింగ్ ఉపాధ్యాయుడూ అయిన ప్రొఫెసర్ శ్రీనివాసన్ మా పనిలో ప్రగతిని సమీక్షించి, ఏమీ పురోగతి లేదని చాలా నిరాశాజనకంగా ఉందని తేల్చేసారు. నేను పనిలో జాప్యానికి ఓ డజను సాకులు చెప్పినా ఆయన్ని ఒప్పించలేకపోయాను. ఆ పనిని పూర్తి చెయ్యడానికి చివరికి ఒక నెలరోజుల వ్యవధి కోరాను. ఆ ప్రొఫెసర్ నా వంక కొంతసేపు చూసి, 'చూడు యంగ్మేన్, ఈరోజు శుక్రవారం మధ్యాహ్నం. నేను నీకు మూడు రోజుల టైమిస్తున్నాను. సోమవారం ఉదయానికి గానీ విమాన నిర్మాణం డ్రాయింగ్ పూర్తికాక పోతే మీ స్కాలర్‌షిప్‌ని ఆపెయ్యవలసి ఉంటుంది' అన్నాడు. నాకు నోటమాట రాలేదు. ఆ స్కాలర్‌షిప్ నా జీవన భాగ్యరేఖ. అది గాని లేకపోతే ఇక ఏ దిక్కూ లేదు. చెప్పినట్టు ఆ పని పూర్తి చెయ్యడం తప్ప మరో మార్గం కనిపించలేదు.

ఆ రాత్రి నేను భోజనం మానేసి డ్రాయింగ్ బోర్డ్ దగ్గరే పనిలో నిమగ్నుణ్ణై పోయాను. మర్నాడు ఉదయం ఒక గంట మాత్రమే విరామం తీసుకుని ఏదో తిన్నాననిపించి మళ్ళా పనిలో పడ్డాను. ఆదివారం ఉదయానికి దాదాపుగా పని పూర్తి కావస్తుండగా హఠాత్తుగా ఎవరో అక్కడ మసిలినట్టుగా అనిపించింది. చూద్దును కదా ప్రొఫెసర్ శ్రీనివాసన్. నన్ను కొంత దూరం నుంచి పరికిస్తున్నాడు. ఆయన నా పని ప్రగతిని చూడడానికి జింఖానా నుండే నేరుగా తన టెన్నిస్ డ్రెస్‌లో వచ్చేసాడు. నా పనితీరు పరిశీలించాక ప్రొఫెసర్ శ్రీనివాసన్ నన్ను ఆప్యాయంగా కావిలించుకొని ప్రశంసాత్మకంగా వెన్నుతట్టాడు. నాకు తెలుసు నిన్ను ఒత్తిడి చేస్తున్నానని అసాధ్యమైన పరిస్థితికి నెడుతున్నానని కూడా తెలుసు. కానీ నువ్వింత చక్కగా ఈ పనిని పూర్తి చెయ్యగలవని ఊహించలేదు' అన్నాడు.

ప్రాజెక్ట్ పని పూర్తి చేస్తున్న కాలంలోనే నేను ఎమ్.ఐ.టి. తమిళ సంఘం వారు నిర్వహించిన వ్యాసరచన పోటీలో పాల్గొన్నాను.

'మన విమానాన్ని మనమే తయారు చేసుకుందాం' అని ఒక వ్యాసాన్ని తమిళంలో రాసాను. ఆ వ్యాసం గొప్ప ఆసక్తిని రేకెత్తించింది. ఆ పోటీలో గెలిచాను. ప్రఖ్యాత తమిళ వారపత్రిక ఆనంద వికటన్ సంపాదకుడైన దివాన్





చేతుల మీదుగా దానికి మొదటి బహుమతి అందుకున్నాను.

ఎమ్.ఐ.టి సంబంధించి నా ఆత్మీయమైన జ్ఞాపకం ప్రొఫెసర్ స్పాండర్‌కి సంబంధించిందే. వీడ్కోలు సమావేశంలో భాగంగా మేము గ్రూపు ఫోటో కోసం నిలబడ్డాం. ప్రొఫెసర్లు ముందు కూర్చొని ఉండగా గ్రాడ్యుయేట్ విద్యార్థులమంతా మూడు వరుసల్లో వెనుక నిల్చొన్నాం. హఠాత్తుగా ప్రొఫెసర్ స్పాండర్ లేచి నిల్చొని నా కోసం కలియచూశాడు. నేను మూడో వరుసలో వెనుక నిల్చొన్నాను. 'రా నాతో పాటు ముందు కూర్చో' అన్నాడు. నేను ప్రొఫెసర్ స్పాండర్ ఆహ్వానానికి నిర్ఘాంతపోయాను. 'నువ్వు నా బెస్టు స్టూడెంట్‌వి.' నీ పరిశ్రమ నీ ఉపాధ్యాయులకి భవిష్యత్తులో మంచి పేరు తేవడానికి ఉపకరిస్తుంది' అన్నాడు. ఆ ప్రశంసకి సిగ్గుపడ్డాను. అదే సమయంలో నాకు లభించిన గుర్తింపుకు గర్విస్తూ నేను ప్రొఫెసర్ స్పాండర్‌తో కలిసి ఫోటోగ్రాఫ్ కోసం కూచున్నాను. 'దేవుడే నీ ఆశా, ఆశ్రయమూ, మార్గదర్శి కాగలడు. భవిష్యత్‌లోకి నీ ప్రయాణానికి ఆయనే దారి చూపే దీపం కాగలడు' అన్నాడు ఆ మహామేధావి నాకు వీడ్కోలు పలుకుతూ.

గ్రాడ్యుయేట్ ఏరోనాటికల్ ఇంజనీర్‌గా నేను ఎచ్.ఏ.ఎల్. నుంచి బయటికి వచ్చేటప్పటికి ఆకాశయానం గురించిన నా చిరకాల స్వప్నాన్ని నిజం చేసే రెండు ఉపాధి అవకాశాలు నా ముందుకొచ్చాయి. ఒకటి వైమానిక దళంలో ఉద్యోగం, రెండోది రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే సాంకేతిక అభివృద్ధి ఉత్పాదక డైరెక్టరేట్‌లో ఉద్యోగమూను. నేను రెండింటికి దరఖాస్తు చేసాను. రెండు చోటుల్నించీ కాల్ లెటర్లు ఒక్కసారే వచ్చాయి.

వైమానిక దళంలో ఉద్యోగానికి డెహరాడూన్‌కీ, రక్షణ మంత్రిత్వ శాఖ ఉద్యోగానికి డిల్లీకి వెళ్ళవలసి ఉంది. అప్పుడీ కోరమాండల్‌తీర బాలుడు ఉత్తర దేశానికి పోయే రైలెక్కాడు. నా జీవిత లక్ష్యం రెండువేల కిలోమీటర్లకు పైగా దూరంలో ఉంది. నా మాతృభూమి విస్తృతి ఎటువంటిదో మొదటిసారి తెలుసుకున్న సందర్భం అది.



Scanned with OKEN Scanner

## ఏ కులం ? (గేయం)

ఏ కులమబ్బీ !
మాదే మతమబ్బీ !!

1. మట్టి పిసికి ఇటుక చేసి
ఇల్లు కట్టి పెట్టినపుడు
డొక్క లెండి కొండ్ర లేసి
ధాన్యరాసులెత్తినపుడు ॥ఏ॥

2. పొగగొట్టాలై పేగులు
కొలిమి సెగలు చిమ్మినపుడు
దగ్గులతో క్షీణిస్తూ
బొగ్గుట్టలు త్రవ్వినపుడు ॥ఏ॥

3. మాడు చెక్కలే తింటూ
మాగాణం దున్నినపుడు
ఎండలలో బండలపై
విగ్రహాలు చెక్కినపుడు ॥ఏ॥

4. పూజకు అందిచ్చు పూల
బుట్టలల్లి ఇచ్చినపుడు
రామకోటి రాసుకొనే
కాగితాలు చేసినపుడు ॥ఏ॥

5. పశువు గొంతు కోసి మీకు
చెప్పులు కుట్టిచ్చినపుడు
కూటికింత కూడు లేక
కుండలు జేసిచ్చినపుడు ॥ఏ॥





6. సన్యాసుల్లై వస్తే
క్షవరాలూ చేసినపుడు
మురికి గుడ్డలుతికి మల్లె
పూలు చేసి ఇచ్చినపుడు ॥ఏ॥

7. చెల్లవు మీ కల్లబొల్లి
కబుర్లన్ని చెదలు పట్టె
ఆగదు మీ పాతరోత
రథం విరిగిపోయినది ॥ఏ॥

8. కులాలనీ కులంలోని
శాఖలనీ వేరుజేస్తే
చెమటోడ్చే మనుషులమూ
చేయి కలిపి నిలబడితే ॥ఏ॥



Scanned with OKEN Scanner

## సీత ఇష్టాలు (బుర్ర కథ)

అది ఒక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పాఠశాల ప్రాంగణం అంతా పిల్లలతో కళకళలాడుతున్నది. జాతీయదినోత్సవంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్నారు విద్యార్థులు. రమాదేవి అనే విద్యార్థిని తరువాత ప్రదర్శించబోయే అంశం ప్రకటిస్తున్నది ఇట్లా....

రమ : జానపద కళారూపాల్లో ఎంతో ప్రాచుర్యం పొందింది బుర్రకథ. తరతరాలుగా ప్రజాచైతన్యంలో ఈ కళారూపం కీలకపాత్ర పోషించింది. ఇందులో ఒకరు కథ చెబుతూంటే వారికి చెరో పక్క ఇద్దరు వంతపాడుతూ ఉంటారు. కథ చెప్పేవారిని "కథకుడు" అనీ ఆయనకు రెండుపక్కలా నిలబడి గొంతు కలిపేవాళ్ళను "వంతలు" అని అంటారు. కథకుడు తంబూరా వాయిస్తాడు కాబట్టి కథకు బుర్రకథ అని పేరు వచ్చింది. ఈనాటి బుర్రకథను కృష్ణవేని చెబుతుంది. రోజా, రాజు వంతపాడుతారు.

అనగనగా రామాపురం అనే ఒక పల్లెటూరు. ఆ పల్లెలో శివయ్య, గౌరమ్మ అనే దంపతులకు కలిగిన తొలి సంతానం సీత. ఆ సీత చదువుకునేందుకు చేసిన ప్రయత్నమే ఈనాటి బుర్రకథకు నేపథ్యం.

కథకురాలు - కృష్ణవేణి
- 1. రాజు
- 2. రోజా

కృష్ణవేణి : (పాట) జయము జయము మన భారతమాతకు జయము దిగ్విజయమూ... ॥తందాన తాన॥
చదువులనిచ్చు సరస్వతి తల్లీ –చల్లగ జూడమ్మా ॥తందాన తాన॥
సిరులనిచ్చెడి శ్రీ మహాలక్ష్మి – కరుణ జూపవమ్మా॥తందాన తాన॥
శత్రువినాశము జేసెడి దుర్గా జయమునీయవమ్మా – తందాన – తందాన – దేవనందనానా – తరికిట ఝుం తరిత

రాజు : అక్కా! ఈరోజు ఏ కథ చెబుతున్నావు ?





రోజా : ఏదో కాదురా ! నలమహారాజు కథ, పాండవులూ కౌరవుల కథ, మరాఠీల కథ, రామకథ, లవకుశుల కథ, సీతమ్మ కష్టాలు....

రాజు : ఏందక్కా ! ఆ కథలన్నీ పాత గాథలయిపోయినయి కదా, కొత్త కథ చెప్పరాదా ?

రోజా : ఏందిరా ! పాతంటే రోతగా ఉందా ? అయితే పాత గ్లాసులు, బిందెలూ, వెండి పళ్ళాలు, బంగారు గొలుసులూ అన్నీ తీసి బయటికి పారేస్తావ ? ప్రతివాడికీ ఇదో ఫేషనైపోయింది. పాత లేందే కొత్తెక్కడిదిరా తిక్క సన్నాసీ ! ఇప్పుడు కొత్త... కొత్త... అని అరుస్తున్నారు గానీ, ఈ కొత్తంతా పాతలోనుంచే గదరా పుట్టింది..

రాజు : అరరరె... ఇప్పుడు నేనేమన్నానని కరెంట్ షాక్ తలిగిన కాకిలెక్క అట్లా అరుస్తున్నావు ? పాతంటే రోతని నేనన్నానా ? కాలం మారినా ఇంకా మనం పాతలోనే బతుకుతున్నామా ? ఎలక్ట్రిక్ దీపాలు వద్దని ఆముదం దీపాలు పెట్టుకుంటున్నామా ? బస్సులూ, రైళ్ళూ కొత్తవని ఎడ్లబండ్లమీదనే ప్రయాణిస్తున్నామా ?

క్రిష్ణవేణి : ఒరే తమ్ముడా ! చెల్లీ ! అనవసరంగా మీరిట్లా కొట్లాడుకొని రసాభాస చెయ్యకండి ! తమ్ముడన్నట్లు ఈరోజు మనం కొత్త కథనే చెప్పుకుందాం.

రాజు : (మంచి పనయింది అన్నట్లు అభినయించాడు)

రోజా : ('చాల్లే ఎచ్చులు' అన్నట్లు మూతివంకర తిప్పుతూ అభినయించింది)

క్రిష్ణవేణి : ఈరోజు మనం చెప్పుకోబోయే కథ – 'సీత ఇష్టాలు'

(పాట) తకతా... తకిట... తక... తరికిట తరికిట తా... ఇది...
పేట ఇంటిలో పుట్టి పెరిగిన పైడిబొమ్మ కథరా ॥తందాన తాన॥
చదువు సందెలో పేరుపొందిన చక్కనమ్మ కథరా ॥తందాన తాన॥
ఓటమినెరుగక పోరాడే ఒక వీరబాల కథరా ॥తందాన తాన॥
పదిమందికినీ ప్రేరణనిచ్చే వర్తమాన కథరా ॥తందాన తాన॥
–తరికిట ఝుం తరితా !



Scanned with OKEN Scanner

రోజా : ఇంతకూ ఎవరా పైడిబొమ్మ ? ఏమా కథ ?

క్రిష్ణవేణి : అయ్యలారా ! అమ్మలారా ! శ్రీలు విలసిల్లిన భారతభూమిలో, రాజనాలు పండే రతనాల నేల తెలుగు నేల. ఆ తెలుగునాట రామాపురమనేది ఒక పల్లెటూరు. ఆ పల్లెలో శివయ్య, గౌరమ్మ అనే పేద దంపతులున్నారు. ఆ దంపతులకు కలిగిన తొలి సంతానమే సీత. సీతను బడికి పంపాలనుకుంటుండగానే వాళ్ళకు మరో పిల్లవాడు పుట్టాడు. సంతానాన్ని ఇక్కడితో ఆపేద్దామా, వద్దా అని వాళ్ళు మధనపడుతుండగానే మరో కూతురు పుట్టింది.

రాజు : ఆలస్యం అమృతం విషం అంటే ఇదేనేమో !

రోజా : నువ్వు నోరు మూస్తావా, ముయ్యవా ?

రాజు : నోరు మూసుకునే కాలం పోయిందక్కా. ప్రశ్నించేవాడే ఉత్తముడు. మాట్లాడేవాడే మంచోడు.

క్రిష్ణవేణి : తరువాత కథ వినండి....

(పాట)
పూట గడవని తల్లిదండ్రులకు పాటు లెక్కువాయె ॥తందాన తాన॥
పంటలు పండక - పొట్టనిండక కష్టమెక్కువాయె ॥తందాన తాన॥
కుటుంబ భారం కుంగదీయగా తల్లడిల్లినారు ॥తందాన తాన॥
భార్యా - భర్త కూలినాలితో బతుకు నీడ్చినారు ॥తందాన తాన॥
-తరికిట ఝుం తరితా !

రోజా : ఇంతకూ సీత బడికి పొయ్యిందా ? లేదా ?

క్రిష్ణవేణి : లేదు చెల్లెలా ! అమ్మా, నాయనా పనిలోకి పోతే తమ్ముణ్ణీ, చెల్లెల్నీ ఆడించడానికే ఆమె అంకితమైపోయింది.

రాజు : **'పిల్లలు బడిలో - పెద్దలు పనిలో'** అనే సంగతి వాళ్ళకు తెలియదా అక్కా ? "పదహారేళ్ళలోపు పిల్లలను పనిలో పెట్టొద్దు" అన్న చట్టాన్ని గురించి వాళ్ళెందుకు పట్టించుకోలేదు ?

క్రిష్ణవేణి : చట్టాలు అమలుచేయడం ఏ ఒక్కరి బాధ్యతో అనుకున్నంత కాలం పరిస్థితిలో మార్పు రాదురా తమ్ముడూ !





రోజా : ఇంతకూ ఆ చిన్నారి సీతమ్మ ఏమేం పనులు చేసేదక్కా ?

క్రిష్ణవేణి : (పాట)
ఇంటి పనులనే చేసేరా.... సై
వంట పనీ కొంత నేర్చెరా... సై
బీడీలెన్నో తాను చుట్టెరా... సై
పత్తి చేలకే పోయెరా... సై
కొవ్వొత్తిలా బతుకాయెరా .... సై
వినరా సోదర చదువుల తల్లి దీనగాథ నిపుడు
నిరుపేద గాథ ఎపుడూ - ॥తందాన తాన॥
-తరికిట ఝుం తరిత !

రోజా : తరువాతేం జరిగిందక్కా ?

రాజు : ఇంకేం జరుగుతుందీ ? నాలుగు రాళ్ళు సంపాదించిన తర్వాత, ఆ రాళ్ళతోనే, ఆ పిల్లనెత్తిన నీళ్ళు పోసి, పెళ్ళిచేసి ఉంటారు.

క్రిష్ణవేణి : నిజంగా అదే జరిగితే మన కథకు అర్థం లేదురా తమ్ముడూ ! ఆ ఊరికి శ్రావణి అనే కొత్త టీచర్ వచ్చింది.

రోజా : నీ పిచ్చిగానీ, టీచర్లు చదువు చెబుతారు కానీ, ఇవన్నీ పట్టించుకుంటారా? ఒకవేళ పట్టించుకొని చెప్పినా వినేవాళ్ళుంటరా? విన్నా, మార్పు సాధ్యమవుతుందా ?

రాజు : తప్పకుండా సాధ్యమవుతుంది. మా బళ్ళో టీచర్లు రోజూ పాఠాలతో పాటు మంచి మంచి కథలు, సూక్తులు చెప్తారు. ఆటలాడిస్తారు. పాటలు పాడిస్తారు. బడి పిల్లలని తమ సొంత బిడ్డల్లాగా పట్టించుకుంటారు.

క్రిష్ణవేణి : ఔను తమ్ముడా ! శ్రావణి కూడా అటువంటి టీచరే ! ఆమె ఆ ఊరికి రాంగనే ముందుగా చేసిన పని బడి ఈడున్న పిల్లలు ఎవరెవరు బడికి వస్తారో రారో తెలుసుకోవడం. అట్లా తెలుసుకొని ఒక్కొక్క ఇంటికి వెళుతూ శివయ్య వాళ్ళింటికి కూడా వెళ్ళింది.

రాజు : అయితే అది గమనించిన గౌరమ్మ సీతను ఇంట్లో దాచిపెట్టి, మా ఇంట్లో అటువంటి వాళ్ళెవరు లేరని చెప్పిందా ?

రోజా : నువ్వు అతిగా ఊహించకు. అక్క చెప్పేది విను.

క్రిష్ణవేణి : రాజు ఊహించింది నిజమే. గౌరమ్మ సీతను దాచిపెట్టింది.

రాజు : అయ్యో ! అప్పుడేమయింది ?

క్రిష్ణవేణి : శ్రావణి టీచర్ వచ్చిన పని చెప్పకుండా శివయ్య దంపతులకు కొన్ని మంచి మాటలు చెప్పింది.

రోజా : ఏమని ?

క్రిష్ణవేణి : (పాట) ఓ భారతీయుడా-ఓ బాలభానుడా-వినవయ్య వీనులవిందుగా తెలుసుకోవయ్య చరితను ముందుగా

ఎన్నో జన్మల పుణ్యఫలమ్మిది మానవ జన్మమ్ము ॥అది మానవ జన్మమ్ము॥
అందులోనూ ఆడపిల్లగా పుట్టుట శ్రేష్ఠమ్ము ॥ఔను పుట్టుట శ్రేష్ఠమ్ము॥
సహనము స్నేహము ప్రేమ భావము ఆమె గొప్పతనము ॥అది ఆమె గొప్పతనము॥
ఆ గొప్పను గల్గిన ఆడపిల్లను చక్కగ పెంచాలి ॥బహు చక్కగ పెంచాలి॥
అప్పుడె ఇల్లు-ఊరు-దేశం-అభ్యున్నతి పొందు ॥ఔను అభ్యున్నతి పొందు॥
అట్టి బాలికల నణచిపెట్టుట - అన్యాయమ్మగును ॥అంతే-అన్యాయమ్మగును॥
॥ఓ భారతీయుడా॥

రాజు : ఆడవాళ్ళు కూడా గొప్పవాళ్ళు, వాళ్ళను అణచిపెట్టడం మహాపాపం అంటున్నావు బాగానే వుంది కాని, అటువంటి నలుగురు గొప్పవాళ్ళ పేర్లు చెప్పక్కా.

క్రిష్ణవేణి : సరే, వినండి మరి. ఆ శ్రావణి టీచర్ కూడా కొందరు ఆదర్శ మహిళల గురించి ఇట్లా చెప్పింది.

రోజా : ఎలా....?

క్రిష్ణవేణి : (పాట)
రుద్రమదేవి చూడరా సై
శత్రువులను చెండాడెరా సై
సరోజినీ నాయుడురా సై





స్వరాజ్య సమరం చేసెరా సై
సంగెం లక్ష్మీ బాయిరా సై
బాలలను బాగు పరచెరా సై
అచ్చమాంబను చూడరా సై
మహిళల మార్గము దిద్దెరా సై
కల్పన చావ్లా చూడరా సై
అంతరిక్షమున కెగిరెరా సై
సునితా విలియం చూడరా సై
పరిశోధనలెన్నో చేసెరా సై

అన్ని రంగములలోన మహిళలూ ఆదర్శంగా నిలిచారు.

-భళానంటి భలి తమ్ముడా - సై - మేలు భలానోయ్ తందానా ॥
తకతా - తకిట తక - తరికిట తరికిట - తా

రోజా : అక్కా ! అక్కా ! ఆ తర్వాత ఏమైందో నేను చెబుతా ! ఆ మాటలన్నీ లోపలి నుంచి వింటున్న సీత బయటికి వచ్చి, తాను చదువుకుంటానని చెప్పింది.

క్రిష్ణవేణి : అవును చెల్లెమ్మా ! అంతేకాదు, టీచర్ మాటలతో ప్రభావితులైన శివయ్య దంపతులు బిడ్డను చదివించడమే మంచిదన్న సంగతి అర్థం చేసుకున్నారు. సీతను టీచర్ వెంట పంపించారు.

రాజు : అంతే లెండి. అందరూ మా చిన్నక్కలా ఉంటారా ?

రోజా : అంటే ?

రాజు : నువ్వు రాజుకంటే గొప్పదానివక్కా ?

రోజా : ఈ కథ గానీ, నీ సంగతి చెబుతా.

క్రిష్ణవేణి : సరే ! మీరు తర్వాత కొట్టుకోవచ్చు. ముందు కథ వినండి. సీత ఎట్లా చదువుకున్నదయ్యా అంటే

(పాట) అక్షరమాల నేర్చెరా సై

తెలుగు చక్కగా జదివెరా సై
ఎక్కాలన్నీ నేర్చెరా సై
లెక్కలు చక్కగ జేసెరా సై
పరిసరాల విజ్ఞానమూ సై
చక్కాగా గ్రహించెరా సై ॥తదిక్కుతోం॥
ఏది జదివినా - ఏది రాసినా - ఎదురులేదు తనకు ॥తందాన తాన॥
అందరిలోను అన్నిటికన్నా ముందు నిలిచె తుదకు ॥తందాన తాన॥
తా - తకిటతక - తరికిట తరికిట తా -

క్రిష్ణవేణి : ఆమె తెలివితేటలు గమనించిన పాఠశాల ప్రాధానోపాధ్యాయులు కూడా ముగ్ధులై ఏడాది గడవకుండానే ఐదో తరగతిలో చేర్పించారు.

రోజా : చూడు ! చదివితే అట్లా చదువాలి.

రాజు : నువ్వేం నన్ను వెక్కిరించనవసరం లేదు. నేను కూడా ఒకటో తరగతిలో ఉండంగనే పెద్ద పెద్ద లెటర్స్ చదివిన.. తెల్సా ?

రోజా : నువ్వా ? అంత లేదు. ఏం చదివినవో చెప్పు.

రాజు : లెటర్స్... పెద్ద లెటర్స్

రోజా : అవే.. ఏంటో... ఒకటి రెండు చెప్పు

రాజు : ఒకటి రెండు కాదు... 26 చదివిన...
చెప్పలేనా ? చెప్పమంటవా ? అయితే విను. A... B... C... D...

రోజా : ఆ లెటర్సా ? ఏడ్చినట్లే ఉంది. నువ్వు తర్వాత కథ చెప్పక్కా

క్రిష్ణవేణి : ఆ తర్వాత సీతకు ఎదురే లేకుండా పోయింది. ఏడో తరగతి కూడా పూర్తి చేసింది. సరిగ్గా అదే సమయంలో శ్రావణి టీచర్ ప్రమోషన్ మీద బదిలీ అయి, వేరే ఊరికి వెళ్ళింది.

రాజు : అయ్యో ! అయితే సీత చదువు ఆగిపోయిందా అక్కా ?

క్రిష్ణవేణి : లేదులే రాజూ ! శ్రావణి టీచర్ సీత మనసులో చదువు బీజాలు బలంగా నాటింది. టీచర్ బదిలీ అయినా ఉన్న ఊళ్ళో పై





చదువులకు అవకాశం లేకపోయినా పట్నం పోయి స్కూల్ చదువూ, కాలేజీలో ఇంటరూ పూర్తిచేసి, డిగ్రీలో చేరింది.

క్రిష్ణవేణి : ఎందుకక్కా ? ఇంజనీరింగ్‌లో సీటు దొరకలేదా ?

క్రిష్ణవేణి : ఏదో చదువుకొని, డబ్బులు సంపాదించి, తను మాత్రం హాయిగా ఉండాలనుకోలేదు సీత. తను బాగా చదువుకొని, తనలాంటి పిల్లలను బాగుపరచాలని, కలెక్టరుగానో, నాయకురాలుగానో ఈ సమాజానికి సేవ చేయాలని గట్టిగా నిర్ణయించుకుంది. డిగ్రీ చదివి పోటీ పరీక్షల్లో విజయం సాధించి, మండల అభివృద్ధి అధికారిగా ఎంపికైంది.

రాజు : ఓహో ! చాలా బాగుంది. తర్వాత కథ చెప్పక్కా.

క్రిష్ణవేణి : తర్వాతేముందిరా తమ్ముడూ ! పిల్లల చదువుకోసం, స్త్రీలకు మేలు చేసేందుకోసం నిరంతరం కృషి చేస్తుందిప్పుడు మన సీతక్క

రోజా : ఔనా ! అక్కా ! సీత ఇష్టాలన్నావు కదా ! అవేవో చెప్పవా ?

రాజు : మరి నా ఇష్టాలో....

రోజా : అవా? అవి... మన కథ అయిన తరువాత తీరుబడిగా చెప్పుదువుగానీ ముందు సీత ఇష్టాలు విను.

రాజు : సరే సరే... నువ్వుంటావు గదా ! వింటావు గదా ! ఇప్పుడు నువ్వు... ముందు అక్క చెప్పేవి విను.

క్రిష్ణవేణి : (పాట) ఆడపిల్లలను చిన్నచూపుతో చూడరాదు భాయీ
॥అరరే చూడరాదు భాయీ॥
అన్నిటిలోనూ అవకాశాలను కల్పించాలోయీ
॥చక్కగా కల్పించాలోయి॥
చదువులనైనా పదవులనైనా సమానమేనోయీ
॥వాల్లు సమానమేనోయి॥
వాళ్ళల్లోని ప్రతిభను నీవూ గౌరవించవోయీ
॥తప్పక గౌరవించవోయీ॥ తరికిట ఝుం తరిత.



Scanned with OKEN Scanner

రాజు : చాలా మంచికథ చెప్పావు అక్కా. ఈ కథ వింటే నిజంగా ఎవ్వరిలోనయినా మార్పు వస్తుంది.

రోజా : ఇటువంటి సీతక్కలు ఊరికొక్కరున్నా ఈ దేశం తొందరగా బాగుపడుతుంది.

క్రిష్ణవేణి : ప్రతి ఒక్కరూ ఈ సీతక్కను ఆదర్శంగా తీసుకొని తమనూ, తమ దేశాన్నీ బాగుపరచాలని కోరుకుంటూ, కథ ముగించుదాం.

(పాట) మంగళం మన భారతమాతకు ॥
మంగళం జయ మంగళం ॥
మంగళం తెలంగాణ తల్లికి ॥
మంగళం జయ మంగళం ॥
మంగళం మన రుద్రమదేవికి ॥
మంగళం జయ మంగళం ॥
మంగళం ఆదర్శ మహిళలకు ॥
మంగళం జయ మంగళం ॥
తరికిట ఝుం తరిత !





## అసామాన్యులు (వ్యాసం)

ప్రతిరోజూ మనం ఎన్నింటినో చూస్తుంటాం. వాటిలో కొన్నింటిని పట్టించుకోం. మరికొన్నింటిని గురించి ఆలోచించం. కానీ కొద్దిగా దృష్టిపెడితే కొన్ని విషయాలలో ఆశ్చర్యం కలుగుతుంది. మర్రి విత్తనాన్ని చూశారా ? ఎంత చిన్నగా ఉంటుంది ! పరిశీలించి చూస్తే తప్ప గుర్తుపట్టలేనంతగా ఉంటుంది. కాని దీనిలో నుంచే పెద్ద మర్రిచెట్టు వస్తుంది. అంటే అంత చిన్న గింజలో ఇంత గొప్ప శక్తి ఉందన్నమాట. ఇట్లే మన మధ్యనే ఉన్నవాళ్ళలో కూడా ఏదో గొప్పతనముంటుంది. సామాన్యులుగా కనిపించేవాళ్ళలో అసామాన్యమైన ప్రతిభ దాగి ఉంటుంది. దాన్ని గుర్తించాలి. గౌరవించాలి.

"ఆకాశంలో హాయిగా ఎగురగలిగే విమానాన్ని ఎవరు కనుగొన్నారు? ప్రపంచంలోని విషయాలను క్షణాలలో ప్రత్యక్షంగా మనకు చూపించే టీ.వీని కనిపెట్టిందెవరు? సమాచార వ్యవస్థలో సాంకేతిక విప్లవాన్ని తెచ్చిన సెల్‌ఫోన్ రూపశిల్పి ఎవరు?" అని తరచూ ప్రశ్నిస్తుంటాం. కాని ఈ సుఖాలు, విలాసాలకన్నా ముందు జీవిత అవసరాలను తీర్చుకొనే మార్గం చూపిన మహా పురుషుల గురించి ఎప్పుడైనా దృష్టి సారించామా ? వాళ్ళ కృషిని, త్యాగాన్ని ఎన్నడైనా తలచుకొంటున్నామా ?

"అన్నమయములైనవన్ని జీవమ్ములు – కూడులేక జీవకోటి లేదు" అన్నాడు పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారు. ఆహారం లేకుంటే ఏ ప్రాణీ బతుకదు. ఇంత ప్రాధాన్యమున్న ఆహార విషయాలను గురించి మనకు మొదట తెలిపినవారు ఆదివాసులు. అడవులే అమ్మ ఒడిగా, కొండకోనలే తోడునీడగా జీవిస్తారు. వాళ్ళు రేయింబవళ్ళు ప్రకృతితోనే కలిసి ఉంటారు. ప్రకృతిని బాగా పరిశీలిస్తారు. ఏవి తినాలో, ఏవి తినగూడదో చెప్పారు. అట్లా చెప్పడానికి వాళ్ళు ఎన్నో ప్రయోగాలు చేశారు. వాటిని రుచి చూశారు. ఆయా ప్రయోగాలలో కొన్ని సందర్భాలలో కొందరు ప్రాణాలను కూడా వదిలారు. జంతువుల మాంసం తినడానికి ముందు ఆయా జంతువులను పరిశీలించారు. ఆ జంతువుల ఆహారపు అలవాట్లపైన దృష్టి పెట్టారు. ఆ తరువాత ఇది తినవచ్చు, ఇది తినగూడదని చెప్పారు. వాళ్ళ పరిశీలన, శ్రమ, త్యాగం ఎంత గొప్పవో !



Scanned with OKEN Scanner

కోయలు, గోండులు, చెంచులు మొదలైన గిరిజన జాతులకు ప్రకృతి విజ్ఞానం ఎంతో గొప్పది. చెట్లను గురించి వాళ్ళకు తెలిసినంతగా ఎవరికీ తెలియదనడం అతిశయోక్తి కాదు. వాళ్ళు శాస్త్రజ్ఞులే. రోగాల బారిన పడినప్పుడు చెట్లమందులతోటే ఆరోగ్యాన్ని తిరిగి పొందారు. ఇట్లా వనమూలికలతో చేసే వైద్యమే ఆయుర్వేదం. ఆయుష్షును పెంచేదే ఆయుర్వేదం. పూర్వం యుద్ధాలలో గాయపడిన వారికి కూడా ఈ ఆయుర్వేద వైద్యం చేసేవారు. ఈ విషయాలలో గురువులై వారు తరువాతి తరాలకు తోవ చూపారు.

ఆదివాసులే కాదు, పల్లెతల్లి ఒడిలో బతికే జానపదుల జ్ఞానం కూడా తక్కువేమీ కాదు. పల్లెవారి పనితనాన్ని తెలిపేటట్లుగా వివరించేటట్లుగా ఎన్నో పాటలు కూడా ప్రాచుర్యంలో ఉన్నాయి. గ్రామంలోని వివిధ పనులు, వృత్తులు చేసేవారు ఒకరిపై ఒకరు ఎట్లా ఆధారపడుతారో వివరించే పల్లె పాటలు మనకు ఎన్నో అందుబాటులో ఉన్నాయి. నిత్యం మనం వాడుకొనే ఒక వస్తువు అది కంచం కావచ్చు, మంచం కావచ్చు, టేబుల్ కావచ్చు. వీటిని తయారు చేయాలంటే వడ్రంగి, కమ్మరి, ఇతర పనులవారు కృషి చేయవలసి ఉంటుంది.

ఇట్లా వృత్తులన్నీ ఒకదానిమీద మరొకటి ఆధారపడి ఉంటాయని గుర్తించండి. అట్లే ఒక్క 'సోల' తయారీ వెనుక ఎందరు వృత్తిపనివాళ్ళ కష్టం దాగి ఉందో ఆలోచించండి. ఒకరికొకరు చేదోడువాదోడుగా ఉంటే తప్ప సమాజం సజావుగా సాగదు. ప్రతి వృత్తీ పవిత్రమైనదే. ప్రతి వృత్తిపనిలోనూ, ఎంతో కష్టం, నైపుణ్యం, త్యాగం కలగలిసి ఉంటాయి. కాంతి చూసి మురిసిపోతాం. కాని ఆ కాంతినివ్వడానికి కరిగిపోయే కొవ్వొత్తిని గురించి ఎప్పుడైనా ఆలోచిస్తున్నామా ?

ఎండాకాలం వచ్చిందంటే చాలు కుండలకు, కూజాలకు మహా గిరాకీ. అటికెలు, గురుగులు మన అవసరాలను తీరుస్తున్నాయి. భక్తి జీవితంలో భాగమైనవి ప్రమిదలు. ఇవన్నీ చకచకా ఎట్లా వచ్చేస్తున్నాయి ? కుమ్మరి చక్రం నుంచి బంకమట్టినుంచే. బంక మట్టి ఊరికే తయారవుతుందా ? మెత్తటి మట్టి, బూడిద, రంపపు పొట్టు, సన్న ఇసుకను కలిపి దీన్ని తయారుచేస్తారు.





ఈ మూడింటిని కలిపి కాళ్ళతో బాగా తొక్కుతారు. చెమటోడ్చి సిద్ధం చేసిన ఈ బంకమట్టిని బండి చక్రం వంటి సారెమీద పెడుతారు. చక్రం మాత్రం ఊరికే తయారైందా ? కమ్మరి, వడ్రంగి వాళ్ళ నైపుణ్యం కలగలిసి ఏర్పడింది. ఇందులో ఎంతో ఇంజనీరింగ్ నైపుణ్యం తొంగిచూస్తుంది. చక్రం తాను తిరగడం కాదు, సమాజ గతినే తిప్పేసింది. ఇదొక అద్భుత ఆవిష్కరణ.

చక్రం తిప్పుతూ చక్రం మీద పెట్టిన బంకమట్టిని చేతివేళ్ళ కొసలతో చాకచక్యంగా నొక్కుతారు. అత్యంత ఆశ్చర్యకరంగా, అనుకున్నరూపాలు అమాంతంగా వచ్చేస్తుంటాయి. ఆ చేతుల్లో ఇంద్రజాల విద్య ఉన్నదా ? అని అనిపించక మానదు. తయారైన మట్టిపాత్రలను ఆరబెడతారు. తరువాత కుమ్మరి ఆవము'లో పెట్టి బురదమట్టితో కప్పేస్తారు. దీనివల్ల కొలిమిని మండిస్తే అన్ని పాత్రలకూ ఆ వేడి తగులుతుంది. పాత్రలన్నీ బాగా కాలి గట్టిగా తయారవుతాయి. మనం ఉపయోగించుకొనే మట్టిపాత్రల వెనుక ఇంత నైపుణ్యముంది.

నగలంటే ఇష్టంలేని వాళ్ళెవరైనా ఉంటారా ? మెడలో హారాలు, చేతులకు కడియాలు, గాజులు, చెవికమ్మలు, ముక్కుపుల్ల, సిగబిళ్ళ, నడుముకు ఒడ్డాణం, కాళ్ళకు కడియాలు, గజ్జెలు, వేళ్ళకు ఉంగరాలు.... ఇట్లా ఎన్నెన్నో ఆభరణాలు ఆపాదమస్తకం ధరిస్తారు. ఒకప్పుడు ఏడు వారాల సొమ్ములు ధరించేవారట. ఆధునిక కాలంలో మరెన్నో రకాల వస్తువులు అందుబాటులోకి వచ్చాయి. ఒక్కొక్క ఆభరణాన్ని ఎన్నో రకాలుగా తీర్చిదిద్దుతారు. ముద్దగా ఉన్న బంగారాన్ని ముద్దులొలికే నగలుగా తీర్చిదిద్దడంలో ఎంత శ్రమదాగి ఉన్నదో తెలిస్తే ముక్కు మీద వేలువేసుకొంటాం. బంగారం అంత సులభంగా కరుగదు. బంగారాన్ని మూసలో పెట్టి బొగ్గుల కొలిమిలో ఉంచి కరిగిస్తారు. నిప్పు రాజేయడానికి, నిప్పులు కణకణలాడేలా మండడానికి బాగా ఊదాలి. బంగారం పనిచేసేవాళ్ళు (స్వర్ణకారులు) ఇట్లా ఊది ఊది అనారోగ్యపు బారినపడిన సందర్భాలు ఎన్నో.

బంగారమేకాదు మనం నిత్యజీవితంలో వాడే వెండి వస్తువుల తయారీలో కూడా ఎంతో కళాదృష్టి, నైపుణ్యం కనిపిస్తుంది. బంగారాన్ని వెండిని



Scanned with OKEN Scanner

వివిధ ఆకృతులుగా తీర్చిదిద్దడంలోగానీ, రత్నాలను పొదగడంలో గానీ సున్నితమైన పనితనం కనిపిస్తుంది. సన్నని వస్తువును తయారుచేసేటప్పుడు వాళ్ళ కళ్ళు తీవ్రమైన ఒత్తిడికి లోనవుతాయి. అయినా మన కళ్లకు ఆనందాన్నిచ్చేటట్లు ఆభరణాలను అందించేటందుకు శ్రమిస్తున్నారు.

ఇనుముతో నిత్యం సహవాసం చేసే కమ్మరులు తమ శ్రమను, నైపుణ్యాన్ని సమాజం కోసం త్యాగం చేస్తున్నారు. ఇనుముతో వాళ్ళు చేసే నాగటి 'కర్రు' భూమిని దున్నడానికి ఉపయోగపడుతుంది. అట్లాగే పార, గొడ్డలి, గడ్డపార, కొడవలి, సుత్తి మొదలైనవి వ్యవసాయానికి చాలా అవసరమైన పనిముట్లు. వీటితోబాటు బండి చక్రపు (గిర్ర) పట్టాను కూడ తయారుచేసేవారు. ఇదొక గొప్ప ఇంజనీరింగ్ ప్రక్రియ. వీటన్నింటికీ ఉత్పత్తికేంద్రం కమ్మరి కొలిమి. అది నిప్పులతో కణకణ మండుతూ ఉంటుంది. ఆ సెగను భరిస్తూ ఇనుమును కాల్చి సుత్తెతో కావలసిన వస్తువుల కదిరూపాలను తీర్చిదిద్దుతారు. ఇట్లా చేయడానికి చాలా కష్టపడవలసి ఉంటుంది.

ఇక వడ్రంగుల పనితనాన్ని ఒకసారి చూద్దాం. మనకు ఆహారం కావాలంటే భూమిని దున్నాల్సిందే. అందుకు ప్రధానసాధనం నాగలి. దీన్ని రూపొందించే వాళ్ళు వడ్రంగులు. ఇదే కాదు గుంటుక, గొర్రు వంటి పనిముట్లు కూడా వ్యవసాయంలో కీలకమైనవి. వీటిని తయారుచేయాలంటే ఏ చెట్టు సరిపోతుందో పరిశీలిస్తారు. తాతముత్తాతల కాలంలో వీరు వంట కలప పరిశోధించారు. కొయ్యను సరియైన రూపాలలోనికి తీసుకురావడం వెనుక ఎంతో శ్రమ ఉంటుంది. చెట్టు కొట్టాలి, కొయ్యాలి, చెక్కాలి, దువ్వోడ (దూగడ) పట్టాలి. తొలి (రంధ్రం) కొట్టాలి. అందులో బిగించాలి... ఇలా ఎన్నెన్నో దశలు. వడ్రంగులు సమాజానికి అందించిన మరో సౌకర్యం బండి. ఇది వ్యవసాయానికే కాదు, ప్రయాణానికి కూడా పనికి వస్తుంది. అంతేకాక మొన్నమొన్నటి వరకు ఇండ్ల కట్టె (కలప) తోటే నిర్మించారు. దూలాలు, వాసాలు, కిటికీలు, తలుపులు ఇవన్నీ వడ్రంగుల పనితనం మూలంగా అందంగా ఆకర్షణీయంగా తయారవుతాయి. మనం వాడుకొనే మంచాలు, కుర్చీలు, బెంచీలు, టేబుళ్ళు, తనబ్బీలు... (అలమార) ఇటువంటివెన్నో వడ్రంగుల చేతుల్లో రూపొందినవే!





అందుకే వాళ్ళను 'దారు శిల్పుల'ని అంటారు. ఇవన్నీ మనం డబ్బుతో కొనుక్కొంటే వస్తున్నాయని అనుకుంటాం! అయితే వీటిని తయారుచేసినప్పుడే కదా ఎవరైనా కొనుక్కొనేది! ఇంటి సామాగ్రి, వస్తు సామాగ్రి, వ్యవసాయ సామాగ్రి వంటివి చూస్తున్నప్పుడు వడ్రంగులను తలచుకోవడం మన ధర్మం. వాళ్ళ నైపుణ్యాన్నీ, గొప్పదనాన్ని గౌరవించడం మన బాధ్యత.

తెల్లవారినప్పటి నుంచి అడుగు బయటకు వేయాలంటే చెప్పుల్లో కాళ్ళు పెట్టాల్సిందే. చెప్పుల చరిత్రను చెప్పుకొంటే ఆవేదన, ఆశ్చర్యం కలుగుతాయి. ఏదైనా జంతువు చనిపోతే దాన్ని చూసి దూరంగా వెళ్తాం. కాని తోలు పనివాళ్ళు ఆ జంతువు చర్మాన్ని ఒడుపుగా ఒలుస్తారు. శుభ్రం చేస్తారు. దానితోనే చెప్పులు తయారుచేస్తారు. ఒక వ్యర్థపదార్థం నుంచి అందరికీ ఉపయోగపడే వస్తువును సృష్టించినవారి తెలివి ఎంతో గొప్పది. అందుకు వాళ్ళు పడే శ్రమ అంత ఇంత కాదు. అసలు దీనికి వెలకట్టగలమా ? వీరి ఔదార్యాన్ని చాటుతున్న ఈ పద్యం చదువండి.

"ముప్పు ఘటించి వీని కులమున్, కలిమిన్ కబళించి దేహమున్
పిప్పి యొనర్చు నీ భరతవీరుని పాదము కందకుండగా
చెప్పులు గుట్టి జీవనము సేయును గాని నిరాకరింప లే
దెప్పుడు అప్పువడ్డది సుమీ భరతావని వీని సేవకున్"

అని గుఱ్ఱం జాషువగారు నొక్కి వక్కాణించారు.

జంతు చర్మాన్ని అనేక రకాలుగా మలుచడంలో వీరి ప్రతిభ కనిపిస్తుంది. చర్మంతో 'డప్పు' లాంటి వాద్యాలను తయారుచేశారు. ఇప్పటికీ ఊళ్ళలోఏదైనా విషయం చాటింపువేయాలంటే డప్పు కొట్టాల్సిందే. చివరికి మనిషిని కాటికి పంపడానికి కూడా డప్పు ముందుంటుంది. ఒకప్పుడు వ్యవసాయ బాయిలోని నీటిని పైకి తోడేమోటకు పెద్ద బొక్కెనలుండేవి. వాటి తొండాలను కూడా చర్మంతో వీళ్ళే తయారుచేసేవారు.

సమాజానికి ఎనలేని సేవలు చేసిన దళితులను అంటరానితనం పేరిట దూరంగా ఉంచారు. గాంధీ, అంబేద్కర్ వంటి ప్రముఖుల కృషి ఫలితంగా



Scanned with OKEN Scanner

వీరికి రాజ్యాంగపరమైన రక్షణ లభించింది. వీరిపట్ల సమాజం ప్రత్యేక దృష్టి సారించాలి. వారికి సమాన గౌరవం లభించేందుకు అన్ని కోణాలలో కృషి జరగాలి.

సంఘంలో క్షురకుల సేవలు మరవరానివి. (క్షురమంటే కత్తి తలవెంట్రుకలను కత్తిరించేవాడు క్షురకుడన్నమాట) ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో వారి భాగస్వామ్యం ఉన్నది. కత్తి, కత్తెరలతో వారు చూపే పనితనం నాణ్యమైందే కాదు, సున్నితమైంది కూడా. క్షురకులకు తరతరాలుగా తెలిసిన మరొక విద్య దేశీయమైన వైద్యం. చెట్ల వేళ్ళతో, ఆకులతో, చేపలతో చేసే మందులను గురించి కూడా వీళ్ళకు చక్కటి అవగాహన ఉంటుంది. పేను కొరకడం, శరీరానికి గాట్లు పడడం వంటి సందర్భాలలో వాటి నుండి బయటపడే చిట్కాలు వీరి దగ్గర అనేకంగా ఉంటాయి. తైలంతో శరీరమర్దనం (మాలిష్) చేయడంలో గొప్ప నైపుణ్యం ఉంటుంది. స్త్రీల ప్రసవ సమయంలో, పురుడు పోయడంలో, తల్లీబిడ్డల సంరక్షణలో మంత్రసానులుగా మంగలిస్త్రీల పాత్రకు ఎంతో ప్రాధాన్యం ఉన్నది. వీరి సేవలన్నీ ఆరోగ్యకరమైన సమాజానికి అవసరం.

శరీరాన్ని రక్షించుకోవాలంటే బట్టలు కావాలి. వాటిని బజారుకు వెళ్ళి కొని తెచ్చుకుంటున్నాం. కాని అవి తయారుకావడానికి పరిశ్రమించేది నేతపనివారు. వాళ్ళు బట్టలు నేసే మగ్గాన్ని ఎప్పుడైనా చూశారా ? దాని వెనుక ఎంతో సాంకేతిక పరిజ్ఞానం ఉన్నది. మగ్గంలో వాళ్ళు దారాలను ఏర్పరుచుకున్న తీరు, నేసేటప్పుడు వారు చూసే నైపుణ్యం ఎంతో గొప్పది. ఒకప్పుడు మన దేశంలో నేత పనివారు అగ్గిపెట్టెలో పట్టేటంత చీరను నేసినారంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఇదంతా ఆషామాషీ వ్యవహారం కాదు. పత్తి నుంచి దారం తీయడం, రంగులద్దడం, అవసరమైన పద్ధతిలో గుడ్డను తయారుచేయడం... ఇదొక సుదీర్ఘ ప్రక్రియ.

గొర్రెల బొచ్చు కత్తిరించి ఉన్నిదారం వడికి దానితో గొంగడి (కంబలి)ని తయారుచేసే కురుమల శ్రమ ఎందరికో వెచ్చదనాన్ని కలిగిస్తుంది. మురికి





బట్టలను శుభ్రంచేసే రజకుల కాయకష్టం మనకు ఆరోగ్యాన్ని అందిస్తుంది. శుభాశుభ కార్యక్రమాలు వీరి ప్రమేయం లేకుండా జరుగవు.

ఈ వృత్తులవారందరూ చూపిన నైపుణ్యం తరువాత కాలంలో అద్భుతమైన ఆవిష్కరణలకు దారితీసింది. వీళ్ళ ఆలోచన, నైపుణ్యం ఎందరినో కదిలించింది. వీటిని ఆధారంగా చేసుకొని కొత్త వాటిని కనుక్కోవడానికి ప్రేరణ కలిగించింది.

ఒక్కరోజు ఆహారం లేకుంటే తల్లడిల్లుతాం. పిడికెడు మెతుకుల కోసం పడరాని పాట్లు పడేవాళ్ళెందరో ఉన్నారు. ఎవరేపని చేసినా కడుపు నింపుకోవడానికే. మనం తినే అన్నం, కూరగాయలు, పండ్లు వంటివేవీ సులువుగా వచ్చిపడేవికావు. చెమటోడ్చి పనిచేసిన రైతుల కృషి ఫలం. ఎండనక, వాననక రేయింబవళ్ళనక రెక్కలు ముక్కలు చేసుకొని రైతు శ్రమిస్తే మనం హాయిగా తినగలుగుతున్నాం. భారతదేశపు మాజి ప్రధానమంత్రి లాల్‌బహదూర్ శాస్త్రిగారు 'జై జవాన్, జై కిసాన్' అన్న నినాదమిచ్చాడు. సమాజానికి రైతు చేసే సేవ ఎంత గొప్పదో తెలిపే ఈ గేయాన్ని చదువండి.

రైతే దేశానికి వెన్నెముక
అతడలిగితే లేదు మనకు అన్నమిక
కోటి విద్యలు అన్ని కూటికొరకన్నారు.
కూడుగోడును బాప రైతన్నలున్నారు.
నడుమొంచి కష్టించి పాడిపంటలు పెంచి
పొట్ట చల్లగుండంగ పోషించు అన్నదాత
తానేమో పస్తులుండి తిండి పెడుతున్నాడు.
సమాజ గమనానికి సాయపడుతున్నాడు.
రాత్రనక పగలనక అత్రంగ పనిచేస్తూ
సోమరితనమొద్దని చాటిచెప్పే ధీరుడు.

ఎండకు ఎండినా వానలో తడిసినా
చలిలో వణికినా సమస్యలతో నలిగినా



Scanned with OKEN Scanner

సడలని స్థైర్యంతో సస్యములనందిస్తూ
జాతి సేవలో పుణీతుడై నిలచిన ॥రైతే॥

ఇట్లా చూస్తూ పోతే ప్రతి ఒక్క వృత్తిలోనూ ఎంతో కొంత శ్రమ, నైపుణ్యం తొంగిచూస్తాయి. ప్రతి వృత్తీ పవిత్రమైందే. దీన్నీ చిన్నచూపు చూడాల్సిన పనిలేదు. ఎవరి ఇంట్లో శుభకార్యం జరగాల్సిఉన్నా మంగళవాద్యాలు, కుండలు, ప్రమిదలు, ఆభరణాలు, వస్త్రాలు మొదలయినవన్నీ కావాలి. అంటే ఇన్ని వృత్తులవాళ్ళు సహకరిస్తేనే ఏ కార్యాలైనా జరుగుతాయి. ఇట్లా అందరూ పరస్పరం సహకరించుకొంటేనే సమాజం నడుస్తుంది. అంతేకానీ 'ఎవరికి వారే యమునా తీరే' అన్నట్లుగా ఉంటే సమాజ అభివృద్ధి కుంటుబడుతుంది. ఇందులో ఎక్కువ తక్కువ తేడాలు మన మనస్సుల్లో ఉండగూడదు. శరీరంలో కళ్ళు, చెవి, ముక్కు, కాళ్ళు, చేతులు... వీటిలో ఏవి గొప్ప అంటే ? అన్నీ కలసి ఉంటేనే శరీరం. అట్లాగే అందరూ కలిసి ఉంటేనే సమాజం. ఒకప్పుడు గ్రామాలు స్వయంసమృద్ధంగా వెలిగినాయి. గ్రామజీవనానికి అవసరమైన వస్తువులను అన్ని వృత్తులవారూ కలిసిమెలిసి తయారుచేసుకొనేవారు. ఒకరి అవసరాలకు మరొకరు చేదోడువాదోడుగా నిలిచేవారు. కులాలను పక్కకు పెట్టి అక్క, బావ, మామ, అత్త అన్న అని పిలుచుకొనే ఆత్మీయబంధం వాళ్ళది. మానవత్వాన్ని చాటిని మధుర జీవనం వాల్లదనుకొని ఉండటం, ఒకరిమీద ఒకరు ఆధారపడటం, ఒకరికొకరు సహకరించుకోవడం, మన సంస్కృతిలోని గొప్ప విలువలు. వీటిని అలవరచుకోవడం, పాటించడం, పాడుకోవడం మనందరి ధర్మం.

మనిషిని మనిషిగా గౌరవిద్దాం. అతనిలో దాగున్న ప్రతిభను అభినందిద్దాం. ఆ గొప్పదనాన్ని మనం అందుకోవడానికి ప్రయత్నిద్దాం. 'శ్రమ' పునాదిపైనే 'అభివృద్ధి' భవనం ఆధారపడి ఉంటుంది. శ్రమించడానికి ఎవరూ సిగ్గుపడగూడదు. సోమరితనంతో శ్రమించకపోతేనే సిగ్గుపడాలి. శ్రమైక జీవన సౌందర్యాన్ని చూడగలగాలి. శ్రమను గౌరవంగా భావించడం నేర్చుకోవాలి. శ్రమసంస్కృతితో జీవించడం నేర్చుకోవాలి.





## సముద్ర ప్రయాణం (యాత్రా రచన)

పడవ యునైటెడ్ కింగ్‌డమ్‌కు బయలుదేరింది. రెండవ ప్రపంచ యుద్ధం 1939లో మొదలయింది. అప్పటి నుండి గ్రేట్ బ్రిటనుకు పడవలు తరుచుగా పోవటం లేదు. నేను వెళ్ళినది సెప్టెంబర్ 8-1944లో బ్రిటనుకు చేరే వరకు ఏవేళ ప్రాణం పోతుందో అనే భయమే. కాబట్టి వెళ్ళినప్పుడల్లా ఒక్కొక్క పడవ వెళ్ళేది కాదు. సైన్యపు బందోబస్తులో చాలా నౌకల "కాన్వాయి" వెళ్ళేది.

మా కాన్వాయ్‌లో 50-60 నౌకలు ఉండె. ప్రతి పడవ పైన "Life boats" ఉండేవి. పడవ కాప్టెన్ మొదలగు ఆఫీసర్లు వచ్చి, మమ్ములను సరిగా ఉన్నామా అని ఇన్స్‌పెక్ట్ చేసి, తరువాత అందరిని పంపేవారు. బొంబాయిలో పడవ ఎక్కిన తరువాత కూడా, కొన్ని దినాల వరకు పడవ అక్కడనే ఉండింది. మమ్ములను దిగనివ్వలేదు. మా క్యాబిన్‌లో ఆరు బెర్తులు ఉండె. మా పడవలోని అటెండెంట్లు భారతీయులే. వారు ఉండే డెక్ వేరే. వారు తినే డెక్ వేరే.

పడవ చిన్నదీ కాదు, చాలా పెద్దదీ కాదు. కొత్త వారికి సముద్రరోగము వస్తుంది. సముద్రం ప్రశాంతంగా ఉంటే ఈ జబ్బురాదు. దీనికి డబ్బు తీసుకోకుండానే పడవవారు మందులు ఇస్తారు. సముద్రం సరిగా లేకుంటే ఈ జబ్బు వస్తుంది. తల తిరుగుతుంది. తల నొస్తుంది. కక్కు వస్తుంది. కండ్లు తిరుగుతవి. ఆ సమయంలో పక్కపైన పడుకొని ఉంటారు.

పడవలో హాస్పిటల్ కూడా ఉంటది. డబ్బు తీసుకోకుండానే సామాన్య రోగాలకు మందులు ఇస్తారు. రోగులు లేవలేకుంటే డాక్టర్లు, నర్సులు క్యాబిన్‌కి వస్తారు. మందులు క్యాబిన్‌కు పంపుతారు. పోస్టు ఆఫీసు కూడా ఉంటుంది. తరువాతి రేవు రాకముందే పోస్టులో జాబులు వేయమని నోటీసు పెట్టుతారు. మనకు జాబువస్తే క్యాబిన్‌కు పంపుతారు.

టెలిగ్రాఫ్ ఆఫీసు (వైర్‌లెస్) కూడా ఉంటుంది. మనకు టెలిగ్రాములు వస్తే ఇస్తారు. మనం కూడా టెలిగ్రాములు ఇవ్వవచ్చు. పడవలో "రిసెప్షన్ రూం" కూడా ఉంటుంది. అది రాత్రి పగలు ఖుల్లా ఉంటుంది. మనకు కావలసిన



Scanned with OKEN Scanner

విషయాలన్నీ తెలుపుతారు. పడవలో దుకాణము కూడా ఉంటుంది. అన్ని వస్తువులు దొరుకుతవి.

పడవపైన రేడియోలు ప్రతి డెక్ పైన లౌడు స్పీకర్లతో కనెక్టు చేయబడి ఉంటవి. పడవవారు రేడియో వార్తలు అప్పటికప్పుడు టైపు చేయించి, సైక్లోస్టైల్ కాపీలు లాంజ్‌లో పెట్టించేవారు. పీరియాడికల్స్ కూడా లాంజ్‌లో పెట్టేవారు. లాంజ్‌లోని ఫర్నీచర్ గొప్ప ధనవంతుల ఇండ్లలో ఉండేటటువంటివి ఉంటవి. ఫ్లోరు పైన గొప్ప విలువైన తివాసీలు మరియు మఖ్మల్ (వెల్వెట్) తివాసీలు ఉంటవి. కంఫర్టబుల్ సోఫాలు మరియు మెత్తటి కుర్చీలు ఉంటవి. అందరూ కూర్చొని స్నేహితులతో మాట్లాడుతూ ఉంటారు. కొందరు చదువుతూ ఉంటారు.

చిన్న పిల్లలకు నర్సరీ సెక్షన్ మరియు కిండర్ గార్డెన్ సెక్షన్లు ఉంటవి. తల్లిదండ్రులు వెంటలేకుండా ప్రయాణం చేసే పసి పిల్లలు కూడా ఉండిరి. అటువంటి పిల్లల బాధ్యత పడవవారే తీసుకుంటారు. పడవలో లైబ్రరీ కూడా ఉంది. పుస్తకాలను మన క్యాబిన్‌కు చదువుకోవడానికి ఇచ్చేవారు. ఔట్‌డోర్ గేమ్స్ కూడా ఉంటవి. పడవలో ప్రయాణీకులు ఆడుతుండేవారు. చివరి దినం టూర్నమెంట్స్ పెట్టించి, గెలిచిన వారికి బహుమతులు ఇచ్చేవారు. స్విమ్మింగ్ పూల్స్ ఉంటవి. ఈతల పోటీలు జరుగుతూ ఉంటవి. డెక్‌పైన ఓపెన్ ఏర్‌లో రాత్రి ఎందరో పడ్కుండేవారు.

మా పడవలో పాశ్చాత్యులు చాలా ఉండిరి. భారతీయులు చాలా తక్కువగా ఉండిరి. పాశ్చాత్యులలో బ్రిటీష్‌వారే ఎక్కువగా ఉండిరి. బ్రిటిష్‌వారు ఎవరూ కాని నాకు తెలియదు. దగ్గర నుంచి చూడటం, వారి దగ్గర అంత క్లోజుగా కూర్చుని వారి భాష వినటం అదే మొదటిసారి. వారి ఉచ్చారణ సరిగా తెలిసేది కాదు. నా ఉచ్చారణ వారికి తెలిసేది కాదు. కాని వారు భారతదేశంలో ఉన్నవారు కాబట్టి, నా ఉచ్చారణ తెలుసుకొనేవారు. నాకు వారి మాటలు తెలుసుకోవటం చాలా శ్రమ అయ్యేది.

రేడియో ఇంగ్లీషు భాష కూడా తెలియకపొయ్యేది. నేను ధోవతి శేర్వానీతో ఉంటిని. నేను తప్ప మిగతా భారతీయులు పాశ్చాత్య డ్రెస్‌లో ఉండిరి. నా దగ్గరికి చాలామంది బ్రిటిష్ వాళ్ళు రాకపోతూ ఉండిరి. ఐనా కొంతమంది





నన్ను మందలించేవారు. నా దగ్గరకు వచ్చి కూర్చుండి నాతో మాట్లాడేవారు. అందులో తరుచుగా మాట్లాడిన వ్యక్తి జైపూర్ మహారాజాగారి కుమారునికి చదువు చెప్పిన వ్యక్తి. అతడు చాలా మంచివాడు. భారతదేశంలోని ఎందరో రాజకుమారులు వారికి శిష్యులు.

ఇంకొకరు ఆంగ్లో ఇండియను. వ్యక్తి తెల్లగా లేకుండె. అతని పేరు ఫాల్సెట్టు. ఇంగ్లాండుకు సెలవుపైన వెళ్ళుతూ ఉండెను. అతనితో నాకు చాలా స్నేహం కలిగింది. అతడు నాకు పాశ్చాత్యుల అలవాట్లను కావలసిన వాటిని తెలుపుతూ ఉండేవాడు. బ్రిటీష్ జీవితపు కథలు తెలుపుతూ ఉండేవాడు. బ్రిటన్‌లో చదువుకోవడం బీదవారి తరం కాదనేవాడు. వేల రూపాయలు ఉంటే గాని బ్రిటన్‌లో జీవితం జరుగదు అనేవాడు. బ్రిటన్‌లో ఉద్యోగం దొరుకదు అనేవాడు.

డెక్‌పైన మొదటిసారి నన్ను చూసినప్పుడు ఏదో రాజు గారికి వంటచేసే వాణ్ణని, నా డ్రస్సు చూసి అనుకున్నాడట. తరువాత నేను విద్యాభ్యాసానికి వెళ్ళుతున్నానని చెప్పినాను. నేను బీదవాణ్ణి. డబ్బు లేకుండా వెళ్ళుతున్నానని వారికి తెలువదు. నేను చెప్పలేదు. నా దగ్గర డబ్బులేదని తెలిస్తే నన్ను 'డీపోర్టు' చేసి ఇండియాకు తిరిగి పంపుతారని నా భయం. దేవునికి తప్ప ఇంకెవరికీ చెప్పలేదు.

ఇంగ్లాండుకు పడవ చేరగానే, బ్రిటీషు రేవులోని పోలీసులు, తగినంత పైసాలేని వారిని డీపోర్టు చేసి వాపసు పంపుతారనీ, బ్రిటీష్ పోలీసువారు చాలా స్ట్రిక్ట్ అని ఫాల్సెట్ నాతో అనేవారు. వారి మాటలు విని, నన్ను ఇంగ్లాండులో దిగనివ్వరని మళ్ళీ అదే పడవలో దేశం వెళ్ళగొట్టుతారని లోలోపల భయం వేసి "ఈశ్వరా నీవే దిక్కు, నీవే నన్ను తలవని తలంపుగా తీసుకొని వస్తున్నావు. కనుక నీవే నన్ను డీపోర్టు చేయించకుండా ఇంగ్లాండులో ప్రవేశపెట్టమని ప్రతి నిముషం మొక్కేవాణ్ణి.

నేను నా దగ్గర ఎక్కువ సామాను లేకుండా 22 పౌండ్లతోనే ఇంగ్లాండుకు బయలుదేరినాను. అప్పుడు ఎక్స్చేంజ్ రేటు ఒక స్టెర్లింగ్ పౌండ్‌కు



Scanned with OKEN Scanner

కల్దారు 13 రూపాయల 6 అణాలు. ఉన్ని బట్టలు నావద్ద సరిపోయేటన్ని లేకుండె. ధోతి, పయిజామా, శేర్వాణీతోనే పడవలో తిరిగేవాణ్ణి. దేవునిపైన భారం వేసినాను. కనుక నాకు ఇంగ్లాండులో ఏదో పని చూపించి ద్రవ్యం సంపాదించే మార్గం చూపి నన్ను చదివించి తిరిగి తప్పక దేశం తెస్తడన్న నమ్మకంతోనే బొంబాయి నుండి గ్రేట్‌బ్రిటన్‌కు బయలుదేరినాను. మా పడవ మెల్లగా నడిచేది. పడమర వైపుకు పోతూ ఉంటిమి. కాబట్టి రోజూ గడియారం వెనుకకు తిప్పుకోవాలనీ, ఎన్ని నిమిషాలు వెనుకకు తిప్పాలో పడవ రిసెప్షన్ ఆఫీసులో నోటీసు పెట్టేవారు.

గ్రేట్ బ్రిటన్ చేరే వరకు అయిదున్నర గంటలు వెనుకకు తిప్పినాము. మొదటి హాల్ట్ మాది ఆడన్ (ఏడెన్)లో, ఆడెన్ పట్టణములోనికి వెళ్ళటానికి మాకు పర్మిషన్ ఇచ్చినారు. నా వెంబడి ఉన్న గుజరాతీ పిల్లల బంధువులు ఆడన్‌లో ఉండిరి. అతడు కారు తెచ్చి మమ్ములను తీసుకుని వెళ్ళినాడు. ఆడన్ ప్రాంతములోని చారిత్రాత్మకమైనవన్నీ చూపించినాడు. వారి ఇంట్లో మంచి శాఖాహార భోజనం పెట్టి మళ్ళా పడవరేవులో విడిచినాడు. ఆడన్‌లో ఉండేవారందరు అరబ్బీ ముస్లింములు. మన హైదరాబాదులోని ముస్లింల మొహల్లా ఉన్నట్టు ఉంటుంది.

మా పడవ కొన్ని దినాలు పోర్టు సయీద్‌లో ఉండి, మధ్యధరా సముద్రములో ప్రవేశించెను. చాలా జాగ్రత్తగా ప్రయాణం చేసితిమి. మా వెంట ఉన్న యుద్ధ విమానాలు మా పడవపైన ఎగురుచుండెను. డిస్ట్రాయర్లు మైనులను తీసివేస్తూ ఉండెను. అప్పుడప్పుడు డేంజర్ ఉన్నదని మేసేజ్ వస్తే మా పడవలు వెనుకకు తిరిగేవి. కొంతసేపు అయిన తరువాత మార్గం మార్చి మళ్ళీ ముందుకు నడిచేవి. 'జిబ్రాల్టర్' రేవుకు చేరుకొంటిమి.

అట్లాంటిక్ మహా సముద్రములో ప్రవేశించేటప్పుడు సముద్రము చాలా 'కాము' (ప్రశాంతంగా)గా ఉండెను. యుద్ధ నౌకలు, యుద్ధ విమానాలు జిబ్రాల్టర్ సంధిని కాపాడుచుండెను. మేము 'బే ఆఫ్ బిస్కే' చేరితిమి. సముద్రము చాలా ఘోరంగా వైల్డ్‌గా ఉండెను. వాతావరణం చల్లగా, మబ్బులతో నిండియుండెను.





అప్పుడే ఇంగ్లాండు దగ్గరకు వస్తున్నదని అందరూ దిగే సన్నాహాలు మొదలు పెట్టినరు. జర్మన్ బాంబుల నుండి బ్రతికి చివరకు ఇల్లు చేరుకొంటిమని బ్రిటీష్‌వారు సంతోషపడుచుండిరి.

ఇంగ్లీష్ చానల్‌లో మా పడవ చేరగానే సముద్రం 'కాం' (ప్రశాంతం) అయింది. గ్రేట్ బ్రిటన్ పడమటి తీరం పొడుగున ఉత్తరం వైపు మా పడవ పోవుచుండెను. గ్రేట్ బ్రిటన్ భూమి కనపడుచుండెను. దేవుడు నన్ను తుదకు గ్రేట్ బ్రిటన్ చేర్చినందకు సంతోషించి, కృతజ్ఞతా వందనం చేసితిని. కాని పాల్సెట్ గారు ఇతర భారతీయ విద్యార్థులు, బ్రిటిష్ కష్టం వాళ్ళు పడవ దిగేముందు డబ్బు గురించి అడుగుతారనీ, సరిపోయేటంత డబ్బు లేకపోతే పడవ దిగనివ్వరని మాటిమాటికి గట్టిగా చెప్పుచుండిరి. కాబట్టి నన్ను గ్రేట్ బ్రిటన్‌లో దిగనిస్తారో లేదో అని లోలోపల చింతించుకొంటూ, మాటిమాటికి దేవుణ్ణి శరణు జొచ్చితిని.

అప్పుడు నేను నాతో పాటు గ్రేట్ బ్రిటన్‌కు ప్రయాణిస్తున్న కరీంనగరు జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు గారి అబ్బాయి సరేశ్‌బాబును కలిసితిని. క్లుప్తంగా నా పరిస్థితి వివరించితిని. నా దగ్గర డబ్బు లేదన్న రహస్యం ఎవ్వరికీ చెప్పనని అతని నుండి వాగ్దానము తీసుకొంటిని. ఆ పిల్లవాడు చాలా మంచివాడు. అతని దగ్గర 150/- పౌండ్ల డ్రాఫ్ట్ ఉండె. అతడు గవర్నమెంట్ స్కాలర్‌షిప్ హోల్డర్ కాబట్టి అతన్ని డబ్బు ప్రశ్న అడుగరు. అతనికి పడవదిగే పర్మిషన్ తొందరగా దొరుకుతుందని అతనితో "బాబూ ! నీకు డబ్బు ప్రశ్నలేదు. నిన్ను డబ్బు విషయం అడుగరు. నీవు గవర్నమెంట్ స్కాలర్‌షిప్ హోల్డరువు. కనుక నీ 150 పౌండ్ల డ్రాఫ్ట్‌లో నావి నూరు పౌండ్లు ఉన్నవనీ, నేను నీకు బంధువును కాబట్టి ఇద్దరి డబ్బు ఒకే డ్రాఫ్ట్‌లో ఉన్నవని చెప్పు. భయపడకు. నేను నీ డబ్బు తీసుకోను. నిన్ను డబ్బు అడుగను. నన్ను పడవ దిగేటట్టు చూడు" అని అంటిని. ఈ మాటకు సురేశ్‌బాబు ఒప్పుకున్నాడు. గ్రేట్ బ్రిటన్ సాయంత్రం చేరినాము. గ్రేట్ బ్రిటన్ పశ్చిమ తీరపు స్కాట్‌లాండ్ యొక్క గ్లాస్గో రేవుపట్టణం దగ్గర పడవ ఆగింది. అక్కడ పోలీసువారు, మా పడవ రేవుకు చేరకముందే పడవలోనికి వచ్చినారు. ప్యాసింజర్ల పాస్‌పోర్టులను ఇతర కాగితాలను చెక్

చేయడం మొదలుపెట్టినారు. కొందరికి దిగటానికి పర్మిషన్ ఇవ్వలేదు. నాకు గుండె జల్లుమన్నది. నా గతి ఏమి అవుతుందో అని. పాల్సెట్ గారు మహా సంతోషముతో తనకు పర్మిషన్ దొరుకుతుందని వెళ్ళినారు. కాని వారికి కూడా ఎందుకో పర్మిషన్ దొరకలేదు. నాకు చమటలు పట్టినవి. కాని పైకి మాత్రం ధైర్యంగానే ఉన్నా, నేను శేర్వానీ, పైజామాలో ఉన్నా. నా వంతు వచ్చింది. నా పాస్‌పోర్ట్ చూసిన పోలీసు అధికారి "మీరు స్టడీస్ కొరకు వచ్చినారా ?" అని అడిగినారు. నేను అవునని చెప్పినాను. ఆలస్యం లేకుండా, ఇంకా ఏమీ అడగకుండానే "పర్మిటెడ్" అని స్టాంపు వేసినారు.

నేను బయటకు వచ్చినాను. బయట గ్రేట్ బ్రిటన్ దృశ్యం చూస్తూ నిలబడిపోయినాను. పట్టరాని సంతోషం వచ్చింది. దేవుడు సాధ్యం కాదనుకొన్నదాన్ని సాధ్యం చేసినాడు. నేను ఎక్కడ ? గ్రేట్ బ్రిటన్‌కు పైసాలేకుండా రావటమెక్కడ ? ఈశ్వరుడు నన్ను రక్షించినాడు – బ్రిటన్‌లోని సుందర దృశ్యాలను చూసి, సమీపంలోని పడవలను చూసి దేవునికి కృతజ్ఞతా వందనాలు చేసితిని. పాల్సేట్ గారికి కూడా దిగటానికి పర్మిషన్ దొరికింది. సురేశ్‌బాబుకు గూడ పర్మిషన్ దొరికింది. సురేశ్‌బాబు సహాయం లేకుండానే అతని డబ్బుతో అవసరం లేకుండానే నాకు పర్మిషన్ దొరికినందుకు అతడు ఆశ్చర్యపడినాడు. మేము పడవ నుండి దిగే వరకు సూర్యాస్తమయం అయింది. నవంబర్ నెల చాలా చలి. సామాను దింపటానికి కూలివారు లేరు. నా సందుగ చాలా పెద్దది. అందరు తమ తమ సామాన్లు వెతుకుతూ ఉండిరి. కొందరు భారతీయ స్నేహితులు నాకు సహాయం చేసిరి. నా సామాను పడవ దిగింది. ఈశ్వరుని కటాక్షము వలన వంటాయన కొడుకునైన బీద టీచరును, సరిపడ డబ్బు వెంట లేకుండా 22 పౌండ్లతో, శేర్వానీ పైజామా తొడుగుకొని గ్రేట్ బ్రిటన్‌లోని స్కాట్‌లాండ్ భూమిపైన అడుగుపెట్టితిని.

-ముద్దు రామకృష్ణయ్య





## దీక్షకు సిద్ధంకండి ! (కరపత్రం)

అక్టోబర్ 2న సామూహిక ఉపవాస దీక్షలతో ప్రత్యేక తెలంగాన రాష్ట్ర ధ్యేయాన్ని చాటి చెప్పటానికి, మహాత్ముని ఆశయాలపట్ల మన ప్రగాఢ విశ్వాసాన్ని తెలుపడానికి తెలంగాణ ప్రజాసమితి ఆదేశాలను అందజేసింది. గత 9 నెలల నుండి శాంతియుత పద్ధతిలో బ్రహ్మాండమయిన ప్రజా ఉద్యమము కొనసాగుతున్నా, అర్థం చేసుకోలేని సుబేదారుల రాజ్యంలో ఇంకా ఈ నిరసన పత్రాలకు అర్థం ఏమిటని కొన్ని యువశక్తులు ఆలోచించడంలో అర్థం లేకపోలేదు.

బాపూజీ పేరున బ్రతుకుతున్న ఈ బడామనుషులంతా భక్తిని వదిలేసి భుక్తి మార్గం వెతుకుతున్నారు. తెల్లరంగు ఛాయలో తమ మలిన హృదయాలను మరుగు పరుస్తున్నారు. జాతిపిత ప్రబోధాలకు తిలోదకాలిస్తున్నారు. ఆయన అహర్నిశల ఆరాటము తీరని ఆవేదనగానే మిగిలిపోయినది. ఒకచోట మతకల్లోలము, వేరొక చోట హత్యలు, మరొకచోట కాల్పులు ఇదీ మన బ్రతుకు. దేశంలోని ప్రతి అంగుళం రక్తంతోనో లేక కన్నీటితోనో తడిసిపోయింది. ఇందుకు మంచి ఉదాహరణ మన తెలంగాణ. ఆంధ్రపాలకుల హయాంలో తెలంగాణ వెనుకబడింది. ఆంధ్రప్రభుత్వ ఉక్కుపాదాల కింద తెలంగాణ ప్రజలు నలిగిపోయినారు. స్వేచ్ఛ కరువైంది. తమ బానిస బంధాలను త్రెంచుకొని ఆత్మగౌరవం కాపాడుకోవడానికి తెలంగాణ జనత ధర్మయుద్ధం సాగిస్తున్నది. ఈ ప్రజాపోరాటంలో వందలాది ప్రజలు ప్రాణాలు కోల్పోయినారు. వేలాది యువకులు అంగవిహీనులయినారు. లక్షలాది ప్రజలు సత్యాగ్రహ సమరంలో పోరాడి కారాగారంలో బంధింపబడినారు. అయినా బ్రహ్మారాక్షసుల పాలనలో సత్యాగ్రహాలకు, పికెటింగులకు, ధర్నాలకు విలువలేకుండా పోతున్నది. తన ఉపవాసదీక్షతో ఉత్కృష్ట లక్ష్యాన్ని సాధించిన గాంధీ కలల దేశంలో రాబందుల రాచరికం నడుస్తున్నది.

మన ఈ శాంతియుత విప్లవాన్ని అంచనావేయడంలో పొరబాటు జరుగుతున్నది. ప్రశాంత గంభీర జలధిలోని ప్రళయాల పరిశీలన జరగడం లేదు. ప్రజాభిప్రాయానికి మన్నన జరగడం లేదు. రోజురోజుకు దారుణ హింసాకాండ, రక్తపాతం తెలంగాణ ప్రజలను కోపోద్రిక్తులను చేస్తున్నది. యువతరం ఆవేశం కట్టలు తెంచుకొంటున్నది. అహింసా సిద్ధాంతం పట్ల ఆత్మవిశ్వాసం సడలిపోయే



Scanned with OKEN Scanner

ప్రమాదం ఉన్నది. ఏ ఎండకాగొడుగు పట్టే శాసన సభ్యులపైన కోపం పేరుకుంటున్నది. యువత, విద్యార్థుల గుండెల్లో ఆరని అగ్నిజ్వాలలు మండుతున్న సంగతిని గురించి పదేపదే హెచ్చరిస్తున్నా, మురా రాజకీయాల కుళ్ళలో కేరింతలాడుతున్నా ఈ స్వార్థపరులకు అర్థం కావడం లేదు.

అందుకే ఈ అహింసా విధానం పట్ల యువశక్తులు అంత ఉత్సాహం ప్రదర్శించడం లేదు. నీతికి, న్యాయానికి, ధ్యేయానికి ప్రాణాలర్పించడానికి సిద్ధమయిన సమయంలో శాంతి సందేశాలు, నీతివాక్యాలు వారి హృదయాలను కలచివేస్తున్నమాట వాస్తవమే. కానీ గాంధీ శతజయంతి సంవత్సరంలో వారి విధానాల ఆచరణలో చూపించి నిజమయిన భారతీయులమని ఋజువు చేయాలి. సత్యాహింసల ద్వారా పరప్రభుత్వాన్ని పారద్రోలిన మనం ప్రజాస్వామిక పద్ధతుల ద్వారా కాసురాకాసి ప్రభుత్వాన్ని కూలద్రోసి ప్రత్యేక తెలంగాణ సాధించుకోవాలి. అప్పుడే గాంధీజీ కన్న కలలు ఫలించి తీరుతాయి.

ఇంతకాలం నుండి జరుగుతున్న తెలంగాణ ప్రజా ఉద్యమాన్ని ఇకనైనా అర్థం చేసుకొని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర నిర్మాణానికి ఒప్పుకొనకుంటే అక్టోబర్ 10 నుండి నిరాహారదీక్ష ప్రారంభించనున్నట్లు విద్యార్థి నాయకుడు ప్రకటించినాడు. ఈ తీవ్ర పరిస్థితిని కేంద్రం వెంటనే గుర్తించాలి. ప్రత్యేక తెలంగాణా సమ్మతిని గాంధీజీ శతజయంతి పేరున చూపించాలి. అదే వారి జన్మదినానికి తగిన కానుక. అందువల్లనే గాంధీజీ నమ్మిన సత్యాగ్రహాలు, నిరాహారదీక్షల కార్యక్రమం ప్రజాసమితి చేపట్టడం జరిగింది. అక్టోబర్ 2న మూకుమ్మడి ఉపవాసదీక్షల ద్వారా వారు నమ్మిన సిద్ధాంతానికి పుష్టిని చేకూర్చండి. జాతిపితకు తెలంగాణా ప్రజలు భక్తి ప్రపత్తులతో సమర్పించే కానుకే మన సామూహిక ఉపవాసదీక్ష.

అక్టోబర్ 2న ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు, ఇది వరకు జరిపిన కేంద్రాలలో ప్రజలంతా చేరి ఉపవాసదీక్షల కార్యక్రమాన్ని దిగ్విజయం చేయండి. మన ఆకలి మంటల జ్వాలలో గాంధీ సిద్ధాంతాల వెలుగులు విరజిమ్మాలి. న్యాయం చేకూరాలి. ధర్మం వర్ధిల్లాలి. సత్యమేవ జయతే.

వరంగల్
30-09-1969

**తెలంగాణ ప్రజాసమితి.**
**విద్యార్థి కార్యాచరణ సమితి.**





## కోరస్ (వచన కవిత)

నేను -
భూమికీ - ఆకాశానికీ వున్న
సంబంధాన్ని చెప్తే వీళ్ళు నవ్వుతారు,

నేను -
పువ్వుకీ - ముళ్ళకీ భేదం చెప్తే
వీళ్ళు కోప్పడుతారు

నేను -
ప్రవాహానికీ నిశ్చలతకీ రూపం కల్పిస్తే
వీళ్ళు ససేమిరా ఒప్పుకోరు,

నేను -
ఆలోచనకీ - ఆచరణకీ అర్థం చెప్తే
వీళ్ళు అపార్థం చేసుకుంటారు.

నేను -
మేధస్సుకీ - మూర్ఖత్వానికీ
సామ్యం చూపితే వీళ్ళు
నా మీద రాళ్ళు విసురుతారు.

నాకు తెలుసు
నేను మీ ముఖాలు చూసుకొండంటూ
ప్రతిబింబం చూపిస్తే వీళ్ళు ఆ అద్దాన్ని
ముక్కలు చెక్కలుగా పగులు గొట్టేస్తారు.

నేను -
గొంతెత్తి ఒంటరిగానే
పాట పాడినా మాటాడినా
నా గొంతు నొక్కేయ ప్రయత్నిస్తారు,



Scanned with OKEN Scanner

నేను -
ఒంటరిగా ఆలోచనలతో
ఊరికే ఊసుపోక పరుగులు తీస్తే
నన్ను పిరికి వెధవననీ
మూర్ఖున్ననీ
చూపుడు వేళ్ళతో చంపేస్తారు
అయినా నాకు తెలుసు
రేపు వీళ్ళే
నా పాటకి కోరస్ అందుకుంటారు -
నాకు భయం లేదు
నేను నేడు
ఈ పాట
ఒంటరిగానే పాడుకుంటాను !





## వాయసం (ఆధునిక పద్యం)

సీ॥ ధ్వాంక్షమా ! మాంసమా కాంక్షించుచున్నావు ?
మానవుల్మెక్కుట మానినారె ?
బలిపుష్టమా ! నరుల్ బలినిచ్చుకూటిని
దీని బ్రతుకు గడుపు దినములెన్ని ?
వాయసమా ! తీపి పాయసమొల్లక
నెంగిలి మెతుకులు మ్రింగుటేల ?
మౌకలీ ! ఏలకో యీ కలి నాకలి
బొబ్బల నీకెట్లు బోనమబ్బు ?

తే॥ ఆత్మ ఘోషమా ! చిరంజీవివై వెలుంగు
మేకదృష్టి గలట్టి వివేకమునకుఁ
బలువిధమ్ముల బ్రక్కచూపులను జూచు
కపట చిత్తులు మెచ్చరు కరటరాజ !

సీ॥ అందచందమ్ము లేదంచల నడగాదు
చిలుకల వలె గుల్కి పలుకఁ బోదు
పేదరికపుఁబుల్గు భేదభావము లేక
గడబిడతో భలే గంతులిడును
కొమ్మల మాటునఁ గులుకుచుఁ గమ్మని
రాగాలు దీయ స్వరాలు లేవు
లోకాన దీనులలోఁ గల శోకాలు
కన్నీటి గాథ లేకరువు పెట్టు

తే॥ నన్న కొడుకుఁ బిలుచునట్టులఁ బెరిమతో
"కాక - కాక॥ యంచుఁగేక వేయు,
కలుపుగోలు తనము తెలియనట్టి మనము
చీదరించుకొనినఁ జిన్నబోదు.



Scanned with OKEN Scanner

సీ॥ కసిఁబూని మోసాన మసిఁబూసి మారేదు
కాయ చేతికినిచ్చు ఖలునకంటె
పగఁబట్టి తొడఁగొట్టి పరులకొంపలు నిట్ట
నిలువున ముంచెడి నీచుకంటె
చారుసంసార సంచారుల మధ్య వి
షాగ్ని రగుల్చు పాషండు కంటె
లిబ్బులబ్బగఁబిచ్చి బెబ్బులియై పచ్చి
నెత్తురు జుర్రెడి తొత్తుకంటె

తే॥ నెంద్రకాయ నడత గంద్రగొద్దలి కోఁత
మందినోళ్ల మూఁత పంది మేఁత
రోఁత బ్రతుకు గడుపు పాతకు నెదనల్పు
కంటెఁ గాకి నలుపు కలుషితమ్మె ?

సీ॥ నల్లమొగమ్మున నెల్ల లోకాలలో
వెన్నుఁడు పూజ్యుఁడై వెలయలేదె ?
విసపు మేతరి గొంతు విడ్డూరమగు నలు
పున్నను శివుఁడంచుఁ బొగడఁబడఁడె ?
చుక్కల దొరలోన ముక్కున నలుపున్న
చల్లని వెన్నెల జల్లులిడఁడె ?
నరుల తలలు నల్పు యిరుల దారులు నల్పు
నింగి నీరును రేయి నీడ నలుపు

తే॥ కాకి నలుపటంచు గావుకేకలు బెట్టి
మాయనంటి పొరలు మాయి నలుపు,
అంధకారమైన అజ్ఞానమేనల్పు
వాయసముల నలుపు రోయనేల ?





సీ॥ కాకిబలఁగమంచు గాబరా పడిదెబ్బ
తనబంధుజనుల యాదరణబొందు
'కాకిపిల్లలు కాకికే కడుముద్దని
తనబిడ్డలన గూర్చి తగవులాడు
వదరుఁబోతును గాంచి వాదమ్ములో మించి
లొట్టిమీఁదం గాకి లొల్లియనును
పిల్లలందఱుఁజేరి యల్లరి బెట్టఁగఁ
గాకి గోలయని చీఁకాకు పఱచు

తే॥ "కావు–కావు" మనుచు దేవుని వేడెడి
పలుకులు చెవులందు ములుకులగును
గీము మీఁద వ్రాలి సేమములడుగును
ప్రాణసఖుని భంగి రాక విడదు.

తే॥ ఇల్లు వెడలింప దొంతుల నెల్ల వెదకు
విధము, పొమ్మని కొట్టిన విసుఁగులేక
నోరునొవ్వంగనే రాయబారమేమొ
తెచ్చు వార్తలో చుట్టాలు వచ్చు కబురో

తే॥ కొమ్మకోనలోఁ గూర్చుండి కోకిలమ్మ
కూయఁగా బళాయని గంతువేయుచుంద్రు
ప్రతి దినము వచ్చి మనలను బలుకరించ
నాదరించరు చులకనగాదె కాకి.



ధ్యానంలో ఛాత్రోపాధ్యాయులు



దత్తత గ్రామంలో డంపుయార్డు నిర్మాణం చేస్తున్న ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు



యోగ్‌చాప్ ప్రదర్శిస్తున్న ఛాత్రోపాధ్యాయులు

Scanned with OKEN Scanner